సంస్థాపకులు
కీ॥ శే॥ వి.వి. రాఘవయ్య

మేనేజింగ్ ఎడిటర్
శ్రీమతి వి. లీలావతి రాఘవయ్య

నవంబరు 1978

సహకార సంపాదకుడు : వేమూరి సత్యనారాయణ

సంపుటి 16 సంచిక 10

విషయసూచిక

కలలు కనేకళ్లు	9	కె. వి. యస్. లక్ష్మి
రసవద్గీత	17	అవసరాల రామకృష్ణారావు
ప్రేమసింహాసనం (కొత్త సీరియల్ ప్రారంభం)	18	యద్దనపూడి సులోచనారాణి
దేముడూ మేం ప్రయాణీకులం	33	కె. లలితాచలం
అంతా ఇంతే!	39	శంకరమంచి పార్థసారధి
పూలూ—ముళ్ళూ (సీరియల్)	45	ఐ. వి. యస్. అచ్యుతవల్లి
ఈ బహుమతి ఎవరికి?	58	పోల్నాప్రగడ రాజ్యలక్ష్మి
వాగ్దానం	67	అజీజ్
ఆకాశమంత పందిరి	75	కళింకోట ప్రభాకరదేవ్
మలుపు	80	మధురాంతకం నరేంద్ర
కాదుసుమా కల!	86	కిరణ్మయీ సారధి
పడమట సంధ్యారాగం (సీరియల్)	92	మల్లాది వెంకటకృష్ణమూర్తి
స్త్రీ స్వాతంత్ర్యం	107	మా. నీ. మ.
సినిమా	114	యస్వీనారాయణ

ఇంకా కవితలూ, మినీకథలూ, కార్టూన్లూ, మరియూ జయదేవ్ '(వి)చిత్ర విజ్ఞానం'

నవలానుబంధం

పంచాయితి—ఆలేటి నాగమణి

ఇంకా రెండు పెద్ద కథలు

ముల్లు—ఆర్. ఇందిర

మైలపడిన చీర—నాయుని కృష్ణమూర్తి

ముఖచిత్రం: 'కుమార రాజా'లో కృష్ణ, జయప్రద

జ్యోతి, 17-B రాజారాం కాలనీ, P. B. నెం. 2650, మద్రాసు-600 024.
ఫోన్: 423123. సంవత్సర చందా (ప్రత్యేక సంచికతో రు. 42/-)

తొలిమాట

మాకు తెలుసు మీరు తొందరపడుతున్నారు. యద్దనపూడి సులోచనరాణి కొత్త సీరియల్ త్వరగా చదువుదామని. మీరు వెంటనే పేజి 18 కి వెళితే అక్కడ 'ప్రేమసింహాసనం' ప్రారంభమయివుంది.


* * *

జ్యోతి నవలల పోటీ గడువు పెంచాము. ఇదివరలో ప్రకటించినట్లు సెప్టెంబరు 20 కాక అక్టోబరు 31 వరకూ నవలలు పోటీ పరిశీలనకు స్వీకరిస్తాము. దాదాపు ఒక పిరియడ్‌లో రెండు మూడు పత్రికల నవలల పోటీలున్న కారణంగా రచయితకు మరికొంత సావకాశమయిన వ్యవధి ఇస్తే బాగుంటుందని కొందరు రచయితలుచేసిన సూచన మేరకు ఈ గడువు పొడిగించబడింది.

* * *

'అయ్యా, మేం మీకు చందాకట్టాం....తర్వాత ఒక్కసారి మాత్రం జ్యోతి అందుకొన్నాం. ఆ తర్వాత రెండు నెలలుగా జ్యోతి మాకు చేరటంలేదు. ఉత్తరం రాస్తే పంపామని రాశారు. అయినా మాకు చేరలేదు. కాబట్టి ఈ విధంగా జరిగేటట్లయితే మాకు జరిగే అన్యాయానికి లీగల్‌గా చర్యతీసుకోవలసి వుంటుంది'—ఇది జ్యోతికి ఇంగ్లీషులో వచ్చిన ఓ ఉత్తరం సారాంశం. ఆ పాఠకుని ఆందోళనలో మేమూ భాగం పంచుకుంటున్నాము. ప్రతినెలా కాపీలు చేరలేదన్న కంప్లయింట్స్. అందుకొంటూనే వుంటాము మేము. ఇదివరలో ఒక ఆంగ్లమాస పత్రిక ఎడిటోరియల్‌లో ఇండియన్ పోస్టల్ డిపార్టుమెంట్‌పై రాసిన వ్యాఖ్య గుర్తొస్తూంది మాకు. ఒక అంతర్జాతీయ కంపెనీ తాను తయారుచేసిన ఫొటో ఫిల్ముల గురించి ప్రకటిస్తూ ప్రపంచంలో వివిధ దేశాలలోని తమ కార్యాలయాల చిరునామాలు యిచ్చి, 'వాటిలో ఎక్కడికైనా మీ ఫిల్ములు ప్రోసెసింగ్‌కు పంపవచ్చును' అని ప్రకటించిందట. ఆ చిరునామా ఇవ్వడంలోనే ఓ చిత్రం వుంది. భారతదేశంలోని వారి కార్యాలయ చిరునామా క్రింద మాత్రం 'రిజిస్టర్డు పోస్టులో మాత్రమే' అనికూడా ప్రకటించారు వారు. యిదంతా రాసిన ఆ ఆంగ్ల పత్రిక నెలనెలా మా చందాదారుల కాపీలతో యిన్ని వందల (సంఖ్య ఖచ్చితంగా గుర్తులేదు) కాపీలు పోతున్నాయి అని రాసింది. ఇప్పుడు మేమూ రాయవలసివస్తోంది. అన్ రిజిస్టర్డు పోస్టులో పంపే వాటిలో చాలా కాపీలు పోస్టులో మిస్ అవడం జరుగుతూంది. పోస్టల్ డిపార్టుమెంట్‌లో కొందరు జ్యోతిని అభిమానించి వుచితంగా చదువుకొనే వుత్సాహం చూపిస్తున్నందుకు చాలా చాలా ఆనందిస్తున్నాము॥ అయితే అవతల చేరవలసిన వారికి—అందునా డబ్బు చెల్లించి జ్యోతి కొనుక్కొని చదువుకోవాలనుకొనేవారికి ఆ కాపీలు చేరకపోవడంలో జరుగుతున్న అన్యాయాన్ని గమనించవలసిందిగా 'తపాలాశాఖ'కు విజ్ఞప్తి చేస్తున్నాము.


మీ అందానికే తగిన
మిల మిల మెరిసే చీరెలు!
కంచి, ధర్మవరం, బెంగుళూరు, బెనారస్, ఆరణి పట్టు చీరెలు!!
వేలకొలది రకములు
గ్యారంటీ వెండి,
జరీతో తయారైనవి
లభించును.
లక్ష్మి జనరల్ స్టోర్స్
గవర్నరుపేట, విజయవాడ-2
గ్రామ్స్.
ఫోన్. 73467, 77052


'అమ్మా,
నాకప్పుడే 3 నెలలు నిండాయి!'
'అవును, ఇప్పుడే ప్రారంభించాలి
ఫారెక్స్®'
మీ పాపాయికి ఘనఆహారాలు
ఇవ్వడం ఆరంభించేందుకు
డాక్టర్లు సిఫార్సు చేసేది ఫారెక్స్®
సత్వరమైన, సంపూర్ణమైన
పెరుగుదల కోసం పాపాయికి
ఆదర్శవంతమైన ఘన ఆహారం.
FAREX

కలలు కనే కళ్ళు

కె.వి.యస్. లక్ష్మి

బోసి పాప నవ్వులా చల్లగా వుంది ఎండ.

ఎనిమిదిగంటలైనా యింకా ఏడుగంటలే అయినట్లు వుంది. మంచు తెరలు పూర్తిగా విడిపోలేదు. ముత్యాల్లా మెరుస్తూన్న మంచు బిందువులను తుడుచుకుందామన్న ధ్యాసేనా లేకుండా మత్తుగా కళ్లు మూసుకున్నట్లు నిశ్చలంగా వున్నాయి గులాబీలు.

భర్తని ఆఫీసుకు సాగనంపి గేటు దగ్గర నిల్చునివుంది మాధవి. అతను కనుమరుగు అయేవరకూ చూస్తూ నుంచుని వుంది. బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంది. "అబ్బ ఏమి ఉద్యోగమో బాబూ! పొద్దునే వెళ్ళిపోయి సాయంకాలానికిగానీ రారు" అని ముద్దుగా భర్తని విసుక్కుంది. ఫ్రెండ్స్ ఎవరూలేరు ఎలా బాబూ పొద్దస్తమానూ గడపటం అన్న తన మాటలకు భర్త చెప్పిన సమాధానం గుర్తుకువచ్చి, బుగ్గలు ఎర్రగా కాగా, పెదాలు సిగ్గుగా నవ్వుకున్నాయి. "రాత్రి జరిగిందంతా పొద్దస్తమానం గుర్తు తెచ్చుకో అదే పొద్దు పోతుంది"—అదీ భర్తగారి సలహా.

కారు హారన్ మోత వినపడటంతో మాధవి దృష్టి చెదిరింది. ఎదురింటివైపు కుతూహలంగా చూచింది. ఆ యింటి యజమాని అసహనంగా కారు హారన్ కొడుతున్నాడు. కమింగ్ డాడీ అంటూ ముత్యాల్లావున్న ఇద్దరు పిల్లలు పరుగెత్తుకుంటూ వచ్చారు. వాళ్ళ వీపులమీద స్కూల్‌బాగ్స్ వున్నాయి. వెనకాలే, వాళ్ళ అమ్మ కాబోలు రెండు కారియర్‌లు పట్టుకునివచ్చి లోపల పెట్టింది. 'మమ్మీ! టాటా' అన్నారు పిల్లలు. ఆమెకూడా నవ్వుతూ చేతులూపింది. కారు కదిలింది.

అక్కడే రెండు నిముషాలు నిల్చుంది. మాధవి ఆమెనే కన్నార్పకుండా చూసింది. సిసలైన మోడల్ గృహిణిలా వుందామె. తెల్లగా నాజూకుగా వుంది. ఆ స్త్రీ నలగని హాండ్‌లూమ్ చీరకట్టుకుని, దేవతలా వుంది. నిర్మలంగా వున్నాయి ఆమె కళ్ళు. 'అబ్బ! చాలా బాగుంది ఈవిడ' అనుకుంది మాధవి. అంతలో ఆమె గేటు మూసి లోపలికి వెళ్ళిపోయింది. 'నడకకూడా చాలా అందంగా హుందాగా వుంది' అని అనుకుంది మరోసారి.

తను వచ్చినప్పటి నుంచీ అంటే దాదాపు మూడు నెలలనించి చూస్తోంది ఆ యింటినీ, ఆ యింటిలోని మనుష్యులనీ. ఒకరికోసం ఒకరు సృష్టింపబడ్డారా! అనిపిస్తుంది. అతను ఎత్తుగా, బలంగా, మగసిరి ఉట్టిపడుతున్నట్లుగా వుంటాడు. ఛాయ తక్కువైనా ఆకర్షణీయంగా వుంటాడు. ఆమె! ఆమె మాత్రం!! ప్రబంధ నాయికలా వుంటుంది. ప్రబంధ నాయికలకు వుందో లేదో కానీ, ఆమెకు మాత్రం హుందాతనం వుంది. పిల్లలు ఇక చెప్పనక్కరలేదు. ఆరోగ్యంగా అందంగా రత్నాల్లా వుంటారు. చక్కటి కారు, అందమైన బంగళా. ఇవన్నీ కొంతమందికే వుంటాయి. తన కెప్పుడైనా కారులో తిరిగే అదృష్టం వుందో? లేదో? ఉస్సురని నిట్టూర్చింది మాధవి. ఆశకు అంతు వుండదు. ఉన్నకొద్దీ ఇంకా ఏదో లోటు వుంటూనే వుంటుంది. అది తెలియక కాదు. కానీ మనిషి యింకా ఏదో దేనికోసమో వగస్తూనే వుంటాడు. అది మానవ నైజం. ఎండ మీదపడి చురుక్కుమనటంతో లోపలికి పరుగెత్తింది మాధవి.

* * *

మర్నాడు భర్తను ఆఫీసుకి పంపి, గేటు

దగ్గరే నిలబడింది మాధవి. ఈ రోజు ఎలాగైనా పరిచయం చేసుకోవాలి ఆ ఎదురింటి ఏంజెల్‌ని, అని నిశ్చయించుకుంది. కొద్ది నిముషాల్లోనే పిల్లలు నవ్వుకుంటూ వచ్చి కారెక్కారు. మమ్మీ! టాటా! ముద్దు కంఠాల్తో వీడ్కోలు చెప్తున్నారు. "జాగ్రత్త దీపూ! ఈ రోజు డాడీ రారు. రేణుకా ఆంటీతో వచ్చేయండీ సరేనా!? వాసూ జాగ్రత్త. అన్నయ్యమాట విను" ఆవిడ హెచ్చరించింది. మాధవి మనసు సంతోషంతో త్రుళ్ళిపడింది. హమ్మయ్య! వీళ్ళు తెలుగు వాళ్ళే! ఫ్రెండ్‌షిప్ చేసుకోవచ్చు. 'అలాగే మమ్మీ' కోరస్‌గా పలికాయి ముద్దుకంఠాలు.



కారు కదిలింది,

ఆమె గేటు దగ్గరే, వెళ్ళిపోయిన కారు వంకే చూస్తూ నిలబడింది. ఏదో తెలియని ఆనందం, ఆమె కళ్ళలో తొణికిసలాడుతోంది. బహుశా, తన ఇల్లు, సంసారం, పిల్లల గురించే కాబోలు. మాధవి గబగబా ఆమె వద్దకు పరుగెత్తుకుని వెళ్ళింది. "మీరు ...మీరు తెలుగువారేనా?"

"అవును" అని నవ్వింది ఆమె.

"నా కెవ్వరూ ఫ్రెండ్స్‌లేరండి. మీ ఇంటికి వస్తూ వుంటాను. సరేనా??"

"అలాగేనమ్మా! తప్పకుండా రా!" అంది ఆమె నవ్వుతూ.

"ఇప్పుడు నాకు పని వుందండీ. సాయంకాలం వస్తాను" అని, బెరుగ్గా అని తిరిగి ఇంట్లోకి వచ్చేసింది మాధవి. ఆమె గుండెలు సంతోషంతో ఎగిసిపడ్డాయి. 'మంచి దానిలాగానే వుంది. ఇలాంటి వాళ్ళను ఎవరైనా గౌరవిస్తారు' అనుకుంది.

సాయంకాలం నాలుగ్గంటలకు గబగబా ముస్తాబయి ఎదురింటికి బయలుదేరింది మాధవి.

కాలింగ్‌బెల్ మ్రోగించి, అదురుతున్న గుండెలతో నిలబడి వుంది. తలుపు తెరిచి చిరునవ్వుతో ఆహ్వానించింది ఆమె.

"మీ పేరేమిటి?" గబగబా అడుగుతోన్న మాధవిని చూసి నవ్వింది. 'నీలవేణి' అని చెప్పింది. "అబ్బ ఎంత బాగుందండీ మీ పేరు. అచ్చం మీ లాగేనే వుంది. చక్కగా మీ కన్నీ వున్నాయి. వినయం. విధే...."

బ్రేక్‌పడింది మాధవి వాక్‌ప్రవాహానికి. "రామ్మా కూర్చో. ఇప్పుడే వస్తాను" అని లోపలికి వెళ్ళిపోయింది.

అక్కడే వున్న సోఫాలో కూర్చుని ఇంటి పరిశీలనలో పడింది మాధవి. చక్కటి డ్రాయింగ్‌రూమ్. కార్పెట్, కార్పెట్‌కి తగ్గట్లు, సోఫాసెట్, లైట్ గ్రీన్ కలర్ డిస్టెంబర్ గోడలు, కళాత్మకమైన చిత్రాలు, చాలా బాగుంది. ఇంతలో ట్రేలో రెండు జ్యూస్ గ్లాసులతో వచ్చింది నీలవేణి. 'తీసుకోమ్మా!' అంటూ ఒక గ్లాసు అందించింది. జ్యూస్ సిప్ చేస్తూ, "అదేం? మీ పిల్లలని ఈరోజు వాళ్ళ డాడీ ఎందుకు తీసుకురారు?" అని అడిగింది. మాధవి బోళాతనానికి నవ్వింది నీలవేణి.

"నవ్వకండి. నామాట తీరే అంత. నాకు నచ్చిన మనుషులతో నేనలాగే మాట్లాడతాను. ఏమనుకోకండి. పొద్దున మీరు చెప్తోంటే విన్నాను."

ఖాళీ అయిన గ్లాసుని ట్రేలో పెడుతూ "వాళ్ళ డాడీ క్యాంప్‌కి వెళతారు. వాళ్ళ టీచరు నా ఫ్రెండ్. ఆయన వెళ్ళినప్పుడల్లా తనే తీసుకొస్తుంది. మాకిది అలవాటే!" అంది నీలవేణి.

"ఏమిటి? మీ వారికి ఎప్పుడూ క్యాంప్ లుంటాయా?"

అవునన్నట్లుగా తల ఊపింది. ఖాళీ గ్లాసులు ట్రే లోపలకి పెట్టటానికి లేచింది నీలవేణి. ఆమె తిరిగి రాగానే, తన సహజ ధోరణిలో కాసేపు తన ఫ్రెండ్స్ గురించి, కాలేజీ లైఫ్ గురించి బడబడా వాగింది మాధవి, మధ్య మధ్యలో జోక్స్ చెపుతూ. అయిదుంపావు వరకూ అలాగే గడిపింది.

హుషారుగా కూనిరాగాలు తీస్తూ ఇల్లు చేరిన మాధవి భర్త ఇంటికి రాగానే విశేషాలన్నీ చెప్పేసింది. బడబడా వాగడం తగ్గించుకోవే పిల్లా! అని నెత్తిమీద మొట్టి ముఖం కడుక్కోవటానికి లోపలికి వెళ్ళిపోయాడు అతను. స్నేహమేరా జీవితం....అని కూని రాగం తీసుకుంటూ కాఫీ తేవడానికి లోపలికి వెళ్ళింది మాధవి.

* * *

"నాకిదేం నచ్చలేదు" అంది మాధవి హఠాత్తుగా. కిచెన్‌లో చైర్‌మేద బైఠాయించింది ఆమె.

"ఏది?" అంది నవ్వాపుకుంటూ నీలవేణి.

"అదే మీరు నన్ను అమ్మా బొమ్మా అని పిలవటం. మీరు నా కంటే పెద్దని నేననుకోను."

"ఓహ్" అదా నేనింకా ఏదో అనుకున్నాను. నాకు ఇరవై ఎనిమిదేళ్ళు. దానినిబట్టి నువ్వే చెప్పు ఎవరు ఎవర్ని అమ్మా అని పిలవాలో!" అంటూ దోసెలు ప్లేటులోపెట్టి మాధవి చేతి కందించింది నీలవేణి.

"అయితే మీరు నా కంటే అయిదేళ్ళు పెద్దన్నమాట.మీరు అసలు అలాకనిపించరు,"

"నీ కాంప్లిమెంటుకి థాంక్స్‌గాని ముందు ఆ దోసెలు తిను, చల్లారిపోతున్నాయి" హెచ్చరించింది నీలవేణి. కాలింగ్ బజర్ మోగడంతో తలుపు తెరవడానికి వెళ్ళింది, నీలివేణి. బాబోయ్ లార్డ్‌యమ కాదు కదా! అనుకుంది. నీలవేణి భర్త క్రిష్ణమోహన్‌కి ఆపేరు పెట్టింది మాధవి, గంభీరంగా వుంటాడని. ఆమె అనుకున్నట్లే అయింది. వచ్చింది అతనే!

"బాబోయి నే వెళ్ళిపోతానండీ" అంది అప్పుడే లోపలికి వచ్చిన నీలవేణితో.

"ఎందుకూ! అంత భయం. మరేం ఫర్వాలేదు కూర్చో. ఆయన మళ్ళీ ఇప్పుడే వెళ్ళిపోతారులే" అని బలవంతంగా కూర్చోబెట్టి టిఫిన్ ప్లేటు తీసుకునివెళ్ళి భర్తకిచ్చి వచ్చింది నీలవేణి.

కొద్ది నిముషాలకి, "నీలవేణీ! మంచి నీళ్లు" అని అరిచాడు అతను. "ఆ! ఆ! వస్తున్నా! వస్తున్నా" తడబాటుతో సమాధానం చెప్పింది. అప్పటికే అతను వంటింటి గుమ్మం దగ్గరకు వచ్చేశాడు. మాధవి తడబాటుతో లేచినుంచుంది. "న....న....నమస్కారం''అంది. అతను ప్రతి నమస్కారం చేసాడు "మేము...మేము మీ ఎదురింట్లోఉన్నాము''అంది."ఓహో అలాగా!''

అని "మీవారేం చేస్తున్నారు? మీదే ఊరు?" అని వివరా లడిగాడు. అన్నిటికీ సమాధానం చెప్పింది మాధవి. ఇతనిని 'లార్డ్ యమ' అని పేరు పెట్టానుగానీ మంచివాడే; పొలైట్ గానే వున్నాడు అనుకుంది తనలో తాను. భార్య ఇచ్చిన మంచి నీళ్ళు తాగి, కాఫీ తీసుకుని వెళ్ళి పోయాడు అతను. ఆ తర్వాత కొద్దిసేపువుండి ఇంటికి వచ్చేసింది మాధవి.

రోజులు గడుస్తున్నాయి. నీలవేణి, మాధవిల మధ్య స్నేహం బలపడింది. మాధవి నీలవేణిని అక్కా అని పిలుస్తోంది. ఒకరోజు మాధవి నీలవేణి యింటికి బయలుదేరింది. అక్కా అని అరుచుకుంటూ వచ్చిన మాధవి దృష్టి హాలులో సోఫాలో కూర్చున్న మనిషిపై పడింది. ఆమెకు సుమారు ముప్పై ఏళ్ళు వుండవచ్చు. "రా మాధవీ రా కూర్చో" కాఫీ కప్పుల ట్రే తీసుకువస్తూ అంది నీలవేణి.

సోఫాలో కూర్చుని ఆ వచ్చిన స్త్రీనే చూస్తూ కూర్చుంది మాధవి. పెదవులకి లిప్ స్టిక్, బాబ్డ్ హెయిర్, మాక్సీ స్కర్ట్-ఇదీ ఆవిడ వేషం. ఆవిడకు మాధవిని పరిచయం చేసింది, ఆవిడ నార్త్ ఇండియన్ అట. తెలుగురాదట. వారిద్దరూ ఇంగ్లీషులోనే మాట్లాడుకోసాగారు. మధ్య మధ్యలో మాధవి ముక్తసరిగా అడిగిన దానికి జవాబు యివ్వసాగింది. కొంచెం సేపువుండి ఆమె వెళ్ళిపోయింది! ఆమెను సాగనంపి వచ్చి కుర్చీలో కూర్చుని ఉస్సురని చిన్నగా నిట్టూర్చింది నీలవేణి.

"అదేమక్కా ఈ రోజు అలసటగా వున్నారు?"

"రేపు దీపూ బర్త్ డే. చిన్న పార్టీ ఇస్తున్నాను. దాని ఏర్పాట్లు చూసేసరికి అలసటగా వుంది. అంతే."

"మరి నన్ను పిలవకూడదా? నా సహాయం తీసుకోకూడదా?" నిష్ఠూరం ధ్వనించింది మాధవి మాటల్లో.

"పరవాలేదు లేమ్మా; ఎంత పనని?" తేలిగ్గా కొట్టి పారేసింది నీలవేణి.

" ఇంతకీ సరేగానీ ఆవిడనిచూస్తే నీకేమనిపించింది" అంది హఠాత్తుగా నీలవేణి.

"ఎవరు?" ఆవిడేనా?? ఆ ముప్పయేళ్ళ బాలాకుమారి?"

"అదే ఆవిడే! ఆవిడ పేరు సుషమ. బాంక్ మేనేజర్."

"అలాగా నామొహంలాగానే వుంది. ఎలాగైనా మీకన్నా అందంగా మాత్రంలేదు. ఏం అలా అడిగారు?"

"అబ్బే ఏంలేదు ఊరికే అడిగాను. రేపు సాయంత్రం తప్పకుండా రావాలి నువ్వు. సరేనా?"

"ఓ తప్పకుండా వస్తానుగానీ నా సహాయం తప్పనిసరిగా తీసుకోవాలి. లేకపోతే నేను ఒప్పుకోను. సరేనా??" అంది మాధవి.

"అన్ని ఏర్పాట్లూ నీకు అప్పగించేస్తాను తల్లీ కోప్పడకు" నీలవేణి మాటలకు నవ్వేసింది మాధవి. కాస్సేపు ఆమాటా ఈమాటా చెప్పి ఇంటికి బయలుదేరింది.

ఆ సాయింత్రం భర్తతో కలిసి బజారుకి వెళ్ళి, దీపూకోసం మంచి ప్రెజంటేషను కొని తీసుకువచ్చింది. ఆ మర్నాడు బాగా ముస్తాబయి ప్రజంటేషన్ పాకెట్ తీసుకుని నీలవేణి ఇంటికి వెళ్ళింది మాధవి. హాలంతా డెకరేట్ చేసింది నీలవేణి. మధ్యలో టేబిల్ వేసి బర్త్ డే కేక్ ఎరేంజ్ చేసి వుంది.

"త్వరగా రా. నీ కోసమే చూస్తున్నాను"అని సాదరంగా లోపలికి తీసుకువెళ్ళింది.

"దీపూ! ఆంటీకి దణ్ణంపెట్టు" అంటూ దీపూచేత మాధవి కాళ్ళకి దణ్ణం పెట్టించింది. అక్షింతలువేసి ఆశీర్వదించి చేతిలో పాకెట్ దీపూ చేతిలో పెట్టింది మాధవి.

"ఎప్పుడొస్తారక్కా గెస్ట్ లంతా?" నలువైపులా చేసిన డెకరేషన్స్ చూస్తూ అడిగింది మాధవి.

"గెస్ట్ లంటే పెద్దవాళ్ళని పిలవలేదు, ఊరికే పిల్లల్నే పిలిచింది. ఇంకెంత రెండు నిముషాల్లో వచ్చేస్తారంతా!" అంది వీధిలోకి చూస్తూ నీలవేణి. కొద్ది క్షణాల్లో పిల్లలంతా వచ్చేసారు. వాళ్ళంతా హాపీ బర్త్ డే అని పాడుతోంటే కేక్ కట్ చేశాడు దీపూ. చిన్న కేక్ ముక్కని

నీలవేణి నోట్లో ఉంచాడు. నీలవేణి తిరిగి చిన్న కేక్ ముక్కని వాడి నోట్లో పెట్టింది. పిల్లలందరికీ స్వీట్సు కేకూ బొమ్మలూ పంచిపెట్టింది. వాళ్ళు కాసేపుండి అల్లరిచేసి వెళ్ళిపోయారు.

'మమ్మీ' అంటూ దీపూ పరుగెత్తుకుంటూ వచ్చి చుట్టేశాడు నీలవేణిని. ఆమె కళ్ళు చెమ్మగిల్లాయి. వాడిని ఎత్తుకుని ముద్దులతో ముంచెత్తింది; గుండెల కదుముకుని వెక్కివెక్కి ఏడ్వసాగింది. కలవరపడిపోయింది మాధవి. వాసవి పక్కనే బిక్కుబిక్కుమని చూడసాగింది. "అరె! ఎందుకక్కా ఏడుస్తున్నారు? ప్లీజ్ చెప్పరూ!" ఆందోళన పడసాగింది మాధవి.

"ఏమీ లేదమ్మా ఆనందబాష్పాలు. అంతే!" కళ్ళు తుడుచుకుంది నీలవేణి.

"నేను నమ్మను. ఆనంద బాష్పాలైతే వెక్కివెక్కి ఏడుస్తారేమిటి ఎవరైనా. ప్లీజ్ చెప్పండి" ఆప్యాయంగా అడిగింది మాధవి.

"ఏమీ లేదమ్మా నన్ను నమ్ము. అది సరేగానీ మాధవీ నేను పిల్లల్ని ఇప్పుడు సినిమాకి తీసుకు వెళ్ళాలనుకుంటున్నాను. ఏమనుకోకుండా నాతో రాగలవా?" చిరునవ్వు బలవంతాన ముఖంమీదకు తెచ్చుకుంటూ అడిగింది నీలవేణి.

"తప్పకుండా. మీరు ముఖం కడుక్కుని రండి" అంది మాధవి. నీలవేణి ఎందుకో బాధపడుతోంది. అది ఈరోజే తెలిసింది తనకి. ఎలా ఆమెను ఓదార్చటం? పరిపరి విధాల ఆలోచించసాగింది మాధవి. తాత్కాలిక ఉపశమనం చేకూర్చినట్లు అవుతుందని ఆమెకూడా సినిమాకి బయలుదేరింది. మధ్య జోక్స్ చెప్పి నవ్వించింది. రాత్రి పడుకున్నా ఆ ఆలోచనలు వదల్లేదు మాధవిని.

* * *

మర్నాడు మాధవి నీలవేణి దగ్గరకు వెళ్ళింది. ఆమె ఏమీ బాధపడినట్లుగాలేదు. నిర్మలంగా నవ్వుతూ ఆహ్వానించింది. తను

ఊరికే పొరబడిందేమో; ఆమె దేనిగురించీ బాధపడటం లేదేమో అనుకుని కదపటం ఎందుకని ఊరుకుంది. రోజులు గడుస్తున్నాయి ఎవరి దినచర్యలోనూ మార్పులేదు.

ఒకరోజు మాధవి హఠాత్తుగా అంది నీల వేణితో "అక్కా మీరు దీపావళి దేనాడు ఎందుకు బాధపడ్డారో చెప్పనా? క్రిష్ణమోహన్ గారు పార్టీలో లేరని కదూ?" సూటిగా అడుగు తున్న ఆమెను చూసి తడబడింది నీలవేణి. ఒక్క క్షణం ఆమె ముఖం మ్లానమైంది. వెంటనే తేరుకుని నవ్వేస్తూ "పిచ్చి పిల్లా ఆరోజు ఆయన క్యాంపు కెళ్ళారు. అంతే! నేను దేని గురించీ బాధపడలేదు. నువ్వు అనవస రంగా అపోహపడకు. ఉండు వాసూ స్వెట్టరు ఈరోజు అయినా పూర్తి చేయాలి." అని లేచి లోపలికి వెళ్ళింది. ఊలూ, నీడిల్స్ తీసుకు వచ్చి అల్లసాగింది. కాస్సేపు ఆ కబుర్లు ఈ కబుర్లుచెప్పి లేచింది మాధవి. "నువ్వు లేక పోతే నేనేమయి పోయేదాన్నో అనిపిస్తుంది ఒకోసారి" అంది నీలవేణి మాధవిని సాగ నంపుతూ. మాధవికి ఆమె మాటలు అర్థం కాక అయోమయంగా చూసింది.

* * *

"మిమ్మల్ని చూస్తే జెలసీగా ఉంది నాకు" అంది మాధవి కర్చీఫ్‌కి పోగులుతీస్తూ, కళ్ళ కొసల నించి చూడసాగింది.

"ఏం? ఎందుకూ?" ఆశ్చర్యం ప్రతి ఫలిం చింది నీలవేణి కళ్ళల్లో!

"ఎందుకేమిటి? చక్కగా స్వంత బంగళా, కారు, ఇంటినిండా ఫర్నిచరు, రత్నాల్లాంటి బిడ్డలు, ప్రేమగా చూసుకునే బంగారంలాంటి మొగుడూ, హోదా___"

"ఆపు ఆపు ఇంక చాలు" నీలవేణి ముఖం మ్లానమైంది.

"నాలాంటి దురదృష్టవంతులు ఈ ప్రపం చంలో వుండరు. ఉండకూడదనే నేను కోరు కునేది" ఆవేదనగా అంది నీలవేణి.


"అదేం? మీకు వచ్చిన లోటేమిటి" కళ్ళె గరేస్తూ అడిగింది మాధవి.

"నా కంతా లోటేనమ్మా. అందరికీ లభిం చేదే నాకు లేదు. నా చెల్లెలిలాంటి దానవు. ఎందుకో నీతో చెప్పుకోవాలని పిస్తోంది నాకు. నాకూ, నా భర్తకీ మధ్య భార్యాభర్తల అను బంధంలేదు."

మాధవి ఉలిక్కిపడింది, "నిజంగానా?" కళ్ళు పెద్దవిచేస్తూ అడిగింది.

"అబద్ధం చెప్పవలసిన అవసరమేముం దమ్మా. పెళ్ళయిన తర్వాత ఒక ఏడాది సుఖ పడి వుంటానంతే! అంతే! ఆ తర్వాత.... ఆ తర్వాత...." మాట్లాడలేకపోయిందామె. కాసేపుండి తిరిగి చెప్పసాగింది.

"నేను ఒక శ్రీమంతుడి కూతుర్ని. చదువు, అందం, డబ్బు అన్నీ వుండేవి. దానికి తగ్గట్టు కొంచెం గర్వంకూడ వుండేది. దురహంకారం కాదు సుమా! ఎంతోమంది నాకు లవ్‌లెటర్స్ రాసేవారు. నన్ను పెళ్ళి చేసుకోవాలనుకునే వారు. అందర్నీ గడ్డిపరకలా తీసిపారేసాను. ఇప్పుడనిపిస్తుంది. వాళ్ళలో ఏ ఒక్కరిని చేసు కున్నా నా జీవితం యింకోలా వుండేది. ఆనం దంగా వుండేది. ఇప్పుడనుకుంటాను. ఏం లాభం? నేను అందరి ఆడపిల్లల్లాగ కలలు కనేదాన్ని కాదు అలాంటివాడు, ఇలాంటి వాడు కావాలని. నాకు తెలుసు నా అందం, చదువు, హోదాలకు సరితూగేవాడు వస్తాడని. ప్రేమగా చూసుకుంటాడనీ తెలుసు. నేను గర్విష్టినయినా దుర్మార్గురాలినికాదు, దుర హంకారిని కాను. ఏదో పిచ్చినమ్మకం. అలాగే నేను మెచ్చినవాణ్ణి చేసుకున్నాను. అతనికి అనుమానం. ఏదో నా డబ్బును చూసుకుని గర్వంగా తనని ధిక్కరిస్తానని, ఏదో అంటూ వుండేవాడు. నేనూ ఊరుకునే దాన్నికాదు. మాటకి మాట. ఫలితం పోట్లాటలు, ఏడుపులు, అశాంతి. కొన్నాళ్ళవరకూ మాకు దైహికంగా సంబంధం వుండేది. ఆ తర్వాత అదీవుండేది కాదు. దానికి కారణం ఆ తర్వాత తెలిసింది. మంచి పరువంలో వున్న వయసు. భర్త కర్క శుడు. సెక్స్ అర్జ్‌తో వేగిపోయేదాన్ని, ఆ క్షణంలో నాకనిపించేది ఎవరితో నన్నా వెళ్ళి



పోదామని. కానీ... కానీ....ఆ పని చేయలేక పోయే దాన్ని. కారణం పరువు ప్రతిష్టలు. సంఘంలో పేరు వున్న వాడి కూతుర్ని, పేరు గలవాడి కోడల్ని, పేరుగలవాడి భార్యని. ఎంత అసహ్యంగా వుంటుంది?? అదీకాక ఈ తుచ్ఛమైన శారీరక వాంఛకోసం ఎవడితో నన్నా వెళ్ళినా వాడు నన్ను పెళ్ళి చేసుకుని భార్యలా గౌరవిస్తాడని నమ్మకంలేదు. ఆ అపనమ్మకం వలనే నేను ఆ పని చేయలేదు చేయలేక పోయాను. ఆ పరిస్థితుల్లోనే ఆయన సుషమతో సంబంధం పెట్టుకున్నారు''

ఆశ్చర్యంతో మాధవి కళ్ళు పెద్దవి అయ్యాయి ''నేను చూసాను. నేను చూసిన ఆ సుషమేనా'' అడిగింది.

ఆమే అన్నట్లు సైగ చేసింది నీలవేణి, ''పోట్లాడే దాన్ని. నన్నెందుకు పెళ్ళి చేసుకున్నారని ఏడ్చేదాన్ని. దానికి అతని సమాధాన మేమిటో తెలుసా? నేను గర్విష్ఠినట, దానికి తగ్గ శాస్తి చేస్తున్నారట. ఏడుస్తూ వుండి పోయాను. ఆయనకు అడ్డుచెప్పేదాన్ని కాదు.

నాలో కసి చెలరేగింది, అతనితో గొడవ పెట్టుకుని విడిపోతే అతనికేం బాధలేదు. ఉన్న అడ్డూ అపూ తొలగిపోతుంది. అప్పుడు పబ్లిగ్గా సుషమని పెళ్ళి చేసుకోవచ్చు. ఆ ఉద్దేశ్యం నేను కనిపెట్టాను. అందుకే విడిపోలేదు. నాకసి తీరుతుంది. ఎంత ఆమెతో తిరిగినా పబ్లిగ్గా తిరగలేడు కదా! నా భార్య అని అందరితో చెప్పలేడు కదా! ఎలాగూ ఇతన్ని విడిచి నేను బావుకునేదేమీలేదు. ఎలాగూ నా సుఖ సంతోషాలు మళ్ళీ జన్మతోనే ముడిపడి వున్నాయి. ఏదో అశాంతి, ఒంటరి తనం, శరీర తాపం, వాంఛ. అప్పుడే ఒక తప్పు చేసాను.'' ఆగి ఊపిరి తీసుకుంది నీలవేణి. భయం భయంగా చూసింది మాధవి. నవ్వింది నీలవేణి. ''నేను... నేను....ప్రొవకేట్ చేసి ఆయన ద్వారా ఈ పిల్లల్ని కన్నాను, అసహ్యం వేస్తోంది కదూ! నామీద?'' మాధవి భుజం కుదుపుతూ అడిగింది నీలవేణి.

''అప్పుడు అలా అసహ్యంగా ప్రవర్తించక పోతే ఈ రత్నాలు నాకు దక్కేవారా? చెప్పు. ఇప్పుడు వాళ్ళే నా సర్వస్వం. వాళ్ళే నాలోకం వాళ్ళే నా ప్రాణం వాళ్ళకోసమే బ్రతుకుతున్నాను'' కారుతున్న కన్నీటిని చీరచెంగుతో వత్తుకుంది నీలవేణి,

''వాళ్ళ గురించి ఏమీ పట్టించుకోరు

ఆయన. వంశాకురాలన్న ధ్యాసకూడా లేదు ఆయనకి. ఎప్పుడైనా నేను చూడకుండా ముద్దు చేస్తారు అంతే! దానికే నాకు పరమసంతోషం. దీపూ బర్త్‌డేనాడు అందుకే ఏడ్చాను. పిల్లలు పుట్టాక నాలో శరీర వాంఛలు చచ్చిపోయాయి. నేనే నా మనసుని సంబాళించుకున్నాను. భగవత్ సేవలో గడిపేస్తాను. ఎన్ని పూజలున్నాయో, ఎన్ని వ్రతాలున్నాయో నాకు తెలుసు. అవన్నీ చేస్తాను. అదే నాకు శాంతి. ఇంటిపని ఉపశాంతి. పిల్లల సంరక్షణ నాకు ఆనందం. జీతం ఒక ఏడు వందలు పడేస్తారు, నా ముఖాన్న. మిగిలిన జీతమంతా ప్రియురాలికే! నాకో ఇల్లు వుంది. ఆ ఇంటిమీద అద్దె మూడు వందలొస్తుంది. ఈ వెయ్యి రూపాయిలతోటి సంసారాన్ని లాక్కుని వస్తున్నాను. ఎంతపని కల్పించుకుని చేసినా తీరిక మిగులుతుంది. ఆ తీరిక వేళల్లో ఇల్లు అలంకరిస్తాను. బొమ్మలు చేస్తాను; సంగీతం నేర్చుకుంటాను. నేను సినిమాలు చూడను, కథలు చదవను. ఎక్కడికీ వెళ్ళను. కారణం—ఎక్కడ చూసినా భార్యాభర్తల అన్యోన్యత కనిపిస్తుంది. నాకు లేనిది అదే! అందుకే పిల్లలకి కార్టూను ఫిల్మ్స్ చూపిస్తూ వుంటాను. నా కొడుక్కి పెళ్ళాన్ని ఎంత అపురూపంగా చూసుకోవాలో నేర్పుతాను, నాకు ఇప్పుడు ఏ ఆశలులేవు. ఏ కోరికలులేవు. కానీ ఏపని చేసినా మనసు ఆలోచించడం మానదు కదా! నేను కన్నె పిల్లలాగ కలలు కంటూ వుంటాను, అది ఏమిటో తెలుసా? డబ్బు వున్నా లేకపోయినా ప్రేమగా చూసుకునే భర్త గురించి. దేవుని ప్రార్థించేది అదే!"

శిలాప్రతిమే అయిపోయింది మాధవి. దీపూ, వాసూ స్కూలునించి వచ్చారు. ఇద్దర్నీ గుండెలకు గాఢంగా హత్తుకుంది నీలవేణి. "ఏం పొందినా పొందకపోయినా వీళ్ళని పొందాను అంతే చాలు ఈ జన్మకి" అంటూ గొణుక్కుంది పిచ్చిదానిలా.

"ఏమ్మా బోర్ కొట్టానా?" నవ్వుతూ అడిగింది నీలవేణి ఆ ఎమోషన్ నించి కొంచెం తేరుకొన్నాక. "అబ్బే, లేదు లేదు" తడబడింది మాధవి.

'ఈ ఏంజిల్, ఈ సుగుణాలఖని వెనుక ఇంత విషాద గాథ వుందా?' పిల్లల్ని ముద్దులాడుతోన్న నీలవేణి కేసి చూసి బలవంతంగా నవ్వింది మాధవి. ఎప్పటిలా నిర్మలంగా నవ్వింది నీలవేణి. ఆ కళ్ళు కాంతులను విరజిమ్ముతున్నాయి. □

పుత్ర సర్వత్ర పోగాల యోగం

1

పేరుబడ్డ కొంతమంది
పెద్దవాళ్ళ కొడుకులు
ప్రతిరోజూ బయటపడే
గొప్పయింటి గొడవలు
కన్నవారి ఉన్నవారి
గుండె గుబులు కుదుపులు
పెంచలేని దించరాని
పెళ్ళికాని కష్టపులు!

2

కళ్ళముందు ఎన్నెన్నో
ఘాతుకాలు జరిపినా
'మా వాడిది తప్పంటే
నేను ఒప్పుకుంటానా?'
అంటుందొక అంధురాలు
నేటికదే వాదన
ందుకనే అంతటితో
ఆగిందా పాలన!

3

తల నెరిసిన తన తనయుని
దారుణాలు నమ్మరు
దర్యాప్తుకి ఒప్పుకోరు
దబాయింపు మానరు
గురువిందకు గురవయినా
పరనిందకు ప్రథములు!
దగాపడిన దేశంలో
తమరే మరి పెద్దలు!

4

కోడలికీ కొడుకు మధ్య
కోర్టు స్థాయి చీలిక
నమ్మలేని బొమ్మలతో
కొత్త వలపు శీర్షిక
ఇంటి గుట్టు రక్షణమే
ఇంక వారి బాధ్యత
ఈ దేశం రక్షణకిక
ఏదండీ తీరిక?

5

ఇంచు మించు ప్రతి మంత్రికి
ఇదే మమత మగ్నత
నీలి వార్త లివి అయితే
నిజము ప్రజకి చాటక,
మన్ను దిన్న పాముల్లే
ఎన్నాళ్ళీ నాటిక?
తరతరాల పాలన కిది
ఎవరి బాబు సంపద?

అవసరాల రామకృష్ణారావు ఆలపించు **రసవద్గీత (11)**

ప్రేమసింహాసనం



యద్దనపూడి సులోచనారాణి

ఆకాశం మేఘావృతంగా వుంది!

రాత్రి పొద్దుపోయిన ఆ వేళలో, రాబోతున్న పెద్ద వాన గురించి పారాహుషార్ పలుకుతున్నట్టుగా గాలి రంయ్యిన వీస్తూ, శబ్దం చేస్తోంది!

వాన రాకకి, సంతోషాతిశయాలతో స్వాగత నృత్యం చేస్తున్నట్టుగా, చెట్లకొమ్మలు కదులుతున్నాయి! ఆ నృత్యానికి తాళం వేస్తున్నట్టుగా, ఆ వీధిలోవున్న యిళ్ళ కిటికీ తలుపులు, టకటక శబ్దంచేస్తుంటే, యింటి యజమానులు, 'ఏమిటి మీ గోల' అన్నట్టు లేచివచ్చి వాటినోళ్ళు నొక్కినట్టుగా గడియలు బిగిస్తున్నారు!

కొత్త సీరియల్

విద్యార్థులు చేస్తున్న అలజడిని, గమనిస్తున్న పోలీసుల్లా, వీధి దీపాలు నిటారుగా నిలబడి, ఈ వాన రాక గడబిడని గమనిస్తు న్నట్టుగా వున్నాయి!

ప్రకృతి చేస్తున్న యీ సందడిలో, ఆ వీధిలో చిట్టచివర యింట్లో నుంచి వస్తున్న 'అమ్మా, అబ్బా' అన్న మూలుగు సరిగ్గా వినిపించడంలేదు. ఆ కంఠస్వరం, ఎంతో నీరసంగా వుంది! మూలుగుతూ, మంచం మీద పడివున్న ఆ వ్యక్తి శరీరం, ఎన్నో తుఫాను గాలుల ఒత్తిడికి, తట్టుకుని శిథిలమై, పాతబడిన భవనంలా కళా విహీనంగా వుంది!

"అబ్బా! అయ్యో!" ఆవిడ మంచంమీద పడుకోలేనట్టుగా, లేచి కూర్చుంది! తలనెరిసి, ముఖం పీక్కుపోయి, వైధవ్యఛాయలతో వున్న ఆమె ముఖం చూస్తుంటే ఆవిడ జీవితం అంతా కష్టాలకొలిమిలో గడిచినట్టుగా, యిట్టే అర్థం అవుతోంది!

"అయ్యో నాయనా! నాకు చావు ఎప్పుడు వస్తుందిరా దేవుడా! నేనేం పాపం చేసానురా తండ్రీ! స్వప్నా! యిలారా! నా దగ్గరగా రా!"

"ఏమిటమ్మా! గుండెల్లో చాలా నొప్పిగా వుందా!" కిటికీతలుపు మూసి, గడియ బిగించి వస్తున్న ఆ యువతి ఎంతో లాలనగా అడిగింది.

బాధతో విలవిలలాడుతున్న ఆవిడ ఒక్క క్షణం తన మంచం దగ్గరగా వచ్చి నిలబడిన కూతురివైపు దీర్ఘంగా చూసింది! ఆ వెంటనే కూతురిచేయి పట్టుకుని బావురుమని ఏడ్చేసింది. "స్వప్నా! ఈ బాధ భరించలేక, నా ప్రాణంపోతే బావుండునని అనుకుంటున్నాను కానీ, నేను లేకపోతే నువ్వేమవుతావే! వద్దు! వద్దు! ఎంత బాధ అయినాసరే! నేను బ్రతకాలి! బ్రతుకుతాను! బ్రతుకుతాను!"

స్వప్న చప్పున మంచంమీద కూలబడి తల్లిని దగ్గరకు లాక్కుంది.

"ఏమిటమ్మా యీ మాటలు—" కంఠం గద్గదికం అవటంతో ఆపైన యింకేం చెప్పలేకపోయింది.

ఆవిడ ఏడుస్తూనే వుంది. "నా భయం నీకు తెలియదే! నా మనసంతా రకరకాల ఆలోచన్లు భూతాల్లా బెదిరిస్తున్నాయి."

స్వప్న తల్లిని చిన్నపిల్లలా దగ్గరికి తీసుకుని, ఆవిడ కన్నీళ్లు తుడిచింది.

"నేనెన్నిసార్లు నీకు చెప్పానమ్మా! నా విషయంలో నువ్వు ధైర్యంగా వుండమంటే వుండనే వుండవు!"

"మీ నాన్న యాక్సిడెంట్‌లో చచ్చిపోయిన రోజునే, నా ధైర్యం భగవంతుడు మింగేసేసాడు. నా అంత దురదృష్టవంతురాలు యీ ప్రపంచంలో యెక్కడా వుండదేమో!"

ప్రారంభం

స్వప్న తల్లి మాటలు వింటూ మౌనంగా వుండిపోయింది! తండ్రి గుర్తురాగానే, స్వప్నకళ్ళలో చివ్వున నీళ్ళు వుబికినాయి! ఆ గారాబం, ఆ సుఖం, ఆ ఆనందం, చేత్తో తుడిచేసినట్టే మాయమైనాయి!

"అమ్మా! నువ్వు ధైర్యం తెచ్చుకోకపోతే ఎలాగమ్మా. నువ్వు భయపడటమే గాదు! నన్నుకూడా భయపెడుతున్నావు! డాక్టర్ నీకేం చెప్పాడు! నువ్విలా ఆలోచించటం మానేస్తేగానీ, నీకా గుండెనొప్పి తగ్గదని అనలేదూ? వుండు నేను వెళ్ళి వేడినీళ్లుపెట్టి తెస్తాను. మందు వేసుకుందువుగాని!"

ఆవిడ కూతురుని లేవనీయలేదు. "ఒక్క నిమిషం నా దగ్గర కూర్చోవేమ్మా! నాకేమిటో చాలాభయంగా వుంది!స్వప్నా! నాకు ఎందుకింత భయం వేస్తోంది! ఈ పాడువాన ఎందుకు వస్తోంది?" అప్పటికే బైట వాన వుధృతంగా పడ్తున్న శబ్దం విన్పిస్తోంది!

"ఏమిటమ్మా! ఇది అకాలంగా కురుస్తున్న వాన కాదుగా. దాని ఋతువు!" తల్లి జుట్టుని సరిచేస్తూ అంది. దీపపు వెలుతురులో ఆ జుట్టు వెండితీగెల్లా మెరుస్తోంది. తల్లి జుట్టు ఎంత నల్లగా వత్తుగా వుండేదో! స్వప్న నిట్టూర్చింది! స్వప్న కళ్ళముందే తల్లి అందం క్షీణించి, మాసిపోయింది!

"నొప్పి కాస్త తగ్గిందా అమ్మా!"

ఆవిడ లేదన్నట్టు తల తిప్పింది.

స్వప్న ఆవిడని బలవంతంగా దిండుమీదకి జరిపి, లేచి వంటింట్లోకి వెళ్ళింది. స్టవ్ వెలిగించి నీళ్లు పెట్టింది! అవతల గదిలో నుంచి తల్లిమూలుగు వినిపిస్తోంది!

స్వప్న తదేకంగా, స్టవ్‌మీద పెట్టిన నీళ్ళవైపే చూస్తోంది. వత్తులు యెంత ఎక్కించినా, నీళ్ళు త్వరగా వేడి అవడంలేదు! స్టవ్‌లో కిరసనాయిల్ అయిపో వచ్చిందో ఏమో! గప్‌గప్ మని ఎగురుతోంది! స్వప్న మళ్ళీ స్టవ్ తగ్గించింది! ఒక్కొక్కళ్ళ జీవితాలు కొన్ని గంటల వ్యవధిలో ఎంత చిత్రంగా మారిపోతాయి!

పది సంవత్సరాల క్రితం ఆ రోజు తనకి యింకా బాగా గుర్తుంది!

స్కూలుదగ్గర తనని దించి తండ్రి ఆఫీసుకు వెళ్లాడు.

"స్వప్నా! సాయంత్రం మనం సినిమాకి వెళ్దాం! టికెట్లు తెస్తాను. మనం బైలుదేరేవరకూ, మీ అమ్మకు చెప్పవద్దు. ఏం?"

తను సంతోషంగా, అలాగే అన్నట్టు తల వూపింది. అప్పుడప్పుడు, ఇద్దరూ కలిసి తల్లిని ఆశ్చర్యపరచటం, చకితురాలిని చేసి తమాషాచేసి, ఆనందంగా చూడటం అలవాటే. ఆ రోజు సాయంత్రం స్కూలునుంచి ఎంతో ఉత్సాహంగా వచ్చింది. కానీ వచ్చేసరికి యింటిదగ్గర పరిస్థితి స్వప్న వూహించలేనంత దారుణంగా వుంది. తండ్రి శవం యింట్లో వుంది! తల్లి ఏడుస్తోంది! ఇంటినిండా జనం వున్నారు. తనని చూడగానే తల్లి పిచ్చిదానిలా ఎదురువచ్చింది. "స్వప్నా! అయిపోయిందే! మన జీవి



తాలు తెల్లారిపోయినాయి! మన ఆనందం ఆ మాయదారి దేవుడు దోచేసుకున్నాడే!” తల్లి ఆ క్షణంలో ఏడుస్తూ అన్న ఆ మాటలు ఎంత నిజం! అక్షరాలా ఋజువు అయినాయి! తండ్రి యాక్సిడెంట్ అయి చనిపోయిన ఆ రోజునుంచి తల్లి ముఖంలో ఆనందం అంటే ఏమిటో తను మళ్ళీ చూడలేదు!

సంతోషం అనేది తన మనసుకి ఒక బాల్యస్మృతిగా మాత్రమే నిల్చిపోయింది.

“స్వప్నా!” ముందుగదిలోనుంచి తల్లి కేక వినిపించింది.

“వస్తున్నానమ్మా!” స్వప్న నీళ్లుచూసి, స్టవ్ తీసేసింది. గ్లాసులో పోసి, మందు తీసుకుని తల్లిదగ్గరకి వచ్చింది! ఆవిడ మంచంమీద కూర్చోలేనట్టుగా, క్రిందకిదిగి నేల మీద కూర్చుంది.

“అమ్మా! ఈ మందు వేసుకో!” బలవంతంగా తల్లిచేత తాగించింది

ఆ మందు ప్రభావం స్వప్నకి చిరపరిచితమే! వేసుకున్న అయిదు నిముషాలకి గాఢమైన నిద్ర వచ్చేస్తుంది!

మందు పనిచేయటం ప్రారంభించగానే, ఆవిడలో ఆరాటం కాస్త తగ్గింది!

“లేచి మంచంమీద పడుకోమ్మా” స్వప్న తల్లిచేయి పట్టుకుని లేవదీసి, మంచం మీద పడుకోబెట్టి, దిండు సరిచేసింది.

“నీ దగ్గిరే కూర్చుంటాను” స్వప్న మంచంమీద కూర్చుంది.

ఆవిడ కూతురిచేయి పట్టుకుంది. “స్వప్నా! మామయ్య దగ్గరనుంచి, ఈరోజు

కూడా వుత్తరంరాలేదు" బేలగా అంది.

"తనే బైలుదేరి వద్దామని అనుకుంటున్నాడేమోనమ్మా."

"వాడికి—నామీద కోపం వచ్చింది! నేనేం చెయ్యను చెప్పు—వదినకి నే నుండటం యిష్టంలేదు."

"అవన్నీ యిప్పుడెందుకమ్మా?"

"అన్ని వద్దన్నా గుర్తుకు వస్తున్నాయే! ఆవిడ దిక్కులేనివాళ్ళం, గతిలేని వాళ్ళం అని ఎన్నిమాటలు అన్నా భరించాను! జలగల్లా పిండుతున్నారు అన్నా సహించాను. కానీ—కానీ—'డబ్బు లేకపోతే, నీ కూతురుని బజారులో పెట్టుకుని అమ్ముకో' అంది. నేనది భరించలేకపోయానే స్వప్నా! నా గుండెల్లో కత్తితో పొడిచినట్టయింది! "నువ్వు అడ్డం రాకపోతే, ఆ రోజు ఆవిడ రక్తం కళ్ళ చూసేదాన్ని!"

ఆవిడ మళ్ళీ ఏడవసాగింది!

"అమ్మా! నువ్వు నిద్రపోతావా లేదా?" స్వప్న చిరుకోపంగా అంది.

"అదికాదే? చెప్పకుండా వచ్చేశామని మామయ్య కూడా నామీద కోపం తెచ్చుకున్నాడు."

"ఆయన బాధ ఆయనది."

"మామయ్యకూడా లేకుండా మనం ఎలా బ్రతగ్గలమే!"

"ఎందుకు బ్రతకలేం? నాన్న లేకపోతేనే బ్రతగ్గలిగామే! ఇప్పుడు బ్రతకలేమా? నీకు నేను, నాకు నువ్వు వుండగా, యింకెవరో ఎందుకమ్మా. నీకు పుణ్యం వుంటుంది! నువ్వు యీ గొడవలన్నీ మనసులో పెట్టుకోకుండా, విశ్రాంతిగా వుండు! నీకు గుండెల్లో నొప్పి వచ్చిందంటే, నాకెంత భయం వేస్తోందో తెలుసా! నువ్వు నా గురించి ఆలోచించకుండా, అవన్నీ ఎందుకు పట్టించుకుంటావు!"

స్వప్న మందలింపులకి జానకమ్మ మాట్లాడలేదు! తప్పుచేసిన చిన్నపిల్లలా మౌనంగా వుండిపోయింది.

మరో పదినిముషాల్లో, నిద్ర ఆవిడ చింతలని, దుఃఖాన్ని, గుండె నొప్పిని స్వాధీనం చేసుకుంది.

తల్లి నిద్రపోగానే, స్వప్న మెల్లగా చేయి విడిపించుకుని లేచివచ్చింది. బైట వానపడుతోంది. స్వప్న మంచంమీద పడుకుంది. మనసు నిశ్చలంగా వుంది. అది పాషాణంలాటి నిశ్చలత. తండ్రిపోయిన క్షణంనుంచే పెద్దరికం లాటిది వచ్చేసింది! తల్లిని ఓదార్చటం ఆనాటినుంచే అలవాటయింది. తండ్రి పోయిన రోజున తను వెక్కి వెక్కి ఏడుస్తుంటే మేనమామ పక్కకు తీసుకువెళ్ళి చెప్పాడు. "స్వప్నా! నువ్వు ఏడవకూడదు. నువ్వు ఏడవటం చూస్తే మీ అమ్మ యింకా బెంబేలుపడిపోతుంది. మీ అమ్మకి నువ్వే ధైర్యం చెప్పాలి!"

ఆ నిముషంనుంచి స్వప్న తల్లిముందు ఏడవలేదు. ఏడుపువస్తే ఏదో వంకతో

బాత్‌రూమ్‌లోకి వెళ్ళి తలుపులు వేసుకునేది. లేకపోతే, తల్లికి కనిపించని ఏ ఒంటరి ప్రదేశమో వెతుక్కునేది।

స్వప్న ధైర్యంచూసి బంధువులే ఆశ్చర్యపోయారు. పెరిగి పెద్దయినకొద్దీ, తన దుఃఖం తన బాధ తనలో దిగమింగి, గంభీరంగా వుండటం స్వప్నకి బాగా అలవాటయి పోయింది.

స్వప్న మంచంమీద వెల్లకిలా పడుకుంది.

వాన శబ్దం వింటుంటే, చిన్ననాటి సంఘటన గుర్తుకు రాసాగింది। తండ్రి తనకి కాగితంపడవ చేయటం నేర్పాడు. అప్పటినుంచి వాన రాకకోసం ఎంతో వుత్సాహంగా ఎదురుచూసేది. తండ్రితో కలిపి, కాగితపు పడవలు ఆ నీళ్ళలో వదిలేది. ఆ పడవలు నీళ్ళలో తేలుతూ వెళుతుంటే, అపరిమితమైన ఆనందం! తండ్రిపోయి పదేళ్లు అయింది। కానీ తండ్రిని గురించి, ఒక్క క్షణంకూడా స్వప్న మర్చిపోలేదు. ఏమీ తోచనప్పుడు, ఆ జ్ఞాపకాల గదులు తెర్చి, అక్కడికి వెళ్ళిపోతే, ఎంతో హాయిగా వుంటుంది। రాను, రాను, స్వప్నకి తండ్రిపోయిన దిగులు క్రమంగా తగ్గిపోసాగింది. ఆయన ఎక్కడికీ వెళ్ళిపోకుండా ఎవ్వరికీ కనిపించకుండా తనదగ్గరే వున్నట్టుగా వుంది। తండ్రి పోవటం, బంధువుల తిరస్కారం, ఆర్థికమైన వత్తిడి, వీటితో స్వప్న మనసు విచిత్రంగా తయారయింది। రేపు ఏమౌతుందోననే భయం రవంతకూడా లేదు। తండ్రిని పోగొట్టుకోవడంకంటే, భయంకరమైన సంఘటన తన జీవితంలో యింకేదీ రాదు। స్వప్న శరీరం, తొలి యవ్వనపు ప్రాంగణంలో, లేత తీగెలా, నాజూకుగా వున్నా, మనసుమాత్రం, ఇరవై సంవత్సరాల అనుభవం సంపాయించిన వ్యక్తిదిలా వుదిం। అందుకే చూసేవాళ్ళకి, స్వప్న మౌనమూర్తిలా, మూగపోయిన వీణలా, కుతూహలం రేకెత్తిస్తున్నట్లుగా వుంటుంది.

ఆలోచనల్లోకి జాలువారిన స్వప్నకి మగతనిద్ర పట్టింది.

మగతనిద్రలో తండ్రి పిలుస్తున్నాడు. "స్వప్నా! స్కూలుకి టైమయింది త్వరగా రా!"

"వస్తున్నా డాడీ!" కానీ తను లేవలేకపోతోంది।

ఏమైంది తనకి?

"స్వప్నా! నువ్వు రాకపోతే నేను వెళ్ళిపోతాను."

"వద్దు. వద్దు. వెళ్ళిపోవద్దు. వస్తున్నా డాడీ."

కానీ తన మాటలు ఆయనకి వినిపించటంలేదు.

"స్వప్నా!"

"స్వప్నా—స్వప్నా."

స్వప్న దిగ్గున లేచి కూర్చుంది। తల్లి పిలుస్తోంది.

"ఏమిటమ్మా."

"నొప్పిగా వుందే! అబ్బా! భరించలేకపోతున్నాను. ఎలాగే! యింకో మాత్ర వుందేమో చూడు."

"లేదమ్మా. ఒక్కటే వుంటే, యింతక్రితం యిచ్చేసాను."

"లేదా! అయ్యో, ఎలాగే! అబ్బా—ఇది అసలు మందుకి తగ్గేట్టు లేదే!"

స్వప్న గభాల్న వచ్చి తల్లిని పట్టుకుంది.

"స్వప్నా! లాభంలేదే! డాక్టర్‌ని పిలుచుకురా! నేను భరించలేకుండా వున్నాను."

"డాక్టరా! ఈ వానలో! ఆ డాక్టర్‌గారి యిల్లు చాలా దూరం!"

"ఆలస్యం చెయ్యకే! వెళ్ళు! తులశమ్మగారిని పిలుచుకురా!"

"అలాగేనమ్మా!"

"గొడుగు తీసుకు వెళ్లు." ఆయాసపడుతూ అంది.

"గొడుగు లేదమ్మా. తులశమ్మగారు నిన్న తీసుకువెళ్ళి పంపలేదు."

"అయ్యో! తడిసిపోతావేమో!"

"ఏం ఫర్వాలేదు" ఆదుర్దాగా, గబగబా వెళ్ళబోయిన స్వప్న ఒక్కక్షణం ఆగి, గిరుక్కున తిరిగి తల్లి మంచం దగ్గరగా వచ్చింది.

"అమ్మా! నువ్వు భయపడవుగా! నేను త్వరగా తులశమ్మగారిని తీసుకు వస్తాను."

"భయపడనులే. తలుపు బైటకివేసి వెళ్లు."

స్వప్న తల వూపింది. తలుపులు తీసుకుని బైటకి వచ్చింది. గాలి, వాన కలిసి రివ్వున వచ్చి, స్వప్న శరీరాన్ని తాకినాయి. తలుపులు బైటకి గడియపెట్టింది! వాన, ఎడా పెడా కొడుతోంది! వుధృతంగా వీస్తున్న ఆ గాలికి, తోసుకుపోకుండా, తనని తాను నిలవరించుకోవటం స్వప్నకి కష్టమైపోతోంది!

స్వప్న ఆ వీధి మొదలులో వున్న తులశమ్మగారి యింటికి పరుగులాటి నడకతో వెళ్లింది. ఇల్లు వదిలి, రెండు బారలు వచ్చేసరికే, స్వప్న పూర్తిగా తడిసి ముద్దయిపోయింది.

తులశమ్మగారి తలుపులు దబదబా బాదింది.


లోపల వాళ్లు మంచి నిద్రలో వున్నట్టున్నారు. వెంటనే తలుపులు తెరవలేదు. స్వప్న గొంతెత్తి పిలవగా, మరోసారి తలుపు దడదడలాడించగా, లోపల లైటు వెలిగింది.

తలుపులు తెరుచుకున్నాయి! కానీ తలుపులు తెరిచిన వ్యక్తి తులశమ్మ కాదు! ఆవిడ కొడుకు మోహన్!

"మీ అమ్మగారున్నారా?"

అతను, నీళ్లు కారుతూ నిలబడిన స్వప్నని విచిత్రంగా చూసాడు.

"లేరే! అక్కయ్య ప్రసవించిందని టెలిగ్రాం వస్తే మధ్యాహ్నం వూరు వెళ్ళింది."



"అయ్యో!" స్వప్న దిగాలుగా చూసింది.

"ఏం కావాలి!"

"అమ్మకి బాగా గుండెల్లో నొప్పిగా వుంది! డాక్టరుని తీసుకురావాలి."

అతను క్షణంసేపు తటపటాయింపుగా చూసాడు. తర్వాత అన్నాడు. "ఆ పని అయితే, మా అమ్మకంటే నేనే మీకు సాయం చేయగలను."

అతను అంటుండగానే, వాన రివ్వున స్వప్నమీదుగా, వచ్చి అతని ముఖానికి తగిలింది.

"అబ్బా!" అంటూ అతను వెనక్కు తగ్గాడు.

"ఒక్క నిముషం మీరు లోపలకి రండి. ఇంత రాత్రివేళ డాక్టరు రావటంకూడా కష్టమే! నా దగ్గర మందులేమైనా వున్నాయేమో చూస్తాను!"

స్వప్న నిస్సంకోచంగా లోపలకి వచ్చింది! అతను తలుపులు దగ్గరగావేసి లోపలికి వచ్చాడు. తులశమ్మగారికొడుకు మోహన్ స్వప్నకి అపరిచితుడేంకాదు! అతను మెడిసన్ చదువుతున్నాడు. తల్లికి మొదటిసారి గుండెనొప్పి వచ్చినప్పుడు అతనే పరీక్షచేసి, డాక్టర్‌ని తీసుకువచ్చి వైద్యం చేయించాడు.

"ఒక్క నిముషం. నేనిప్పుడే బట్టలు మార్చుకుని వస్తాను" లుంగీ బనీనుతో వున్న అతను లోపలికి వెళ్ళబోయాడు. ఇంతలో, తలుపులు రివ్వున తెరుచుకున్నాయి. గాలి గభాల్న లోపలకి జొరబడి, గోడలకివున్న క్యాలెండర్లని రెపరెపలాడించి, టేబిల్‌మీదవున్న బిద్రీవర్క్ ఫ్లవర్‌వేజ్‌ని క్రిందపడేసింది. అతను ఒక్క అంగలో వచ్చి, వీధితలుపులు గడియపెట్టాడు. స్వప్న ఫ్లవర్‌వేజ్‌ని తీసి టేబిల్‌మీద వుంచింది.

"ఒక్క నిముషం"—అని లోపలికి వెళ్లాడు. లోపల అతను బట్టలు మార్చు కుంటుంటే, గుమ్మంలో నుంచి స్వప్న కనిపిస్తూనేవుంది. పాతవాయిల్ చీర స్వప్న ఒంటికి అతుక్కుపోయింది. జుట్టునుంచి నీళ్ళు కారుతున్నాయి. స్వప్న నిశ్శబ్దంగా, మౌనంగా, అతని రాకకోసం వేచిచూస్తున్నట్టుగా, క్రిందకి చూస్తూ, ఏదో ఆలోచనలో మునిగిపోయినట్టుగా పరధ్యాసగా నిలబడిపోయివుంది.

అతనికళ్ళు స్వప్న సౌందర్యానికి కట్టుబడినట్లుగా, మళ్ళీ మళ్ళీ అటే చూస్తున్నాయి!

బట్టలు వేసుకున్న అతను డ్రాయరులో మందులు వెతికేనెపంతో జాప్యం చేయసాగాడు.

"ఉన్నాయా మందులు!" స్వప్న అడిగింది.

"ఉహూ." అతను వెతుకుతూనే అన్నాడు.

అతనికి ఆ క్షణంలో ఆ అమ్మాయిని తాకాలనే కోర్కె కలిగింది!

ఇంట్లో ఎవరూలేరు! వీధితలుపులు వేసివున్నాయి! అతని కోర్కె మరింత బలపడింది! స్వప్నకి రోగిష్టితల్లి తప్ప అండగా యింకెవ్వరూ లేరు! అతనికి ధైర్యం వచ్చింది!

"మందులు లేకపోతే పోనీ! డాక్టరుగారి దగ్గరకి వెళదాం" అంది.

"అలాగే. తాళంకోసం చూస్తున్నాను" అతను ముందుగదిలోకి వచ్చి డ్రాయరు తెరిచి చూస్తున్నాడు.

హఠాత్తుగా లైట్లు పోయినాయి!

"భయపడకండి. నా దగ్గర బ్యాటరీ లైటువుంది." చీకటిలోంచి అతని కంఠం వినిపించింది. "మీరెక్కడ వున్నారో నాకు కనిపించటం లేదు." అతని చాచినచేయి స్వప్నకి తగిలింది. స్వప్న దూరంగా జరగబోయింది. కానీ అతను ఆ చేయి వదల లేదు. మరునిముషంలోగాని స్వప్నకి అతను తనచేయి వదలడంలేదని, తనని కావాలనే దగ్గరకు లాక్కుంటున్నాడని అర్థంగాలేదు!

స్వప్న బలంగా వదిలించుకోబోయింది. కానీ సాధ్యంగాలేదు.

అతని రెండుచేతులు స్వప్నమీద కదులాడసాగాయి. స్వప్నకి తనమీద పెద్ద గొంగళిపురుగులు పాకుతున్నంత కంపరంగా అనిపించింది.

"ఛీ! ఇదేమిటి వదులు." అంది కోపంగా.

"నా తప్పేంలేదు. దేవుడు లైట్లు ఎందుకు తియ్యాలి" అతని కంఠం మామూలుగా లేదు.

స్వప్న పెనుగులాడింది! వానలో తడిసివచ్చిన స్వప్నకి అతని వూపిరి గాడిపొయ్యి సెగలావుంది!

"ఏం ఫర్వాలేదు. ఈ రోజుల్లో ఇలాంటివి సామాన్యమే!" అతనేం మాట్లాడు

తున్నాడో అతనికే తెలియనట్లు న్నాడు. స్వప్న ఆతన్ని విది లించబోయింది! కానీ సాధ్యం గాలేదు. అతనిపట్టు భల్లూకపు పట్టులావుంది!

అతను స్వప్నని బలవం



తంగా క్రిందకి తోసాడు. క్రింద పడబోయిన స్వప్న టీపాయ్ మీద చేయి పడడంతో ఎలాగో ఆపుకుంది! ఎంత వదిలించు

కోవాలన్నా, అతని పట్టు వదలటంలేదు.

స్వప్నచేతికి వాడిగావున్నదేదో తగిలింది. స్వప్న దాన్ని గట్టిగా పట్టుకొని ఎత్తి తనమీదకి వంగిన అతన్ని బలంగా కొట్టింది. అతను కెవ్వుమన్నాడు! స్వప్న మళ్ళీమళ్ళీ పిచ్చిదానిలా చేతులతో సత్తువ అంతా పోయేలా కొట్టింది.

అతనిచేతులు పట్టు సడలినాయి!

హఠాత్తుగా లైట్లు వెలిగినాయి! క్షణంసేపు స్వప్నకి కళ్లు కనిపించనట్టే అయింది! స్వప్న బాగా చూడగలిగేసరికి, అతను స్వప్నపక్కనే ఒరిగివున్నాడు. తలమీద జుట్టులో రెండుచేతులతో గట్టిగా పట్టుకుని ఒగరుస్తున్నాడు.

స్వప్నచేతిలోవున్న నెమలిబొమ్మని పక్కకు పడేసి లేవబోయింది! అతను చేయిచాచి స్వప్నని పట్టుకున్నాడు. మీదకి కలబడ్డాడు. అతని తలలోనుంచి నీళ్లలా కారుతున్న రక్తం స్వప్న బుగ్గలకి, బట్టలకి ఎక్కడపడితే అక్కడ అంటుకుంటోంది. ఎంతో కష్టంమీద అతని పట్టునుంచి విడిపించుకుంది!

అతనిపట్టు వదలగానే, లేడిలా వెళ్ళి వీధితలుపులు తెరిచింది. వాన కాస్త తగ్గింది. ఇంతక్రితంవున్న వుధృతంలేదు.

ప్రకృతిపండుగ చేసుకుని అలిసిపోయిన వ్యక్తిలా సొమ్మసిల్లినట్లుగా వుంది.

స్వప్న పరుగెత్తుకుని యింటికి వచ్చింది. దుఃఖం, భయం, కోపం, నిస్సహాయత స్వప్నని చుట్టుముట్టేయి. చిగురుటాకులా కంపించేలా చేస్తున్నాయి!

"డాక్టరు వచ్చాడుటే___" జానకమ్మ కంఠం నీరసంగా అడిగింది.

"లేదమ్మా."

"లేదా___" స్వప్నని చూసిన ఆవిడ కళ్లు పత్తికాయల్లా అయినాయి! ఒక్క నిముషం తన గుండెనొప్పి బాధే మర్చిపోయింది.

రేగిన తలతో, చిరిగిన చీరతో, ఒంటినిండా రక్తపు మరకలతోవున్న కూతురుని చూడగానే ఆవిడ చేష్టలుడిగినదానిలా అయింది.

"స్వప్నా! ఏమిటే! ఏమైంది___"

స్వప్న అప్పటికే తల్లిదగ్గరగా వచ్చేసింది.

"అమ్మా!" మోకాళ్ళమీద కూలపడి తల్లిఒడిలో తల దాచుకుని బావురుమంది!

స్వప్న అలా ఏడవటం జానకమ్మ ఎప్పుడూ ఎరగదు.

"ఏమైందే___ఏమైంది! తులశమ్మ యింట్లో లేదా?"

"లేదు. ఆవిడ కొడుకున్నాడు. ఇంట్లో యింకెవ్వరూ లేరు" స్వప్న యేడుస్తూ అంది.

ఆవిడకి అర్థమైపోయింది. "హరి భగవంతుడా!"

ఆవిడ పైప్రాణం పైనే పోయినట్లుగా చూడసాగింది. "స్వప్నా వాడు-వాడు నిన్నేమైనా చేసాడా?" అడగలేక అడిగింది.

"లేదమ్మా! చావుదెబ్బలుకొట్టి పారిపోయి వచ్చేసాను!"

"నా తల్లే! నా తల్లే!" ఆవిడ ముఖంలో ఆనందం వెల్లివిరిసింది. కానీ కూతురికి తప్పిన ఆపద ఎంత భయంకరమైనదో గుర్తుకురాగానే ఆవిడకి మళ్ళీ పట్టరాని దుఃఖం వచ్చేసింది.

"స్వప్నా! నా కడుపున పుట్టినందుకు నీకెన్ని కష్టాలు వచ్చినాయే!" అంటూ ఏడవసాగింది.

2

సరికొత్త డిజైన్‌తో, అధునాతనంగా, నీట్‌గా వున్న భవంతి అది! గేటు తెరవగానే క్రమపద్ధతిగా పెంచిన పూలమొక్కలు కళకళలాడుతూ, ఆహూతుల్ని చిరునవ్వుతో పలకరిస్తున్నట్టుగా వుంటాయి! గ్రిల్ వున్న వరండాలో, స్థంభానికి కట్టేసి వున్న పెద్ద ఆల్సేషన్ కుక్క 'భౌభౌ' మంటూ స్వాగతం చెబుతుంది! ఆ యింటి ఆవరణ, ఆ పూలమొక్కలు పెంచిన తీరు, నౌకర్లు మెల్లగా మాట్లాడే పద్ధతి చూస్తే, ఆ యింటి యజమానికి క్రమశిక్షణపట్ల ఎంత అభిమానం వుందో అర్థమైపోతుంది!

కారు హారన్ వినిపించింది. పడుకుని కునుకుతీస్తున్న కుక్క చెంగున లేచింది. 'భౌభౌ'మని అరుస్తూ కారుకి తన సంకేతం పంపించింది! లోపల ఎక్కడో పని చూస్తున్న వంటమనిషి గేటు తెరవటానికి పరుగెత్తుకు వచ్చాడు!

లోపల హాలులో, వయసుమళ్ళిన ఒకామె కూర్చుని వుంది!

ఆమె కారు హారన్, కుక్క అరుపు వినగానే, "అదుగో! అబ్బాయి వచ్చినట్టున్నాడు" అంది.

తెరుచుకున్న గేటులోనుంచి, తళతళలాడుతున్న క్రీమ్ కలర్ ఫియట్ కారు వచ్చి పోర్టికోలో ఆగింది! అందులోంచి దిగుతున్న పాతికేళ్ల యువకుడిని చూడగానే, కుక్క గోముగా అరుస్తూ, వెనకకాళ్లమీద నిలబడి, ముందుకాళ్ళెత్తి అతన్ని దగ్గరకి రమ్మని అర్థిస్తున్నట్టుగా మారాం చేయసాగింది!

అతను చేతిలోవున్న పుస్తకాలు, నల్లకోటు వంటమనిషికి యిచ్చి కుక్కదగ్గరకి వెళ్లి తలమీద చేయివేసి, "హల్లో పప్పీ!" అంటూ పలకరించాడు. దాని మెడలో గొలుసు నూడదీసి, జేబులోనుంచి బిస్కట్ తీసి తినిపించాడు. అతను లోపలకి వస్తుంటే, అదికూడా వెంటే వచ్చింది.

లోపల హాలులో తల్లి ఎవరితోనో మాట్లాడుతోంది! వారి సంభాషణకి అంతరాయం కలిగించటం యిష్టం లేనట్టుగా తన గదిలోకి వెళ్లిపోబోతుంటే, వెనకనుంచి తల్లి అతన్ని పిలిచింది.

"సుధీర్! ఒక్కక్షణం యిలారా!"

తల్లి పిలుపు వినగానే అతను వెనక్కి తిరిగివచ్చాడు.

"యీాయన్ని చూడు. ఎవరో గుర్తుపట్టగలవా?"

తన కెదురుగా వున్న సోఫాలో కూర్చునివున్న ఒకాయనని చూపిస్తూ అంది.

ఆయనకి దాదాపు అరవై సంవత్సరాలు వుండవచ్చు! పంచె కట్టుకుని, పాత

కాలపు కోటువేసుకున్నాడు. మెడచుట్టూ వుత్తరీయంవుంది. చేతిలో ఒం కర్రవుంది!కీ ఆ కర్రమీద చేతులు ఆనించి ఆయన కూడా సుధీర్‌ని చిరునవ్వుతో చూస్తున్నాడు.

"గుర్తు వస్తున్నారా లేదా?"

సుధీర్ గుర్తురావడం లేదన్నట్టు తల తిప్పాడు.

"అహల్యమ్మగారూ! మీరు చెప్పినమాట అక్షరాలా నిజం! ఇతను, సుధీర్ అంటే నేను నమ్మలేకుండా వున్నాను" ఆయన నవ్వారు. బంగారుపన్ను తళుక్కు-మంది. సుధీర్ మనోనేత్రంముందు మరోవ్యక్తి ముఖం కదిలింది.ఆయనెవరో సుధీర్‌కి తెలుసు! కానీ వయసుతో దారుఢ్యంగా వున్న ఆయనకి, యీయనకి పోలిక లేదే....!

"ఎంత పెద్దవాడయాడు! నేను ప్రయివేట్ చెప్పి, చెవులు మెలేసిన అతనేనా అన్పిస్తోంది!"

సుధీర్ కళ్ళలో ఆలోచన క్రమంగా, ఆనందంగా మారింది. వెంటనే దగ్గరగా వస్తూ "లక్ష్మీరంజనం మాష్టారు. అవునా!" అన్నాడు.

ఆయన తల వూపారు.

"నమస్కారం మాష్టారూ. బాగున్నారా?"

"పుత్రపౌత్రాభిరస్తు!" ఆయన చేయి చాచి దీవించారు.

సుధీర్ ఫక్కున నవ్వాడు. "కరెక్టు! మీరు అప్పుడుకూడా యిలాగే దీవించే వారు! ఎన్నేళ్లయింది మిమ్మల్ని చూసి!"

"దాదాపు ఇరవై సంవత్సరాలు. ఇంత త్వరగా గుర్తుపట్టలేవనుకున్నాను."

"మీ బంగారపుపన్ను సాయం చేసింది అనుకోండి."

అతను నవ్వాడు.

"ఎవరినైనా మర్చిపోగలనుగాని మిమ్మల్నెలా మర్చిపోగలను చెప్పండి. మీరు నాచేత తీయించిన గుంజీలు వేయించిన గోడకుర్చీలు యింకా గుర్తున్నాయి!"

ఇంతలో ఫోన్ మోగింది. అతను అటువెళ్ళాడు. ఫోన్‌లో మాట్లాడి వచ్చాడు.

"అమ్మా! మాష్టారుగారికి కాఫీ యిచ్చారా లేదా?" టై విప్పుతూ అడిగాడు.

"అన్ని మర్యాదలూ అయినాయి. నీ రాకకోసమే ఎదురుచూస్తున్నాం."

అతను తల్లిపక్కన కూర్చుని బూటు విప్పి, మేజోళ్లు వూడదీసాడు. నౌకరు తెచ్చియిచ్చిన స్లిప్పర్స్ కాళ్ళకి వేసుకున్నాడు.

"మాష్టరుగారు నీతో పనుండి వచ్చార్రా" అంది తల్లి.

"నాతోనా! ఏం మాష్టారూ! మళ్ళీ నాకు పాఠాలు చెబుతారా!"

ఆయన నవ్వారు.

"నువ్వే మాకు నేర్పేటట్టుగా వున్నావు.అమ్మగారికి అంతా నివేదించుకున్నాను."

"మాష్టారుగారు నీకు ఒక కేసు పట్టుకు వచ్చార్రా!" అంది తల్లి.

"నిజంగానా!ఏమాష్టారుగారినైనా,అన్యాయంగా వుద్యోగంలోనుంచితీసేసారా?"

"ఉహూ కాదు."

"ఏదయినా విడాకుల బాపతా?"

"అదీ కాదు."

"మరి?"

"హత్య కేసురా!"

సుధీర్ కనుబొమలు ముడిపడినాయి.

"మర్డర్ కేసా!"

"అవును బాబూ! నా చెల్లెలుకూతురు. తల్లికి ఒంట్లో బాగాలేక ఒకరోజు రాత్రి డాక్టర్‌గారిదగ్గరికి సాయంకోసం, తెలిసినవాళ్ల యింటికి వెళితే, వాళ్ల కుర్రాడు, అత్యాచారం చేయబోయాడు. అది తప్పించుకోవటానికి చేతికి అందినది పట్టుకుని కొట్టింది. తలమీద గాయం అయి చచ్చిపోయాడు." ముసలాయన కంఠం వణికింది. కళ్లలో తిరిగిననీళ్లు తుడుచుకుంటూ చెప్పాడు. "అది చంపాలని చంపలేదు. యాధృచ్ఛికంగా జరిగిపోయింది. అది మేం మొత్తుకున్నా పోలీసులు వినటంలేదు. కావాలని చంపిందంటున్నారు. ఈ మాట తెలియగానే నా చెల్లెలు కాస్తాపోయింది! ఒకటికాదు నాబాధ!...."

"ఆ అమ్మాయి యిప్పుడు ఎక్కడుంది?"

"జైలులో. జామీను యిస్తేవిడిపించవచ్చుట! కానీబాగా తెలిసిన వ్యక్తి కావాలి! మాకు దిక్కు ఎవరున్నారు? తెలిసిన అందరి కాళ్లూ పట్టుకున్నాను. మర్డర్‌కేసు అనే సరికి అందరూ భయపడుతున్నారు. నాకు నీతో చదివిన కేశవ మొన్న కలిసి, నీ గురించి చెప్పాడు. నువ్వు ప్లీడరీ వృత్తిలో మంచి పేరు తెచ్చుకుంటున్నావని, నీ దగ్గరికి వెళితే సాయం చేస్తావని నీ అడ్రస్ యిచ్చాడు. అది పట్టుకుని వెతుక్కుంటూ వచ్చాను. అమ్మగారు నన్ను వెంటనే గుర్తుపట్టి పలకరించారు."

సుధీర్ నౌకరు తెచ్చిన కాఫీ తాగి కప్పు పక్కన పెట్టాడు.

"బాబూ! అది అన్నెంపున్నెం తెలియని అమాయకురాలు. దానికేం తెలియదు" అన్నారాయన.

"అలాగని మీరూ, నేనూ అంటే కోర్టు ఒప్పుకోదు మాస్టారూ. ఋజువు చేయగలగాలి!"

"ఏం చేస్తావో ఏమో! నీదే భారం."

అతను లేచాడు! అతని ముఖం సీరియస్‌గా వుంది.

"మాస్టారూ! ఆ అమ్మాయి నిజంగా, మీ రనుకున్నంత అమాయకురాలే అయితే, నేను తప్పకుండా సాయం చేస్తాను! ఆ అమ్మాయి యిప్పుడు ఎక్కడుంది?"

ఆయన పోలీస్‌స్టేషన్ గురించి చెప్పారు.

"పేరేమిటన్నారు?"

"స్వప్న."

అతని లేచి ఆ పోలీస్‌స్టేషన్ అధికారులకి ఫోన్ చేయటానికి వెళ్ళాడు.

రిసీవర్ తీసి నంబర్ డయల్‌చేస్తూ అనుకున్నాడు. "స్వప్న! వాట్ ఎ బ్యూటిఫుల్ నేమ్!"

(సశేషం)

దేవుడా! మేం ప్రయాణీకులం



కె.లలితాచలం

రేవులో అన్ని పడవలూ వెళ్ళిపోయాయి, ఒక్క పాపయ్య పడవ తప్ప. పాపయ్య ఎప్పుడూ చివరగానే బయలుదేరతాడు. అందరితోపాటు చేరుకుంటాడు.

సంవత్సరమంతా ఆరేవు సందడి ఒక ఎత్తు ఆ రోజు ఒక ఎత్తు. పడవలన్నీ అలంకరించుకుని సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని కళ్ళారా చూడాలని, చూచి తరించాలనీ తండోపతండాలుగా భద్రాద్రికి తరలి వెళ్ళే భక్తుల్ని తమ ఒడిలో కూచోబెట్టుకుని, ఆనందడోలికల్లో ఊగులాడుతూ, గంగమ్మతో ఊసులాడుకుంటూ తరలే రోజది.

అందరి మనసులో ఒకే ఊహ. అందరి కన్నుల్లో ఒకే దృశ్యం. అదే ఆ దివ్య మంగళ స్వరూపుడు, సీతా సమేతుడైన ఆ శ్రీరామచంద్రుని కమనీయ రూపం. కన్నుల ముందు లీలా మాత్రంగా, ఊహాతీతంగా, అందరి ముందూ దర్శన మిస్తోంది. అందరి మనసుల్లో ఆతృత. ఎప్పుడెప్పుడు, ఆ పుణ్యస్థలిలో అడుగు పెడతామా! ఎప్పుడెప్పుడు ఆస్వామిని దర్శిస్తామా అని.

దొరికిన పడవలో తనువుల్ని చేర్చి ఎలాగో ఒకలాగున ప్రయాణం సాగించి గమ్యం చేరుకోవాలన్న తపన ప్రతి ఒక్కరి కన్నుల్లో గోచరిస్తోంది.

ప్రయాణీకుల్ని నింపుకుని ఉత్సాహంతో పాటలు పాడుకుంటూ భజనలు చేసుకుంటూ హరికథా కాలక్షేపం చేస్తూ పడవలు ముందుకు సాగిపోయాయి.

పాపయ్య పొద్దుటినుంచీ పడవని అలంక

రిస్తున్నాడు. పాపయ్య భార్య రంగి పడవకు పసుపు పూసి, కుంకం బొట్లుపెట్టింది. గూడు ముంగిట మామిడి తోరణాలు, పూవులు కట్టాడు పాపయ్య. తెరచాప కొయ్యకు బొట్లుపెట్టి అలంకరించాడు. పడవ అందాలు సంతరించు కుని సిగ్గులు మొగ్గలైపోతున్న సీతమ్మవారి లాగా కనిపించింది పాపయ్య కళ్ళకు.

జాము పొద్దెక్కేసరికి పాపయ్య అందాల హంసతోపాటు రంగికూడా ముస్తాబైంది. కళ్ళ నిండా కాటుక దిద్దింది. అర్ధరూపాయంత ఎర్ర కుంకుమ బొట్టు పెట్టింది. కొప్పులో ఎర్ర గన్నేర్లు తురిమింది, చిగురంచు చుక్కలచీర, చిలక పచ్చని రెవిక తొడిగింది, చిలకల్లే నవ్వింది. మెడలో ఏ ఆభరణాలు లేకపోయినా ఆ చిలక నవ్వే ఏడువారాల నగలుగా అని పించింది పాపయ్యకు. తన అందాల పడవ హంసనీ, రామచిలకలా కిలకిల నవ్వే రంగినీ మార్చి మార్చి చూసుకున్నాడు. తృప్తిగా నవ్వుకున్నాడు. రాములవారి కోసం ఎదురు చూసి చూసి కళ్లు కాయలు కాసిన గుహుడి లాగా ప్రయాణీకుల రాకకోసం ఎదురుచూశాడు. పాపయ్య ఎప్పుడెప్పుడు ఆ భక్తుల్ని భద్రాద్రి చేర్చి వారితోపాటు తనుకూడా శ్రీరామదర్శనం చేసుకుంటానా అని తహతహలాడిపోతు న్నాడు.


దూరంగా ప్రయాణీకుల అలజడి అవు తోంది. రంగిమీద నిలిచిన చూపు మరొక పక్కకు తొలగటంలేదు. తను రాములారిలా రంగి సీతమ్మోరిలా, హంస గుహుడి పడవలా ఊహించుకుని పొంగి పోతున్నాడు పాపయ్య. మైమరచి పోతున్నాడు. 'మావా అంసనీ నన్నూ పొద్దు కుంకిందాకా సూత్తా కూకో, మనం భద్రాద్రి ఎల్లినట్టే సామిని సూసినట్టే. నెగు నెగు, అంటూ భర్తను తొందర చేసింది రంగి. పడవెక్కి నిక్కినిక్కి చూసింది ప్రయాణీకుల రాకకోసం.

తళతళలాడే ఇత్తడి సామాన్ల గంపతో కామయ్యవచ్చాడు. అంగట్లో కామయ్య సామాన్లకో ప్రత్యేకత ఉంది. కామయ్యని ఆప్యాయతగా పలకరించి యోగక్షేమాలు విచా రించాడు పాపయ్య. రంగి సామాన్లన్నీ ఒక పక్కగా సర్దుకోమని చోటు చూపించింది. రంగు రంగుల లక్కపిడతలు, చెక్కబొమ్మలు రకరకాల బొమ్మల సామాన్లతో యాకూబు ఆయాసపడుతూ వచ్చాడు. యాకూబు వెన కాల కుటుంబయ్య కూజాలు కుండలు చట్లు తీసుకొచ్చి పడవలో సర్దుకుని చెమట తుడుచు కున్నాడు. ఒకరి నొకరు పలకరించుకున్నారు. పిచ్చాపాటీ మాట్లాడుకోసాగారు. సాలె సాంబ య్యకూడా వారి మాటల్లో మాటలు కలిపాడు మూట దింపుతూ. తనకు తోడుగా ఆడపిల్లలు ఎవరైనా వస్తే, ఎంచక్కా ఊసులాడుకోవచ్చు ననుకుంది రంగి. దూరంగా వచ్చే అమ్మా యిల్ని చూసి ముఖం చేటంత చేసుకుంది, త్వరగా రమ్మని చెయ్యూపింది, "ఓరే రంగీ! ఆ సిన్నది?" అన్నాడు పాపయ్య ఆ పిల్లల వంక తేరిపార చూస్తూ. "ఇదుగో! ఓర సూపు కోరసూపు వయసొచ్చిన పిల్నిచూసినావంటె కల్లు పీకేత్త, ఏటనుకున్నావో! బుద్ధి గుంటె మంచిది" అంది పాపయ్య గుణం తెలిసినా. తనను తప్ప ఎవరి ఊసెత్తినా రంగికి చిరాకు. అది అసూయ. ఆడగుణం!

'ఓసోసి ఓరని అడిగితేనే కసుబుసులాడ తన్నావు. ఓరసూపు సూత్తే ఉరేసుకుంటా నంట వని నాకెరికేనే అమ్మీ! కుసింత సెయ్యి ఆసరా ఇద్దునా? కాలు జారుద్దేమో!" కొంటెగా చూశాడు పాపయ్య. "అల్ల కాలు జారకుండ నే సూత్తాలే, నీ మనసు జారకుండ సూసుకో" అంటూ పైట సద్దుకుని, బుడబుక్కల భాగ్య చేతిలో మూట అందుకుని చేయి అందిచ్చింది. భాగ్యమ్మ లచ్మి చేతులో చెప్పుల మూట అందుకుని తన చెయ్యిని అందిచ్చింది.

"ఏమే! భాగ్యా మీ అయ్య, మొన్ననే ఎల్లిండు గదా! నువు ఇయాలదాకా అగినా వెందుకే?" పలకరింపుగా అంది రంగి.

"మా అయ్య,నన్నూ, లచ్మినీ కలిసి రమ్మ న్నాడు. ఆడికి ఎదవ సచ్చినోల్లు పోకిరీ ఎదవ లొచ్చి, ఎదవ కల్లెట్టుకు సూత్తరని, మా అయ్య పండక్కిరమ్మని సెప్పి ఎల్లీసినాడు" అంది



భాగ్య. ఔనన్నట్లుగా తలూపింది మాలచ్మి.

లచ్మి తన మూట కూడా ఒక పక్కన పెట్టుకుని బుద్ధిగా కూచుంది.

గూడు నిండా సామానుతో నిండిపోయింది. ప్రయాణీకులు మాత్రం గుడిశ బయట చెక్క మీదే కూర్చున్నారు. భాగ్య వెంటవచ్చిన కోతిపిల్ల మాత్రం కిచకిచమంటూ గూడుమీద అటూ ఇటూ తిరుగుతూ అల్లరిచేస్తోంది. పడవ ఎప్పుడు బయలు దేరుతుందా! అని అందరూ ఎదురు చూస్తున్నారు.

"రంగీ నా అంస కడుపు నిండింది. నా తల్లి ఒడి నింది దిట్టితీసి టెంకాయకొట్టే. అంసని గోదారి తల్లి ఒడిలోకి తోసేత్తా. ఒడిలోపడ్డ బిడ్డని ఆ తల్లే ఎత్తుకుని ముద్దాడుద్ది." అంటూ ఉషారుగా రంగిని పిలిచాడు పాపయ్య.

రంగి గోదారి తల్లికి పసుపు, కుంకుమ, పూలువేసి పూజచేసింది. అందరూ భక్తితో ఆ తల్లికి దణ్ణాలు పెట్టుకున్నారు. డబ్బులు విసిరేశారు గోదావరిలోకి.

రంగి దేముడ్ని తలచుకుని కొబ్బరికాయ కొట్టబోయింది. దూరాన్నుంచి ఎవరో "ఆగరా పాపయ్యా" అంటూ కేకలువేస్తూ వచ్చారు.

"సాములు సాములు'' అన్నారు పడవలో వాళ్ళంతా ముక్తకంఠంతో. బ్రహ్మయ్యగారిని ఆ పల్లెవాసులందరూ సాములు అని పిలుస్తారు. ఆయన మహాపండితుడు. వేదవేదాంగాలు రంగరించి ఉద్ధరిణలోపోసి అవుపోసన పట్టిన మహాఘటికుడు. ఆయనంటే అందరికీ గౌరవం భక్తి, భయం. అందుకే పడవ ఆయనకోసం ఆగింది.

బ్రహ్మయ్యగారు సకుటుంబ సపరివార సమేతంగా విచ్చేశారు. వర్షం రాకుండా పడవ బయలుదేరాలని ఆయన ఆశ. అందుకే పరుగు పరుగున వచ్చారు. ఇంక కొన్ని నిమిషాల్లో వర్షం వస్తుంది. చకచకా సామాను పడవలోకి ఎక్కించారు బ్రహ్మయ్యగారు. భార్యనీ పిల్లల్నీ కూడ ఎక్కమని తొందర చేస్తున్నారు.

ఎంత భక్తిగౌరవాలున్నా పాపయ్య మనసు ఏదో పాపభీతితో నిండిపోయింది. బ్రహ్మయ్యగారు తన పడవలో ఎక్కడం పాపయ్యకు సుతరాం ఇష్టంగా అనిపించలేదు. మరొక పడవలో ఆయన వెళ్ళకూడదా! అనికూడా అనిపించింది. కాని పైకి ఏమీ అనలేక లోపల దాచుకోలేక సతమతమైపోతున్నాడు పాపయ్య.

బ్రహ్మయ్యగారు గూడులోకి తలదూర్చి గూడునిండా ఇత్తడి పాత్రలు కుండలు బట్టలు చూశారు. అన్నం మూటలు, చెప్పుల జోళ్ళతో నిండిపోయి ఉంది. చేపల కంపుకూడా కొడుతోంది ఒక పక్క. బ్రహ్మయ్యగారు ముక్కు మూసుకుని అయిష్టంగా వెనక్కి తిరిగారు. ఆ మనష్యుల మధ్య తనంతటివాడు కూర్చుని ప్రయాణం చెయ్యడమా అన్న అహంభావం

కూడా అడ్డొచ్చింది. పోనీ దిగిపోదామంటే అదే ఆఖరు పడవ. కొద్ది సేపట్లో వర్జం. ఆపైన అష్టమి గడియలు ప్రవేశిస్తాయి. అష్టమి నవ ములు కష్టదినాలు ప్రయాణానికి. ఈ రోజు బయలుదేరితే గానీ, శ్రీరామనవమి నాటికి భద్రాద్రి చేరడం కష్టం. శ్రీరాముని కళ్యాణానికి వెళ్ళి తీరాలి. అనేక శంకలు అడ్డుగోడలుగా నిలిచినా వాటిని కూలగొట్టి ప్రయాణం సాగించ డానికే నిశ్చయించుకున్నారు బ్రహ్మయ్యగారు. అంతగా అయితే భద్రాద్రి చేరగానే ప్రాయ శ్చిత్తం చేసుకోవచ్చునని సరిపుచ్చుకున్నారు. పుణ్యాహవచనం చెసుకుంటే సరి అనుకున్నారు మనసులో.

గూడులోకి కాలుపెట్టి జరగండి అన్నట్టుగా చేతితో సంజ్ఞ చేశారు. కొందరు బైటకువచ్చి కూచున్నారు. మరి కొందరు చివరగా ఒదిగి కూచున్నారు.

రంగి టెంకాయ కొట్టింది. పాపయ్య పడ వని గోదారి తల్లి ఒడిలోకి తోశాడు ఎత్తుకో మన్నట్లుగా. రంగి గంగమ్మ తల్లిని మనసారా ప్రార్థించింది. ఈ ప్రయాణం చల్లగా సాగాలని కొట్టిన కొబ్బరికాయ దిష్టితీసి గోదావరి లోకి విసిరేసింది రంగి.

'రామయ తండ్రీ! భద్రాద్రి వాసా! సేదకో తండ్రీ సేదుకోసామీ' అంటూ పాపయ్య గడ నీటిలోకి దింపాడు. అందరూ భక్తి శ్రద్ధలతో పాపయ్యతో శృతికలిపారు. పాపయ్య దృష్టి ఆ భద్రాద్రివాసుని పైనే లగ్నమైపోయింది.

పాపయ్య అమితోత్సాహంతో పల్లెపదాలు పాడుకుంటూ జోరుగా గడవేస్తున్నాడు. పడవ నీటివాలుని చీల్చుకుంటూ సాగిపోతోంది. పడవ పుంజుకుంటున్న వేగానికి అందరికీ ఉత్సాహం ఉరకలు వేస్తోంది. కొందరు భజనలు చేసు కుంటున్నారు. పాటలు వచ్చినవారు ఆ భద్రాద్రి వాసుడి ప్రియభక్తుడైన రామదాసు కీర్తనలు గానం చేస్తున్నారు. బ్రహ్మయ్యగారి మనసు దైవధ్యానంమీద కంటె తాను అపవిత్రమైన చోటులో కూర్చున్నానే అన్నబాధతో నిండి పోతోంది. ఒక పక్క చిరాకు ఒక పక్క ఏమీ చేయలేని అసమర్ధత, తప్పనిసరి ఆయన నోటిని కట్టి పారేశాయి. 'చిత్తం శివుని పైన భక్తి చెప్పులపైన' అనే సామెత తీరున ఉంది బ్రహ్మయ్యగారి పని.

'నేనెంతపుణ్యాత్ముడినో ఆ స్వామిని కొలిచి తరించే భక్తులను, స్వామి దర్శనానికి తీసుకుని వెళ్ళే భాగ్యం నా హంసకు పట్టింది' అను కుంటూ ఎవరి దగ్గరా డబ్బు తీసుకోలేదు పాపయ్య. అతని ధ్యేయం ఆ పుణ్యాత్ము లందర్నీ రాముని దగ్గరకు తీసుకుని వెళ్ళడమే. అదే తనకు పుణ్యం, పురుషార్థంగా భావించాడు పాపయ్య. రంగి కూడా అతనికి తగిన ఇల్లాలు.

అంతలో ఆకాశమంతా మబ్బులు కమ్మే సింది. చిరుగాలి ఈదర గాలిగా తుంపరలు కుంభవృష్టిగా క్షణాల్లో ముంచుకు వచ్చేసింది. ముందు అగాధమే ఉందో, సుడిగుండాలే ఉన్నాయో కూడా కనుపించటంలేదు. వాన ఎడా పెడా కొట్టేస్తోంది. గోచీ తప్ప మరొక ఆచ్ఛాదనలేని పాపయ్య శరీరం గజగజా ఒణికి పోతోంది. కనుచూపు మేరలో అతనికి ఊరు గాని ఒడ్డుగానీ కనిపించడం లేదు. పాపయ్యకు ఏం చెయ్యాలో ఎలా అందర్నీ కాపాడాలో పాలుపోలేదు.


"సామీ బద్రాద్రివాసా! ఏంటయ్యా ఈ ఇప రీతం? నేనేమన్నా తప్పు సేసినానా సామీ. పాపిట్టిమడుసులం. నాను ఓరినన్నా తక్కువగా సూసినానా సామీ! నాను ఆనకు తడిసినా అందర్నీ గూట్లో కూకోమంటినే" అంటూ పరిపరివిధాల ఆక్రోశిస్తూ భగవంతునితో మొర పెట్టుకున్నాడు.

రంగి అందర్నీ గూడులోకి రమ్మని పిలి చింది. కాని ఎవరికీ ధైర్యం చాలటంలేదు. లోపల అడుగు పెట్టడానికి సందేహించారు.

దేముడి దగ్గరకు వెళ్ళాలని అందరికీ ఆశ. కాని దేముడంటే ఎంత భక్తో అంత భయం కూడాను. దేముడు వరాలిస్తాడని అందరికీ తెలుసు. శపిస్తాడని కూడా తెలుసు. దేముడు తనంతట తానుగా పిలుస్తే బాగుండునని ప్రతి వారికీ వుంటుంది.

అందుకే దేముడిలాంటి బ్రహ్మయ్యగారి

(వి) చిత్ర విజ్ఞానం



ఐక్యరాజ్య సమితి భవనంలోని డాగ్‌హేమర్‌షాల్డ్ లైబ్రరీలో వెయ్యిన్ని ఎనిమిదివందల తొంభైయారు పేజీల పుస్తకం ఒకటుంది. ఈ పుస్తకం పేరు **India at a Glance !**

వంక ఆశగా చూశారు అక్కడి వారంతా. ఆయన పిలుపుకోసం రోమాలు నిక్కబొడుచుకు పోతున్నా వినయంగా నిలబడ్డారు. కొంత సేపటికి విసురుగా కొడుతున్న వానకు తట్టుకోలేక కొంచెం కొంచెం లోపలికి, వాళ్ళకు తెలియకుండానే వెళ్ళారు. చోటు చేసుకుని కూచున్నారు.

గాలి జోరుకు తెరచాప చిరిగిపోయింది. గడ విరిగిపోయింది. తాడు తెగిన గాలి పటంలా గమ్యం తెలియని బాటసారిలా నడుస్తోంది పడవ. అందులో ప్రయాణిస్తున్న ప్రయాణీకులు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని కూర్చున్నారు. పడవ ఏ క్షణాన్నైనా మునిగి పోవచ్చు.

ప్రాణాలమీద అందరికీ తీపి ఉన్నా, ఆశ మాత్రంలేదు. అందరూ ముక్తకంఠంతో ఆర్తులై భగవంతుని ప్రార్థిస్తున్నారు. అందరికీ ఒక్కమాటే గడువు తీరిపోతున్నదని తెలుసు. అది ఏ నిమిషాన్నో, ఏ క్షణాన్నో! పడవలో హాహాకారాలు మిన్నుముట్టుతున్నాయి. ఒకరి మీద ఒకరు కుప్పలు కుప్పలుగా పడుతున్నారు, లేస్తున్నారు. ఇప్పుడు వారిలో తరతమభేదాలు, కులమత భేదాలు లేవు. అందరికీ ఒకటే ఆశ. ఒకటే ప్రార్థన. అందరం కలిసి బ్రతికి బయట పడాలి, అందరం జీవించాలి. ప్రతి ఒక్కరిలో అదే కోరిక. సమిష్టి కోరిక.

బ్రహ్మయ్యగారు భగవద్ధ్యానం చేస్తూ మృత్యువు ఒడిలో, గంగమ్మ కడుపులో చొచ్చుకుపోతే, మోక్షం సంప్రాప్తిస్తుందని కాబోలు భగవంతునిపై మనసు లగ్నంచెయ్యాలని విశ్వప్రయత్నం చేస్తున్నారు. హాహాకారాలు ప్రతి ధ్వనిస్తుంటే ఏకాగ్రత కుదరటం లేదు. అందరూ ఆర్తులైనప్పుడు, అందరూ కలిసి భగవంతుని ధ్యానంచేస్తే, భగవద్ధ్యానంలో భయాన్ని విస్మరించి, హాహాకారాల స్థానంలో భగవన్నామం మారుమ్రోగుతుందనిపించింది బ్రహ్మయగారికి ఆ క్షణంలో. సంఘ బలం ఉంటేగాని మానసిక బలం చేకూరదనిపించింది. అందుకే అందర్నీ కూడ కట్టుకోవాలన్న ఉద్దేశ్యంతో చిరునవ్వుతో అందర్నీ తన దగ్గరకు పిలుచుకున్నారు.

"కొద్ది క్షణాలలో మృత్యువు ఆలింగనంలో అందరం పరవశిస్తాము. అప్పుడు నీవు, నేను అను భేదంలేదు. రండి నాయనలారా భయపడకండి, భగవంతుని ప్రార్థించండి" అంటూ వెన్నుతట్టి భయాన్ని తొలగించడానికి ప్రయత్నించారు బ్రహ్మయ్యగారు.

అందరూ భగవంతుని మనసారా ప్రార్థించారు. ఏ పుణ్యాత్ముడి మొర విన్నాడో ఆ భగ

వంతుడు. ఏ పశ్చాత్తప్తుడి హృదయం విదారకమై పొంగిందో! గాలి వాన తిరుగుముఖం పట్టింది. వాతావరణం ప్రశాంతంగా మారింది కొద్ది గంటల కాలంలో.

"మావా! నే గెడేత్తా. నువు కూసింత సేపు కూకో!" అంటూ రంగి పాపయ్య చేతులో గడ తీసుకుంది. పడవ సాగుతోంది.

బయట వాతావరణం ప్రశాంతంగా మారుతున్నకొద్దీ బ్రహ్మయ్యగారి మనసులో అలజడి ఎక్కువ కాసాగింది. అంతవరకూ తనచుట్టూ చేరి అమాయకంగా దేముని ప్రార్థించినవారంతా దూరంగా వెళ్ళి దూరదూరంగా నిలబడ్డారు. పాపయ్య ఒక పక్కగా ఒణుకుతూ చేతులు కట్టుకు నిలబడ్డాడు. బ్రహ్మయ్యగారికి తాను ఒంటరిగాణ్నిగా, వెలివేయబడ్డట్టుగాఅనిపించింది కొంతసేపు.

ఆయన కళ్ళముందు ఏదో అద్భుతమైన కాంతి. ఆ వెలుగు ముందుకు దారిచూపుతోంది. గతం ఒక చీకటిగా, భవితవ్యం నిత్యనూతనంగా, ఆరని వెలుగులా కనిపించింది. అంతే! ఒక్కమాటు నిండుగా ఊపిరిపీల్చుకుని, కాంతులు చిమ్మే తన కళ్ళతో అందరివంకా చూశారు బ్రహ్మయ్యగారు. అందరూ తనని ఇదివరకు చూసినట్లే చూస్తున్నారు భక్తితో. కాని బ్రహ్మయ్యగారి చూపులు పాతవికావు. సరికొత్తవి. అమాంతం ఒక అడుగు ముందుకు వేసి తన వంటిమీద వున్న శాలువా పాపయ్య మీద కప్పారు బ్రహ్మయ్యగారు. ఆయన కళ్ళలో ఏదో తలప్తి తొంగిచూసింది. అక్కడి వారంతా అదోరకంగాచూశారు. అది భయమో! ఆశ్చర్యమో! వింతో! "తప్పు సాములూ! మమ్మల్ని తాకకండి. పాపమొచ్చుద్ది. పాయచ్చిత్తం చేసుకోవాల్సి వచ్చుద్ది" అన్నట్లుగా, తన మనోభావాల్ని మూగగా కళ్ళతో వ్యక్తం చేశాడు పాపయ్య. భయంతో ఒక రెండు అడుగులు వెనక్కి వేశాడు. ఆ చూపులో ఎన్నెన్ని భావాలు, బ్రహ్మయ్యగారు చదవగలిగారో! పశ్చాత్తాపంతో ఆయన కళ్ళు కిందకు వాలిపోయాయి. బ్రహ్మయ్యగారు మరి రెండడుగులు ముందుకువేసి పాపయ్యని పొదివి పట్టుకుని తనతోపాటు ముందుకు తీసుకెళ్ళారు. ఆయన కళ్ళలో కోటి భావాలు చదివారు అక్కడివారు.

"లేదురా! అజ్ఞానం తొలగిపోయింది. పశ్చాత్తాపమే నాకు ప్రాయశ్చిత్తం. అదే మోక్షం." అంటున్నట్లుగా వున్నాయి ఆయన కళ్ళలోమెదిలే భావనలు. ఆ భావనలకు భాషలేదు.

బ్రహ్మయ్యగారికి తను ఇంతకాలం సాలెపురుగులా గూడు కట్టుకుని కూర్చున్నట్లుగా, ఇప్పుడు ఆ గూడు విచ్ఛిన్నమై పోయినట్లుగా, తన కళ్ళముందు అంతా స్వచ్ఛంగా కనిపించసాగింది.

దూరాన భద్రాద్రి రామన్న కోవెలలో జేగంటలు అవిరామంగా మ్రోగుతూ, భక్తుల్ని ఆహ్వానిస్తున్నాయి. అందరూ ఒక్కమాటుగా దీర్ఘంగా నిట్టూర్చి, చేతులెత్తి నమస్కరించారు ఆ దేవదేవుడికి. □



అంతా ఇంతే...

శంకరమంచి పార్థసారధి

నాయుడుగారికి ఎన్నడూ లేనిది కొడుకు సుబ్బారావుమీద మొదటిసారిగా కోపం వచ్చింది. కొడుకు ఏమైపోతాడో అన్న భయం మొదలైంది. ఆయనలో ఈ భావాలన్నీ కలగటానికి కారణం, సుబ్బారావు స్నేహితుడు ఆచారి అందించిన సమాచారం.

మొదటినించీ గూడా నాయుడుగారు కొడుకుని చాలా గారాబంగా పెంచుకుంటూవచ్చారు. ఎప్పుడూ పల్లెత్తు మాటనలేదు. చదువు విషయంలో గూడా. సుబ్బారావు ఒకో క్లాసులో రెండు మూడేళ్ళు తీరుబడిగా కూర్చుండిపోయినా, ఏమనకపోగా చాలా సహనంగా చదివించుకుంటూ వచ్చారు. కొడుకు కాలేజీలో చేరగానే నడిచెడితే ఎక్కడ అరిగిపోతాడో అని చిన్న సైజు కారు కొనిచ్చారు. ఆ కారులో ఆయిలు నింపటానికి అతగాడి జేబులు ఎప్పటికప్పుడు నింపుతూనే వచ్చారు. ఇదంతా ఎందుకు చేసారంటే, ఏదో కొడుకు చదువుకుని, వాడు బాగుపడి, తననిగూడా బాగు చేస్తాడని ఆశించి....అంతేగాని ఇలా తగులడతాడని తెలిస్తే అసలు చదివించేవారా? ఇంత డబ్బు అతగాడి మీద ఖర్చుపెట్టేవారా?

ఇంతకీ నాయుడుగార్కి అంతగా కోపం తెప్పించిన విషయం, ఆచారి అందించిన సమాచారం ఏమిటంటే—

మామూలుగా, ఆచారి సుబ్బారావు కోసం అతడు లేని సమయంలో రావటంతో నాయుడుగారు అతడ్ని కూర్చోపెట్టి మెల్లిగా కబుర్లలోకి దింపి, చదువు లెట్లావున్నాయని అతి మామూలుగా అడిగారు.

ఆచారి ఆ ప్రశ్నకి జవాబివ్వకపోయినా, మాట్లాడకుండా వూరుకుండిపోతే బాగుండేది.

కాని ఆచారి అలా వూరుకోక అసలు విషయం ప్రక్కనపెట్టి ఇంకో విషయం కదిపి నాయుడు గారి ఆందోళనకి పరోక్షంగా కారకుడయ్యాడు.

"మీవాడి సంగతి మీకు తెలీదులావుంది. కాలేజీలో వాడికి ఎంత పేరు! అమ్మాయి లందరికీ వీడు ఆదర్శ పురుషుడండి!" గొప్పగా పేలాడు.

అసలా ఆచారి ఎవర్ని గురించి మాట్లాడుతున్నాడో అర్థం కాక "ఎవరు మావాడా? ఎందుకని" ప్రశ్నించాడు.

"అవునండి సుబ్బారావే! మొన్నీ మధ్య 'వరకట్న నిషేధం' అన్న విషయంపై గంటసేపు ఏకబిగిన మాట్లాడేసి, మోచేతి ప్రమాణంగల కప్పు గెల్చాడు; మీకు తెలీదులా వుంది" తనే గెల్చినంత సంతోషంగా చెప్పాడు.

అప్పుడే నాయుడుగారి ఆందోళనకి అంకురంపడ్డది. అందుకే "వూ! (ఏడవ లేక పోయాడు!)" మూలిగారు.

నాయుడుగారి 'వూ' లోంచి వూపిరి తీసుకుని ఆచారి మళ్ళీ, "అంటే మీకు ఇదిగూడా తెలీదా?" అడిగాడు.

"ఇంకేమిటి?" మళ్ళీ ఏం వినాల్సివుంటుందోనన్న బాధతో అడిగారు.

"ఆడపిల్లలు వివాహానికి పూర్వం....సోషల్‌గా వుండొచ్చునా—కూడదా? అన్న విషయంపై ఆరు పేజీలు వ్రాయమని వ్యాస రచన పోటీ పెడితే, మనవాడు అరవై పేజీలు ఏకి పారేశాడు."

"ఎవరిని;"

"ఎవర్నేమిటండి—సాంప్రదాయాన్ని, ఆచారాలని, పెద్ద వాళ్ళ సంఘాన్ని, ఈనాటి వివాహ వ్యవస్థని."

"అంటే మావాడు ఇంకో మోచెయ్యి సైజు కప్పు గెల్చాడన్నమాట (వీడిట్టాతగులడి పోతున్నాడేం?)"

"ఈసారి కప్పివ్వ లేదనుకోండి—ఓ సర్టిఫికేట్ ఇచ్చారు. అప్పటినించి ఆడపిల్లల పాలిటి దేముడై కూర్చున్నాడు సుబ్బారావు."

"కూర్చుంటాడు—ఎందుకు కూర్చోడు? చదువుకి పంగనామాలెట్టేసి వెధవ్వేషాలూ వేడూసూ" ప్రకాశంగానే అక్కసుని వెళ్ళబోసుకున్నారు.

మారిన వాతావరణాన్ని గమనించిన ఆచారి మెల్లిగా తప్పుకున్నాడు.

నాయుడుగారు బాధపడిపోతున్నది సుబ్బారావు చదువుకి పంగనామాలెడుతున్నాడని కాదు. అకడిలో వచ్చిన, వస్తున్న మార్పుల గురించి. 'వరకట్నం కూడదని వాదించాడట, దానికి ఆ కాలేజీ వెధవలు పొంగిపోయి కప్పిచ్చారుట. రేపు నిజంగా వాడు కట్నం తీసుకోనంటే తనగతేం కావాలి? వీడిని నమ్ముకుని వచ్చే సంవత్సరం రెడ్డి ప్రారంభించబోయే వ్యాపారంలో తాను గూడా భాగం కలుస్తానని మాటిచ్చాడే? తన మాటేం కాను?'. అప్పటి నించి ఆయన కొడుకు గురించి వాకబు చేయటం మొదలెట్టారు. ఈ ఆందోళనని, బాధని ఒక్కరూ భరించలేక, ఒక రోజు భార్య సావిత్రమ్మతో—

"వీడికి పెళ్ళి చేసేస్తే పోతుందేమో?" అన్నారు.

"వాడి పెళ్ళికి అప్పుడేం తొందరండి—చదువు కానీండి", అన్న భార్య వంక మింగేలా చూసేస్తూ,

"మనవాడి చదువు అయిపోవటం అంటూ లేదు. అలా చదివేస్తూనే వుంటాడు ఎన్నేళ్ళయినా. అయినా వీడేం చదివి దేశాన్నేలాలా? మంచి పిల్లనిచూసి పెళ్ళిచేస్తే కాస్త ఇంటిపట్టునన్నా పడివుంటాడు."

భర్త వుగ్ర రూపం చూసి భయపడి ఆవిడ "సరే మీ ఇష్టం" అంటూ పచ్చ జెండా వూపింది.

అప్పటినించి నాయుడుగారు సంబంధాలు చూట్టం మొదలెట్టారు (సుబ్బారావుకి తెలీకుండానే)

ఇంకో రోజు ఆయన బ్యాంకులో పన్చూసుకుని బయట కొస్తుంటే ఆచారి కంగారుగా వెడుతూ కనిపించాడు. అతగాడిని చూసి ఏం ఆశ్చర్య పోలేదుగాని, అతడి చేతిలోవున్న వస్తువుని చూసింతర్వాత మనస్సు పరిపరివిధాల



పోయింది. అందుకే వెంటనే,

"ఏవిటోయ్, అప్పుడే పెళ్ళికి కావాల్సినవన్నీ ఏర్పాటు చేసుకుంటున్నావా?" అని అడిగారు అతడి చేతిలో పెళ్ళి పీటని చూస్తూ.

"అబ్బె అది కాదు సార్...." చూడకూడని వ్యక్తిని చూసినట్లుగా బాధపడుతూ అన్నాడు.

"ఏవిటి, హోదావుడి?" రెట్టించి మళ్ళీ అడిగారు కాబట్టి తప్పక ఆచారి మెల్లిగా "మన వాడు—అదే సుబ్బారావండి—ఇవాళ పెళ్ళి చేయిస్తున్నాడండి" పెళ్ళి కబురు చల్లగా చెప్పాడు.

"ఎవరికి? నీకా?" గుండె నిండా గాలి పీల్చుకుంటూ అడిగారు.

"అబ్బె నాక్కాదండి—మా కాలేజీలో ఇద్దరు ప్రేమించుకున్నారండి. పెళ్ళి చేసుకోవాలనుకున్నారు, కాని పెద్దలు అంగీకరించలేదు-అంటే వేర్వేరు కులాల వాళ్ళు లెండి—చివరికి మన సుబ్బారావు నడుం కట్టి, కానీ కట్నంగాని, ఖర్చుగాని లేకుండా గుళ్లో పెళ్ళి చేయిస్తున్నాడు. అదీ విషయం. వస్తానండి ముహూర్తం వేళవుతోంది" అంటూ ముందుకి పోబోయి ఆగి మళ్ళీ "సార్ నేచెప్పానని చెప్పకండి—గొప్ప రిస్కులో పడతా" అని చకచకా వెళ్ళిపోయాడు.

నాయుడుగారు చాలాసేపు అలాగే నిలుచుండి పోయారు. 'లాభంలేదు, వీడు పూర్తిగా కొరకరాని కొయ్యలాగా అయిపోతున్నాడు. ఇంకాలస్యంచేస్తే తనమాటే వినకపోవచ్చు' అనుకుంటూ ఇంటి దారి పట్టారు.

ఆ రోజునించి బుర్రలోవున్న అన్ని విషయాల్ని ప్రక్కకునెట్టి కేవలం కుమార రత్నం గూర్చే ఆలోచించటం మొదలెట్టారు.

నాయుడుగారికి రాజకీయ పరిజ్ఞానం చాలా వుంది. ఎన్నో రాజకీయ తుఫాన్లని చూసారు. పెద్ద మేధావులనబడే వాళ్ళని పిల్లిగింతలు కొట్టించేసారు. ప్రజల అదృష్టం కొద్దీ కాస్తలో తప్పిందిగాని లేకపోతే మంత్రి అవటానికి పూర్తి అర్హతలున్నవారు. కాని అంత విజ్ఞానం, అనుభవం వున్నా, కొడుకు సైకాలజీ ఏమిటో అర్థం చేసుకోలేకుండా వున్నారు. అందుకే ఆయనలో ఆయనే మధనపడసాగారు.

ఒకనాటి సాయంకాలం తిరిగి తిరిగి నాయుడుగారు ఇంటికి చేరుకునేసరికి, సుబ్బారావు ఎవరితోనో ఆవేశంగా మాట్లాడుతున్నాడు.

ఆయన సద్దుచేయకుండా అలాగే ప్రక్కన వున్న కుర్చీలో కూర్చుని ఆలకించసాగారు.

"........ఒరే ఫూల్ మనం ఈ పెద్దవాళ్ళ 'ట్రాప్'లో పడకూడదురా! ఈ సంఘంలో ఆడ దాని పరిస్థితి మెరుగుపడాలంటే దానికి మన లాంటి యువకులే నడుం కట్టాలి. ఈ వర కట్నం అన్నది ఒక జాడ్యంలాంటిది. తర తరాలుగా వస్తున్న ఒక పెద్ద అంటు రోగం. కట్నం తీసుకుంటున్నావంటే నిన్ను నీవే అమ్ముకుంటున్నా వన్నమాట! ఇన్నీ తెల్సి, ఇన్నాళ్ళుగా నా స్నేహంచేసి, చివరికి మానాన్న కట్నం తీసుకుంటా నంటున్నాడని అంటావా! సిగ్గులేదూ ఆ మాటనటానికి?" ఆవేశంగా చెప్పుకుపోతున్న సుబ్బారావు వుపన్యాసం విని నాయుడుగారు ఇంకో సందర్భంలో అయితే చప్పట్లు కొట్టేవారేమోగాని, ప్రస్తుతం మొఖా నికి పట్టిన చెమటని కర్చీఫ్‌తో తుడిచి, వారి సంభాషణనివింటూ అలాగే కూర్చుండి పోయారు.

లోపల ఆచారి మెల్లిగా "అది కాదురా, నా పెళ్ళిచేసి, నా కట్నంతో నా చెల్లెలు పెళ్ళి చెయ్యాలట" సంజాయిషీ ఇస్తున్నట్లుగా అంటున్నాడు.

"ఇలాగే ప్రతివాళ్లు అనుకుంటే, మనం బాగుపడే దెప్పుడు? మనం ఆశించిన మార్పెలా వస్తుంది. ? ఆల్‌రైట్, నువు కట్నం లేకుండా పెళ్ళిచేసుకో! నీ చెల్లెలికి వరకట్నం అడక్కుండా ఎవ్వరూ రాకపోతే, నే చేసుకుంటా, సరేనా?...ఇంకో విషయం. నువు కులాంతర వివాహం చేసుకుంటావని ఆశించాను. ఆల్‌రైట్....గో ఎ హెడ్.... విష్ యూ ఆల్ ది బెస్టు. "

ఇక వారు బయట కొస్తారన్న అనుమానం గల్గి, వారి కంటపడటం ఇష్టంలేక నాయుడు గారు ప్రక్క గదిలోకి తప్పుకున్నారు.

అలాగే కుర్చీలో కూర్చుండి ఆలోచనల్లో మునిగిపోయారు.

"అసలు వీడు వల్లిస్తున్న ఆదర్శాలన్నీ ఆచరిస్తాడా? లేక తనలాగ చెప్పటం వరకేనా? అది రూఢీగా తెల్సుకోవాలి. ఒకవేళ చెప్పిన వన్నీ తు. చ. తప్పకుండా ఆచరిస్తానంటే తన పరిస్థితేమిటి? వాడిమీద కట్నం ఆశించక పోవటంవల్ల తనకెంత నష్టం? కట్నం మాట దేముడెరుగు, మరో కులం అమ్మాయిని చేసు కుంటానంటే, తన కర్తవ్యం ఏమిటి? వాడితో ఘర్షణపడటమా? లేక వాడి మార్గాన పోవ టమా? ఘర్షణ పడటంవల్ల పెద్ద వుపయోగం వుండక పోవచ్చు—గుళ్లో పెళ్ళిళ్ళు చేయిం చినవాడు, తన పెళ్ళి చేసుకోలేడా? మరేం చెయ్యాలి?—ఏం లేదు—ఏ మాత్రం ఆలస్యం చెయ్యకుండా వాడిని పిల్చి, 'నీకో సంబంధం చూశాను, మూడు లక్షలు కట్నం. మనవాళ్ళే- నువ్వు కూడా చూసి సరే అంటే' అనాలి అపుడువాడు 'నేను కానీ కట్నం తీసుకోను- సరిగదా ఇంకో అమ్మాయిని ప్రేమించాను' అంటాడు. ఆ సమయంలో మంచిగా బేరానికి దిగాలి...."

సావిత్రమ్మగారు గదిలో కొచ్చి లైటేసే దాకా అలా ఆలోచిస్తూనే వున్నారు.

నాయుడుగారికి ఒక నిర్ణయం తీసుకున్నాక దాన్ని వెంటనే అమలు పర్చటం అలవాటు. అందుకే,

"అబ్బాయి నోసారి పిల్చుకురా" అన్న ఆర్డరు జారీచేసి, ఆవిడటు వెళ్ళగానే, లేచి మంచంమీద పడుకుని, 'మూడ్'లో' కొచ్చి, కొడుకు కోసం ఎదురు చూస్తున్నారు.

సుబ్బారావు మెల్లిగా తల్లి వెనకగా వచ్చి, తండ్రి సంజ్ఞ ప్రకారం ప్రక్కనేవున్న కుర్చీలో కూర్చున్నాడు.

సావిత్రమ్మగారికి అంతా వింతగాను, ఆశ్చ ర్యంగానూ వుంది.

నాయుడుగారు మెల్లిగా లేని ఓపికని తెచ్చు కుంటున్నట్లుగా ఫీలింగ్ పెట్టి "నీతో ఒక ముఖ్య మైన విషయం మాట్లాడాలని పిలిపించారా" అన్నారు.

"చెప్పండి."

"ఏం లేదు—నా ఆరోగ్యం పూర్తిగా దెబ్బ తింది. మీ కెవరికి చెప్పలేదుగాని, గుండె మహా

(వి) చిత్ర విజ్ఞానం



బలహీనంగా కొట్టుకుంటోంది (అబద్ధం!). ఏవేళటప్పుడు ఏంజరుగుతుందోనన్న బెంగే నన్ను రోజులోజుకి తినేస్తోంది (మళ్ళీ అబద్ధం!) అందుకే నేనుండగానే పెళ్ళిచేసి ఆ ముచ్చట కళ్ళారా చూడాలని ఆశగా వుందిరా!" మాట్లాడటం ఆపి భార్యా, పుత్రుల వంక, చూసారు.

వాళ్ళ దగ్గరనించి ఎటువంటి రియాక్షన్ లేకపోవటంతో మళ్ళీ అందుకున్నారు. "నా మాటని కాదనవన్న ధైర్యం వుంది బాబూ.అదే ధైర్యంతో ఓ సంబంధంగూడా చూసాను. లక్షణమైన పిల్ల, లక్షణమైన సంస్కారం, లక్షల కట్నం....నువు కూడా చూసి సరే అంటే ముహూర్తం పెట్టిద్దాం."

సావిత్రమ్మగారు కంగారుగా, "నాతో మాట మాత్రమైన అనలేదే!" అంది.

భార్యవంక మింగేసేలా చూసి, మళ్ళీ కొడుకుతో, "చెప్పు నాయనా, నీ అభిరుచులేమైనా వుంటే చెప్పేయ్" అన్నారు గారాబంగా. సుబ్బారావు మెల్లిగా, "నాన్నా, నాకు కొన్ని ఆదర్శాలున్నాయి. ఆదర్శవంతంగానే వివాహం చేసుకోవాలనుకున్నాను. కాని....మీరు కనబరుస్తున్న ప్రేమ ఆప్యాయతల ముందు తలొంచక తప్పటం లేదల్లే కనిపిస్తోంది. అయినా చూస్తుచూస్తూ నేను నమ్మినసత్యాలు, వల్లించిన ఆదర్శాలనీ వదిలెయ్యాలేను. అందుకే ఓ నిర్ణయానికొచ్చాను" అని తండ్రివైపు చూసాడు.

నాయుడుగారికి నిజంగానే గుండె బలహీనమై పోయినట్లుగా అనిపించింది.

మెల్లిగా "చెప్పు నాయనా నీ నిర్ణయం ఏమిటో" అన్నారు.

సుబ్బారావు మళ్ళీ అన్నాడు "ఏంలేదు, నేనెటూ నిర్ణయించలేకపోతున్నాను. అందుకే రెండు కాగితాలమీద, రెండు పద్ధతులు వ్రాసి, అంటే ఒక కాగితంపై 'నాన్నమాట నేను వినాలి' అని, రెండో కాగితంపై 'నామాట నాన్న వినాలి' అని వ్రాసి రెండు కాగితాలు కలిపి లాటరీవేద్దాం. ఏ విధంగావస్తే అలా చేద్దాం. రెండో వాళ్ళు దానికి విరుద్ధంగా ప్రవర్తించకూడదు."

నాయుడుగారు ఎన్నో ఎన్నికల్లో నిలబడారు, గెల్చారు. కాని ఇప్పుడెందుకో భయం వేసింది. అయినా తప్పలేదు. "సరే" అన్నారు.

సుబ్బారావు చకచకా కాగితం చింపి, రెండిటీమీద ఏదో వ్రాసి, చిన్నచిన్న మడతలుగా చుట్టి, రెండిటిని చేతిలోపట్టుకుని తండ్రివంకచూసాడు, 'రెడీ' యేనా అన్నట్లుగా.

తండ్రి తలూపిన మీదట, రెండు కాగితాలని గలగల లాడించి, టేబిలుమీద వేసాడు.

నాయుడుగారు ప్రక్కనేవున్న భార్యని ఒక కాగితం తీసి ఇమ్మన్నారు.

ఆమె అలాగే ఒక కాగితాన్ని తీసి భర్త చేతిలో వుంచింది.

టే
కే
ది
ం,
మాట

"సరే,
పెళ్ళి
మీకే
రో—
ఉంటారో అంతా మీ ఇష్టం. నా పనల్లా మీరు చూపించిన అమ్మాయికి తాళి కట్టటం, అంతే!" అని సీరియస్‌గా బయటి కెళ్ళిపోయాడు.

నాయుడుగారికి పిచ్చి ఆనందంగా వుంది. ఈ సమస్య ఇంత త్వరగా, ఇంత లాభసాటిగా పరిష్కారమవుతుందని కల్లోగూడా అనుకోలేదు.

బల్ల మీద రెపరెప లాడుతున్న కాగితాన్ని చేతిలోకి తీసుకుని, "ఈ కాగితం తనకి అసాధ్యం అనుకున్న పెన్నిధిని తిరిగి తెచ్చి పెట్టింది. ఇది తన పాలిట రక్షరేకు" అనుకుంటూ ప్రక్కనవున్న రెండో కాగితాన్ని గూడా చేతిలోకి తీసుకుని "అదే కాగితం వచ్చి వుంటె, ఈ పాటికి తనీ పరిస్థితిలో వుండేవాడా? కుళ్ళి కుళ్ళి ఏడుస్తూ వుండేవాడు" అనుకుంటూ రెండో కాగితాన్ని మడతలు విప్పి ఆసక్తిగా చదివారు.

అంతే!

అందులో వ్రాసివున్న దాన్నిచూసి అలాగే కూర్చుండి పోయారు. నోటమాట రాలేదు.

ఆ కాగితంలో గూడా, "నాన్నగారి మాటనే వినాలి" అని వ్రాసుంది.

కొద్ది సేపటికి తేరుకున్న నాయుడుగారు, కొడుకు తెలివి తేటల్ని తలుచుకుని మురిసి పోయారు. □

ప్రేమా-మాలిన్య



ఐ.వి.యస్. అచ్యుతవల్లి

సీరియల్

"ఎవరూ వినతకా!"

"మరే! మన ఇంటికి వచ్చే నారాయిడు అయ్యగారితో చెబుతూవుంటే విన్నాను."

"మరి సుమనకో! ఆవిడకు సంబంధం కుదిరిందా!" అంది నళిని యాదాలాపంగా అడిగినట్లు.

"సుమన చదువుకున్న అమ్మాయి కదండీ! అయినా వినతను రెండో పెళ్లి వాడికి ఇచ్చి చేస్తున్నారుట."

గతుక్కుమంది నళిని. "రెండో పెళ్లివాడా? ఎవరు అతను దగ్గిర సంబంధమా?" అంది

జరిగిన కథ :

రామనాథం కూతురు సుమన ఆ వూళ్ళోని మరో రైతు జగన్నాధరావు వైపు ఆకర్షితురాలయింది. జగన్నాధరావు భార్య నళినికీ సుమనకూ స్నేహం కలిగింది. పరస్పరం ఆకర్షింపబడ్డ జగన్నాధరావు, సుమన లభించిన అనుకూల పరిస్థితులలో శారీరకంగా కూడా దగ్గరయ్యారు. నళినికీ, వినతకూ కూడా జగన్నాధరావు, సుమనలపై అనుమానం కలిగింది. తన ఆరోగ్యం చెడిపోవడంతో తన భర్తను చేసుకొమ్మని సుమనను కోరింది సావిత్రి. సుమన అంగీకరించలేదు. వినత ఒప్పుకొంది బావగారిని చేసుకోవడానికి.

ఆశ్చర్యంగా.

"ఎక్కడా భర్తలేకపోతే అక్కభర్తే దిక్కు అన్నట్లు ఏం సంబంధంలెండి. సావిత్రి భర్తకే ఇచ్చి చేస్తున్నారుట!"

"అదేం?"

"సావిత్రికి పిల్లలులేరు పైగా జబ్బుపడింది దిట. సుమనని చేసుకోమన్నారట. తను చేసుకోనన్నదిట. వినత చేసుకుంటానందిట. అంచేత ఆ అమ్మాయికి చేసేస్తున్నారు."అంది రాజమ్మ.

"సుమన పెళ్లి చేసుకోనందా! అవును. ఎల్లా చేసుకుంటుంది! ఎవర్ని చేసుకుంటుంది? ఇక్కడ తనువున్నది. వాళ్ళ ప్రణయ లీలలు ఎల్లాగయినా బట్టబయలు కాకమానవు. అప్పుడు అంతా గందరగోళ మవుతుంది. అందుకని ముందే మానేసి వుంటుంది. వాళ్లిద్దరూ తమ ప్రేమ కథకు ముగింపు ఎల్లా ఇద్దామనుకుంటున్నారు! తనతో చెప్పరు. కథ మొదలెట్టినప్పుడు చెప్పారా! ముగిసేటప్పుడు చెప్పుతారనుకోవటానికి!

వూళ్ళో తనకు వ్యక్తిగతంగా మంచిపేరు వచ్చింది 'బుగతగారి భారియ శానమంచోరు' అంటూ అంతా తనని మెచ్చుకుంటున్నారు. తన మంచి తనంమీద సుమనకి కానీ జగన్నాధానికి కానీ నమ్మకం కలగటం లేదు. అందుకనే సుమన మీద తనకి రోజురోజుకీ పెరుగుతున్న ప్రేమను తన ముందు దాచాలని వ్యర్థ ప్రయత్నాలు చేస్తాడు జగన్నాధం. రాజమ్మ ముందు ఏమీ ఉద్విగ్నత ప్రదర్శించ లేదు నళిని.

సాయంత్రం దేనికో సుమన నళినివద్దకు వచ్చింది. ఈ మధ్య అంతగా ఇద్దరూ కలిసి మెలిసి పనులు చేయటంలేదు. శారీరకంగా జగన్నాధంకు చేరువయి నప్పట్నించీ మానసికంగా నళినికి దూరం కాజొచ్చింది సుమన.

రాజమ్మ టీ బిస్కట్స్ తెచ్చి ఇచ్చింది.

"చాలా రోజులయింది. ఈపాటి తీరికగా కూర్చుని. ఏమిటి విశేషాలు?" అంది నళిని.

"ఏమున్నాయి! పిల్లలు ఎక్స్‌కర్షన్‌కి ఎక్కడి కయినా తీసుకు వెళ్ళమంటున్నారు. దమయంతి టీచర్ హైద్రాబాదు అయితే బాగుంటుంది అంటున్నారు." అంది సుమన.

"అవును. ఆంధ్రదేశపు రాజధాని పిల్లలంతా చూడాల్సిందే! అక్కడికే దసరా సెలవల్లో తీసుకు వెళ్లుదాము. రానుపోను రైలు ఛార్జీలు ఎంత అవుతుందో అక్కడ వారం రోజులుండటానికి ఎంత అవుతుందో అంతా అంచనా వేయండి పిల్లలందరి పేర్లు లిస్టు తయారు చేసి వచ్చే వాళ్ళ దగ్గర సొమ్ము కలక్టు చేయండి" అంది నళిని.

"అవి అన్నీ దమయంతి టీచర్ చూసుకుంటానంది, హైదరాబాద్‌లోవాళ్ళ అక్కయ్య వున్నది. ఆవిడకు ప్రాస్తానంది ఆవిడ చిల్డ్రన్స్ కేర్ హోంలో ఉద్యోగం చేస్తోందిట. ఆవిడ నలభయిమంది పిల్లలకు ఎకామిడేషన్ చూస్తానందిట."

"సరే అవన్నీ జాగ్రత్తగా చూసుకోండి. ఇంకేమిటి సంగతులు? మీ చెల్లాయికి పెళ్లిట!" అంది నళిని. సుమన తలెత్తి నళిని వంక చూసింది. నళిని కళ్ళల్లో లీలగా పరిహాసరేఖ గుర్తించా ననుకుంది సుమన.

"అవును అయినా ఇక్కడ చేయరు."

"అదేం."

"అది పెళ్లి క్రింద లెఖ్ఖకిరాదు. మా పెద్దక్క జబ్బు మనిషి అయినది. దాని అత్త వారు మా బావకు మళ్ళీ పెళ్లి చేస్తామంటూ తయారు అయినారు. ఇంక గత్యంతరం లేక మా చెల్లి అయితే స్వంత అక్కని కాస్త దయగా చూస్తుందికదా అనిచేస్తున్నారు." అంది.

"మరి నీకు మటుకు పెళ్లి చేయక్కర్లేదా! ఇప్పుడు వినతకేమి తొందర! నిన్నే ఇచ్చి చేయవచ్చును కదా!"

సుమన కళ్ళు క్రోధంతో ఎరుపు రంగుకి తిరిగాయి. వున్నమాట, నలుగురూ అనుకునే మాట అయినా నళిని నోటివెంట అటువంటి ప్రశ్నరావటం సుమన అభిమానాన్ని గాయ పరిచినట్లు అయింది. అయినా నళిని ప్రశ్నకు జవాబు కావాలి. ఇప్పుడు కాకపోతే ముందు ముందయినా నళినికి తాను ఏదోవిధంగా జవాబు చెప్పుకోవాలి. సుమన నిటారుగా కూర్చుంది.

"నేను ఉద్యోగం చేసుకుంటున్నాను. అప్పుడే పెళ్ళిచేసుకోవాలనిలేదు. మా శ్రీని వాస్‌కి చదువు పూర్తి అయి వాడు బాధ్యత తీసుకుంటే కాని నేను ఉద్యోగం చేయటం మానను. వినతకు చదువురాదు. అందుకని పెళ్ళి చేసేస్తే సరిపోతుంది. అనుకున్నారు. పై వాళ్ళయితే అక్కకు చేయకుండా చెల్లెలికి ఎందుకు చేస్తున్నారు! అనే ప్రశ్నవేస్తారు, మా బావకు భార్య అవసరం కనుక, ఇంక మరే ప్రశ్నలూ వేయకుండా పెళ్ళికి ఒప్పుకున్నారు."

"అయినా ఇంటి బాధ్యత నీకెందుకు? మీ నాన్నగారు చూసుకుంటారు. మగపిల్లవాడు అతను చూసుకుంటాడు. అవకాశం వచ్చి నప్పుడు వదులుకోకూడదు. నీకు మటుకు ఇల్లూ వాకిలీ పిల్లాజెల్లా అవసరంలేదా?"

"అవసరంలేదనికాదు. మా బావని చిన్నప్ప ట్నుంచీ ఎరుగుదును. అతనితో సంసారం చేయటం అంటే నా మనసుకి నచ్చలేదు."

"అతను ఒక్కడేనా మగవాడు? మీకు కూడా ఏదో సంబంధం చూడమనండి. పెద్ద మ్మాయికి కాకుండా చిన్నపిల్లకు చేసేస్తే మీలో ఏదో లోపం వుందని అసలు చేసుకుం దుకు సందేహిస్తారు. ముద్దు వచ్చినప్పుడే చంకనెక్కాలని శాస్త్రం వుంది. దేనికయినా సమయం వుంది. సమయం దాటితే వదులు కొన్న అవకాశం తిరిగిరాదు." అంది నళిని.

"అవును తిరిగిరాదు" అనుకుంది సుమన.

వినత పెళ్ళికి తల్లి, తండ్రి, శ్రీనివాస్ బయలుదేరారు.

"నువ్వు వస్తావా!" అంది శాంతమ్మ.

"అక్కా! రాకూడదా?" అంది వినత.

"నీ ఇష్టం అమ్మా!" అన్నాడు తండ్రి. పెద్ద అంగరంగ వైభవంగా జరుగుతుందా పెళ్ళి! తూతూమంత్రంగా అయిందంటే అయిందనిపించుతున్నారు. దానికి తను కూడా ఎందుకు అనుకొని 'నేను రానులే! స్కూల్ పిల్లలకు పెస్టు పెట్టాలి!" అంది.

వాళ్లు పెద్ద బ్రతిమాలలేదు. వాళ్ళకీ మన స్సులో కించగా వుంది. సుమన రాజేష్‌ని అంగీకరిస్తే కొంతలో కొంత తెరిపిన పడినవా రవుతారు. కాని సుమన అంగీకరించలేదు. వినత అంగీకరించింది. ఇప్పుడు సుమనని ఒక ఇంటిదాన్ని చేయటం చాలా సమస్య అయింది. సుమనకి కుదిరేదాకా వినతకు చేయం అనటం భావ్యంకాదు. "సుమనకి నచ్చిన వరుదెవరయినా దొరికితే బాగుండును" అనుకున్నాడు రామనాథం. అక్కలకీ మేనల్లు ళ్ళకీ మేనకోడళ్ళకీ అందరికీ తలొక జాబు వ్రాసేడు. సుమనకు ఏదైనా సంబంధం వుంటే చూడమని.

* * *

ఉదయం ఎనిమిది గంటలవుతోంది. అప్పుడే స్నానంచేసి వచ్చి డైనింగ్ టేబుల వద్ద కూర్చుంది నళిని.

రాజమ్మ వేడివేడి ఉప్మాచేసి తెచ్చింది. జీడిపప్పులు ఒత్తుగా పేర్చినట్లున్న ఉప్మాలో నిమ్మరసం వేసుకుంటే ఇష్టం నళినికి. ఉప్మా ప్లేటుఅందిస్తూ"ఎవరోవచ్చేరు"అందిరాజమ్మ.

"ఎవరు?"

"ఏమో! ఉత్తరాదినించి వొచ్చినట్లున్నారు. పెద్ద లెదర్ సూట్‌కేస్, బెడ్డింగ్ తెచ్చు

కున్నారు. ఉద్యోగస్తురాలిలా వున్నారు. హాలులో కూర్చున్నారు." ఆదరబాదరగా ఫలహారం చేయటం మొదలుపెట్టింది. ఎంతో ఇష్టమయిన ఉప్మా తినలేకపోయింది.

"కొంచెం వేయనాండీ!" అంది రాజమ్మ.

"వొద్దొద్దు" అంటూ చేయి కడిగేసుకుంది.

"ఏమిటో ఈ అమ్మ. తినటానికీ తాగటానికీకూడా తీరికలేకుండా తిరుగుతున్నది." అనుకుంది రాజమ్మ.

చేయి తుడుచుకుంటూ హాలులోకి వచ్చింది నళిని. స్లీవ్‌లెస్ జాకెట్టూ, పల్చని జార్జెట్ చీర, ఉంగరాలు తిరిగే జుట్టు భుజాలవరకూ, పల్చగా సన్నగా నాజూకుగా తళతళ్ళాడే జలతారు తీగలాంటి స్త్రీ పేపరు చదువుతూ కూర్చుంది.

"ఎవరు!" అంది, నళిని.

"మీరేనా నళినీ జగన్నాథ్‌గారు?" అంది ఆ స్త్రీ ఒయ్యారంగా లేచి నమస్కరించుతూ.

"నేను నళినిని. జగన్నాథ్ అనే తోక నా పేరుకు తగిలించుకోలేదు."

"ఐసీ! మీరు జగన్నాథరావుగారి మిసెస్‌గా ఇప్పుడు వుండటంలేదా?" అంది నవ్వుతూ.

నళినికి ఒళ్ళు మండింది. "మిసెస్‌గా వుండటమేమిటి! ఇదేమన్నా ఉద్యోగమనుకున్నారా, భార్యగా వుంటటమంటే! లేక ఇష్టం లేనప్పుడు రిజైన్ చేసి వెళ్ళిపోవటానికి ఇదేమన్నా, పి.ఎ. పనా! 'ధర్మేచ అర్ధేచ కామేచ నాతిచరామి' అని ముమ్మార్లు జపించి కట్టించుకున్న సూత్రబంధం."

"మరి మీ పేరు అలా సింగిల్‌గా వుంచుకోవటంలో అంతరార్థం ఏమిటి?"

"నా కసలు నా పేరుతో ఇంకొక పేరు జోడించుకోవటం నచ్చదు. అందులో అతని పేరు ఇంకొక ఆడపేరుతో జోడించుకుంటే నచ్చదు. అయినా ఆ విషయాలన్నీ మీ కనవసరం!" అంది కోపంగా.

"ఆహాహా! కోపంలో ఎంత ముద్దు వస్తున్నావే సత్యభామా!" అంది ఆ యువతి. నళిని విస్తుబోయింది. ఎవరీమె! తనని యింత చనువుగా సంబోధిస్తూంది? ఆ యువతి నళిని తెల్లబోయి చూస్తూంటే విరగబడి నవ్వసాగింది.

"ఇంతకీ ఎవరు మీరు?"

"ఎవరురాని నువినా...." అంటూ ఇంకా నవ్వసాగింది. రాజమ్మ, రాములమ్మ ఇంకా పనివాళ్ళు అందరూ హాలులో గూమిగూడారు.


"ఇంకా ఆనవాలు పట్టలేదుటే! నేనూ, మీ ఇంటి కెదురుగా వుండే సుబ్బలక్ష్మినే! అన్నపూర్ణమ్మగారి మనుమరాలిని!" అంది.

"ఓసి. నువ్వుటేబాబూ! ఇంకా ఎవరో అనుకున్నాను. ఏమిటిలా మళ్ళింది గాలి! ఈ వేషమేమిటి! పరాయిదానిలా ఇల్లా బయట హాల్లో కూర్చోవట మేమిటి. ఎక్కడ్నించీ రాక? ఎక్కడికి పోక!"

"అలా అన్ని ప్రశ్నలకూ ఒకేసారి జవాబులు ఇయ్యబడవు. వన్ బై వన్ క్యూపద్ధతిలో రావాలి ప్రశ్నలు. నేను రావటం భారతదేశపు రాజధాని నగరంనించి. ఇంక పోవటమంటావా ఎక్కడికి వెళ్ళతానో అది నా చేతి లోలేదు. భవిష్యత్తు అగమ్యగోచరం! భూతకాలం భూతాలను మరపింపచేసింది. వర్తమానకాలం అంటావా! ప్రాణసఖి సమక్షంలో వున్నాను, ఇంక బయటహాల్లో ఎందుకు వుండిపోయానంటావా నీకు మడీదడీ ఏమన్నా వున్నాయేమో! వంటింటిలోకి సరాసరి దూసుకుపోయి ఎల్లా రాను!" అంది ఆ యువతి.

"మా ఇంట్లో మడీదడీ పూజలూ వ్రతాలూ లేమీ లేవు. ఇరవయ్యో శతాబ్దం వాళ్ళము." అంది నళిని.

"ఇరవయ్యో శతాబ్దపు వాళ్ళకు శ్రోత్రియం వుండదంటావా! పరుగులిడే చక్రాలు ప్రవహించే జీవవాహిని అన్నట్లు మళ్ళీ కాలచక్రం బయలుదేరిన చోటికే వచ్చి తీరుతుంది. ట్రెడిషన్ ట్రెడిషన్ అంటూ అంతా మళ్ళీ అగ్నిహోత్రం చుట్టూ అరవయి ఆరుసార్లు గింగరాలు తిరుగుతున్నారు. తూర్పు జిల్లాలకు వెళ్లు. ఇంకా జాకిట్టు తొడుగ్గుకుంటే 'షోకిల్లా' లనుకుంటారని విప్పుకు తిరుగుతూ, 'ట్రెడిషన్'ని కాపాడుతున్న వాళ్ళు బోలెడు మంది కనపడుతారు నీకు!"



"నీవు బాగా ట్రావెల్ చేసి వున్నావు. నీకు అన్ని రాష్ట్రాల ప్రజల అలవాట్లు బాగా అవగాహన చేసుకుందుకు అవకాశం వుంది."

"నూతిలో కప్పలా ఒకేచోట కూర్చుంటే ఎల్లాగు? నలుగురితో కలవాలి. నాలుగు వూళ్ళూ వున్న అవకాశం మేరకు చూడాలి. అప్పుడే మనస్సు విశాలమవుతుంది. భావాల పరిధి విస్తృతమవుతుంది."

"సరేలే, పద స్నానం చేయి. కాఫీ ఫలహారాలు చేద్దువు గాని," అంది నళిని.

"నాకేదయినా వేరే ఒక రూం చూపెట్టు. నా తట్టాబుట్టా పదేసుకుంటాను."

"రాజమ్మా! తన సామాను నా గదిలో పెట్టు!" అంది నళిని.

"నీ గదిలో ఎందుకే! నా మకాం! పానకంలో పుడకలా? మీవారు రెండు రోజుల్లోనే సెలవు ఇచ్చేయమంటారు."

"మా వారు నా గదిలోకి అస్తమానూ రారు."

"అవసరం వచ్చినప్పుడు వస్తారా రారా?"

"అంత అవసరం ఆయన కెప్పుడో కాని రాదు."

"ఏమిటే నీ కథ! నవల వ్రాసుకుందుకు పనికివచ్చేలా వుంది. చెప్పవా!"

"ముందు స్నానం అదీ చెయ్యి. తర్వాత మన కథలు చెప్పుకుందాం."

సుబ్బలక్ష్మి బాత్‌రూంలోకి వెళ్ళింది కావల్సిన బట్టలు తీసుకుని. నళిని తన మంచం మీద జారగిల బడింది. సుబ్బలక్ష్మికి నళినికి చాలా చిన్నప్పటి స్నేహం. సుబ్బలక్ష్మి నళిని కన్న ఒకటి రెండేళ్ళు చిన్నది. తెల్లగా పీలగా వుండేది. అందరూ బలంగా దుబ్బల్లా వుండే పిల్లలలో సుబ్బలక్ష్మి తోస్తే పడిపోయేలా అబ్బనాకారంగా వుండేది. దానికి తోడు ముతక చీటీ పువ్వుల గౌన్లు. అవి వెలిసిపోయి చిరిగిపోయి వుండేవి. అది చింకి గౌను వేసుకుని ఆటలకువస్తే పిల్లలంతా ఆ చిరుగుల్లో కాగితం ముక్కలు, చిన్నచిన్న కంకరరాళ్లు వేసి పోస్టాఫీసు పోస్టాఫీసు అంటూ ఏడిపించేవారు. నళినికి జాలివేసేది.

"ఏమిటర్రా చిన్న పిల్లనిచేసి ఏడిపిస్తారు" అనేది.

"చిన్న పిల్లలు కానిదెవరు! మనంమటుకు పెద్దవాళ్ళమా!" అనేది సుందు. ఇసకకుప్పల్లో దూరి వంటినిండా ఇసుక పోసుకుని ఇల్లుచేరితే తల్లి నాలుగు తన్ని వళ్ళంతా రుద్ది నీళ్ల పోసేది. తర్వాత ఇరుగు పొరుగు పిల్లలతో చేరి ఆటలు మరిగిందని తల్లి తనని రేసిడెన్షియల్ స్కూలులో చేర్పించేసింది. శెలవలకు ఇంటికి వచ్చినప్పుడల్లా తనచుట్టూ సుందు లీల, గోపీ అంతావచ్చి చేరేవారు. సుబ్బలక్ష్మి వచ్చేది కాదు. ఒకరోజు గుడికి వెళ్లి వస్తున్నారు నళిని స్నేహితురాళ్ళు. సుబ్బలక్ష్మి పువ్వుల పరికిణి కట్టుకుని ఎదురు వచ్చింది. నళిని వెళ్లి దాని జబ్బ పుచ్చుకుంది.

"ఏమే సుబ్బూ? రావటం మానేసావు!" అంది.

చురచుర చూసింది సుబ్బలక్ష్మి.

"మాట్లాడవేమే?"

"నువ్వు గొప్పగా చదువుకుంటున్నావుగా!"

"చదువుకుంటే! నువ్వుమటుకు చదువుకోవటంలా?"

"నువ్వు గొప్పదానివి! అంచేత నువ్వు మంచి ఇంగ్లీషు స్కూల్లో చదువుతున్నావు. మంచి మంచి బట్టలు కట్టుకుంటావు. నీతో నాకు స్నేహం ఏమిటి!"

"బలే దానివే! వీళ్ళంతా స్నేహంగా వుంటం లేదా! అక్కడ మా చుట్టాలున్నారని అక్కడ చేర్పించారు మావాళ్లు." అంది నళిని.

"ఉడుకుమోతుది." అంది సుందు. నళిని డిగ్రీకోర్సులోకి వచ్చేసరికి ఎల్లాగో స్కూల్ ఫయినల్ ఎగ్జామ్స్ వ్రాసింది సుబ్బలక్ష్మి. నళిని వచ్చినప్పుడు వచ్చేది. పెద్దదవుతున్న కొద్దీ, గొప్పవాళ్ళని చూసి అసూయ పడటంవల్ల మానసిక అసంతృప్తి తప్ప లబ్ధి ఏమీలేదని గ్రహించింది. నళిని వచ్చినప్పుడు కాస్సేపు వచ్చి కూర్చుని నళిని కాలేజి విశేషాలు విని వెళ్లిపోతూండేది.

"ఏమే కాలేజీలో జేరుతావా!" అంది నళిని ఒకసారి.

"ఊహూ! స్కూల్ ఫయినల్ చదివే సరికే నా తల ప్రాణం తోకకు వచ్చింది. ఇంక చదవలేను." అంది సుబ్బలక్ష్మి.

"వూరికే కూర్చుంటావా!"

"ఊ హుఁ"

"మరేం చేస్తావు!"

"నువ్వు సుందు వాళ్ళతో చెప్పకేం!" అంది గొంతు నొక్కి.

"ఊఁహూ. చెప్పను."

"నామీద ఒట్టు వేయి!"

"పిచ్చిదానా! నువ్వు అందరిలోకి చిన్నదానివి. నీ రహస్యం ఎందుకు చెబుతాను. నువ్వు నామీద వుంచిన నమ్మకాన్ని వమ్ము చేస్తానా!"

"నేను గౌతంను ప్రేమించాను. మేమిద్దరం పెళ్లి చేసుకుంటాము."

"ఏమిటే నిజంగా!"

"నిజం! మా అమ్మమ్మకు తాతయ్యకు తెలియదు ఇంకా!"

"వాళ్లు ఒప్పుకుంటారా!"

"ఒప్పుకోరు."

"మరి నీకు భయం వెయ్యదూ!" అంది నళిని.

"భయమా! ఎందుకు! నీకు పెళ్లి చేసుకుందుకు భయమేస్తుందా!"

"నా సంగతి వేరు. నాకు మావాళ్లు కట్నం ఇచ్చి మామూలు పెళ్లి చేస్తారు."

"పెళ్లి అంటె ఏదయినా పెళ్ళే! వాళ్ళు చేసినా మనం చేసుకున్నా పెళ్లి అంటే పెళ్లే. గౌతం చాలా డబ్బున్నవాడు. పెళ్ళిచేసుకుంటానని వాగ్దానం చేసాడు."

"అందుకని ప్రేమించేసావా?"

"లేదు. అతనే నన్ను పెళ్ళి చేసుకుంటే కాని నిలవలేనంత గాఢంగా ప్రేమించేసాడు. వనే, నేను డబ్బుని తప్ప ఇంకదేనినీ ప్రేమించలేను. గౌతంకు తరతరాలు కూర్చుని తిన్నా తరగని సంపదవుంది."

"బుద్ధి స్థిరం కాదంటారు. కాలేజీలో అతనికి మంచి పేరు లేదు."

"మంచి వాళ్ళకు చెడ్డపేరు చెడ్డవాళ్ళకు మంచి పేరు తప్పదు ఈ లోకంలో. స్థిర బుద్ధి లేదంటావు, అది ఉన్నదెవరికి! ఇవ్వాళ కారం

ఇష్టమయిన వాళ్ళకు కొన్నాళ్లు కారం తినగా తినగా తీపితినాలనిపించితే అది స్థిరబుద్ధి కాన క్షే లెఖ్ఖా!మార్పు మానవులుకోరుకోవటంసహజం. వున్న వాతావరణం నించి ఇంకో వాతావరణం లోకి వెళ్ళితే సౌఖ్యవంతమయిన జీవన మార్గం కనపడుతుందేమో అనే ఆశ మానవులకు వుంటుంది. ఒక్క మానవులకే కాదు, చైతన్యం వున్న ప్రతి ప్రాణీ మార్పును కోరుకుంటుంది. ఎండలో నడచి వెళ్తున్న ఎద్దు చెట్టు నీడ కన పడితే దానంతటదే చెట్టునీడకు చేరుకుంటుంది."

"మీ అమ్మమ్మ తాతయ్య నీకు పెళ్లి చేద్దామనుకుంటున్నారా!"

"వాళ్లు ఇంకా ఏమీ అనుకోవటంలేదు. నేనే ఛలో ఢిల్లీ!"

"వాళ్ళు బాధపడరూ!"

"ఎందుకు బాధపడాలి! నా కిప్పుడు లక్షణంగా పెళ్లి పేరంటం చేయాలంటే పది పది హేనువేలు కావాలి. మా మామయ్యలకు నేనొక తప్పని సరి తద్దినాన్ని. కూతురు కూతురు కదా, తల్లి లేనిదాన్ని కదా అని ఇంత వరకు పెంచుకు వచ్చేరు, ఏదో నాదారి సంబంధం చూస్తారు నెమ్మదిగా పాతిక ఏళ్ళు వచ్చేక! అందాక ఎవరు కూర్చుంటారు!" అంది సుబ్బలక్ష్మి.

గౌతం మార్వాడీల కుర్రాడు. చిన్నప్ప ట్నించే వీళ్ళందరితో ఆడుకుంటూ వుండే వాడు. బి. ఎ కి చాలాసార్లు కట్టాడు కాని ప్యాసవలేదు. తన వాటా తీసుకుని ఢిల్లీలో మేనత్త భర్తతో కలిసి వ్యాపారం పెట్టు కుంటాడుట. అతను వెళ్లేప్పుడు సుబ్బలక్ష్మి కూడా వెళ్ళిపోవటం అక్కడ పెళ్ళి చేసు కున్నాక తాతయ్యకు అమ్మమ్మకు జాబు వ్రాయటం. అది సుబ్బలక్ష్మి ప్లాను.

"చాలా బాగుంది" అంది నళిని.

సుబ్బలక్ష్మి ఢిల్లీ వెళ్ళాక వాళ్ళ తాత అమ్మమ్మ చాలా బెంగపడ్డారు: అందరితో చెప్పి కుళ్ళి కుళ్ళి ఏడిచారు. కొడుకులని మేన కోడలి బాగోగులు చూడలేదని తిట్టిపోసారు. తర్వాత క్రమక్రమంగా ఆ గొడవలు పూరం దరితోపాటు వాళ్ళూ మర్చిపోయేరు. మళ్ళీ ఇదే చూడటం! ఆనాటి సుబ్బలక్ష్మి ఈనాటి అత్యంత అధునాతన యువతి క్రింద రూపొందింది. నమ్మ లేకపోతోంది నళిని. సుబ్బలక్ష్మి స్నానం ఫలహారంచేసి పైకి వచ్చింది.

"ఏమిటే అల్లా వున్నావ్! పిల్లాజెల్లా లేరుట కదా! మీరి పూళ్ళోకల్లా గొప్ప భాగ్యవంతులట కదా!" అంటూ ఎదురుగా వున్న మంచంమీద జారబడింది. లేత గులాబీ కాశ్మీరు సిల్కు చీర. నీలి రంగు ఫుల్‌స్లీవ్ చోళీ జుత్తంతా పైకి దువ్వి రబ్బరు బాండ్ పెట్టింది. నెమిలి పింఛంలా ఉంగరాలు తిరిగిన జుట్టు నెత్తిమీద పరుచుకుని తమాషాగావుంది. కనుబొమ్మలు ఐబ్రో పెన్సిల్‌తో దిద్దుకుంది, పల్చని పెదాలకు లేగులాబీ రంగు.

"నువ్వేమీ మారలేదే! ఎల్లావుంది ఢిల్లీ జీవితం! పిల్లలున్నారా! ఏంచేస్తున్నాడు గౌతం. వ్యాపారం ఎల్లావుంది!" అంది నళిని.

"పిల్లలు నలుగురున్నారు. గౌతం వ్యాపారం దివాలా తీసింది, ప్రస్తుతం ఒక చిన్న హోటలు పెట్టుకున్నాడు."

"పిల్లలు మగా, ఆడా!"

"ముగ్గురు మగా, ఒక ఆడా! పిల్లలని మా చెల్లాయి చూసుకుంటుంది ఇంట్లో. నేను సోషల్ సర్వీస్ చేస్తున్నాను. పిల్లలు చురుకయినవాళ్ళే. చదువు బాగా వస్తుంది. అంచేత మంచి ఎడ్యుకేషన్ ఇప్పించాలని వుంది."

"మీ చెల్లాయా! నీకు చెల్లెళ్లెవరున్నారే."

"గౌతం భార్య నాకు చెల్లాయి కాదూ!"

"వాట్!" అంటూ తేలు కుట్టినంత అదిరి పాటుతో లేచి మంచం నడుంగా కూర్చుంది నళిని.

"ఎందుకంత ఆశ్చర్యం!"

"నీకేమన్నా మతిపోయిందా!"

"మతివుంది. కనుకనే గౌతంను వాళ్ళ వాళ్ళు పెళ్లికి వత్తిడిచేస్తే బలవంతంగా పెళ్లికి వప్పించాను."

"ఏమిటే నువ్వు మనిషివేనా!"

"మనిషినేనే! మనిషిని కనుకనే నలుగురు

పిల్లలతో రోడ్డుమీదపడి అడుక్కు తినకుండా వుండాలంటే ఏదో వక త్రోవ త్రొక్కాలని నిర్ణయించుకున్నాను. 'దులారీ' కాస్త ఆస్తి మంతురాలు. గౌతం అప్పుల్లో పీకలదాకా కూరుకుపోయేడు. అతని అన్నలు పెళ్లి చేసు కొమ్మని సలహాఇచ్చేరు.గౌతం అమాయకుడు. నన్ను ఏదో అన్యాయం చేసినట్లు అవుతుందని విల విల్లాడి పోయేడు. పెళ్ళి చేసుకుంటే ఆస్తి వస్తుంది. మళ్ళీ జీవితంలో కొంచెం నిలద్రొక్కు కోవచ్చును. అటు వాళ్ళ వాళ్ళలోనూ తిరిగి కలిసినట్లు అవుతుంది. ఇటు మనకు భుక్తి మార్గం దొరుకుతుంది అని నచ్చ చెప్పాను. ఇప్పుడు దులారీ మాతోనేవుంటుంది. హోటల్ వ్యాపారం బాగానే జరుగుతోంది. పిల్లలు దులారీని వదిలి ఒక్క క్షణమయినా వుండరు. దులారీకి పిల్లలంటే పంచప్రాణాలు."

"ఆఁ పంచప్రాణాలు! సవతి తల్లి తల్లి కాదు. తాగినవాడు తండ్రికాదు. అన్నట్లు ఎన్నాళ్ళు పంచప్రాణాల క్రింద చూస్తుంది! ఆమెకు పిల్లలు కలిగితే నీ పిల్లల గతేమిటి!''

"ఇదేమన్నా మొఘల్ సామ్రాజ్యమా! పెద్ద రాణీకి పిల్లలుంటే వాళ్ళే మహారాజులయి పోతారని ఏడవటానికి! వున్నదేదో అందరూ తింటారు. అయినా దులారీకి పిల్లలు కలగరు. గౌతం ఆపరేషన్ చేయించుకున్నాడు."

"వ్వాట్;'' అంది మళ్ళీ నళిని, ఇంకా కళ్లు పెద్దవి చేసి.

"తెలుగులో ఆశ్చర్యపోవే! అస్తమానూ వ్వాట్ వ్వాట్ అంటూ ఇంగ్లీషు ముక్క లెందుకు;'' అంది సుబ్బలక్ష్మి,

"సుబ్బూ! నీవెంత తెలివయిన దానివే! ఎల్లాంటి సమస్యకయినా నీవద్ద పరిష్కారం దొరుకుతుంది.''

"నాపేరు సుబ్బుకాదే! బాబూ! సుభా గౌతం సుబ్బూ రుబ్బూ, ఏనాడో వదిలేసాను.'' అంది.

"పోన్లే సుభా! అనే అంటాను. వో సుభా (సుబహ్) కభీతో ఆయేగీ.'' నళిని పాడ సాగింది.

"తెలివి వక్కరి సొత్తంటే తెలివి తక్కువ దద్దమ్మా!'' అంటూ సుభ పాడ సాగింది. నళి నికి సుభను చూస్తున్న కొద్దీ ఆశ్చర్యం కలగ సాగింది. ఇది ఇంత హేపీగా ఎల్లా వుండ కలుగుతోంది; అది అన్నట్లు తన జీవి తాన్ని తనే గాఢంగా ప్రేమించుకుందేమో! అందుకనే 'గౌతం' చుట్టాలమ్మాయిని పెళ్ళి చేసుకుంటే పెద్ద బాధకలగలేదు. కొంచమన్న గౌతం అంటే ప్రేమవుంటే పరాయివాళ్ళ పాలు అవుతున్నందుకు ఎంతయినా బాధపడేది. పైగా పిల్లలని ఆ అమ్మాయికి మాలిమిచేసి తాను టూర్లు తిరుగుతోంది! జీవితం ఇంత ఈజీగా తీసుకున్నవాళ్లే సుఖపడ గలరు?''

"ఏమిటే ఆలోచన;''

"ఏం లేదు. జీవితం గురించి!'' అంది నళిని.


"ఓసీ, ఇన్నాళ్ళుగా సంసారం చేస్తున్నావు. ఇంకా జీవితం గురించి ఆలోచించుకుంటూనే వున్నావా! జీవితం మనల్ని నడిపించదు. మనమే జీవితాన్ని నడిపించుకోవాలి.''

"అల్లా కొంతమందే తమ తమ జీవితాల్ని తీర్చిదిద్దుకోగలుగుతారు. చాలామంది విధి చేతిలో కీలుబొమ్మలే కదుటే!''

"మన అసమర్ధతని కప్పి పుచ్చుకుందుకు విధి అని గాడిద గుడ్డు అని అంటూ వుంటారు. నాకు అల్లాంటి ఎస్కేపిస్టు మాటలంటే చిరాకు! విధి చేతులో కీలుబొమ్మలం. అనుకుంటూ అన్నం వండుకోవటం మాని వేస్తున్నామా; బియ్యం ఇంట్లో లేకుంటే ముష్టి ఎత్తి అయినా కడుపాకలిని అణచటా నికి ప్రయత్నిస్తున్నాము. కొంచమన్నా పని చేయకుండా భగవంతుని లీల అంటూ కబుర్లు చెప్తే నాకు వళ్ళుమండుకు వస్తుంది.'' అంది సుభ.

నిజమే! ఎవళ్ళ సమస్యలని వాళ్లే చక్క దిద్దుకోవాలి. సమస్య స్వరూపం ఎల్లాంటి దయినా పరిష్కారానికి మార్గాలు అన్వేషిం చాలి. అన్వేషించుకుంటూపోతే ఎప్పటికో ఒకప్పటికి పరిష్కార మార్గం కనుపించ వచ్చును, మార్గం సుగమంగా లేదని అన్వే

(వి) చిత్ర విజ్ఞానం



రోజూ శీర్షాసనం చేస్తే క్షయవ్యాధి రాదు. దృష్టి, జ్ఞాపకశక్తి లోపించవు. వెంట్రుకలు రాలడమో, నెరవడమో వుండదు—ఇది అనాదినుండి మనకున్న నమ్మకం! కైవల్యధామ పరిశోధనా కేంద్రంలో జాయింటు డైరెక్టరైన డా॥ కరంబేల్‌కర్ శీర్షాసనం ప్రమాదకరం, ముఖ్యంగా కంటికి అంటున్నారు॥

షణ మానుకోవటం అవివేకం" అంది నళిని.

"ఏదో పెద్ద డైలమాలో పడ్డట్టున్నావ్! ఇంతకీ మీ జగన్నాధులుంగారు దర్శన మీయరేమి!" అంది సుభ.

"పనిమీద వూరికి వెళ్ళారు సాయంకాలం వస్తారు" అంది నళిని.

*　　*　　*

ఇప్పుడు శాంతమ్మకు కొంచెం వెసులుబాటు చిక్కింది. తీరిగ్గా కూర్చుంటుంది. ఇరుగూ పొరుగూ వస్తారు. కూతుళ్ళ కాపరాల గురించి మాట్లాడుకుంటూ కూర్చుంటుంది. రామనాథం తన పొలం గొడవలు ఆదాయ వ్యయాలు తప్ప మిగిలిన విషయాలు ఎప్పుడూ ఆట్టే పట్టించుకోవటంలేదు. శ్రీనివాస్‌కి గారాం ఎక్కువ. సుమన ఉద్యోగస్థురాలు అవటం, తండ్రి వ్యవసాయం చేసుకోవటం శ్రీనివాస్‌కి సుమనకే ఇంట్లో ఆధిక్యతవున్నట్లు కన్పించసాగింది. ఎన్నిసార్లు కట్టినా కనీసం ఇంటరేనా దాటలేక పోతున్నాడు. పరీక్షకు కట్టటం తప్పటం; ఒకసారి సుమనకు ఏనుగు వచ్చింది.

"అస్తమానూ పరీక్షలకు ఫీజ్‌కట్టటం తప్ప ధ్యాసగా పరీక్ష ప్యాసు అవ్వాలని చదవటం అంటూ వుండదా!" అంది.

"నీ సొమ్మ ఏం పోయింది! నువ్వు ప్యాస యినావు కదా! మహా బోడి. బి- ఎ. దాన్ని చూసుకుని ఈ మిడిసిపాటు!" అన్నాడు.

"చూడవే అమ్మ! అస్తమానూ పరీక్షలకు ఫీజ్ దండగ చేస్తున్నానని నేనంటే ఎలా ఎదురు చెపుతున్నాడో" అంది సుమన.

"అయినా వాడి జోలి నీకెందుకు నువ్వేం పెట్టి పోషిస్తున్నావా! ఏదో వూరికే కూర్చో వటం ఎందుకని ఆ స్కూల్‌కి పంపిస్తున్నాను. నీ ఆర్జన ఏదో ఖర్చు అయిపోతూందని భయంగావుంటే వేరే బాంకులో దాచుకో!" అంది శాంతమ్మ.

"అవునే నీ డబ్బు నువ్వు దాచుకో; దానితో నీకు మొగుడువస్తే కొనుక్కుందువు కాని," అన్నాడు శ్రీనివాస్ ఎక్కసక్కెంగా.

సుమన కళ్ళమ్మట నీళ్ళూరాయి. "డబ్బు కోసం అన్నానా అమ్మా! ఇంటర్ దాటటానికి పదేళ్ళు పడుతూంటే ఇంక డిగ్రీ చదువేం చదువుతాడు! వీడు డిగ్రీ తీసుకునే సరికి గవర్నమెంట్ ఉద్యోగం వచ్చే అవకాశం దాటి

పోతుంది. డిగ్రీయేనా లేకుండా ఉద్యోగాలు ఏమివస్తాయి? వాడి భవిష్యత్తుకోసమేగా నేను చెబుతున్నది?"

"నా భవిష్యత్తు నేను చూసుకోగలను. నువ్వేమీ సూక్తి ముక్తావళి వర్ణించనక్కర్లేదు. నీ భవిషత్తు నువ్వే చూసుకోవాలి, ఆ నళినిని నమ్ముకుని కూర్చున్నావు. ఆవిడకు డబ్బు రాబడి ఎప్పుడు తగ్గిపోతే అప్పుడు స్కూల్ ఎత్తేస్తుంది. అప్పుడు అమ్మగారి ఉద్యోగం ఊస్టింగ్ అయిపోతుంది. ఎన్నాళ్ళు చేసినా రాచవారి సేవ రాళ్ళపాలు కాకతప్పదు. అది గుర్తుంచుకో!'' అన్నాడు శ్రీనివాస్.

ఈ మధ్య తల్లి కూడా తరుచు విసుక్కుంటోంది. శ్రీనివాస్ సూటిపోటి మాటలు విసురుతూంటాడు. ఈ సందట్లో జగన్నాధ రావుని తరుచు కలుసుకోవటం పడటంలేదు. ఏదో ఒకటి తేల్చుకోవాలి? ఎన్నాళ్ళీ దాగుడు మూతలు? అతని వాంఛలు తీర్చుకోవటం అవుతోంది. వినోదజాబుల ద్వారా తరుచు హెచ్చరిస్తోంది ఏం చేయదల్చుకున్నావని.

వూరి చివరగా జగన్నాధరావుకి పూలతోట వుంది. ఎప్పుడన్నా వూరి పిల్లలు పూలు కోసుకుందుకు వస్తూ వుంటారు. ఈ మధ్య జగన్నాధరావు రెండెకరాలు మించివున్న ఆ తోటకు చుట్టూ కంచె వితనం చెట్లు నాటించాడు. అవి బాగా దట్టంగా బలిసాయి. చిన్న మాలతీ లత గుబురుగా వున్నచోట ఐరన్ స్తంభాలమీద పందిర వేసారు. అడుగున సిమెంట్‌తో వర్తులాకారంగా చప్టాచేసారు; మాలతీ పూలు చాలా సున్నితమయిన వాసన వేస్తాయి. నళినికి ఆచోటు అంటే చాలా ఇష్టం. ఆ చప్టామీద కూర్చుంటే తోటలో ఏమూల ఎవరు ఏం చేస్తున్నారో కనుపించుతుంది. అక్కడ ఎవరున్నారో తోటలో తిరుగుతున్న వాళ్ళకి కనుపించదు. దూరదూరంగా చామంతులు మళ్ళ నిండా విరబూసి వున్నాయి. ముదురాకు పచ్చని ఆకులుమీద పచ్చని పసుపు ముద్దల్లాంటి చామంతులు సంజవేళ లేత అరుణ వర్ణంలో వింత కాంతితో మెరుస్తున్నాయి. సుమన చాలాసేపు నించీ ఆ చప్టా మీద కూర్చుని వుంది. సంజ వెలుగులు క్రమక్రమంగా అంతరించుతున్నాయి. పున్నమి ముందరి రోజులేమో లేత వెన్నెల తోట అంతా క్రీనీడలా పరుచుకుంటోంది. సుమన నిరీక్షణ ఫలించింది. దూరంగా తోట మాలి వీరయ్యతో యాధాలాపంగా ఊసుపోక కబుర్లు చెబుతున్నట్టుగా వస్తున్నాడు జగన్నాధరావు. స్త్రీ మనస్సు అతి విచిత్రమయినది. ఒకప్పుడు సుమనకు తను జగన్నాధరావు కోసమే పుట్టినట్లు అన్పించేది. అతన్ని చూడగానే కళ్ళల్లో ఒక ఆరాధనాభావంతో మెరుపు మెరిసేది. ఆ తొలి వలపు ఉధృతం పొంగు చాలావరకు తగ్గింది. అప్పుడు చేసిన తప్పులో తనచేయి కూడా వున్నా మొత్తం మూడు వంతులు తప్పు జగన్నాధరావు మీదే మోపబోతున్నది. తనేదో అబల అయినట్లు జగన్నాధరావు వలలో నిష్కారణంగా చిక్కుకున్నట్లు బాధపట్టుకుంది. జగన్నాధరావు స్వతహాగా సంస్కారవంతుడు. చదువుకున్నాడు. విలాసవంతుడుకాడు. కామోద్రేకికాడు. ఒక పురుషుడిలో ఒక స్త్రీ చలనం కలిగించుతుంది. వాళ్ళు భార్యాభర్తలయితే లోకం పట్టించుకోదు. కాకపోతే అందరి కళ్ళూ వాళ్ళమీదే వుంటాయి. అందరి చెవులూ కథల కోసం రిక్కించి వుంటాయి. నళిని అందమయినదయినా నళిని కలిగించలేని స్పందన సుమన కలిగించింది. ఒడ్డున నించున్నవాడు జగన్నాధం. ప్రవాహంలో వున్నది సుమన. చేయి అందిస్తే, తను పైకి రావటానికి బదులు, జగన్నాధంని కూడా ప్రవాహంలోనికే లాగేసింది. మునిగే వాడికి చేయి అందించితే తామూ మునిగిపోతారు తప్ప మునిగేవాడు తేలడు అని నిరూపించింది సుమన. జగన్నాధరావుకి సుమన పట్ల చులకన భావం ఎప్పుడూలేదు. ముందూ వెనకా ఆలోచన లేకుండా, తనకన్యాత్వాన్ని బలిపెట్టుకుందని జాలికూడా వుంది. పైగా. అయినా ఇప్పుడిప్పుడు వినత పెళ్ళి అయాక ఇంట్లో కూడా తనపట్ల అందరికీ విసుగు కోపమూ ఎక్కువ అయినట్లు అన్పించ

సాగింది సుమనకు. దానితో తన ఈ జీవితంలో అనిశ్చిత పరిస్థితి రావటానికి కారణం జగన్నాధమే అనిపించసాగింది సుమనకు. ఏదో పట్టుదల కసి నళిని ఏదో తనని హేళన చేస్తున్నట్లు. నళిని కూర్చున్న కనకపు సింహాసనం తను అయాచితంగా ధారాదత్తం చేసినట్లు బాధ పట్టుకోసాగింది. ఒకప్పుడు జగన్నాధరావుని చూస్తూనే నిలువెల్లా పులకించిపోయే తనువు ఇప్పుడు అణువణువునా కసితో పగతో రగుల్కొంటూంది. జగన్నాధంకు సుమనలో చెలరేగుతున్న విషజ్వాలల సెగలు తెలియటంలేదు. సుమనలో అతని కెప్పుడూ అతని దాహం తీర్చే చల్లని నీటి చెలమే దర్శన మిస్తూంది.

మెల్లగా వీరయ్యని వదిలించుకుని వడివడిగా మల్లె తీగలు విరజాజి పొదలూ చూస్తున్నట్లుగా నడిచి వచ్చాడు జగన్నాధం సుమన వద్దకు.

"ఎంత సేపు అయింది సుమా!" అన్నాడు దగ్గిరగా కూర్చుంటూ. గిన్నె మాలతి పూలు గుత్తులు చాలా కోసింది సుమన. వాట్లకున్న ఆకులు తెంపుతూంది.

"ఎంత సేపు అయితేనేం! మీ కిప్పటికి కదా తీరిక చిక్కింది?" అంది సుమన.

"వీరయ్య కన్పించాడు, వాడ్ని వదిలించుకుని రావాల్సి వచ్చింది." అన్నాడు.

"ఎన్నాళ్ళీ దొంగ బ్రతుకు మనకు!" వద్దనుకుని కంఠం నొక్కిపెట్టి పలికినా తీక్షణంగానే వచ్చింది స్వరం.

"అదేమిటి సుమా! అల్లా అంటావు!" అన్నాడు జగన్నాధరావు బాధగా.

"మా చెల్లాయికి పెళ్ళి అయింది. తెలుసా!" అంది.

"తెలుసును."

"మా ఇంట్లో మా బావని నన్నే చేసుకొమ్మని చాలా వత్తిడి తెచ్చారు. కాని నేను మీ కిచ్చిన మాటవల్ల నేను పెళ్లి చేసుకోను అని చెప్పేసాను. విధిలేక "బావ" పై సంబంధంకు వెళ్లిపోతాడని భయమేసి వినతకు చేసారు."

జగన్నాధం ముఖం బాధగా కమిలిపోయింది. ఈ సంభాషణ గమ్యం ఏమిటో జగన్నాధంకు తెలుసును. సుమన కోరుకునేదేమిటో జగన్నాధంకు తెలుసును. తన్ను ఏది అడిగినా జగన్నాధం ఇచ్చేయటానికి సిద్ధంగానే వున్నాడు. అయితే నళినిని కష్టపెట్టటానికి అతని మనస్సు సిద్ధంగాలేదు, మామూలు భార్యలా నళిని తనని దేనికీ సతాయించటంలేదు. సుమన పట్ల మితిమించిన ఆరాధన పసికట్టి కూడా ఆ విషయం తననేమీ బాధించనట్లు వూరుకుంది.

"మాట్లాడరేం!"

"ఏం మాట్లాడను!"

"ఎన్నాళ్ళిల్లా?"

"అదే ఆలోచిస్తున్నాను."

"మగవారు. మీరు ఆలోచిస్తారా! వేసినన్ని రోజులు వెండి కాగడా వెలిగించుతారు. నాకు ఒక దారి ఇది అని నిర్దేశించాల్సిన బాధ్యత మీకువుంది. అది మర్చిపోకండి. ప్రేమ శరీర సుఖమే ఇస్తుంది అనుకోకండి. అంతులేని బాధ్యతకూడా అంటగట్టుతుంది."

"నేను బాధ్యతనించి పారిపోవాలను కోవటం లేదు. నీవేది చెబితే అది చేయటానికి సిద్ధంగా వున్నాను. వూరికే అపోహపడి అనవసరంగా ఇంటా బయటా అశాంతి పాలు కావద్దు." అన్నాడు గంభీరంగా.

"అయితే వెంటనే మన పెళ్ళి ఏర్పాట్లు చేయండి." అంది సుమన. గొంతులో ఉడుకుమోతు తనం ధ్వనించింది. జగన్నాధరావుకు నవ్వు వచ్చింది. హరిశ్చంద్రుడు మాతంగ కన్యలకు చెప్పిన జవాబు గుర్తుకు వచ్చింది.

"ఏందుకు నవ్వుతారు?"

"నాకు పెళ్ళా! నలభయ్యో పడి వచ్చింది!"

"నలభయ్యో పడి ప్రేమ పారాలకు పనికి వచ్చిందా! పెళ్లి పీటకు పనికిరాదా! అవసరం తీరిన మగాడ్ని అనిపించుకున్నారు."

జగన్నాధరావు ధనవంతుడు. ఒక విధ

మయిన హుందా తనంతో అతని బాల్యం గడిచింది. ఇంటా బయటా నళినితో సహా అతని పట్ల గౌరవ పూర్వకంగా ప్రవర్తిస్తారు తప్ప లోకువతనంగా మాట్లాడరు. సుమన చీప్‌గా మాట్లాడేసరికి జగన్నాధరావు పౌరుషం తీవ్రంగా గాయపడింది.

"అవసరమా! నాకు నీతో అవసరము తీరిందా! అదేమిటో వివరించు చెబ్తాను." అన్నాడు తీవ్రంగా. ఇన్నాళ్ళ సాహచర్యంలో అతనిలోని ప్రేమనీ ఆవేశాన్ని పొందగల్గింది సుమన. అతని స్వరంలోని తీక్ష్ణతకు కంగారు పడింది.

"అదే! శరీర సుఖం...." నసిగింది.

"సుమా! నీవు పొరబడుతున్నావు. అది ఒక అవసరంగా నేనే నాడూ ఆరాటపడలేదు. నీవు అంది వచ్చేవు. ఆనందించాను. దానికి నేనే నాడూ కట్టుబడి వుంటాను. ఇంక సంఘ పరంగా మన సాహచర్యంకు ఒక రూపు ఇవ్వటం సంగతి నేను ఆలోచించక పోలేదు. అందుకనే నళిని స్కూల్ పెట్టాననగానే తల ఊపాను. నీకూ ఏదో వ్యావృత్తి వుంటుందని నీ ఆర్థిక పోషణ అంతా భరిస్తున్నాను. ఇంకేం చేయాలి? పెళ్లి అంటావా! పెళ్లికి చాలా ఆటంకాలున్నాయి. నళిని వుండగా మనం పెళ్లి చేసుకుంటే లోకం దృష్టిలో మన అపరాధం రెట్టింపు అవుతుంది. ఏం వంక పెట్టను నళినికి! ఆమె చదువులో సంస్కారంలో అందంలో గుణంలో ధనంలో అన్నిటా నీకన్నా ఎక్కువ స్థాయిలో వుంది. ఏ ఆధారంతో ఆమెకూర్చున్న కుర్చీ కాళ్లు విరగ గొట్టగలను!" అన్నాడు జగన్నాధరావు.

సుమనకు వళ్ళు జలదరించింది. నళిని అన్నిటా తనకన్న ఉన్నతమయినదిట! అలాంటి ఆరాధనే వుంటే తననెందుకు నిలువునా ముంచాడు ఈ మానవుడు? ఏ వంకా లేని భార్య వుండగా పరాయి పిల్లతో ప్రేమ మాటలు మాట్లాడే పురుషులు ఏ జాతికి చెందుతారు?

"అయితే నన్నేం చేయమంటారు!" అంది సుమన.

"అదే ఆలోచిస్తున్నాను సుమా. నీ మీద అభిమానం లేకుండా నిన్ను నేను ముట్టుకోలేదు. ఆ క్షణంలో నాకు ఇది వక సమస్యగా తోచలేదు. ఏదో విధంగా కక్షకట్టి నళినిని వదిలించుకోవాలన్నంత తీవ్రమయిన కసి, నాకు నళిని పట్ల పెరగటంలేదు. ఆమె శాంతస్వభావి. తనని కూడా ఆలోచించమంటాను." సుమన నిటారుగా కూర్చుంది. "ఏమిటీ మీరన్నది!" అంది.

"అదే! మన సమస్య నళినికి చెబుతాను. ఆమె ఏమి చేయమంటే అది చేద్దాం" అన్నాడు.

"మీకు లేకున్నా నాకు మానాభిమానాలున్నాయి. నీ మొగుడ్ని నాకు ఇయ్యి అని నేను బిచ్చమడగవలసిన పరిస్థితి నాకు వద్దు. ఆమె ముఖం ఇంక నేను ఎల్లా చూడగలను! అంతకన్నా ఇంకో పరిష్కార మార్గం నేనే చెబ్తాను వినండి."


"ఏమిటది!"

"ఆమెకు పిల్లలులేరు. ఇంత ఆస్తికీ వారసులు లేరు. కనుక ఆమెను మీ పునర్వివాహానికి సమ్మతి పత్రంవ్రాసి ఇమ్మనండి. ఇస్తుంది అప్పుడు మీరు మా వాళ్ళతో సంప్రదించి పెళ్లి చేసుకోవచ్చును."

"అంత మాట నేను తనని అని నలుగురి ముందూ నేను హీనపరచలేను సుమా! ఏమంటే అనుకో! అంత అవమానం తనని చేయగల కఠినత్వం నాకు లేదు." అన్నాడు బాధగా.

"వున్న మాటేగా! నలుగురూ అనుకున్నదేగా! పెళ్ళయి ఇన్ని సంవత్సరాలయినా బిడ్డ తల్లి కాలేకపోయిన ఆమె గొడ్రాలుగానే లెక్క-కదా! ఇందులో అవమానమేముంది. ఆమె బాధపడాల్సిన అవసరమేముంది! మా అక్క మా చెల్లెలికి భర్తనిచ్చి చేయలేదా!"

"మీ అక్క రోగిష్ఠి మనిషి. ఇంక సంసారం చేయగల్గిన శరీరస్థితి ఆమెకు లేదు.



పంచభక్ష్య పరమాన్నాలతో నిండిన వెండి పళ్ళెంలాంటి జీవితం నళినిది. అంత కౄరంగా నా లాలసకు ఆమెని బలిచేయటం భగవంతుడు మెచ్చడు,"

"ఈ బుద్ధి ముందెందుకు లేదు? అంత భార్యమీద ప్రేమానురాగాలు వరద వెల్లువలా పొంగిపోతుంటే నా మీద ఈ విషపు వల ఎందుకు విసిరారు? నేను వెలయాలుని అనుకున్నారా? నేనూ అయినింటి ఆడపిల్లను. మామూలు కన్నె మనసుతోనే నన్ను నేను మీకు మనసా వాచా అర్పించుకున్నాను. నాకూ సంఘంలో ఒక గౌరవస్థానం మీ భార్యగా కావాలి? దానికి మనం పదుగురి ఎదుటా పెళ్లి చేసుకోక తప్పదు. రహస్యంగా మీ వాంఛలు తీరుస్తూ, నలుగురిలో ఎన్నటికీ పెళ్లి కాని వృద్ధ కన్యలాగ నన్ను వుండమంటారా? మీరు నళిని గారితో చెప్పి ఒప్పించండి" అంది దృఢంగా.

"సుమనా! ఒకానొక దురదృష్టకర కాలంలో మనిద్దరివల్ల తప్పు జరిగింది. శరీర ఉద్రేకం ఇద్దరం తట్టుకోలేకపోయాం. తప్పు చేసింది మనం. అయితే శిక్ష నళినికా? నీ వల్ల బిడ్డలు పొందలేకపోయినాను కనుక, నేను సుమనని పెళ్లి చేసుకుంటాను అని ఎల్లా చెప్పను. ఇంత అఘాతమయిన విషయం ఆమెకు నేను ఎల్లా చెప్పగలను?"

"ఏం? ఆమె లోపం ఆమెకు తెలియదా?"

"లోపం ఆమె ఒక్కరిదే అవుతుందా? నా వల్లకూడా వుండవచ్చుగా? మనలో మాట సుమా? నాలుగేళ్ళనించీ మనం, శరీరసంబంధం కలిగివున్నాము. నీవు తల్లికాగల సూచనలు కనపడినాయా? ఇప్పుడయితే ఈ లోపాన్ని ఇద్దరం పంచుకుంటున్నాము. నిన్ను అందరి ఎదుట నళినిలో ఈ లోపం వున్నది కనుక, పెళ్లి చేసుకుంటున్నాను అని చేసుకుంటా ననుకో? నాలుగయిదేళ్ళు గడిచినా నీవు సంతానవతివి కాకపోతే, నలుగురూ నా ముఖంమీదే ఇంకోదాన్ని కూడా కట్టుకుంటావా? అని అడగరా?" అన్నాడు.

(ఇంకా వుంది)

"అబ్బబ్బ! ఈ ట్రాన్స్‌ఫర్ల ఉద్యోగం అంత అవస్థ అదే కాని మరోటిలేదు!" అంది ఉమ అలమారుల్లో సామాన్లు సర్దుతూ.

"ఏవిటి రాణీగారు సామాన్లు సర్దుతూ సణుక్కుంటున్నారు?" అన్నాడు హాల్లోంచి వంటింట్లోకి నవ్వుతూ వచ్చిన ప్రసాద్.

"మీకు చిరునవ్వులుగానే ఉంటుంది. ఏడాదికి ఒకమారు ట్రాన్స్‌ఫర్ అంటూ కాగితం ఒకటి పట్టుకొస్తూ ఉంటారు. ఈ సామాన్లతోటీ చంటి పిల్లలతోటీ ఊరూరా తిరగలేక చస్తున్నాను" అంది ఉమ ఉడుకుమోతుతనంతో.


"ఇదిగో చూడు ఉమా! నువ్విలా విసుక్కున్నంతలో ట్రాన్స్‌ఫర్లు తప్పుతాయి అంటావా? గవర్నమెంటు ఉద్యోగికి రెండు మూడేళ్ళకి ట్రాన్స్‌ఫర్ అనేది, అవశ్యంగా ఎదురయ్యే ఒక ఇబ్బందితో కూడిన ఇంపైన మార్పు. దీన్ని మనం సరదాగా తీసుకోవాలి కాని సీరియస్‌గా పట్టించుకొని బాధపడిపోకూడదు."

"ఇందులో సరదా ఏం ఉందండీ నా మొహం!"

"అమ్మమ్మ అలా అనకు. ఉద్యోగంలో చేరిన ఈ ఏడెనిమిదేళ్ళలోనూ ఎన్ని ఊళ్ళు చూశాం అంటావు? ఎంతమంది కొత్త కొత్త ఫ్రెండ్స్ తయారయ్యారంటావు? ఇన్ని ఊళ్ళల్లోనూ కలిసి, ఊళ్ళుచూడ్డం, కొత్త కొత్త ప్రదేశాలు దర్శించడం, కొత్త కొత్త మనుష్యులతో పరిచయాలు సంపాదించడం, వీటి అన్నిటికీ మనం పైసా ఖర్చుపెట్టక్కర్లేకుండా గవర్నమెంటువారు టి. ఏ. అనే పేరుతో మనకి సౌకర్యం ఏర్పాటుచేసి, ట్రాన్స్‌ఫర్ అనే పేరుతో యాత్రలకి పెర్మిషన్ ఇస్తూంటే ఇంతకంటే ఏం కావాలి? ఇన్ని

పోలాప్రగడ రాజ్యలక్ష్మి

ఈ బహుమతి ఎవరికి?



ఊళ్లుచూసి ఇంతమంది ఫ్రెండ్స్‌ని సంపాదించడానికి మనకి ఈ పాటికి ఎంత ఖర్చు అయేది అంటావు?''

"మీరు ఇలాంటి కబుర్లు చెప్పకండి నాకు వళ్ళు మండుకొస్తోంది."

''ఇంకా నయం మా అక్కయ్యా. వాళ్ళకి వారం పదిరోజుల క్రితమే ఈ ఊరునురచి ట్రాన్స్‌ఫర్ కావడం, వెతుక్కో నక్కర్లేకుండా వాళ్ళు ఖాళీచేస్తూన్న ఇల్లే మనకి వాళ్ళు అద్దెకి ఇప్పించడంవల్ల, ఇల్లు వెతుక్కునే బాధ ఒకటి తప్పింది మనకీ కొత్త ఊళ్లో. లేకపోతే ఈ విశాఖపట్నం మహాపట్నంలో ఇల్లు దొరికి ఉండేదా? ఇంతవరకూ నయం కదా అని సంతోషించాలి.''


"ఏం సంతోషం అండీ. ఇల్లు దొరగ్గానే అయిందా? పాలవాళ్ళూ పనివాళ్ళూ సరియైన మనుష్యులు కుదరాలి. పిల్లలకి దగ్గర కాన్వెంటుల్లో సీట్లు దొరకాలి. ఇరుగూ పొరుగుని మంచి చేసుకోవాలి, క్రొత్త స్నేహాలు ఏర్పాటు చేసుకోవాలి...."

"అబ్బబ్బ. అన్నీ అవుతాయి. నా మాట విను. జీవితంలో ఇబ్బందుల్ని ఇంపైన సంఘటనలుగానూ, సమస్యలని సరదా అయిన సవాళ్ళగానూ తీసుకోపోతే ఆనందంగా బ్రతకలేం. విసుగూ కోపం మనల్ని మోసగించి మనలో ప్రవేశించి వేరుపురుగు దొలిచినట్లు దొలిచేస్తాయి."

"సర్లెండి మీ గీతోపదేశం మీరూను. ఒక్క పని సాయం చెయ్యరుగాని ఉపదేశాలూ ఉపన్యాసాలూ మాత్రం దంచుతారు. ఈ పెద్ద డబ్బాలు రెండూ ఆ పై అలమారులో పెట్టండి. నాకు అందడంలేదు."

"చూశావా పొట్టివల్ల నష్టాలు!"

"ఆ. మీ పొడుగువల్ల లాభాలు చూస్తు



న్నాంగా రోజూ. తలకి ద్వారబంధాలు తగిలి బొప్పెలు కట్టడం." అంటూ ఉమ నవ్వింది. ప్రసాద్ కూడా పకపకా నవ్వేశాడు.

సాయంత్రం ప్రసాద్ ఆఫీసునుంచి వచ్చే సరికి ఉమ నవ్వుతూ ఎదురువచ్చి "ఓ మంచి వార్త!" అంది.

"స్టేట్ లాటరీ ఏదైనా ఫస్టు ప్రైజ్ వచ్చిందేవిటి కొంపదీసి" అన్నాడు "ఉఫ్" అని కుర్చీలో కూర్చుంటూ ప్రసాద్.

"అబ్బబ్బ. మీకెప్పుడూ డబ్బు రంధి తప్ప మరోటిలేదు కదా" అంది ఉమ కనుబొమలు చిట్లించి.

"ధనప్రాప్తి అనే వార్త కాకపోతే ఇంక ఏదైనా మనకి సాదావార్తే!... ఊ....చెప్పు" అన్నాడు ప్రసాద్ ఏ కాలి మేజోడుతీసి ఆ కాలికి సంబంధించిన బూటులో పెడుతూ.

"మాలతిగారు వచ్చిందండీ...."

"ఆవిడెవరు?...."

"అదే... మీ అక్కయ్య అప్పుడప్పుడు చెబుతూ ఉండేవారు కదా- విశాఖపట్నంలో నాకు మాలతి అని ఒక ఫ్రెండ్ ఉంది, నేనంటే భలే ప్రాణం. వారం రోజులు నన్ను చూడకపోతే ఉండలేదు. మేం ఇద్దరం కలిసి భీమిలీ, హార్బర్, సింహాచలం వెళుతూ ఉండే వాళ్ళం అని...."

"అవునవును....నాకూ ఒకటి రెండుసార్లు వాళ్ళ పిక్ నిక్స్ గురించి చెప్పి బోర్ కొట్టించింది....ఆ మాలతిగారా ఇప్పుడు వచ్చింది? సరే....బానానే ఉంది....అవునూ?....నిన్నెం ఎరుగును ఆవిడ? మనం ఈ ఊరు వచ్చాం అని అసలు ఆవిడకి ఎలా తెలుసు?"

"నేనూ అదే విస్తుపోయాను మొదట- తర్వాత తెలిసింది, మీ అక్కయ్య ఉత్తరం రాసిందిట నిన్న-ఇలా మా తమ్ముడికి వైజాగ్ ట్రాన్స్‌ఫర్ అయింది. మేం కాళీచేసిన ఇంట్లోనే ఉంటున్నారు. కొత్త ఊరు. మా మరదలికి ఎవరూ పరిచయంలేరు అక్కడ. నువ్వెళ్ళి కాస్త చూస్తూ ఉండు—అని...."

"ఇహనేం? ఈ కొత్త ఊళ్ళో నీకు రెండు రోజులు తిరక్కుండానే ఒక మంచి ఫ్రెండ్ దొరికిందన్నమాట. చూశావా? విసుక్కున్నంత సేపు పట్టలేదు - ఏవిటో కొత్త ఊరు, కొత్త వాతావరణం, కొత్త మొహాలు-అంటూ ఏక యిదయ్యావు" అని ప్రసాద్ బట్టలు మార్చుకోడానికి పడక గదిలోకి వెళ్ళాడు.

వెనకాలే వెళ్తూ "ఫ్రెండ్ సరే—రేపు ఆదివారం మన ఇద్దర్నీ వాళ్ళింటికి కాఫీకి పిలిచింది" అంది ఉమ.

బనీను విప్పుకుంటున్నవాడల్లా ఆ మట్టున ఆగిపోయి "మన ఇద్దర్నీనా?. ..... నన్ను కూడానా?" అన్నాడు ప్రసాద్.

"అవును. ఏం?"

"అహ....అదికాదు....ఆయనవచ్చి పిలవకుండా ఆవిడ రమ్మన్నంతలో నేనుకూడా నీతో బయల్దేరివస్తే...." అంటూ అర్థోక్తిలో ఆగిపోయాడు ప్రసాద్.

"ఏం? వస్తే తప్పేవిటి? ఇదే మీ మగవాళ్ళకున్న బెట్టు—మీ ఫ్రెండ్స్ ఇంటికి తీసుకెళితే మీతో నేను రాలేదూ ఎన్నిమాట్లో— ఆడవాళ్ళువచ్చి పిలవలేదనీ వాళ్ళెవరో నాకు తెలియదనే ఇలా బెట్టుచేశానా...."

"సరేనయ్యా. అలాగే వస్తాలే. ఇంతకీ ఎక్కడేవిటి వాళ్ళ ఇల్లు?"

"ఎక్కడో చెప్పిందండి ఆనమాలు."

"ఎడ్రస్ తీసుకోలేదా?"


"ఊహుఁ"

"సర్లే-ఎక్కడో తెలియకుండా, ఎవరింటికని బయలుదేరుతాం?" అని ప్రసాద్ విసుక్కున్నాడు. ఉమ మొహం ఇంత చేసుకుని చిన్న బుచ్చుకుంది.

తర్వాత ఎన్నో ఆదివారాలు గడిచాయి.

ఓ ఆదివారంనాడు సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో మాలతి, ఉమా ప్రసాదుల ఇంటికి వచ్చింది. జరీ చీర కట్టుకుని చేతిలో కుంకుమ భరిణె పట్టుకుని మెట్లు ఎక్కుతూన్న మాలతిని చూసి ఉమ నవ్వుతూ "రండి.... రండి" అంది.

"అవును. మీరు మా యింటికి వచ్చారు కాదేం?" అంది మాలతి కంఠంలో కొంచెం నిష్ఠూరం ధ్వనింపజేస్తూ.



"అప్పుడాండీ... అప్పుడూ...." అంటూ నీళ్ళు నమిలింది ఉమ.

"మీవారు లేరా ఇంట్లో?" అంది మాలతి ఇటూ అటూ పరిశీలిస్తూ.

"లేరండి. ఆఫీసులో ఏదో పని ఉందని ఇప్పుడే కాఫీ తాగి అలా వెళ్లారు."

"సరే-వచ్చేఆదివారం మా అమ్మాయి పెళ్ళి. మీరూ మీ వారూ ప్రొద్దునే కాఫీలకే అక్కడికి వచ్చెయ్యండి. మావారు కూడా వచ్చారు. బయట రిక్షాలో కూర్చున్నారు. ఉండండి. ఆయన్ని అడిగి శుభలేఖ పట్టుకొస్తాను. లోపలికి రమ్మంటే ముందు ఆయన ఉన్నారో లేదో చూసిరా అని రిక్షాలోనే కూర్చుండిపోయారు. మీవారు లేరంటే ఇంక అసలు లోపలికి రారు. తగని మొహమాటం సిగ్గూను" అంటూ గబగబా మాట్లాడేసి వీధిలోకి వెళ్ళి వాళ్ళ ఆయన్ని అడిగి శుభలేఖ పట్టుకొచ్చి ఇచ్చి, బొట్టు పెడుతూ మళ్ళీ అంది మాలతి "పెళ్ళికి తప్పకుండా రావాలి. మీ ఆయన్ని తీసుకుని మరీను. మీ ఆడబడుచుకి శుభలేఖ వేశాను. వస్తే ఆవిడ కూడా వస్తుంది"

ఓ ప్రక్కనుంచి వ్రేళ్ళతో కుంకం బొట్టు సరిజేసుకుంటూ మరో ప్రక్కనుంచి శుభలేఖలో ఉన్న కళ్యాణ మంటపం పేరు, ఒకటికి రెండుసార్లు కూడబలుక్కుని చదువుకుంటూ "అలాగే వస్తాం. తప్పకుండా" అంది ఉమ.

ఆ రాత్రి ఉమ, ప్రసాద్‌కి జరిగిందంతా చెప్పి "ఉండండి శుభలేఖ తెస్తాను. అలమారులో పెట్టాను" అంటూ మంచం మీంచి లేవబోయింది.

"జాగ్రత్త చేశావు కదా, పొద్దున్న చూసుకుందాం లే" అంటూ ఆమె జబ్బపట్టుకుని ఆపాడు ప్రసాద్.

"తప్పకుండా వెళదాం అండీ పాపం, ఆవిడ మరీ మరీ చెప్పింది. ఆయన కూడా వచ్చారు. మీరు ఇంట్లో ఉంటే పిలుద్దాం అని...."

"అలాగే వెళదాం అన్నానుగా" అంటూ ప్రసాద్ లైటు ఆర్పి ఫేన్ స్విచ్ వేశాడు,

అనుకున్న ప్రకారం శనివారం సాయంత్రమే పెళ్ళి కూతురికి బహుమతిగా ఇవ్వడం కోసం స్టీలు ప్లేటూ కప్పూ పట్టుకొచ్చాడు ప్రసాద్. తీరా ఆదివారం ప్రొద్దుటే పిల్లల కిద్దరికీ నీళ్లు పోసి మంచి బట్టలు తొడిగి తను పట్టు చీర కట్టుకుని ఉమ ముస్తాబయేసరికి, కుర్చీలో

కూర్చుని బద్ధకంగా వళ్ళు విరుచుకుంటూ "నేను రావాలంటావా?" అన్నాడు ప్రసాద్.

"అదేవిటండీ మళ్ళీ?" అంది ఉమ నిరుత్సాహంగా.

"అదికాదు ఉమా! నీకు కనీసం ఆవిడ ఒక్కరేనా తెలుసు, నాకు ఎవరూ తెలియదు. ఎలా రావడం ఈ పెళ్ళికి? నాకు మొహమాటంగా ఉండదూ? పోనీ నువ్వు వెళ్ళు పిల్లల్ని నేను చూస్తాను." అన్నాడు ప్రసాద్. ఉమకి ఉడుకుమోతుతనం వచ్చింది. "మీ మగవాళ్ళు ఎప్పుడూ ఇంతే. పోనీ సరదా పడుతోంది తీసుకు వెళదాం అని లేదు" అంది.

"మగవాళ్ళని అందరినీ కలిపి అనేస్తున్నావు. ఎంతమంది మన స్తత్వాలు తెలుసేవిటి నీకు?" అన్నాడు ప్రసాద్ కొంటెగా.

"ఒక మాటంటే పది అర్థాలు తీస్తారు" అని అలిగి అక్కడనుంచి వెళ్ళబోయింది ఉమ.

"సరే నడు" అంటూ పిల్లల్ని తీసుకుని ప్రసాద్ ఉమా సమేతుడై బయలుదేరబోయి వెంటనే ఆగి, "ఏదీ? ఆ శుభలేఖ ఏదీ?" అన్నాడు.

ఉమ అలమారంతా వెదికింది. శుభలేఖ కనిపించలేదు. రేడియో ప్రక్కని చూసింది. ఉహుఁ!....పరుపు క్రింద దాచిన జ్ఞాపకం అంటూ పరుపు తిరగేసింది. మళ్ళీ అలమారు దగ్గిరికి వచ్చింది.

వెదకడంవల్ల నుదురంతా చెమటపట్టి ముఖాన రాసుకున్న పౌడరు చారికలుగా మారడం చూసి జాలితో "ఊ....సరే....శుభలేఖ లేకపోతే ఏం లే—మొత్తానికి వెంకటేశ్వర కళ్యాణమంటపం అని గట్టిగా జ్ఞాపకమేనా?" అన్నాడు ప్రసాద్.

"అవునండీ—నాకు బాగా జ్ఞాపకం—అయితే అది ఎక్కడుందో మరి...."

"ఆ సంగతి రిక్షావాడో ఆటోవాడో చూసుకుంటాడు. నువ్వు ముందు ఇంటికి తాళంవేసి బయల్దేరు........"

ఉమా ప్రసాద్‌లు ఆటో రిక్షా వాడికి డబ్బిచ్చి ఇద్దరూ చెరో కుర్రాడినీ తీసుకుని వెంకటేశ్వర కళ్యాణమంటపం ముందున్న శామియానాలోకి అడుగు పెడుతూండగానే, ఒకళ్ళిద్దరు మగవాళ్ళువచ్చి ప్రసాద్‌ని మగవాళ్లు కూర్చున్న కుర్చీల దగ్గరకు తీసికెళితే ఇద్దరు అమ్మాయిలువచ్చి ఉమని మరోవైపు తీసుకెళ్ళారు. అంతా కొత్తవాళ్లు. తెలిసిన వాళ్ళెవరూ ఉండరని ముందే సిద్ధం కావడంవల్ల ఉమ, ప్రసాద్ ఏం ఇబ్బంది పడలేదు. ఉమ మాత్రం మాలతిగారు ఎప్పుడు కనిపిస్తారా అని ఎదురు చూస్తోంది.

కాఫీ ఫలహారాలు పుచ్చుకోవడం అయింది. పిల్లలిద్దరూ ఉమా ప్రసాద్‌ల మధ్య వారధిలా తిరుగుతున్నారు.

పట్టు చీరలూ టెర్లిన్ పాంటులా, జరీ చీరలూ అటూ ఇటూ హడావిడిగా కదులుతున్నాయి. కబుర్లు, కేకలు, హెచ్చరికలు - జోక్స్-లోకాభిరామాయణం - పకపకలు-మల్లె పువ్వుల వాసనలు అగరు వత్తుల పరిమళాలు. ఓహ్! పెళ్లి హడావిడి ఝామ్మంటూ ఉంది.

బేండ్‌వాళ్ళు హెచ్చు స్థాయిలో పాట అందుకున్నారు.


ఎదురుగా పెళ్ళికోసం అని అందంగా కట్టిన చిన్న మందిరం, ఖాళీగా ఉంది. ఇంకా పెళ్ళికూతురూ, పెళ్ళికూతురు తల్లీ తండ్రీ, పెళ్ళికొడుకూ లోపలినుంచి ఇవతలకి రాలేదు. పురోహితుడు మాత్రం పీటలూ పళ్లేలూ సర్దుతున్నాడు.

తెలిసిన వాళ్ళెవరూ లేక, ఎవరితో మాట్లాడాలన్నా మొహమాటపడుతూ ఉమ ఇబ్బందిగా వుంది కాని, అక్కడ ప్రసాద్ మాత్రం చుట్టూ ఉన్న నలుగురైదుగురితో మాటలు కలిపి హుషారుగా కబుర్లు చెబుతూ నవ్వుతూ కాలక్షేపం చేసేస్తున్నాడు.

ఉమని చూసి "ఆడ పెళ్ళివారి తరపు కాబోలు" అనుకుంది ఒకామె, మరొక ఆమె "మగ పెళ్ళివారి తరఫేమో" అని పలకరించడానికి జంకింది.

"మాలతిగారు కనిపిస్తే బాగుండును. ఎలాగా కన్యాదానపు పీటల మీదకి వచ్చి కూచుంటారుగా?" అనుకుంటూ ఇటూ అటూ

(వి)చిత్ర విజ్ఞానం



1930లో మిన్నెసోటాలో పురావస్తుశాఖవారు 10 వేల సంవత్సరాల నాటి మానవుడి అస్థిపంజరాన్ని వెలికి తీశారు. దాని ప్రత్యేకతనుబట్టి దానికి "మిన్నెసోటా మాన్" అని పేరు పెట్టారు. దానిని పరీక్షించగా అది ఆనాటి ఒక స్త్రీ అస్థిపంజరం అని తెలిసింది. దీనితో మిన్నెసోటా మహిళలు దానికి "మిన్నెసోటా వుమన్" అని పేరు పెట్టాలని పోరాడి 1976లో చట్టరీత్యా సాధించారు!

కుర్చీలో ఇబ్బందిగా కదులుతూన్న ఉమ కళ్ళు హఠాత్తుగా పెళ్ళి మండిరం వైపు తిరిగి ఆ మట్టున అక్కడ ఆగిపోయాయి.

పెళ్ళి కుమార్తెని తీసుకువచ్చి కూర్చో పెట్టారు.

ఆమె ప్రక్కనే ఆమె తల్లి దండ్రులు కూడావచ్చి కూర్చున్నారు.

అడ్డంగా కట్టిన తెర అవతల పెళ్ళి కొడుకు కూర్చుని ఉంటాడు.

కాని....కాని....పెళ్ళి కుమార్తె ప్రక్కని కూర్చున్న ఆమె మాలతిగారు కాదే! మళ్ళీ మళ్ళీ పరకాయించి చూసింది ఉమ.

అబ్బే. ఆవిడ మాలతిగారు కాదు....అనుమానంలేదు. మరయితే. ఇది ఇంకో పెళ్ళా? మాలతిగారు చెప్పిన కళ్యాణమంటపం ఇది కాదా? అయినా అనుమాన నివృత్తికోసం ఉమ తన ప్రక్కన కూర్చున్న ఒక ముత్తైదువని అడిగింది "పెళ్ళికూతురు ప్రక్కని కూర్చున్న ఆవిడ ఎవరండీ?" అంటూ.

ఆవిడ ఉమని ఎగాదిగాచూసి "అదేవిటమ్మా అలా అడుగుతావు? ఇంకెవరు కూర్చుంటారు ప్రక్కని? ఆ అమ్మాయి తల్లే ఆవిడ. మీరు మగపెళ్ళివారి తాలూకా?" అంది.

ఉమకి తేళ్ళూ జెర్రులూ ప్రాకాయి.

మగవాళ్ళు కూర్చున్న వైపు పరకాయించి, ప్రసాద్‌కి చేత్తో సంజ్ఞ చేసింది ఉమ "లేవండి వెళ్ళి పోదాం" అని.

ప్రసాద్ చూశాడు కాని ఏం సమాధానం ఇయ్యకుండా అటు తిరిగి ఎవళ్ళతోటో పకపక నవ్వుతూ మాట్లాడుతున్నాడు. కొడుకు ద్వారా కబురు చేసింది "అమ్మ పిలుస్తోంది. అలా ఓమాటు రమ్మంటోంది" అని.

"ఉహూ. నేను రాను" తిరిగి కబురుచేశాడు.

ఉమకి మతిపోయింది, అసలు పెళ్ళికే రానన్న పెద్ద మనిషి ఇలా మొండికేసుకుని కూచున్నారేవిటి చెప్మా అని. ఏదోమాట చెప్పాలట. అమ్మ ఎందుకో రమ్మంటోంది అని మళ్ళీ మళ్ళీ కబురు చేశాక విసుగ్గా కుర్చీలోంచి ప్రసాద్ లేచాడు. జనం ఎక్కువగాలేని ఒక మూలకివచ్చి నుంచుంది ఉమ. ఆమెని సమీపిస్తూనే విసుగ్గా "ఏవిటి ఇందాకటినుంచీ ఆ సంజ్ఞలూ కబురు పంపడాలూను?" అన్నాడు ప్రసాద్.

"మనం మాలతిగారి ఇంట్లో పెళ్ళికి కాదండీ వస్తా."

"నీకేమైనా మతిపోయిందా ఏవిటి?"

"అవునండీ. ఇది ఇంకెవరింట్లో పెళ్ళో."

"ఇది వెంకటేశ్వర కళ్యాణ మంటపమే కదా. ఇక్కడే అని కదా నువ్వు చెప్పింది?"

"నేను ఆపేరు విషయంలో ఏదో పొరబాటు పడి ఉంటాను."

"అయితే ఇప్పుడేం చెయ్యమంటావు?"

మరో ప్రపంచానికి దారి యిటు...

తరతరాల దాస్యాంధకారంలో తల్లడిల్లిన దేశంలో తాత్కాలికంగా పేదరికం పీడించవచ్చు. మనుషులు పేదలైనా మనసులు పేదవి కావు, అవి నిత్య సంపన్నలు.

బాపూజీ పదేపదే చెప్పినట్లు మన ప్రగతి చెట్టు వ్రేళ్ళు పల్లెసీమల్లో పాదుకొని వున్నాయి.

గ్రామీణులు, నిరుపేద గ్రామీణులు, సన్నకారు, బలహీన వర్గాలకు చెందిన రైతులు, అంతో యింతో కాస్త్ఫా ని వ్యవసాయం చేస్తూన్న రైతులు—వీరే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అన్నపూర్ణ చేతి పూర్ణకుంభం నింపుతున్న నిరతాన్నదాతలు.

ఈ కష్టజీవుల జీవన సరళిని మెరుగు పరిచేందుకు రాష్ట్రప్రభుత్వం కంకణం కట్టుకుని వుంది.

ఈ బృహత్తర లక్ష్యంలో భాగంగా 2½ ఎకరాల మాగాణిగాని, 5 ఎకరాల మెట్టభూమిగానీ వున్న సన్నకారు రైతులకు భూమిశిస్తు మినహాయించింది; పొలాలకు నీటి ఖర్చులు మాత్రం వుంటాయి—అంతే.


ఇటీవల భూమి స్వాధీనమైన అసంఖ్యాక బలహీన వర్గాల వారికి లక్షలాది మంది తదితర సన్నకారు రైతులకు భుజం తట్టి ప్రభుత్వం యిచ్చిన ప్రోత్సాహం యిది.

ఆంధ్రప్రదేశ్ రైతాంగం అంతా కొత్త ఆశలతో హలం పట్టారు.

మరో ప్రపంచానికి దారి యిటు.......!

డైరెక్టరు, సమాచార, పౌరసంబంధ శాఖ,
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, హైదరాబాదు.

17/78-79



"పోదాం పదండి."

"ఎక్కడికి?"

"ఇంటికి."

"ఊహుఁ ...నేను రాను. పెళ్ళికంటూ బయలుదేరాం- బహుమతి కూడా తీసుకుని వచ్చాం. ఇంక వెనక్కి వెళ్ళేదిలేదు. మాలతిగారి అమ్మాయి కానీ మరో మనోహరంగారి అమ్మాయి కానీ. ఎవరైతే ఏం కాక? పెళ్ళి అయేదాకా ఉండవలసిందే. పెళ్ళికూతురికి తెచ్చిన బహుమతి ఇచ్చి వెళ్ళవలసిందే!"

"ఇదేం మంకుపట్టు అమ్మా. సంబంధం లేని వాళ్ళెవరికో బహుమతి ఇస్తాం అంటారు. ఆసలా చుట్టూ కూచున్న మగాళ్ళెవరో మిమ్మల్ని పొగుడు తున్నారనుకుంటాను. అందుకే ఉబ్బి తబ్బిబ్బయి పెళ్ళి అయేదాకా ఉందామనీ, పెళ్ళి కూతురికి బహుమతి ఇద్దామనీ అంటున్నారు. లేకపోతే ఈ పెళ్ళికీ మనకీ సంబంధం ఏవిటి?" అంది ఉమ కోపంగా.

"పోనీ అలాగే అనుకో" అని పెంకితనంగా అనేసి, మళ్ళీ తను కూర్చున్నచోటు వైపు అడుగు కదిపాడు ప్రసాద్.

ఇంతలో పందిట్లో ఒక్క ఉరుము ఉరిమి మెరుపు మెరిసినట్లయింది. కళ్యాణమంటపంలో ఏదో ప్రళయం వచ్చినట్లు అంతా గందరగోళంగా ఉంది. "అంతా ఇలా కంగారుగా లేచి నుంచుంటున్నారేవిటి చెప్మా" అని ఉమా ప్రసాదులు అటు చూశారు.

పద్దెనిమిది ఇరవై ఏళ్ళ అమ్మాయి. సామాన్యమైన అందంతో ఆకర్షణీయంగానే ఉంది.

కోపంతో మొహం అంతా జేవురించి బుగ్గలు అదురుతూ పెదవి కంపిస్తోంది. కళ్ళు రెండూ మాత్రం వచ్చే కన్నీటిని ఆపుకోవడం వల్ల నీటికుండల్లా ఉన్నాయి.

కళ్యాణ మంటపంలో పెళ్ళి కొడుక్కీ పెళ్ళి కూతురికీ మధ్య నిలబడి ఏదో గట్టిగా చెప్తోంది.

ఆమె కంఠంలో ఓమారు దైన్యం, ఓమారు క్రోధం, ఓమారు దుఃఖం, అవమానం మార్చి మార్చి వినిపిస్తున్నాయి. అందరితోబాటు ఉమా ప్రసాద్ ఇద్దరూ కూడా ఆ అమ్మాయి చెప్పేది శ్రద్ధగా వినసాగారు.

"అయ్యా అంతా దయచేసి వినండి. ఇప్పుడు పెళ్ళి కొడుకుగా ఈ పీటలమీద కూచున్న రామారావు, అయిదారు నెలల క్రితం దాకా మా ఊళ్ళో రాంబాబుగా ఉద్యోగంచేస్తూ ఉండేవాడు. అప్పుడు మా యింట్లోనే ఒక గదిలో

ఉంటూ మంచి మాటలతో మా అమ్మని నమ్మించి నన్ను పెళ్ళి చేసుకుంటానని మోస గించాడు...."

"ఆ ..." అంటూ పెళ్ళి కూతురుతో సహా పందిట్లో ఉన్న వాళ్ళంతా విస్తుబోయి పెళ్ళి కొడుకు వైపు చూశారు.

"నాకిది ఎవరో తెలియదు." అన్నాడు పెళ్ళి కొడుకు బింకంగా.

"ఏవిటి తెలియదూ?....నా మొహంకేసి చూసి మాట్లాడు....నన్ను బీచ్‌కీ, పిక్నిక్‌లకీ, సినీమాలకీ తీసికెళ్ళలేదూ? తప్పకుండా పెళ్ళి చేసుకుంటానని నువ్వు నాకీ ఉంగరం ఇవ్వ లేదూ?" అంటూ ఆమె తన వ్రేలిని ఉన్న పేరు చెక్కిన ఉంగరం అతనికి చూపించింది.

పెళ్ళి కొడుకు ఆ ఉంగరాన్ని చేజిక్కించు కొనే లోపుగా, పెళ్ళి కూతురు చటుక్కున ఆ ఉంగరాన్ని లాక్కుని దానిమీద 'రాంబాబు' అని రాసి ఉన్న అక్షరాలని పరిశీలించసాగింది.

పెళ్ళి కొడుకు "అబద్ధం" అంటూ ఇబ్బం దిగా అరిచాడు....

"అయితే ఇదీ అబద్ధమేనా? నువ్వూ నేనూ కలిసి తీయించుకున్న ఫోటో" అంటూ జాకెట్ లోంచి ఒక ఫొటో తీసింది. వెంటనే పెళ్ళి కొడుకు పీటలమీంచి కోపంగా లేచి ఆమె చేతి లోంచి ఫోటో లాక్కుని రెండు ముక్కలుగా చింపేయ బోతూంటే పెళ్ళికూతురు "ఆగు" అంటూ అపర దుర్గలా అరిచింది.

పెళ్ళి కొడుకుతోబాటు పెళ్ళి వాళ్ళంతా ఆమె కంఠంలోని తీవ్రతకి అదిరిపడ్డారు.

"మీరంతా పెద్దలు. ఈ పెళ్ళి జరిగితే నాకు పెద్ద అన్యాయం అయిపోతుంది. అమ్మా, నీ పెళ్ళికి అడ్డం వచ్చానని ఏం అనుకోకు-ఈ పెద్ద మనిషి మొదట నా భర్త అయ్యాకే నీ భర్త అవుతున్నాడమ్మా. నా పరిస్థితి ఆలో చించు. . కాదూ కూడదంటే నీ చేతుల్తో నాకు కాస్త విషం ఇచ్చి ఆ పైన ఇతని చేత తాళి కట్టించుకో" అంటూ ఆ అమ్మాయి వలవలా ఏడ్చేసింది.

ఒక్క క్షణం ఆగి, వెంటనే పీటలమీంచి పెళ్ళి కూతురు లేచింది. లేచి "అమ్మా.... మరేం ఫరవాలేదు....కూర్చో....నా స్థానంలో అలా కూర్చో" అంది గంభీరంగా.

ఎవరికీ ఏం అర్థం కాలేదు.

"వాయించండోయ్ భజంత్రీలు" అంది పెళ్ళి కూతు.

అందరూ భ్రమాన్పడి చూస్తున్నారు.

దిక్కులు చూస్తూ కంగారు పడుతూ అక్కడినుంచి మొహం చాటెయ్యడం ఎలాగా అని ఆలోచిస్తూన్న పెళ్ళి కొడుకుని గద్దిస్తూ "ఊ-కట్టవయ్యా. ఆ అమ్మాయి మెళ్ళో తాళి కట్టు" అంది పెళ్ళి కూతురు.

పెళ్ళికొడుకు తటపటాయించాడు.

"మర్యాదగా, కట్టు"—ప్రళయ గర్జనలా ఉంది ఆమె కంఠం.

అంతే....పెళ్ళి కొడుకు కిక్కురు మనలేదు.

"అందరూ అక్షింతలు జల్లండి."

ఈమారు కిక్కురు మనకుండా చెప్పినట్లు చెయ్యడం, చుట్టూనుంచున్న పెద్దలవంతు అయింది.

"వెయ్యి, అక్షింతలు" అన్నాడు నవ్వుతూ ప్రసాద్.


"చాల్లెండి నడవండి. మంచి పెళ్ళికివచ్చాం" అంది ఉమ విసుగ్గా.

"నిజంగా మంచి పెళ్ళికే వచ్చాం. ఇదిగో ఈ బహుమతి పట్టికెళ్ళి ఇయ్యి" అంటూ ప్రసాద్ ఉమ చేతిలో కప్పూ ప్లేటూ ఉంచాడు.

"ఎవరికి? ఈ కొత్త పెళ్ళి కూతురికా?"

"అబ్బెబ్బే—తాళికట్టించుకున్న ఈ అమ్మా యికి కాదు. సాటి స్త్రీ బాధని అర్థం చేసుకుని మనోబలంతో తగిన సమయంలో తగిన నిర్ణయం తీసుకొని, ఇలాంటి మోసగాడికి తగిన గుణపాఠం నేర్పిన, ఆ పెళ్ళి తప్పి పోయిన పెళ్ళి కూతురికి" అన్నాడు ప్రసాద్.

"పెళ్ళి చేయించిన పెళ్ళి కూతురికి ఏవిటి?" అని ఒక్క క్షణం అనిపించినా, మళ్ళీ అదే సమంజసం అయిన నిర్ణయం అని నిశ్చయించు కుని, "రండి ఇద్దరం పట్టి కెళ్ళి ఇద్దాం" అంది ఉమ, ఒక పెళ్లి కూతురికి అని తెచ్చిన బహు మతిని, మరో పెళ్ళి ఆగిపోయిన పెళ్ళి కూతు రికి అభినందనపూర్వకంగా అందించడానికి □



కారు డిక్కీ తెరిచి, జాకీ ఎత్తడానికి ఉపయోగించే ఇనపరాడ్ అందుకున్నాను. తిరిగి డిక్కీమూసి, డ్రయివింగ్ సీట్ వేపు నడిచేను.

డోర్ లాగి, ఆ రాడ్ ని కాళ్ళదగ్గర, క్లచ్ - బ్రేక్ ఉండేచోట రెడీగాపెట్టేను. సెకెండ్ సీట్లో కూర్చుని ఎవ్వరయినా కిందికిచూస్తే, చీకట్లో అది కనిపించే అవకాశం లేదు.

తిరిగి డోర్ మూసి, రిస్టువాచీ చూసుకున్నాను. పాత డొక్కువాచీ అది. మసక చీకట్లో డయల్ సరిగా కనిపించి చావడం లేదు.

దుకాణాల్లో వెలుగుతున్న ట్యూబ్ లైట్స్ వైపు తిరిగి చూసుకున్నాను. రాత్రి తొమ్మిదింబావు!

అది మోజంజాహీ మార్కెట్ ప్రాంతం. రోడ్డు కిరుపక్కలా రకరకాల దుకాణాలు వున్నాయి. తొమ్మిది గంటలకి దుకాణాలు మూసేస్తారు గనక యజమానులూ- గుమాస్తాలు, నౌఖరులూ ఇళ్ళకివెళ్ళే ప్రయత్నంలో నిమగ్నమై వున్నారు.

అందరిలాగే మా యజమాని, సేఠ్ చందన్ లాల్ కూడా యింటికి వెళ్ళే ప్రయత్నంలో వున్నాడు. కాగితాలూ, ఫైళ్ళూ, డబ్బూ, నగలూ తన చిన్నసైజు బ్రీఫ్ కేసులో సర్దుకుంటున్నాడు.

ఆ బజార్లో అతనికి పెద్దతాకట్టు దుకాణం వుంది. బాగానే సాగుతుంది వ్యాపారం. పగలంతా వచ్చేపోయే జనంతో సందడిగావుంటుంది.

నగా నట్రా, ఇళ్ళూ వాకిళ్ళూ, పొలాలూ గాక, రిక్షాలు సయితం అక్కడ కుదువబెట్టుకోబడతాయి. మధ్యతరగతి జీవులకి అర్జంటుగా ఏం ముంచుకు వచ్చినా, సేఠ్ చందన్ లాల్ ఆపద్బాంధవుడిలా కనిపిస్తాడు.

ఉదయం తొమ్మిది గంటలనుంచి రాత్రి తొమ్మిదిగంటల వరకూ వ్యాపారం చూసుకుని ఆరోజు పోగయిన వెండి బంగారు నగలూ, రిస్టువాచీలు, ప్రామిసరీనోట్లు, డబ్బూ గట్రా బ్రీఫ్ కేస్ లో సర్దుకుని కారులో ఇంటికి బయలు దేరుతాడు.

నేనతని కారు డ్రయివర్ని. అంతక్రితం తనే స్వయంగా కారు నడుపుకునే వాడతను. ఏడాది క్రితం అతని కుడికాలి మోకాల్లో బోన్ టి. బి. వచ్చి, ఆపరేషన్ జరిగింది.

ఆ కాలితో బ్రేక్ వత్తలేడు గనక, డ్రైవర్ కావాలని పేపర్లో ప్రకటిస్తే వచ్చి చేరేను. భోజనంపెట్టి వంద రూపాయలిస్తాడు. నా

నివాసం కారు గేరేజ్‌లోనే. ఇంకా పెళ్ళి జేసుకోలేదు. ఈ రోజుల్లో ఈ బ్రతుక్కి ఇహ పెళ్ళికూడానా!

బీడీ అంటించి, కారు మడ్‌గార్డ్ నానుకుని దుకాణంవైపు చూస్తున్నాను, ఆ రోడ్ రోలర్ ఎప్పుడు వస్తాడా అని.

కాసేపటికి షాప్‌కు తాళంవేశారు గుమాస్తాలు. చందన్‌లాల్ ఒక్కో తాళాన్నీ లాగి లాగిచూసి, సరిగ్గా వున్నాయన్నట్టు తలూపి మెట్లు దిగేడు.

అతని వెనకే ఇద్దరు గుమాస్తాలూ, ఓ నౌఖరూ దిగి సేఠ్‌కు నమస్కారాలుపెట్టి తలో దిక్కు వెళ్ళిపోయేరు. చందన్‌లాల్ గుండ్రాయి లాటి బొజ్జ ఊపుకుంటూ కారు దగ్గరికివచ్చాడు.

ఫ్రంట్ డోర్ తెరిచి పట్టుకొన్నాను.

అతి కష్టంమీర లోనికి దూరి, బ్రీఫ్‌కేస్ ఒళ్ళో పెట్టుకు కూర్చున్నాడు. డోర్‌మూసి డ్రైవింగ్ సీట్లో కూలబడ్డాను. సెల్ఫ్ స్టార్టర్ లాగి, గేర్‌మార్చి, కారు ముందుకు పోనిచ్చాను.

రాణీగంజ్ దగ్గరుంది అతని ఇల్లు.

లిబర్టీ టాకీసు దాటేక, ఓ విశాలమైన రోడ్డు వస్తుంది. ఆ రోడ్లో దుకాణాలూ అవీ ఏమీ వుండవు. లైట్ల వెలుతురూ అంతంత మాత్రమే!

రోడ్డు మధ్య నడుస్తున్న కారు స్పీడ్ స్లో జేసి, రోడ్డు పక్కకి తీసికెళ్ళి ఆపేను.

"ఏం జరిగింది?" అడిగేడు చందన్‌లాల్.

"ఫ్యూయల్ సరిగ్గా అందడంలేదు. ఏర్‌లాక్ అయిందేమో చూస్తాను." అన్నాను ఇంజన్ ఆఫ్‌జేసి.

"త్వరగా చూ డు. ఆకలవుతోంది." అన్నాడు.

కిందికి వంగి, చేత్తో తడుముతూ, అంత క్రితం అక్కడ రెడీగా పెట్టిన ఇనపరాడ్ అందుకున్నాను.

"ఏమిటది?" అడిగేడు చందన్‌లాల్.

"ఇదా? స్పేనర్!" అంటూ కణతమీద ఒక్కటి ఇచ్చేను,

చందన్‌లాల్ అ షాక్‌లోంచి తేరుకోక ముందే, శక్తికొద్దీ మరోటి ఇచ్చేను. ఉన్నట్టుండి అలా మెరుపు దెబ్బలు తీస్తానని అతను కలలో కూడా ఊహించి వుండడు. కిక్కురు మనకుండా తల పక్కకి వాల్చేశాడు.

రాడ్ కిందపెట్టి, కారు స్టార్ట్‌జేసి, వేగంగా ముందుకు పోనిచ్చేను. పావు గంటలో అతని ఇంటి కంపౌండ్‌లోకి తిప్పాను. కంపౌండ్ పక్కనే వుంది గారేజ్!

రివర్స్ గేర్‌వేసి, కారు గారేజ్‌లోకి తీసి కెళ్ళి ఆపేను. ఇంజన్ ఆఫ్ జెయ్యకుండా కారు దిగి, చందన్‌లాల్ కూర్చున్న వైపు వెళ్ళి, డోర్ తెరిచి, అతి కష్టంమీద అతన్ని కిందికి లాగేను. పిండి బస్తాలా దొర్లేడు. అతని ఒళ్లోంచి బ్రీఫ్‌కేస్ అందుకుని కార్లో పడేసేను.

గబ గబ గారేజ్ మూల వున్న ట్రంకు పెట్టెలో నా సామాను సర్ది, దాన్నికూడా కార్లో పడేసి, స్టీరింగ్ ముందు కూర్చున్నాను. కారు గారేజ్ బైటికి తీసి ఆపేను.

జాగ్రత్త కోసం చుట్టూ చూసేను, కార శబ్దం విని ఇంట్లోంచి ఎవ్వరైనా బైటికివచ్చార అని. ఎవ్వరూ కనిపించలేదు.


రెప్పపాటులో కారు దిగి, గారేజ్ తలుపుల మూసి, ఇవతల గడియపెట్టేను. మరో అరగంటవరకూ చందన్‌లాల్‌కు స్పృహరాదు ఆలోగా నేనీ పరిసరాల్లో ఉంటేగా!

కారెక్కి ముందుకు పోనిచ్చేను. గేటు దాటగానే ఎడంవైపు తిప్పి వేగం హెచ్చించేను. పావు గంట లోపల అమీర్ పేట్ జేరుకోవాలి. కారు లాగే నా మనసూ వేగంగా పరుగులు తీస్తోంది.

ఆ బ్రీఫ్‌కేస్‌లో లేదు లేదంటే, ఎనిమిది వేలకి తక్కువుండదు. అమీర్‌పేట్‌లో వున్న షాలిమార్ హోటల్ గదిలో తన సామానుతో సహా వచ్చి, నా కోసం ఎదురుచూస్తూంటుంది కౌసల్య!

ఆమె నక్కణ్ణించి తీసుకు, తిన్నగా బేగం పేట్ రైల్వే స్టేషన్ జేరుకోవాలి. నాంపల్లి స్టేషన్నించి బైలుదేరి పదిన్నరకి ఆ స్టేషన్లో ఆగుతుంది బాంబే ఎక్స్‌ప్రెస్.

అది క్యాచ్ చేశామంటే గండం గట్టెక్కి నట్టే. చందన్‌లాల్‌కు స్పృహవచ్చి, పోలీస్



కంప్లయింట్ ఇచ్చినా, మా అయిపూ అజా ఉండేగా ఈ నగరంలో!

పూనా చేరుకుని, కౌసల్యని పెళ్ళి జేసుకోవాలి. ఈ డబ్బుతో ఏదైనా వ్యాపారం ప్రారంభించి సాఫీగా కాలం వెళ్ళబుచ్చాలి.

కౌసల్య!

ఈ జన్మలో మళ్ళీ కౌసల్యని చూస్తాననుకోలేదు నేను. హైద్రాబాద్‌వంటి ఈ విశాలమైన నగరంలో చాలా విచిత్రంగా, కాకతాళీయంగా మళ్ళీ కనిపించింది.

ఒకరోజు, ఏదో పనిమీద కార్లో పంజగుట్ట కాలనీ గుండా పోతున్నాను. ఉన్నట్టుండి రోడ్డు పక్కనించి పిల్లవాడి తోపుడు బండి తోసుకుంటూ రోడ్డు క్రాస్ జెయ్యబోతున్న అమ్మాయిని చూసి సడన్ బ్రేక్ వేసేను.

కిందామీదా చూడకుండా, అలా రోడ్డు కడ్డంగా వచ్చే వాళ్ళంటే నాకు వళ్లుమంట. పైగా ఆ తోపుడు బండిలో చిన్న పిల్లాడుకూడా ఉన్నాడు.

"ఏయ్, అమ్మాయ్! కళ్లు కనిపించడంలా?" అన్నాను గట్టిగా. అప్పుడు చూసింది ఆమె కారు వైపు.

ఆ పోలికలు అంతక్రితం ఎక్కడో చూసినట్టే తోచడంతో, కనుబొమలు ముడిచి ఇంకా సపరీక్షగా చూసేను.

ఆమెకూడా రెప్పవెయ్యకుండా నన్నే చూస్తోంది. పద్దెనిమిదేళ్ళ యువతి. గుండ్రని మొహం. చారడేసి కళ్ళు. అందంగా, పొందికగా ఎదిగిన అవయవాలు. రంగు వెలసినచీర. మాసిన రవిక!

సడన్‌గా పదేళ్ళ వెనక్కి వెళ్ళేయి నా జ్ఞాపకాలు. అప్పుడు మేము సూర్యాపేటలోవుండే వాళ్ళము. నా చిన్నతనంలోనే అమ్మ పోయింది. నాన్న నాయుడుగారి రైసుమిల్లులో పనిచేసే వాడు. అప్పుడు నాకు పన్నెండేళ్ళుంటాయి.

మా ఎదురింట్లోనే నారాయణమ్మ అనే ప్రౌఢ వుండేది. బి. డి. ఓ. గారింట్లో వంట మనిషిగా పనిచేసేది. ఆమెకి ఎనిమిదేళ్ళ ఓ కూతురుండేది. ఆ పిల్ల ఇంకా నారాయణమ్మ కడుపులో వుండగానే తండ్రిపోయేడుట.

అపిల్లే కౌసల్య!

ఎలకతోకల్లాటి రెండుజడలూ, చింకిఫ్రాకూ చీమిడిముక్కూ ఎప్పుడూ దుమ్ముకొట్టుకుని వుండే పాదాలూ ఆ పిల్ల ప్రత్యేకతలు.

బడికెళ్ళి చదువుకోరా అని నాన్న యెంత పోరినా, వినకుండా ఆ పిల్లతో మట్టిలో ఆడు

బంజరు భూముల్లో బంగారం పండిద్దాం

దున్నుకోను సెంటు భూమైనా లేందే సాలంతా పొట్టకు వెళ్ళదు.

ఇది యీనాటి సమస్య కాదు.

ఎవరిస్తారు, ఎప్పుడిస్తారు?—అన్నది ప్రశ్న.

కాలం చేసిన యీ ప్రశ్నకు సమసమాజం బదులిస్తుంది.

స్వాతంత్ర్యం వచ్చింది. శతాబ్దాల తరబడి నలిగి దరిద్ర నారాయణుల్లా మిగిలిన బలహీన వర్గాలపట్ల ప్రభుత్వానికి పట్టింపు హెచ్చింది.

1973 భూ పరిమితి చట్టం చురుగ్గా అమలౌతుంది. జూన్ 1 వ తేదీనుండి "భూ స్వాధీన పక్షోత్సవాలు" జరుపుకొన్నాం. భూములు కేటాయించిన పేదవర్గాల వారందరికీ భూ స్వాధీన కార్యక్రమం విజయవంతంగా సాగుతున్నది. ఆ పక్షం రోజుల్లో 73,847 మందికి సుమారు 1,32,000 ఎకరాల భూమి స్వాధీనం చేశారు. 65,983 మందికి ఇళ్ల స్థలాలకోసం 4,837 ఎకరాల భూమిని స్వాధీనపరిచారు.

మన రెక్కల్లో శక్తి వుంది. ఇక్కడ సాగు చేయాలన్న మనోధృతి వుంది. ఈ నాగటి కర్రు క్రింద మన భుక్తి వుంది. ఇది బంజరైనా సరే, బంగారం పండిద్దాం రండి.

డైరెక్టరు, సమాచార పౌరసంబంధ శాఖ,

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, హైదరాబాదు.

16/78-79

కుంటూ, మామిడితోపుల్లోనూ, చింతతోపుల లోనూ, చెరువుగట్లవెంట తిరిగేవాణ్ని.

అలా నాకు పదమూడేళ్ళు నిండాయి. చదువు అబ్బక జులాయిలా తిరుగుతూ చెడిపోతున్నానని భయపడి, తెలిసిన ఓలారీ డ్రయివరుదగ్గర క్లీనర్‌గా కుదిర్చేడు నాన్న.

అలా కొన్నాళ్ళు లారీలవెంట తిరుగుతూ డ్రయివింగ్ నేర్చుకున్నాను. ఇంటికివెళ్ళినప్పుడల్లా కౌసల్యను చూడకుండా వుండలేకపోయేవాణ్ని.

ఒకరోజు అకస్మాత్తుగా నాన్న పోవడంతో ఆ ఊరికీ నాకూ ఋణం తీరిపోయింది. పొట్ట చేతపట్టుకుని హైద్రాబాదు వచ్చేను. క్రమంగా కౌసల్య జ్ఞాపకాలు నానించి చెదిరిపోయేయి.

అచ్చు అలాగే వుందే ఈ అమ్మాయి!

"కౌసల్యా!" అన్నాను పలుకుతుందో లేదో చూద్దామని.

ఆ అమ్మాయి ఉలిక్కిపడి "మాణిక్యం! నువ్వేనా?" అంది.

ఆనందంతో నా మనసు ఉరకలు వేసింది. కారు అలా రోడ్డుమధ్య ఆపినందుకు, వెనుక ఇతర వాహనాలు అరుస్తున్నాయి. వెంటనే కారు రోడ్డుపక్కకి తీసికెళ్ళి ఆపాను.

బండి తోసుకుంటూ మెరిసేకళ్ళతో నా పక్కకివచ్చింది కౌసల్య. ఆ బండిలోకూర్చున్న రెండేళ్ళ కుర్రాడు నన్నూ, కారునీ యెగాదిగా చూస్తున్నాడు.

మహాసాగరంవంటి ఈ నగరంలో,ఇన్నాళ్ళూ ఏ ఆత్మీయులూ లేక, ఏకాకిగా బ్రతుకుతున్నాను. ఊహించని విధంగా ఎదురైన ఆ చిన్ననాటి నేస్తాన్ని చూడగానే చెప్పలేని ఆనందంతో నాకు ఊపిరి అందలేదు!

"కౌసల్యా! హైద్రాబాద్ ఎప్పుడొచ్చారు? అమ్మ ఎలా వుంది? ఈ అబ్బాయెవరు?" అడిగేను ఏకబిగిన.

అంతవరకూ తళతళ మెరుస్తున్న కౌసల్య కళ్ళల్లో విషాదం చోటు జేసుకుంది. "ఏం చెప్పేది మాణిక్యం! ఏడాది క్రితం అమ్మ పోయింది. ఆ ఊళ్ళో నా బ్రతుకు దుర్భరమయింది. ఓ డాక్టరమ్మ ఇంట్లో పనికి కుదిరేను. ఆవిడ కీమధ్యే ఇక్కడికి బదిలీ అయింది. వాళ్ళ ఇల్లు ఈ కాలనీలోనేవుంది. ఈ అబ్బాయి వాళ్ళ కొడుకే!"

నిట్టూర్చేను. "మనిద్దరి జీవితాలు దాదాపు ఒకే కోవకి చెందుతాయి. వాళ్ళు జీతం ఏమిస్తారేమిటి?"

"భోజనం, బట్టలూ పోను, నెలకి నలభై రూపాయలిస్తారు."

"పెళ్ళి జేసుకున్నావా?"

సిగ్గుపడుతూ, లేదన్నట్టు తల విదిలించింది.

నేనెక్కడ పనిజేస్తున్నానో, ఎక్కడ వుంటున్నానో మొదలైన వివరాలుచెప్పి, ఆమె చిరునామా అడిగి, వచ్చే ఆదివారం ఫలానా చోట కలుసుకోమని చెప్పి వెళ్ళిపోయేను.

ఆదివారాలు చందన్‌లాల్ దుకాణం మూసి వుంటుంది. ఆరోజు అతను ఇంట్లోనే వుండి, వీక్లీ ఎకౌంట్స్ చూసుకుంటాడు. నాకూ అట్టే పని వుండదు, కారు మేంటినేన్స్ తప్ప!

చెప్పినట్టే, ఆదివారం నిర్ణీత ప్రదేశానికి వచ్చింది కౌసల్య. ఈసారి కాస్త స్నానం అదీచేసి, మంచి బట్టలు కట్టుకుంది. వదులుగా జడవేసుకుని, పిసరంత మల్లెచెండు తురుముకుంది.

ఎందుకోగానీ, ఆమెని చూడగానే నా మనసంతా అవ్యాజ్యమైన భావనతో నిండిపోయింది. ఆరోజు రీగల్ టాకీస్‌లో ఆడుతున్న తెలుగు పిక్చర్ చూశాం.

ఆలా ప్రతి ఆదివారం ఎక్కడో ఒకచోట కలుసుకునే వాళ్ళం. పబ్లిక్ గార్డెన్స్, జూలాజికల్ పార్క్, చార్మినార్, సాలార్జంగ్ మ్యూజియం ఇలా ఒక్కో ఆదివారం ఒక్కో ప్రదేశానికి తీసికెళ్ళి చూపేవాణ్ణి.

అలా కలుసుకుంటున్నా, మాలో అనురాగం తప్ప మరో హేయమైన భావం చోటు జేసుకోలేదు!

ఓ రోజు మధ్యాహ్నం, ఇరానీ హోటల్లో భోజనం జేశాక, మాటల మధ్య అడిగేశాను. "కౌసల్యా! మనం పెళ్ళి జేసుకుని దంపతులమైతే ఎలా వుంటుంది?" అని.

దాంతో కౌసల్య మొహం ముడుచుకు పోయింది.

"దేనికలా ఐపోయావ్?" అడిగేను అర్థం కాక.

కౌసల్య భారంగా నిట్టూర్చింది. "మాణిక్యం! నీవు నా మనసులోని మాట బైట పెట్టావ్. ఇప్పుడు నాకు పద్దెనిమిదేళ్ళు. మరో రెండేళ్లు పోతేగానీ, నేను పెళ్ళి చేసుకోలేని అశక్తురాలిని!"

"దేనికి!" అడిగేను ఆశ్చర్యంగా

"నేను మా అమ్మకి ఓ వాగ్దానం జేశాను."

"ఏమని?"

కౌసల్య నవ్వి— "నా పదేళ్ళప్రాయంలో మా అమ్మ ఓ సోది చెప్పే అమ్మికి నా చెయ్యి చూపించింది. ఆ అమ్మి, నన్ను ఇరవై యేళ్ళు నిండేవరకూ పెళ్లి జేసుకోవద్దనీ, నా పద్దెనిమిదో ఏట ఓ గండం వుందనీ, ఆ వయసులో గనక నా పెళ్ళైతే, నా భర్త ఏ దుర్ఘటనకో గురై మరణిస్తాడనీ చెప్పింది.

సరిగ్గా అటువంటి జోస్యమే, మా అమ్మ చిన్నతనంలో ఓ జ్యోతిష్కుడు ఆమె చెయ్యి చూసి చెప్పేడుట. మా అమ్మ తలితండ్రులు ఆ జోస్యాన్ని గాలికబుర్ల కింద జమకట్టి, పదహారేళ్ళ వయసులోనే అమ్మ పెళ్ళి జేశారుట. ఫలితంగా, నేనామె కడుపులో వుండగానే నాన్న పోయాడు.

ఆ జోస్యాల సంగతెలా వున్నా, ఏడాది క్రితం అమ్మ మరణిస్తూ నా చేత ఓ ప్రమాణం చేయించింది. నే నెక్కడ వున్నా, ఎలా వున్నా, ఇరవై ఏళ్ళు నిండేవరకూ ఎట్టి పరిస్థితిలోనూ పెళ్ళి చేసుకోవద్దని. తనమాట కాదని నేను పెళ్ళి చేసునుంటే, తనలాగే నా జీవితమూ మోడు వారి పోతుందని ఆమె భయం!

అమె మాట శిరసావహిస్తానని, చేతిలో చెయ్యివేసి వాగ్దానం చేశాను. అందుకే, దయ చేసి మరో రెండేళ్ళు ఓపిక పట్టు మాణిక్యం!" అంది ప్రాధేయపడుతూ.

నాకు నవ్వాగలేదు. "ఈ రాకెట్ యుగంలో ఇంకా ఆ పుక్కిటిపురాణాలు పట్టుకు వేళా డితే ఎలా? అత్యవసర పరిస్థితుల్లో కొన్ని వాగ్దానాలు తుంచి వెయ్యక తప్పదు కౌసల్యా! చచ్చిన వారికి బ్రతికున్న వారి ఇక్కట్లు ఎలా తెలుస్తాయి?"

"అలా అనక! తొందరపడి మనం పెళ్ళి చేసుకుంటే, దురదృష్టవశాత్తు మా అమ్మమాట నిజమై నీకేమైనా జరిగితే నేను జీవించగలనా? నాకోసం రెండేళ్ళు కాచుకోలేవా మాణిక్యం"

"రెం.... డేళ్ళు! మాటలా? అంతవరకూ ఎలా ఓపిక పట్టమంటావు కౌసల్యా! పైగా మా సేఠ్ ఇంట్లో పనిచేసే నౌఖరు తన కూతుర్ని చేసుకోమని ఒహటే పోరుతున్నాడు. నిజానికి ఆ అమ్మాయి ఎర్రగా బుర్రగా ఎంతో బావుంటుందనుకో.

కాని, నా మనసులో నీకు తప్ప మరొకరికి స్థానం ఇవ్వలేకపోతున్నాను. ఆ అమ్మాయి ఏదో ఓ వంకతో రోజూ నన్ను కలుసుకోడానికి వస్తుంటుంది ..." నేను వదిలిన బాణం బాగా పనిచేసింది.

కౌసల్య కళ్ళు ఈర్ష్యతో దహించుకు పోయేయి.

"ఐతే ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకుంటావా మాణిక్యం?"

"ఛ....ఛ! అలా అన్నానా!....ఐతే, పరిస్థితు లెప్పుడూ ఒకే విధంగా వుంటాయా కౌసల్యా?" అన్నాను ఆమె భావాలు చదవ డానికి ప్రయత్నిస్తూ.

కౌసల్య మొహం నిండా విషాదం అలుము కుంది.

మరో పదిహేను రోజుల తరవాత మళ్ళీ ఎత్తేను పెళ్ళి ప్రసక్తి.


"రోజు రోజుకూ నాలో ఓపిక నశిస్తోంది కౌసల్యా! ఒంటరిగా, ఆ కారు షెడ్లో జీవితం దుర్భరంగా వుంది. ఒకరి తోడూ నీడా లేని బ్రతుకూ ఒక బ్రతుకేనా?

ఆ ఒంటరితనంలో రాత్రిళ్ళు షెడ్డు గోడలు కరవగానికే వస్తున్నట్టు తోస్తుంది. ఇలా ఎంతో కాలం ఆగనులే. నీ మూఢ నమ్మకాలు కట్టి పెట్టి, ఆ తంతేదో త్వరగా జరగనివ్వు."

కౌసల్య నవ్వి—"పెళ్ళి పెళ్ళి అని అలా దేవిర్లాడుతున్నావుగానీ, మన సంపాదన

(వి) చిత్ర విజ్ఞానం

పొగత్రాగడం నిషేధించడానికి స్వీడన్ ప్రభుత్వం తీవ్ర చర్యలను తీసుకుంటున్నది. సిగరుట్లను ఎవరిళ్లల్లో వాళ్ల తలుపులు మూసుకుని కాల్చాల్సిందే. బైట సిగరెట్లతో ఎక్కడ కంటబడినా పోలీసులు వదిలిపెట్టరు. పైగా పొగ త్రాగడంవల్ల కలిగే హాని గురించి, రోజూ రేడియోల్లో, బళ్ళలో, కాలేజీల్లో, ఆస్పత్రుల్లో ప్రజలకు వివరించడం జరుగుతోంది. స్వీడన్‌లో ఎందుకూ పనికిరాని మామూలు సిగరెట్ ప్యాకెట్ ధర రూ. 13-70 పైసలు ॥



విషయం ఆలోచించేవా మాణిక్యం? ఇప్పుడు చెరో చోట పనిచేస్తున్నాం గనకా, ఒంటరి వాళ్ళం గనకా వాళ్ళ దగ్గిరే ఇంత తిండీ, వుండడాని కింతచోటూ దొరుకుతున్నాయి.

రేపు పెళ్ళైతే, అలా వేరువేరుగా వుండలేం కదా? తప్పని సరిగా ఓ ఇల్లు అద్దెకి తీసుకోవాలి. ఈ మహానగరంలో ఇళ్ళు దొరకడం అటుంచి, వాటి అద్దెల సంగతి నీకు తెలిసిందే కదా? అది పోను, సంసారానికయ్యే సామానూ అదీ ఎలాగూ కొనక తప్పదాయె. రేపు పిల్లా జెల్లా పుడితే, మన పిడికెడు సంపాదనతో వాళ్ళనెలా పోషించేది? ఎలా పైకి తీసుకువచ్చేది! అవన్నీ శాంతంగా ఆలోచించేవా?" అంది.

తప్పించుకోడానికిదో సాకన్నమాట, అనుకుంటూ నవ్వేను. "కౌసల్యా! నీలాగే నేనూ అంతదూరం ఆలోచించే ఓ నిర్ణయానికివచ్చేను. నా దగ్గర ఓ పథకం వుంది. దాన్ని అమలు జరిపేమంటే మన జీవితాలు నిశ్చింతగా గడిచిపోతాయి!"

"ఏమిటా పథకం?'.

"మా సేఠ్ రోజూ రాత్రి తొమ్మిదిగంటలకి ఆరోజు పోగయిన డబ్బా దస్కం బ్రీఫ్ కేస్‌లో పెట్టుకొని కార్లో ఇంటికి బయలుదేరతాడు. వాడు వడ్డీవ్యాపారి. బీదా బిక్కీ రక్తం పిండి, వేలకి వేలు సంపాదిస్తున్నాడు.

ప్రామిసరీ నోట్లలో ప్రభుత్వం నిర్ణయించిన వడ్డీరేటు చూపించి, దానికి రెండింతలు అప్పుల వాళ్ళదగ్గిర గుంజుతాడు. వాణ్ని మూర్ఛపోగొట్టి ఆ బ్రీఫ్‌కేసు కాజేస్తాను. ఇద్దరం ఎక్కడికయినా వెళ్ళి పెళ్ళిచేసుకుని సుఖంగా బ్రతుకుదాం! ఏమంటావ్?"

"బాబోయ్! దొంగతనమే!" అందికౌసల్య గుండె అదుముకుని. "ఇది దొంగతనం ఎలా అవుతుంది కౌసల్యా? వాడు ఇతరులని దోచుకోడంలేదా? ఈ మాత్రం మనం వాణ్ని దోచుకుంటే తప్పేమిటి?"

"పట్టుబడితే ఇంకేమయినావుందా? దొరికే ఈ కాస్త మెతుకులూ గంగపాలు కావూ?" కౌసల్య కంఠం వణికింది.

"పిచ్చిదానా! ఇది చాలా తేలికయిన ప్లాను. పట్టుబడే ప్రసక్తిలేదు. వాణ్ని మూర్ఛపోగొట్టి బ్రీఫ్‌కేస్‌తో తిన్నగా షాలిమార్ హోటల్ చేరుకుంటాను. ఆలోగా నీవు నీ సామానుతో ఆ హోటల్లో నాకోసం కాచుకో.

నేను రాగానే ఇద్దరం బేగంపేట స్టేషన్ పోదాం. అక్కడ మనకి బొంబే యెక్స్‌ప్రెస్ అందుతుంది. ఆలోగా చందన్‌లాల్‌కు స్పృహ వచ్చి,పోలీస్ రిపోర్టు యిచ్చేవరకూ,వాళ్ళు వెదికే వరకూ మన ఛాయలీ నగరంలో వుంటేగా?"

"నాకోసం అంతపెద్దనేరం చేస్తావామాణిక్యం?"

"దొంగతనమా? నీకోసం ఏం చేయడానికయినా నేను సిద్ధమే కౌసల్యా" అన్నాను ప్రేమ నిండిన స్వరంతో.

కౌసల్య పలకలేదు.

"ఊరికే ఆలోచించి మనసు పాడు చేసుకోక! రేపు సోమవారంకదా, రేపే ప్లాన్

అమలు జరపాలి. అర్థమయిందా?" అన్నాను.

మెల్లిగా తలూపింది కౌసల్య!

ఎదురుగా షాలిమార్ హోటలు కనిపించడంతో ఆలోచనలు చెదిరిపోయాయి. కారు స్పీడ్ స్లోచేశాను.

హోటల్‌కి కాస్త ఇవతల, మసకచీకట్లో ఆపి దిగాను. బ్రీఫ్‌కేస్ అందుకుని గబగబ హోటల్లోకి నడిచాను. చిన్న హోటల్ అది. అట్టే రష్‌వుండదు. పైన సింగిల్‌రూమ్స్ అద్దె కివ్వబడతాయి.

అంతక్రితం నేనే మారుపేరుతో ఓ రూమ్ తీసుకుని వుంచేను. ఈపాటికి కౌసల్య తన సామానుతో వచ్చి యెదురు చూస్తూంటూంది. గబగబ మెట్లెక్కి పైకి చేరుకున్నాము. మేము తీసుకున్న 6వ నెంబర్ గది తలుపుకి తాళం లేదు. అంటే కౌసల్య వచ్చివుంటుంది.

గదిముందాగి తలుపు తట్టేను. చెయ్యి పడగానే క్కిర్రుమంటూ తెరుచుకుంది. లోనికెళ్ళాను. గది ఖాళీ! ఎవ్వరూలేరు.

సరిగ్గా అదేక్షణంలో యెవ్వరో గదిలోకి వచ్చిన అడుగుల చప్పుడు విని చటుక్కున వెనుదిరిగేను. ఇద్దరు అపరిచితులు.

"మాణిక్యం నువ్వేనా?" అడిగాడొకడు.

"ఔను! మీరెవరు?"

అతను నవ్వి "సిటీ క్రయింబ్రాంచి పోలీసులం!" అన్నాడు నింపాదిగా.

నాగుండె గుభిల్లుమంది.

అతను నవ్వుతూ, "నీ నిర్వాకం యింత త్వరగా మాకెలా తెలిసిందా, అని ఆశ్చర్య పోతున్నావ్ కదూ?" అని జేబులోంచి మడత పెట్టిన ఓ కాగితంతీసి నావైపు చూపాడు, "ఇది ఉత్తరం! నీకోసం రాసిన ఉత్తరం. చదువు."

వణికే చేతులతో దాన్ని అందుకున్నాను.

"ప్రియమైన మాణిక్యం!

ఇలా చేసినందుకు నన్ను మనస్ఫూర్తిగా మన్నించగలవు. నీ మేలుకోరి బాగా ఆలోచించే ఇలా చేసాను. క్షమిస్తావు కదూ?

అటు నా తల్లికిచ్చిన వాగ్దానం తుంచివెయ్యలేను. ఇటు నిన్నూ వదులుకోలేను. నీలో సహనం తక్కువ! తొందరపడి ఇప్పుడే నన్ను పెళ్ళి చేసుకుంటే, నా తల్లిమాట నిజమై నీకు ఏమయినా అయితే నేనేమైపోను?

అందుకే ఈ నిర్ణయం తీసుకున్నాను. చోరీ నేరంకింద నీకు కొద్దిరోజులు శిక్షపడుతుంది. ఆలోగా నా గడువూ పూర్తవుతుంది. జైల్లో వున్నంతకాలం నీవు మరొకరి సొత్తువైపోతావేమో నన్న భయమూ వుండదు!


ఒకరికిచ్చిన వాగ్దానంకోసం ఇంత కట్టుబడి వున్న నేను ఎటువంటిదాన్నో నీవే వూహించుకో. పెళ్ళంటూ చేసుకుంటే నిన్నే చేసుకుంటానని నీకూ వాగ్దానం చేశానుకదా? దాన్ని కూడా నా కొనవూపిరి వరకూ నిలుపుకుంటాను.

నీవు విడుదలయ్యేవరకూ అభిసారికలా నీ కోసమే ఎదురు చూస్తుంటాను. పోలీసులకు నీ గురించి చెప్పానని దయచేసి కోప్పడక.

ఇక వుంటాను.

ఎప్పటికీ

నీ కౌసల్య. □



ఆకాశమంత పందిరి

కళింకోట ప్రభాకరదేవ్

ఉత్తరంలోని ప్రతి అక్షరం., తనను వెక్కిరిస్తున్నట్లుగా తోచింది లలితకు. బాధగా నిస్సహాయంగా నవ్వుకుంది.

పద్మ ఎంత చక్కగా, సూటిగా వ్రాసింది! తనకన్నా వయస్సులో బాగా చిన్నదయినా అది తనకన్నా తెలివయినది. దానికి ధైర్యంవుంది. తెగింపు వుంది. తనకు ఆ రెండూలేవు. అందు చేతనే ముప్ఫయ్యేళ్ళు వస్తున్నా మ్రోడులాగ మిగిలిపోయింది.

చెంపలమీదుగా జారుతున్న కన్నీటిని తుడుచుకుంది లలిత. ఇంట్లో భరించలేనంతగా నిశ్శబ్దం! లలిత తల్లి జానకమ్మ సర్వంకోల్పోయిన మనిషిలాగ రాటకు జారగిలబడి కూర్చునుంది.

లలిత తల్లి వేపొకసారి చూసి, భారంగా నిట్టూర్చి తనగదిలోకి నడిచింది. మంచంమీద కూలబడి మరోసారి వుత్తరాన్ని చదవసాగింది.

అక్కయ్యకు,

నేను రజాక్‌తో వెళ్ళిపోతున్నాను. త్వరలోనే మేమిద్దరం రిజిస్టర్ మేరేజ్ చేసుకుంటాము. ఈ విషయం నీకు కోపం కలిగిస్తుందని తెలిసినా, పరిస్థితుల్ని నువ్వు జాగ్రత్తగా గ్రహించి, నన్ను క్షమించగలవని ఆశిస్తూయున్నాను. మాకోసం నువ్వెంత కష్టపడుతున్నావో తెలుసు. నీ కష్టంతో మా కడుపు నింపగలవేగాని కోరికలనేం తీర్చగలవు? అందుకనే, వెళ్ళిపోతున్నాను. నాపెళ్ళి బాధ్యత నీకు తప్పుతుంది. ఈ విధంగానయినా నీ బరువును కొంతంత తగ్గించ గలిగినందుకు ఆనందిస్తున్నాను.

ఇట్లు
నీ చెల్లెలు
పద్మ.

'ఎంత నేర్పుగా వ్రాసింది! తెలివిగా నా చేతకానితనాన్ని ఎత్తి చూపింది' నిట్టూర్చింది లలిత.

అవును పద్మ మాటలు నిజమే. తను తెచ్చిన జీతంతో వాళ్ళకోరికలు యెలాగ తీరుతాయి? తీరుతాయని ఎవరూ అనుకోలేదు. అందుచేతనే, కోరికలు తీరేమార్గం, తీర్చుకునే అవకాశం లభించింది కనుక పద్మ వెళ్ళిపోయింది. అదృష్టవంతురాలు!

ఒకే కడుపున పుట్టిన తామిద్దరిలో యెంత వ్యత్యాసం! చేజిక్కిన అవకాశాన్ని జారవిడుచుకున్న దౌర్భాగ్యురాలు తను. ఆనాడు సుధాకర్ మాటలు మన్నించివుంటే తనకు ఈనాడు యింతటి క్షోభవుండేది కాదు.

పది సంవత్సరాల క్రితం....

సుధాకర్ తనకోసం, తన అంగీకారం కోసం ఎంత ప్రాధేయపడ్డాడు! ఎంతగా నచ్చచెప్పాడు.

"లలితా! నామాట విను. మనం వివాహం చేసుకుందాం. మీ అమ్మ, చెల్లెలు, తమ్ముడు, మనతోనే వుంటారు. ఈ విషయంలో నువ్వు లేనిపోని అనుమానాలు పెట్టుకోవద్దు. నీబాధ్యతలకు నేను అడ్డురాను" అన్నాడు.

కాని తను వినలేదు. బాధ్యత కోరికకు

కళ్ళెం వేసింది. సుధాకర్ యెంతచెప్పినా ప్రయోజనం లేకపోయింది.

కాలం ఎవరి కోసమూ ఆగదు.

సుధాకర్‌కు మరోవూరు బదిలీ అయింది. అతడు దూరమయినా, మానసికంగా తనకు మరింత దగ్గరయ్యాడు.

ఒకటి....రెండుకాదు. పది సంవత్సరాలు గడిచాయి. తండ్రి చనిపోతూ తనమీదవుంచిన బరువు బాధ్యతలను యింతవరకూ సక్రమంగానే నిర్వర్తించింది.

చివరకు తనకు మిగిలిందేమిటి?

సాధించింది పిడికెడంత, పోగొట్టుకుంది కొండంత. ఇదీ తన బ్రతుకు.

పిచ్చిగా నవ్వుకుంది లలిత. ఆ నవ్వులో కాంతిలేదు.

ముప్ఫయ్యేళ్ళు! అంటే మూడు పదులు!
ముప్ఫయి వసంతాలు!!

ఇన్ని వసంతాలు గడిచినా తన బ్రతుకులో ఒక్క వసంతం కూడా తొంగిచూడలేదు. స్పందనలేదు. చైతన్యంలేదు. కుటుంబ అవసరాలను తీర్చేయంత్రం తను. అంతే.

మంచం మీదనుండి నీరసంగా లేచి అద్దం దగ్గరకు నడిచింది లలిత. నుదుటిమీది అస్తవ్యస్తంగా పడివున్న జుత్తును సవరించుకుంది. అద్దంలో తనప్రతిబింబాన్ని చూసుకొనివులిక్కిపడింది. ఇదివరకు ఎన్నోసార్లు అద్దంలో తన ప్రతిబింబాన్ని చూసుకున్నా, అప్పుడెప్పుడూ లలిత యిలాగ వులిక్కిపడలేదు. ఆందోళన చెందలేదు.

కళ్ళు చిట్లించుకొంటూ అద్దంలోకి పరీక్షగా చూసింది.

సందేహంలేదు.

తన రూపంలో మార్పు స్పష్టంగా,కొట్టొచ్చినట్లుగా కనబడుతుంది. గులాబిరంగులోవుండే చెక్కిళ్ళు తెల్లగా పాలిపోయినట్లుగా వున్నాయి. కళ్ళకింద నల్లటి చారలు!

ఒకప్పుడు ఎంత అందంగా వుండేది తను! తన కళ్ళలోకి చూస్తూ సుధాకర్ పరవశించిపోయేవాడు. తన చెక్కిళ్ళు గులాబీ మొగ్గలనేవాడు. అధరాలు అరవిందాలంటూ కవిత్వం ఒలకబోసేవాడు.

ఒకనాడు....

అమ్మా నాన్నలతో కలసి దగ్గర బంధువుల ఇంట్లో పెళ్ళికి వెళ్ళింది. సుధాకర్ కూడా వచ్చేడు.

పెళ్ళి పందిరంతా కోలాహలంగా వుంది. మంగళ వాద్యాలు మ్రోగుతున్నాయి. పందిరి రాటకు ఆనుకుని పురోహితుడు జరిపిస్తున్న పెళ్ళి తంతును తిలకిస్తోంది తను.

"అంత దీక్షగా చూస్తున్నావ్. పెళ్ళిమీదకు గాలి మళ్ళిందేమిటి?" అన్నాడు నవ్వుతూ సుధాకర్.

తను సిగ్గు పడింది.

"కొద్ది రోజులు ఓపికపట్టు. జాబ్ దొరకగానే, ఆకాశమంత పందిరిలో నీ మెడలో మూడు ముళ్ళు వేసేస్తాను.'' అన్నాడు.

ఆ మాటలు తన హృదయ వీణా తంత్రులను సుతారంగా మీటేయి. ఇంతలో, పందిట్లో లైట్లు ఆరిపోయాయి. ఒక్కసారిగా, అంతటా చీకటి వ్యాపించింది. తను భయంతో సుధాకర్ చెయ్యిని గట్టిగా పట్టుకుంది. ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాడు సుధాకర్. బలంగా తనను దగ్గరకు లాక్కొని ముద్దుపెట్టుకున్నాడు.

గతంలోనుండి బైటపడింది లలిత.

నిప్పులు చెరిగే ఎండలో నడుస్తున్న బాటసారికి శీతల పానీయం దొరికినట్లుగా అనుభూతి చెందింది లలిత. మధురస్మృతికి చిహ్నంగా పెదవులు చిన్నగా కంపించాయి.

కేవలం గతకాలపు మధురస్మృతుల ఆధారంగా జీవించడం దుర్భరంగా వుంటుంది.

బరువుగా నిట్టూర్చింది లలిత.

ఆలోచనలు పద్మవైపు పరుగులు తీశాయి. పద్మ చాలా అదృష్టవంతురాలు! దాని పెళ్ళి చెయ్యలేని అశక్తురాలిని నేనని గ్రహించి వెళ్ళిపోయింది. కాని, దానికేం తెలుసు? పద్మ పెళ్ళికోసం ప్రతినెలా జీతంలో కొంత భాగం తను బాంక్‌లో వేస్తుంది. చెల్లెలి భవిష్యత్తును

అందంగా తీర్చిదిద్దాలని కలలు కంది. అవన్నీ, గాలి మేడలయ్యాయి. తన అవసరం దానికి అక్కరలేదు. రెక్కలు వచ్చిన పక్షిలాగ ఎగిరి పోయింది.

పద్మ వెళ్లిపోయినందుకు తను బాధ చెంద టంలేదు. మనసుకు నచ్చిన వాడితో పెళ్ళి చేసుకోవాలని వెళ్ళిపోయింది. సంతోషమే. కాని, వెళ్ళిపోతూ అది అన్నమాట ముల్లులాగ గుచ్చుకుని మనసును సలుపుతుంది.

నేను దాని పెళ్ళి చెయ్యలేని అశక్తురాలినా? ఆరు సంవత్సరాల పసిదాన్ని పదహారేళ్ళ దానిగా చేశాను. ఆఫీసులో లంచ్ అవర్స్‌లో కాఫీతో కడుపు నింపుకుని దానికి మంచి బట్టలు కొన్నాను. దాని భవిష్యత్తుకోసం నా భవిష్య త్తును నిస్తేజం గావించుకున్నాను.

ఇంతచేసినా ఏం ప్రయోజనం? అవకాశం దొరకగానే వెళ్లిపోయింది. వెళ్ళిపోతూ, నా అసమర్థతను ఎత్తిచూపుతూ వెక్కిరించింది.

ఇక, తన అవసరం ఎవరికి?

రేపు, తమ్ముడు కూడా అంతే.


డిగ్రీరాగానే వాడికి రెక్కల్లో బలం వస్తుంది. వాడి దారి వాడు చూసుకుంటాడు. తను ఒంటరి దయిపోతుంది. ఏకాకిగా మిగిలిపోతుంది.

దుఃఖం ముంచుకు వచ్చింది లలితకు.

తలగడలో ముఖం దాచుకుని వెక్కి వెక్కి ఏడ్చింది. కొంతసేపు ఏడ్చేక మనసు కాస్తంత తేలికయినట్లు అనిపించింది.

"రెక్కలు రాగానే ఎగిరిపోయే వాళ్ళ గురించి బాధపడకూడదు. రెక్కలకు బలం యివ్వడంవరకే తన బాధ్యత. ఆ బాధ్యతకోసం తన భవిష్యత్తును పాడుచేసుకోకూడదు." ఈ ఆలోచన రాగానే, ఆనాడు సుధాకర్‌ను దూరం చేసుకోవడం ఎంత అవివేకమైనదో అర్థమయింది లలితకు.

ఇప్పటికైనా మించి పోయింది లేదు. తను త్వరపడాలి. ఒంటరిగా మిగిలి పోకూడదు. సుధాకర్ హృదయ ద్వారాలు తనకోసం యిప్పుడు కూడా తెరిచే వున్నాయి.



పది సంవత్సరాలు గడిచినా సుధాకర్ ప్రేమ చెక్కుచెదరలేదు.

తనకోసం, తన కృపాకటాక్ష వీక్షణల కోసం నిరీక్షిస్తున్నాడు.

పది సంవత్సరాలపాటు తన కోసం నిరీ క్షించిన సుధాకర్ ప్రేమ ఎంతగొప్పది! తనను మరచిపోలేక అతడు అవివాహితుడుగానే వుండి పోయాడు. అటువంటి ప్రేమమూర్తిని బాధ్య తలంటూ ఎంత నొప్పించింది!!

ఇక, ఎంత మాత్రం ఆలస్యం జరగడానికి వీల్లేదు. ఇప్పటికే చాలా జీవితం వ్యర్థంగా గడిచిపోయింది. నెలరోజుల క్రిందట సుధాకర్ తమ వూరికే ట్రాన్స్‌ఫర్ కావడం తన అదృష్టం!

రకరకాల ఆలోచనలతో మగత నిద్రలోకి జారిపోయింది లలిత.

* * *

ఆటో దిగి, ఇంట్లోకి వెళ్ళబోతూ గుమ్మం దగ్గరే ఆగిపోయింది లలిత.

లోపల ఒక స్త్రీ మాట్లాడుతుంది, ఆ మాటల్లో తన పేరు దొర్లడంతో నొసలు చిట్లించింది లలిత.

ఆ 'స్త్రీ' సుధాకర్ తల్లి అని పోల్చుకుంది.

"నువ్విన్నాళ్ళకు పెళ్ళి చేసుకుంటానని అన్నావు. చాలా సంతోషం బాబూ! కాని, ఆ లలితను మాత్రం....చేసుకో....వద్దు."

"ఎందుకనమ్మా! లలిత అంటే నీకు ఇష్టమేగా?" ఆ కంఠ స్వరం సుధాకర్‌ది.

సుధాకర్ ప్రశ్నకు ఆమె ఏమంటుందోనని ఆతృత చెందింది లలిత.

కొన్ని క్షణాలు భారంగా దొర్లిపోయాయి.


"లలిత అంటే యిష్టం లేదా అమ్మా?"

"ఇష్టం లేకేం బాబూ! లలితను నా కోడలుగా చేసుకోవాలని ఎంతో ఆశపడ్డాను."

"మరి, ఇప్పుడేం జరిగిందని వద్దంటున్నావ్?"

"ఏది జరగకూడదో అదే జరిగింది బాబూ! లలిత చెల్లెలు పద్మ ఎవడో తురకవాడితో లేచిపోయింది. ఇప్పుడు, నువ్వు లలితను పెళ్ళి చేసుకుంటే...ఆ చెడిపోయిన కుటుంబంలో సంబంధం కలుపుకుంటే....నీ చెల్లెళ్ళకు మంచి సంబంధాలు వస్తాయా? ఆలోచించు బాబూ.. " ఇంకా ఏదేదో చెబుతుంది సుధాకర్ తల్లి.


మరిక, అక్కడ నిలబడలేకపోయింది లలిత. గాయపడిన మనసుతో, చెమ్మగిల్లిన కళ్ళతో, తడబడే అడుగులతో వెను తిరిగి వెళ్ళిపోయింది—ఒంటరిగా. □



టైమ్ టూన్సు
వర్ణాంతర వివాహామా?
Mn Mn
అమ్మాయ్! ఆ కొంగు కాస్త దాపు కొమ్మా!!
PPPPR P
ఐతే నీ కిద్దరు కూతుళ్లూ ఒక కొడుకూ అన్న మాట!!
I--+ I
ఈ బస్సులో ఇలా నుంచొని ప్రయాణం చెయ్యలేం రా బాబూ!
పందెం లో చిత్తుగా ఓడిపోయి నట్లున్నావే!!
I
iT
వర్షంలో తడిస్తే జలుబు చేస్తుందమ్మా! గొడుగు లోకి రా!!
పడతావ్ సుమా జాగర్త!!
I

మధురాంతకం నరేంద్ర

మలుపు



హాలంతా నిశ్శబ్దంగా వుంది.

అత్యుత్తమ చిత్రంగా అనేక బహుమతులను గెలుచుకున్న చిత్రం అది.

తమ సభ్యులకోసం ఆ పట్టణానికి చెందిన ఫిలిం సొసైటీవాళ్లు దాన్ని ప్రత్యేకంగా తెప్పించారు.

నిజ జీవితంలో ఎవరూ పట్టించుకోలేనంతటి చిన్నవిషయాలలో సయితం మగవాళ్ళచేత ఆడవాళ్లెలా మోసగింపబడుతున్నారో చాలా నైపుణ్యంతో చిత్రీకరించారు ఆ దర్శకుడు.

ప్రేక్షకులందరూ బయట ప్రపంచాన్ని మరచిపోయి సినిమాలో నిమగ్నమై పోయి వున్నారు.

తనను పట్టించుకునే వాళ్లెవరూ లేనందుకు నిరసన తెలియచేస్తున్నట్టుగా ఝాన్సీ ఒడిలోని పాపకెవ్వుమంటూ అరునొక్కరాగం అందుకొంది.

ఝాన్సీ వులిక్కిపడింది.

"నీకేమయిందే తల్లీ! ఊరుకో. ..ఊరుకో" అంటూ సముదాయించడానికి ప్రయత్నించింది.

తమ ఏకాగ్రతకు భంగం కలిగించిన పాప వేపు, ఆపాప తల్లివేపు చాలమంది విసుగ్గా చూస్తున్నారు.

ఝాన్సీకేం చెయ్యాలో తోచలేదు.

పాప ఏడుపు మానడంలేదు.

"ఝాన్సీ! పాపను కాస్సేపు బయటకుతీసుకెళ్ళు" అన్నాడు ఆమె భర్త హరి.

అంతవరకూ ఆ ఆలోచనరానందుకు తనను తానే తిట్టుకుంటూ పైకి లేచింది ఝాన్సీ.

డోర్ దగ్గరవున్న నల్లటి తెరను తొలగించింది.

శక్తినంతా వుపయోగించి గొళ్ళెంతీసి బయటకి నడచింది. ఇక నువ్వు లోపలికి రానవసరం లేదన్నట్టుగా తలుపు తనంతట తానే మూసుకుపోయింది.

చీకటిలోనుంచీ వున్నట్టుండి వెలుతురులోకి వచ్చినందువల్ల ఆమెకు కాసేపు ప్రపంచమంతా అలుక్కుపోయినట్టుగా కనిపించింది.

బయట అంతా దాదాపు నిర్మానుష్యంగా వుంది.

సినిమాహాలు కాంపౌండు గోడకు వివిధ సినిమాల పోస్టర్లున్న బోర్డులు ఆనించబడి వున్నాయి.

టీ అంగడిలో దాదాపు ఇరవయ్యేళ్ళ వయసున్న యువకుడు బాయిలరుముందు నిలబడి తన తంటాలు తాను పడుతున్నాడు. బంకులోని నటీవయసతను సీసాలను సర్దుకుంటు

న్నాడు.

"ఊరుకో బేబీ! ఊరుకో!...." అంటూ జిజ్జిగొట్టసాగింది ఝాన్సీ.

సినిమా పోస్టర్ల దగ్గరకు తీసుకెళ్ళి బొమ్మ లను చూపెట్టింది. అటు వైపుకూ, యిటు వైపుకూ తిరగసాగింది. పాప ఏడుపాపలేదు.

ఇంతలో ఆమె చూపులు టీ కొట్టుపైన పడ్డాయి. పాపకు ఆకలయ్యి వుంటుందన్న సంగతి ఆమెకు స్ఫురించింది.

పాపకు నాలుగు నెలలు దాటినప్పటినుంచీ బుడ్డిపాలే శరణ్యమయ్యాయి. అందుకే ఎక్కడికి బయల్దేరినా పాపతో బాటుగా పాల బుడ్డీ గూడా తీసుకెడుతూ వుండేది ఝాన్సీ. కానీ ఈరోజు తొందర తొందరగా బయలుదేరి రావలసి వుండడంవల్ల పాలబుడ్డి సంగతి మరచి పోయింది. టీ అంగడి దగ్గరకు వెళ్ళి పాలు తీసి తాగించదలచుకొంది ఆమె. వెంటనే తన దగ్గర డబ్బులు లేవన్న సంగతి గుర్తుకొచ్చింది. డబ్బులు కావాలంటే లోపలికి వెళ్ళి భర్తను అడగాల్సిందే!

"ఛీ....ఛీ....పాడు ఆడజన్మ!" అనుకొంది ఝాన్సీ.

"పాపకు పాలు తాగించగూడదాండీ?!"

ఉలిక్కిపడి చూచింది ఆమె.

టీ అంగడి అబ్బాయి అడుగుతూవున్నాడు. అతడు తనను ఎంత సేపటినుంచీ గమనిస్తు న్నాడో-ఏమో!

"మరి....మరి....డబ్బులు....పర్సు హాలు లోపలే వుంది."


"ఇంటర్వెల్లో తెచ్చివండి ... పర్వాలేదు" అంటూ ఆ అబ్బాయి పాల గ్లాసు యిచ్చాడు.

"మరో గ్లాసు కావాలి... పాప వేడిపాలు తాగలేదు....."

ఆ అబ్బాయి మరో గ్లాసు అందించాడు.

పాప నక్కడే కూర్చోబెట్టి మెల్లమెల్లగా పాలు తాగించింది ఝాన్సీ.

"థాంక్సండీ..........ఇంటర్వెల్లో డబ్బులి స్తాను...." అంటూ పాపనెత్తుకొని వెనుదిరి గింది.



తలుపుతీసి, కర్టెను తొలగించుకొని లోప లికి వచ్చింది. తలుపు తనంతట తానుగా మూసు కొంది.

లోపలికి ప్రవేశిస్తూనే ఆమె కళ్ళు తెరపైకి మళ్ళాయి. జరుగుతున్న సంఘటన ఏమిటో అర్థంగాలేదు. తన సీటుకోసం వెతకసాగింది ఝాన్సీ. రెండు మూడు నిముషాల ప్రయత్నం తరువాతగానీ సీటు కనిపించలేదు. వెళ్ళి కూర్చొంది. ఏకాగ్రతతో సినిమానే చూస్తూ వున్న భర్త హరి ఆమె పొలకువను గమ నించనేలేదు.

తెరపైని సంఘటన ఎంత ప్రయత్నించినా అర్థంగాక పోవడంతో "ఏం జరిగిదండీ?" అంటూ ప్రశ్నించింది ఝాన్సీ.

"ముందు సినిమా చూడు. ఇంటికెళ్ళిం తరువాత చెబుతాను" విసుక్కుంటున్నట్టుగా గొణిగేసి సినిమాను తదేకంగా చూడసాగాడు హరి.

ఆమె ముఖం చిన్న బుచ్చుకొంది.

సినిమాలో నాయకుడు నాయిక నెందుకో చావబాదుతున్నాడు.

భర్తకేసి చూసింది ఝాన్సీ.

కుర్చీలో హాయిగా కూర్చుని, కాళ్ళు బాగా చాచుకొని, శరీరాన్నే మరచిపోయి సినిమా చూస్తున్నాడు.

బిడ్డలపైన తల్లి కెంత బాధ్యతవుందో, తండ్రికీ అంతే బాధ్యతవుంటుంది. తాను అతనిలా ఫ్రీగా కూర్చోలేకపోతున్నందుకు కారణం ఒడిలోని పాప.

పడుకున్న పాపను అలాగే ఎత్తి అతడి ఒడిలో పడుకో బెడుతూ "కాస్సేపు పాపనెత్తుకోండి" అంది ఝాన్సీ ఆజ్ఞాపిస్తున్నట్టుగా.

అతడు భార్యకేసి ఓసారి తీక్షణంగా చూసి నీ సంగతి యిప్పుడు కాదులే అన్నట్టుగా పాపను పదిలంగా పట్టుకొని సినిమా చూడసాగాడు.

ఝాన్సీ కాళ్ళుబాగా చాచుకొని, చీర కుచ్చిళ్ళు సర్దుకొని, వ్రేళ్ళు ఓసారి విరుచుకొని పడుకొన్నట్టుగా కూర్చొంది.

ఒకటి... ..రెండు........నిముషాలు గడవసాగాయి.

పదిహేను నిముషాలు గడచాయి.

ఝాన్సీ సినిమాను అర్థం చేసుకోగలిగింది, కాబట్టి మళ్ళీ అందులో లీనమైపోయింది.

కానీ ఆ ఏకాగ్రతకు మళ్ళీ భంగం కలగక తప్పిందిగాదు.

పాప మళ్ళీ ఏడుపు మొదలెట్టింది.

హరికి గొంతుకవరకూ కోపం వచ్చింది. కానీ దాన్ని బయటపెట్టడానికి అది అనువైన చోటు కాదనుకున్నాడేమో—పాపను విసుగ్గా ఝాన్సీ చేతి కందిస్తూ "పాపను అప్పుడే ఎందుకు తీసుకొచ్చావు లోపలికి? నిద్రపోయిం తరువాత తీసుకొస్తే ఏం పోయింది? తీసుకెళ్ళు" అన్నాడు.

పొరబాటంతా తనదే అయినట్టుగా మాట్లాడుతున్న భర్త వైఖరిని చూడగానే ఝాన్సీకి చెప్పలేనంత కోపం వచ్చింది.

పాపనందుకొని సుడిగాలిలా పైకిలేచి బయటకు వచ్చేసింది.

పాపను భుజంపైన పడుకోబెట్టుకొని చేతితో వీపుపైన తట్టుతూ సముదాయించసాగింది. దాన్ని అలా సినిమాకు తీసుక రావడం మొదటిసారేంగాదు. ఇంతకు ముందు తాను నాలుగైదు సార్లు తీసుకొచ్చింది. కాని అప్పుడెప్పుడూ యిలా చేయలేదు. లేదంటే యింటర్వెల్లో పాలు తాగించేది. ఇప్పుడు గూడా ముక్కులదాకా తాగిందిగదా పాలు! మరెందుకిలా ఏడుస్తోంది!

తనను సినిమా చూడనివ్వకుండా చేయాలనే ఏడుస్తోందేమోననిపించగానే కోపంతో ఓసారి వేగంగా తట్టింది ఝాన్సీ. పాప రాగం శృతిమించి పోయింది.

తనకేసే చూస్తున్న టీ అంగడి అబ్బాయి కనిపించాడు. తన తొందరలో డబ్బులు తీసుక రావడం ఈసారి గూడా మరచిపోయింది. అంగడికి దగ్గరగా నడచి "ఈసారి గూడా మరచిపోయాను. ఇంటర్వెల్లో తెచ్చిస్తాను" అంది.

అతను తలవూపాడు.

ఇంటి దగ్గర పాప యిలా గుక్క తిప్పుకోకుండా ఏడ్చినప్పుడు—భుజంపైన వేసుకొని గదిలో పచార్లు చేయడం ఝాన్సీకి అలవాటు. అలాచేస్తే పాప వెంటనే నిద్రపోతుంది. కానీ సినిమా టాకీసులో పచార్లు చేయడం ఏంబావుంటుంది? అయినా తప్పనిసరి గావడంతో ఎవరూ చూడని చోటికి నడచి పచార్లు చేయసాగింది.

"ఇంటి దగ్గర హరి ఆదర్శాలు వల్లిస్తూంటే తానెంత మురిసిపోయేది! అంతా నిజమే ననుకొని ఆనందపడేది! కానీ అవసరంవచ్చినపుడు తెలుస్తోంది అసలు కథ. లేకపోతే పాప మాటిమాటికీ ఏడుస్తోంటే—ఒక్కసారయినా ఓదార్చగూడదూ? మాటిమాటికీ పో, పో— అంటూ తనను బయటికి పొమ్మనడమేనా? ఇకమీదట ఇలాగాదు—అనుకొంది ఝాన్సీ.

పాప నిద్రపోయింది.

లోపలికి వెడదామనుకొంది ఝాన్సీ. కానీ మళ్ళీ లేస్తుందేమోనన్న ఆలోచన రాగానే ఆగిపోయింది.

ఇంటర్వెల్ వదలినట్టున్నారు-

తలుపులు తెరుచుకున్నాయి.

పుట్టలోనుంచి బయటికివచ్చే చీమల మల్లే

బయటి కొస్తున్నారు అందరూ.

తనవైపుకే గబగబా నడచివస్తున్నాడు హరి.

ఆమె ముఖం ముడుచుకొంది.

"పాప నిద్రపోయిందా?" అంటూ పలకరించాడు.

ఆమె సమాధానం చెప్పలేదు.

"కాఫీ తీసుకరానా?" అన్నాడు.

"నా ముఖానికి కాఫీ ఒకటే తక్కువయ్యింది! టీ బంకులో పాపకు పాలు తాగించాను. వాడికి డబ్బులిచ్చి రండి." అంటూ అతడి ముఖంకేసి చూడకుండానే విసురుగా లోపలికివచ్చి కూర్చొంది ఝాన్సీ.

లోపలికి వచ్చే వాళ్ళతోనూ, బయటికివెళ్ళే వాళ్ళతోనూ హాలంతా సంతలావుంది. ఝాన్సీ మనస్సుగూడా చీకాకుగా వుంది.

"పాడు సినిమా. వచ్చి గూడా లాభం లేకపోయింది. తన ప్రాణానికి ఈ బిడ్డొకటి దొరికింది. ఒక సుఖమూలేదూ, ఏమీలేదు. ఈసారి ఏడిస్తే వెళ్ళనుగాక వెళ్ళగూడదు. వెళ్ళకుండా ఏం చెయ్యాలి? ఆయనగారి దగ్గరికిచ్చి తీసుకెళ్ళమనాలి. తీసుకెళ్ళను పొమ్మంటే ....తానూ పోగూడదు. మొండిగా కూర్చుని వుండాలి....పొమ్మని గద్దించి మాట్లాడితే.... ఏమైనా కానీ లెమ్మని వులక్కుండా పలక్కుండా వుండిపోవాలి. సినిమాలో కొట్టబోతే....హూ. ..తనకు మాత్రం ఆత్మాభిమానం లేదూ? లేచి గిరుక్కున వెళ్ళిపోవాలి. ఎక్కడికి వెళ్ళాలి? యింటికి....అవును.... యింటికి వెళ్ళిపోవాలి....చూడాలి....చూడాలి–ఈ మగవాళ్ళ కథేమిటో....తేల్చుకోవాలి...."

తెరమీదస్లయిడ్లువేయడం మొదలుపెట్టారు.

బేక్ గ్రౌండ్ మ్యూజిక్ మనుషుల్ని వూపుతోంది. హరి వచ్చి కూర్చున్నాడు.

"చాక్ లెట్" అంటూ గుప్పిట విప్పి చూపాడు.

"అక్కర్లేదు" అంది ఖచ్చితంగా.

హరి మౌనంగా ఒక చాక్ లెట్ కవరువిప్పి నోట్లో వేసుకున్నాడు.

ఇంకా మనుషులు మెల్లమెల్లగా లోపలికి వస్తూనే వున్నారు.

ఒకలావయిన వ్యక్తి....రెండు వరసలకు మధ్య వస్తోంది. ఆవిడ వెళ్ళడానికి- స్థల మివ్వడం కోసం కాళ్ల దగ్గరకు జరుపుకొంది ఝాన్సీ. అయినా ఆవిడకా స్థలం చాలలేదు. మనిషిని వెనక్కు నెడుతున్నట్టుగా ముందు కెళ్ళింది. హరిగూడా జాగ్రత్తపడ్డాడు. ఆ రాపిడికి పాప మళ్ళీ లేచి కూర్చొంది.

ఎక్కడో తగిలినట్లుంది. బేక్‌గ్రౌండు మ్యూజిక్కుకంటే శ్రావ్యంగా ఆలాపించ సాగింది పాప.

ఝాన్సీకి చెప్పలేనంత విసుగొచ్చింది.

'తాను అతడికిచ్చి బయటకు తీసుక పొమ్మ నాలి. వెళ్ళకుండా తననే తీసుకపొమ్మంటే- అతనిమాట వినగూడదు. బాగా బుద్ధి చెప్పాలి. తనను దురుసుగా ఏమయినా అంటే తానువెళ్ళి పోవాలి' అనుకుంటూ విసురుగా పాప నతడి ఒడిలోపెట్టి "బయటకు తీసుకెళ్ళండి" అంది.

ఆశ్చర్యం!

హరి పైకి లేచాడు.

ఝాన్సీ నిశ్చేష్టురాలై చూస్తూ వుండగా అతడు బయటికి నడిచాడు.

స్లయిడ్లు వేయడం పూర్తయినట్లుంది— సినిమా మళ్ళీ ప్రారంభమయ్యింది.

నిముషాలు గడుస్తున్నాయి.

తెరపైన ఏం జరుగుతూందో తెలుసుకోవా లన్న ధ్యాస ఆమెకు కలగలేదు.

అయిదు నిముషాలు గడచాయి.

హరి లోపలికి రాలేదు.

పదిహేనునిముషాలుగడచాయి. హరిరాలేదు.

తాను అనుకొన్న రీతిలో గాక, మరో విధంగా ఎదురైన పరిస్థితి ఆమెను విస్మయంలో ముంచి వేసింది.

ఇక మౌనంగా వుండలేకపోయింది ఝాన్సీ.

పైకి లేచి బయటకు నడచింది.

టీ కొట్టుబయట ఒక స్టూలు....ఆ స్టూలు పైన హరి....అతడి చేతుల్లో ఏడుస్తున్న పాప ....చేతిలోని కప్పును పాపనోటి దగ్గరగా పెడుతూ "తాగమ్మా! తాగు...." అంటూ అనునయిస్తున్నాడు అతను.

పాప వినడంలేదు.

చేతో కప్పును దూరంగా తోయడానికి ప్రయత్నిస్తోంది.

దూరంగా అలాగే రెండు మూడు నిముషాల సేపు నిలబడి చూస్తూవుండిపోయింది ఝాన్సీ.

హరితాగించడానికి ప్రయత్నిస్తూనేవున్నాడు.

పాప తాగడంలేదు.

గబగబా అతడి దగ్గరకు నడచి "మీరువెళ్ళి సినిమా చూడండి....నేను పాపను సముదా యిస్తాను" అంటూ అతడు విస్తుపోయి చూస్తూ వుండగా పాపను దగ్గరికి తీసుకొందిఝాన్సీ. □



కాదు సుమా కల!

కిరణ్మయీ సారథి



"నా రాజా వస్తాడు. మహదానందం తెస్తాడు" అని మనసు గొంతెత్తి పాడుతూంటే సిగ్గుతో మెలికలు తిరిగిపోతూ ముఖాన్ని చేతుల్లో దాచుకొని బోర్లా పడుకుంది కల్పన.

"వదినా! వదినా!" అంటూ గదిలోకొచ్చిన సుభద్ర కల్పన వాలకం చూసి నవ్వుకుంటూ——

"అన్నయ్య వచ్చేది రేపు. యిప్పట్నుంచే యీ సిగ్గునిలా వేస్ట్ చేయడం బాగా లేదో నా!" అంటూ కల్పన ప్రక్కన చేరింది.

"ఛీ. కొంటెపిల్ల" అని లేచి కూర్చొని చీరను కాళ్ళదాకా సర్దుకొని——

"నీకూ నిద్రపట్టడం లేదుకదూ!" అంది.

"అఫ్‌కోర్స్. అన్నయ్యను చూసి రెండేళ్ళవుతోంది. రేపుఅనేది యీ రోజే అయితే ఎంత బావుంటుందో ననిపిస్తోంది. అమ్మా నానగార్లు, తమ్ముళ్ళూ చెల్లాయిలుకూడా నిద్ర పోకుండా ఎప్పుడు తెల్లారుతుందా? ఎప్పుడు ఏర్‌పోర్ట్ కెళ్దామా అన్న తొందరలోనే వున్నారు." అని ఆగి కల్పనకేసి చిలిపిగా చూస్తూ——

"యిక మా వదిన సంగతి చెప్పఖ్ఖర్లేదనుకో" అంది.

"ఊఁ! చాల్లే" అంది కల్పన బుంగమూతితో.

"సరే నే వెళ్తున్నా వొదినా. అమ్మా నానగార్లతో కబుర్లు చెబుతూ నిద్రవస్తే పోతాను. మరి నువు తీయని కలల్లోకో, తీయతీయని జ్ఞాపకాల్లోకో వెళ్ళిపోవచ్చు. గుట్‌నైట్" అంటూ వెళ్ళిపోయింది సుభద్ర.

"కొంటెపిల్ల" అనుకొని, తన పడకమీదికి చేరుకొని ప్రక్కనే టీపాయ్ మీదున్న తన భర్త కిశోర్ ఫోటో నందుకొని - ముద్దుపెట్టు

కొని గుండెకు హత్తుకుంది.

"ఏయ్! ఫొటోలోంచికూడా చిలిపితనమేనా?" అని ఫోటోను చేత్తో ఎత్తి పట్టుకొని నవ్వుకుంటూ పెట సర్దుకుంది.

కిశోర్ - రాజేశ్వరి, రాజారావుగార్ల పెద్ద కొడుకు. మెడిసిన్ చదువుతుండగా ఉమెన్స్ కాలేజీలో బియస్సీ చదువుతున్న కల్పనతో పరిచయం కావడం—

"నే నెవరో, నీ వెవరో - నిన్నూ నన్నూ కలిపిందెవరో" అని డ్యూయెట్ పాడుకోవడం, యిరుపక్షాల పెద్దల అంగీకారంతో దంపతులు కావడం జరిగిపోయింది.

"దేవతల్లాంటి అత్తామామలు, మంచి స్నేహితుల్లాంటి నలుగురు ఆడబిడ్డలు, లక్ష్మణుల్లాంటి ఐదుగురు మరుదులు వున్న యీ పవిత్ర దేవాలయంలో పెద్ద కోడలి స్థానం పొందడం ఏ జన్మలో నోచిన ఎన్ని పుణ్యాల ఫలమో" అని తన అదృష్టానికి తాను పొంగిపోతుంటుంది కల్పన.

పై చదువులకోసం అమెరికాకు వెళ్ళాడు కిశోర్. రెండేళ్ళయిపోయాయి. సర్జరీలో ఫెలోషిప్‌తో వస్తున్నాడు. ఆ వస్తున్న వార్తను తెచ్చిన 'కేబుల్'ను మామగారు చూడకుండా ఎన్నిసార్లు హృదయానికి హత్తుకుందో మాటలు వచ్చి వుంటే ఆ కేబులే చెప్పి ఉండేది.

రెండేళ్ళ క్రితం....

కిశోర్, కల్పనల పెళ్ళయి సంవత్సరం దాటిపోయింది. ఆ రోజు రాత్రి పది గంటలు కావస్తోంది.

"అమ్మా కల్పనా! - యీరోజు పేపరిలా యిచ్చెళ్ళమ్మా?" పిలిచారు రాజారావుగారు.

న్యూస్‌పేపర్ తీసుకెళ్ళి ఆయన కందించింది.

"ఏమ్మా! మీ అత్తయ్య నిద్రపోతోందా?" అడిగారు.

"లేదు మామగారూ! భాగవతం ఎంటూ కూర్చున్నారు" అంది.

"మా పెద్దతల్లి సుభద్ర చదువుతోందా!"

"లేదండీ—నేనే" అంది కల్పన తలవంచుకునే.

నవ్వి—"వెళ్ళిరామ్మా! ఆలస్యమైతే యీ భాగవతంకన్నా నిద్రే హాయిగా వుంటుందని నిద్రలో కొరుగుతుంది మీ అత్తయ్య" అన్నారు రాజారావుగారు.

రుక్మిణీ కల్యాణ కథాఘట్టం రాగయుక్తంగా చదువుతోంది కల్పన.

"అంకిలి సెప్పలేదు చతురంగ బలంబుల
తోడ నెల్లియో
పంకజనాభ! నీవు శిశుపాల జరాసుతులన్
జయించి నా
వంకకు వచ్చి రాక్షస వివాహమునన్ భవ
దీయ శౌర్య మే
యుంకువ సేసి కృష్ణ! పురుషోత్తమ!
చేకొని పొమ్ము వచ్చెదన్"

"రుక్మిణీ! రుక్మిణీ!" మేడమీది గదిలోంచి కిశోర్ పిలిచాడు.

పై పంటితో పెదవి నొక్కుకుంటూ నవ్వు రానీకుండా అత్తగారికేసి చూస్తూ కూర్చుంది కల్పన.

"రుక్మిణీ అని వాడు పిలుస్తున్నాడు చూసి రామ్మా" అన్నారు రాజేశ్వరిగారు.

"యీ కథను వింటుంటా రత్తయ్యా" అంది ముసిముసి నవ్వుల్ని దాచుకుంటూ.

అవునేమో అనుకొని "తరువాత చదువమ్మా!" అన్నారు.

"కల్పనా! ఏయ్ కల్పనా! మధ్యాన్నంనుంచీ నా సెట్ కనబడ్డంలేదు. ఎక్కడుందో చూశావా?" మళ్ళీ పైనుంచి కేకలు వినిపించడంతో నవ్వు నాపుకోలేక పద్యం చదవనూలేక ఊరుకుండి పోయింది కల్పన.

గదిలోకి రాజారావుగారొచ్చారు.

"యింకా యిక్కడే వున్నావేమ్మా? వాడేదో వెదుక్కుంటూ దొరకడం లేదని పిలుస్తున్నాడు. వెళ్ళి చూడు" అన్నారు.

"యీ కళ్యాణ ఘట్టం పూర్తికానివ్వండి. అలోగా మీరెళ్ళి వాడికి వెతకడంలో సాయపడండి" అన్నారు రాజేశ్వరిగారు రుక్మిణీ కళ్యాణ ఘట్టంలో పూర్తిగా తన్మయులవుతూ.

"సంతోషించాంగానీ - నువ్వెళ్ళమ్మా! మీ అత్తయ్యకు నేను చదివి వినిపిస్తాలే" అన్నారు రాజారావుగారు.

అప్పటిగ్గానీ తన్మయత్వంలోంచి తేరుకో లేదు రాజేశ్వరిగారు.

కల్పనకేసి తిరిగి నవ్వుతూ— "వెళ్ళమ్మా! మీ మామయ్యగారు పద్యాలు పాడితే నిద్ర దానంతటదే వస్తుంది" అన్నారు.

"అంటే బాగా పాడలేననేకదూ" అన్నారు రాజారావుగారు.

"అని నేనన్నానా?" అంటూ నవ్వారు రాజేశ్వరిగారు.

వృద్ధదంపతులు ఒకరిమీద ఒకరు వేసుకునే విసుర్లకు నవ్వుకుంటూ లేచి సిగ్గుపడుతూ మేడ మీది గదిలోకి దారితీసింది కల్పన.

తన భర్త చిలిపితనాన్ని గుర్తుచేసుకుంటూ మొగ్గలు తొడిగిన సిగ్గు పరిమళాలు వెదజల్లే పూవుకాగా, అడుగులో అడుగైనా వడివడిగానే గదిలో కడుగుపెట్టి - కాలుగాలిన పిల్లిలా మెడలో స్టెత్ వేసుకొని తన గుండెను తానే చూసుకుంటూ రుసరుసలాడుతున్న కిశోర్‌ను చూసి - మెల్లగా తలుపు మూసేసి వెనగ్గా వెళ్లి కళ్ళు మూసింది.

చేతుల్ని విసురుగా లాగేసి—

"దేవీగారి పురాణ పఠనం అప్పుడే పూర్తయిందా?" కోపంతో రుసరుసలాడిపోతున్నట్టు అన్నాడు.

"స్టెత్‌కోసం పిలిచారుగా. అది దొరగ్గానే వెళ్ళి పూర్తిచేస్తాను" ఉడికించడానికని వెనక్కి తిరిగింది వెళ్ళబోతున్నట్టుగా.

జడను పట్టుకొని మీదికి లాక్కున్నాడు.

మత్తుగా ఒదిగిపోయింది కల్పన.

"యిదేనా మీ స్టెత్" అంది నవ్వుతూ.

"కాకపోతే యిదా?" అంటూ అందాకా తన మెళ్ళోవున్న స్టెత్‌ను టేబుల్ మీదికి గిరవాటేసి-

"యీ స్టెత్‌తో నా గుండెను పరీక్ష చేసుకుంటున్నాను చూడు" అని కల్పనను తనవైపుకు తిప్పుకొని గట్టిగా హత్తుకున్నాడు.

"అబ్బా! లైటు వెలుగుతోంది" అంది ముద్దుగా.

"ఉండనిద్దూ! అదేం సిగ్గుపడదు" అని పెదవుల్ని అద్దాడు.

కౌగిలిలోంచి పారిపోయి, లైటాఫ్ చేసి, కిశోర్ కౌగిలిలో కరిగిపోయింది కల్పన.

అలా ఎన్నో .... ఎన్నెన్నో .... గడిపిన తీయని పున్నమి రాత్రుల్ని గుర్తుచేసుకుంటూ మగత నిద్రలో కొరిగిపోయింది కల్పన.

* * *

తెల్లారింది.

యిల్లంతా పండగ రోజులా కళకళలాడు తోంది. ఎవరికివారే హడావిడిగా తమతమ పనుల్ని పూర్తి చేసుకుంటున్నారు. తొందరగా తెమలమని ఒకరినొకరు హెచ్చరికలు చేసుకుంటున్నారు.

అందరికంటే ముందుగానే తయారైన రాజారావుగారు రేడియో ముందు కూర్చొని చిన్న కొడుకు అడిగే ప్రశ్నలకు నవ్వుతూ సమాధానాలు చెబుతూ వార్తలు వినడానికి ట్యూన్ చేశారు.

"బొంబాయి నుంచి బయల్దేరిన బోయింగ్ 707 యాంత్రిక లోపంవల్ల బయల్దేరిన కాసేపటికే కూలిపోయిందని తెలియజేయడానికి విచారిస్తున్నాం. పైలట్లతో సహా ప్రయాణీకు లందరూ మృతిచెందిన వార్తను తెలపడానికి బాధపడుతున్నాం" అంటూ అందులో మరణించిన ముఖ్యులైనవారి పేర్లు చదువుతూ—

"అమెరికా నుంచి స్వదేశం తిరిగి వస్తున్న డాక్టర్ కిశోర్...."


"బాబూ!" అని గావుకేకవేసి కూలబడిపోయారు రాజారావుగారు.

"నాన్నగారూ" అంటూ కిశోర్ తమ్ముళ్ళు, చెల్లెళ్ళు, "ఏమండీ!" అంటూ రాజేశ్వరి ఒక్కసారిగా అరిచారు.

"అయిపోయిందమ్మా! అంతా అయిపోయింది. మీ అన్నయ్య .... మన కిశోర్ విమాన ప్రమాదంలో...."

"బాబూ! భగవాన్!" అంటూ రాజేశ్వరిగారు వున్నపాటున పడిపోయారు.

"వదినా!" ఏడుస్తూ కేకేసింది సుభద్ర.



ఆ సరికే మేడమెట్ల మీంచి కాలుజారి దొర్లి పడిపోయింది కల్పన.

అప్పటిదాకా సంతోషాన్ని మూటగట్టుకున్న ఆ యిల్లు సర్వస్వం శోకదేవతకు నిలయ మయింది.

విషాదం విలయతాండవం చేస్తోంది. ఆ వికృత నాట్యం క్రింద ఆ కుటుంబంలోని హృదయాలు నిర్దాక్షిణ్యంగా నలిగిపోతున్నాయి.

స్పృహ తప్పిన కల్పనకు ఉపచారాలు చేస్తూ కూర్చున్నారు సుభద్ర, మిగతా పిల్లలు.

రాజేశ్వరి, రాజారావుగార్లకు భవిష్యత్తంతా అంధకారంగా కనిపించసాగింది. ఆశలన్నీ నేలరాలాయి.

పచ్చని పందిరి విధి వీచిన ప్రళయ ఝంఝకు నేలమట్టమయింది. పెళ్ళయి మూడేళ్ళయినా దాటని కల్పన బ్రతుకు అడవి గాచిన వెన్నెల కావలసిందేనా?

"భగవాన్! ఎందుకిలా చేశావ్?" అని నుదురు పట్టుకున్నారు రాజారావుగారు.

కల్పన దగ్గరికి చేరి ఒళ్ళోకి తీసుకొని ఏడుపును నిగ్రహించుకుంటూ తల నిమురుతూ, కల్పనకు స్పృహ వచ్చింతరువాత స్థితి నెలా తట్టుకోవాలా అని కుమిలి పోతున్నారు రాజేశ్వరిగారు.

"టెలిగ్రాం" అన్న కేకకు ఒక్కసారిగా అందరూ ఉలిక్కిపడ్డారు.

"కష్టాలుగానీ, నష్టాలుగానీ ఒంటరిగా రావంటారు, యీ టెలిగ్రాం ఎలాంటి సందేశం మోసుకొచ్చిందో" ననుకొని—

"ఏమైనా యింతకంటే పెద్ద నష్టమూ, కడుపుకోతా మాత్రం అయి ఉండదు" అని తనను తాను సర్ది చెప్పుకున్నారు రాజారావు గారు.

కిశోర్ పెద్ద తమ్ముడు కృష్ణప్రసాద్ వెళ్ళి సంతకంచేసి టెలిగ్రామ్ తీసుకొచ్చి రాజారావు గారి కందిచాడు.

రాజారావుగారి చేతులు వణికాయి. తిరిగి తన కొడుక్కిచ్చి-తలపట్టుకొని "నువే చదువ్" అన్నారు.

వణికే చేతులతో టెలిగ్రాం చింపి చదివి-

"డాడీ" గట్టిగా అరిచాడు ప్రసాద్.

"మరో ప్రమాదమై ఉంటుంది, వినడానికి గుండె దిటవు పరచుకోవాల్సి ఉంటుంది" అనుకొని చలనం లేకుండా కూర్చున్నారు రాజా

రావుగారు,

కృష్ణప్రసాద్‌కేసి ఆతృతగా చూస్తున్నా రందరూ!

"డాడీ" మాటలు పెగలడంలేదు, కళ్ళల్లో నీరు సన్నటి పొరలా చదవడానికి అడ్డుతగులు తుండగా తుడుచుకొని నవ్వుతూ,

"డాడీ....డాడీ! యిది అన్నయ్య యిచ్చిన టెలిగ్రాం, ఫ్లయిట్ మిస్సయిందిట, రైల్లో వస్తున్నాను స్టేషన్‌కు రమ్మని యిచ్చాడు. అమ్మా! వదినా! అన్నయ్య....అన్నయ్య విమాన ప్రమాదంలో చిక్కుకోలేదు........" సంతోషంతో మాటలు మరి పెగల్లేదు.

ప్రసాద్ చేతిలోని టెలిగ్రాంను గబుక్కున తీసుకున్నారు రాజారావుగారు.

"మిస్డ్ ది ఫ్లయిలట్. కమింగ్ బై ట్రెయిన్ రిసీవ్ అట్ సికింద్రాబాద్ స్టేషన్ టు నైట్-కిశోర్"

"బాబూ! బాబూ!...." "భగవాన్! ఎంతటి కరుణామూర్తివయ్యా!" అని కళ్ళద్దాలు తీసి కళ్ళు తుడుచుకొని చేతులు జోడించారు రాజా రావుగారు.

అందరి కళ్ళల్లోనూ దూకడానికి సిద్ధంగా కన్నీళ్లు.

అత్యంత విషాదానికీ, అత్యంత సంతోషానికీ—రెండింటికీ వచ్చేవి కన్నీళ్ళే!

నమ్మాలో నమ్మకూడదో ననుకున్నా చేతిలోని టెలిగ్రాం "అబద్ధంకాదు" అని హెచ్చరిస్తుండడంతో అందరి మనసులూ శాంతించాయి. సాయంత్రం ఎప్పుడవుతుందా? అసలు నిజంగా కిశోర్‌ను ప్రాణాలతో చూడగలమా లేదా అన్న సందేహం, ఆదుర్దా అందరిలోనూ తీవ్ర స్థాయిలో కనిపించింది. టెలిగ్రాంరావడం అందరికీ కలలాగే అనిపించసాగింది. ఎవరికి వారే కుదుట పడడానికి ప్రయత్నిస్తున్నారు.

* * *

రాత్రి ఎనిమిది గంటలకల్లా రాజారావుగారి కుటుంబ సభ్యులందరూ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ చేరుకున్నారు. బొంబాయినుంచి రైలు రావడానికి యింకా గంటన్నర పైమున్నా—యింట్లో కాలు నిలవక ఆదుర్దా ఏదో స్టేషన్ లోనే ఎక్స్‌పీరియన్స్ అవుదామనుకొనివచ్చారు.

ముఖాల్లో దైన్యం పూర్తిగా తొలగలేదు.

"తీరా రైలొచ్చేసిం తరువాత అందులో కిశోర్ లేకపోతే—మైగాడ్! వెధవ అనుమానాలన్నీ యిలాంటి సమయాల్లోనే వస్తాయి" అని తనలో తానే తర్జన భర్జనలవుతూ ఆ చివర నుంచి యీ చివరదాకా ప్లాట్‌ఫారమ్మీద తిరుగుతున్నారు రాజారావుగారు.

రాజేశ్వరిగారు, ప్రక్కనే కల్పన, అటు ప్రక్కన సుభద్ర, మిగిలిన చెల్లెళ్ళు, చిన్న తమ్ముళ్ళూ కూర్చున్నారు.

కృష్ణప్రసాద్ మరి యిద్దరు తమ్ముళ్ళు అటూ యిటూ తిరుగుతూ బొంబే ట్రెయిన్ లేట్‌గా వస్తోందా అన్న అనుమానాన్ని నివృత్తి చేసుకోవడానిగ్గానూ మాటిమాటికీ ఎంక్వయిరీ కౌంటర్‌కు వెళ్తున్నారు.

నత్త నడకలా నడుస్తున్న గడియారాన్ని చూస్తూ ఎవరికి వారే తిట్టుకుంటున్నారు.

తొమ్మిది. తొమ్మిదింబావు. అందరి గుండెల్లోనూ రైలు పరుగెడుతోంది. ఆదుర్దాను కప్పి పుచ్చుకుంటున్నారు. ఆదుర్దాను వ్యక్తం చేస్తున్న చెమటను చికాకుపడుతూ తుడుచుకుంటూనే ఉన్నారు.

తొమ్మిదిన్నర! కాసేపట్లో బొంబాయి నుంచి వస్తున్న ట్రెయిన్ ప్లాట్‌ఫారమ్మీదికి రాబోతున్నట్టు ఎనౌన్స్‌చేశారు.

అందరూ లేచి నిలబడ్డారు. దూరంనుంచి రైలుకూత వినిపించింది.

అందరి భవిష్యత్తును, కమ్మని కలలను, అంతకుమించిన కమ్మని నిజాన్ని నిర్ణయించ గలిగిన రైలు.

వచ్చేసింది. అందరి కళ్ళూ రైలుమీదే. కిశోర్‌కోసం పిచ్చిగా, ఆశగా వెదుకుతున్నకళ్ళే.

తలుపు దగ్గర నిలబడి చిరునవ్వులు చిందిస్తూ,

"అమ్మా! నాన్నగారూ! కల్పనా! కృష్ణా! బాబీ" యిలా అందరినీ పేరు పేరునా పిలుస్తుండగా కోలాహలంలో ఆ పిలుపులు గాలిలో కలిసిపోయాయి,

అందరిలోనూ సంతోషం ఒక్కసారిగా

(వి) చిత్ర విజ్ఞానం



నెదర్‌లాండ్స్, ఇస్రాయిల్, స్విట్జర్‌లాండుల్లో గుడ్డి వాళ్ళకి ఒక చక్కటి సౌకర్యం కలిగించారు. ఆ దేశాల్లోని కరెన్సీ నోట్లమీద చిన్న గుండ్రటి బొటిపె లుంటాయి. వీటిని తాకి లెక్కపెట్టి, కరెన్సీ నోటు విలువ గ్రహించ వచ్చు!

పెల్లుబికింది.

ప్రసాద్ ఆ కంపార్టుమెంటు వెంట పరుగెత్తాడు. అనుసరించారందరూ. మళ్ళీ తమ దగ్గర్నుంచి కిశోర్‌ను ఎక్కడ దూరంచేస్తుందో నన్న భయంతో అధిగమించిన సంతోషంతో కంపార్టుమెంట్‌లోంచి కిందికి దిగిన కిశోర్‌ను చుట్టుముట్టారు.

తల్లిదండ్రుల పాదాలకు ప్రణమిల్లాడు. చెల్లాయిల్ని తమ్ముళ్ళను అక్కున చేర్చుకున్నాడు.

అధిగమించిన సంతోషంతో ఏ ఒక్కరికీ నోరు పెగల్లేదు. కళ్ళల్లో సుడులు తిరుగుతున్న నీళ్ళు. ముఖాల్లో ఆనందం. మాట్లాడాలని పెదవులు పడుతున్న యిబ్బంది. మాటల్లో వ్యక్తం చేయలేని అనుభూతి అది.

కిశోర్ - చెమ్మగిల్లిన కళ్ళు తుడుచుకొని నవ్వుతూ....

“ఈ ఉదయం జరిగిన విమాన ప్రమాదాన్ని గురించి పేపర్లోచూసి గుండెపగిలిందేమో ననుకున్నాను. మీ అందరి స్థితి ఊహించుకోలేక తల్లడిల్లిపోయాను. ఆ సరికే నేను రైల్లో వుండడంవల్ల నా సంగతి ఫోన్‌ద్వారానైనా తెలపలేకపోయాను. అయినా నే నదృష్టవంతుణ్నమ్మా! అవున్నాన్నగారూ!” అన్నాడు రాజారావుగారి గుండెలో ఒదిగిపోతూ.

“అవును బాబూ! మన మందరమూ అదృష్టవంతులమే. అదంతా కల్పన నోచిన నోముల పుణ్యఫలం” అన్నారు రాజేశ్వరిగారు.

“కల్పన. నా కల్పన” అనుకొన్నాడు. కల్పనకోసం వెదికాయి కిశోర్ కళ్ళు.

అందరూ కల్పన కోసం వెనక్కి తిరిగారు.

కిశోర్‌ను చూసిన సంతోషాన్ని తట్టుకోలేక దూరంగా స్తంభాన్నానుకొని, దూకుతున్న కన్నీటి నాపుకోకుండానే పిచ్చి ఆనందంతో అందరినీ; తనివితీరా కిశోర్‌నూ చూసుకుంటోంది కల్పన.

“కల్పనా!” అంటూ కల్పనకేసి పరుగెత్తాడు కిశోర్.

అప్పటి కందరూ తేరుకొని కళ్ళు తుడుచుకోవడంలో మునిగి పోయారు.

కిశోర్ కౌగిలో కల్పన.

“ఏమండీ! మీరు....మీరు” అని మాట్లాడలేక గుండెలో తలదాచుకొని గట్టిగా ఏడ్చేసింది కల్పన

“పిచ్చి కల్పనా! నాకేమీ కాలేదుగా. నీ నుంచి నన్నెవరూ దూరం చేయలేరు.” అని మరింత గట్టిగా గుండెకు హత్తుకున్నాడు కిశోర్.

వేయి దీపావళుల కాంతి ఆ కుటుంబ సభ్యులందరి ముఖాల్లోనూ తాండవించింది.

కిశోర్ కౌగిలిలో గువ్వలా ఒదిగిపోయింది కల్పన.

“మనసున మల్లెల మాలలూగెనే......”

దూరంగా ఎక్కడ్నుంచో వస్తున్న పాట విని, తలెత్తి కిశోర్ కళ్ళల్లోకి సూటిగా చూసి, అందరూ తమనే గమనిస్తుండడం గమనించి సిగ్గుపడి కౌగిలిలోంచి విడిపించుకొని దూరంగా జరిగింది కల్పన.

“కాదు సుమా కల” అని నవ్వుకుంటూ అందరూ బయటి క్కదిలారు. □

సీరియల్

పడమటి సంధ్యారాగం



మల్లాది వెంకటకృష్ణమూర్తి

జరిగిన కథ

సత్యమూర్తి జీవితంలో క్షణక్షణం ఎదురుదెబ్బలు తింటున్నాడు. మొదటి భార్య విచిత్రమైన పరిస్థితుల్లో మాయమైంది. తర్వాత చేపట్టిన రెండో భార్య ప్రియంవద శీలం మంచిది కాదన్న అనుమానంతో కృంగిపోతున్నాడు. బస్సులో పరిచయమయిన ప్రవీణ ఆటో యాక్సిడెంట్‌లో మరణించడంతో మనిషిలో వైరాగ్యపు భావాలు అధికమయాయి సత్యమూర్తిలో. మాణిక్యశాస్త్రిలు ఈ పరిస్థితుల్లో వెలుగు చూపించాడు. ప్రియంవదకి నిజంగా మరొకరితో సంబంధం ఉన్నదా అన్నది రూఢీ పరచుకొనేందుకు ప్రయత్నించాడు సత్యమూర్తి.

బాబుని ఎత్తుకొని బయటకి వెళ్ళడం అంతకు మునుపెన్నడూ చేయలేదు సత్యమూర్తి.

దారిలో ఆగివున్న ఆటో ఎక్కి- సత్యమూర్తి ఆటోడ్రయివర్‌కి తను వెళ్ళవలసిన చోటు, చిరునామా చెప్పాడు.

ఇరవై నిముషాల తర్వాత ఆటో ఓ చిన్న ఇంటి ముందు ఆగింది, మాడేపల్లిలో.

ఆటోని వుండమని చెప్పి సత్యమూర్తి బాబుని భుజాన వేసుకుని గేటు తెరుచుకొని లోపలికి వెళ్ళాడు.

ఆ ఇంటి కాంపౌండ్‌లో కుడివైపు వున్న చిన్న ఆర్.సి.సి. ఇంటి గుమ్మా

నికి వేళాడుతోన్న బోర్డ్ సత్యమూర్తి కంట పడింది.

నల్లటి ప్లాస్టిక్ పలకమీద తెల్లటి అక్షరాలు అతికించి వున్నాయి.

'సుగుణరావు యం. ఇ.'

తలుపు దగ్గరకి వేసివుంది.

తలుపు తెరుచుకొని లోపలకి వెళ్లాడు.

ఓ ముప్పైఅయిదేళ్ళ యువకుడు పరచివున్న చాపమీద కూర్చునివున్నాడు. చేతిలో బీర్ గ్లాస్ ప్రక్కన ఖాళీ అయిన రెండు బీర్ బాటిల్స్ వున్నాయి. కాళ్ళ దగ్గర ఓపెనర్ పడివుంది. మిరపకాయ బజ్జీలు చిన్న న్యూస్‌పేపర్‌లో వున్నాయి.

అతన్ని చూడగానే గుర్తుపట్టినట్లుగా సత్యమూర్తి భుజంమీదనుంచి బాబు అతని మీదకి వురికాడు నవ్వుతూ.

"మీరు...."

తత్తరపడుతూ చూసాడు అతను. క్షణాల్లో అతని మొహం పాలి పోయింది.

సత్యమూర్తి సూటిగా అతని కళ్ళ లోకి చూసాడు. ఆ చూపు గుచ్చుకున్న ట్లుగా అతను తన కళ్ళు పక్కకి తిప్పు కున్నాడు.

కొన్నిక్షణాలు నిశ్శబ్దంగా గడిచి పోయాయి ఆ గదిలో.

సత్యమూర్తి అతనిమీదకి వురికిన బాబుని మళ్ళీ అందుకున్నాడు.

అతను లేచి నిలబడి తల వంచు కున్నాడు.

సత్యమూర్తి ఆ గదిలో పగిలివున్న ఎర్రటి గాజుముక్కలని చూసాడు. టేబిల్ ప్రక్క కిటికీమీద వున్న షెల్ఫ్‌లో పుస్త కాల ముందువున్న ఎర్రటిబొట్టు పెన్సిల్, ఐటెక్స్ డబ్బా ఆ పక్కనే కొద్దిదూరంలో వున్న పౌడర్‌డబ్బా చూసాడు.

"మీది ప్రియంవద వూరు కదా?"

తల వూపాడతను.

"పూర్వపరిచయమా?"

"అవును."

గిరుక్కున వెనక్కి తిరిగి బయటకి నడిచాడు సత్యమూర్తి.ఆగివున్న ఆటోలో ఎక్కి చెప్పాడు.

"స్టేషన్."

"పోలీస్‌స్టేషనా?"

"కాదు రైల్వేస్టేషన్."

వేగంగా వెళ్తోంది ఆటో. సత్య మూర్తి గుండెలో అగ్ని పర్వతాలు పగులుతున్నాయి. ఇంతదాకా తన భార్య ప్రియంవద తప్పు చేయటంలేదేమోనన్న ఆశ ఎక్కడో మిణుకు మిణుకుమం టోంది. అదిప్పుడు పూర్తిగా ఆరి పోయింది.

ఆరిపోయి కొత్త మంట రగిలింది.

రగులుతోంది.

సత్యమూర్తి గుండె మండుతోంది.

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఆవర ణలో ఆగింది ఆటో. పదిరూపాయల నోటు ఇచ్చి చిల్లరకోసం ఎదురుచూడ కుండా లోపలకి వెళ్ళాడు సత్యమూర్తి.

ప్లాట్‌ఫారం టిక్కెట్ కొన్నాడు కౌంటర్‌ముందు ఆగి. కొంటూ అడిగాడు బొంబే వెళ్ళే బండి ఏ ప్లాట్‌ఫారంలో ఆగి వుందో.

ప్లాట్‌ఫారం లోపలకి వెళ్ళి కొద్ది నిముషాలు నిలబడి ఆలోచించాడు కళ్ళు మూసుకొని.

మాణిక్యశాస్త్రులు మాటలు గుర్తుకు

వచ్చాయి.

"నీ భార్యమీద ప్రతీకారం చేసే వుద్దేశం పెట్టుకోకు. పగ ద్వేషాలు అస లుండకూడని స్పందనలు. అవి నెమ్మ దిగా, రహస్యంగా ఆత్మహత్యకి, లేదా హత్యకి వుపయోగపడే గుళికల్లాంటివి. నిన్ను పిచ్చివాడిని చేస్తుంది కసి. చివరికి నిన్ను నీ చుట్టుప్రక్కల వాళ్ళనీ దహించి వేస్తుంది. నీవు ఆర్పలేని జ్వాలని నీవే రగిలించికొన్నట్లవుతుంది. మొక్కలో త్రుంచకపోతే అది మానయి నిన్ను కృంగతీస్తుంది.

సత్యమూర్తి శతవిధాల మనసుని తన అదుపులో వుంచుకొని ప్రియంవద తను తీర్చుకోబోతున్న కక్షని మరచిపోవాలను కొన్నాడు.

కాని సాధ్యపడలేదు. మనసు తను చేయబోయే పనిమీదే లగ్నం అయింది.

బొంబే ఎక్స్‌ప్రెస్ ఆగివున్న ప్లాట్ ఫారంమీదకి వెళ్ళాడు. రైలుని చూసి వుత్సాహంగా చప్పట్లు కొట్టాడు బాబు.

సత్యమూర్తి ఓ టూ టయిర్ కంపార్ట్‌మెంట్‌లోకి యెక్కాడు. బాబుని చిచ్చికొడుతూండిపోయాడు. పది నిముషాల్లో నిద్రపోయాడు బాబు. వంగుని బాబుని ఓ సీటుకింద పడుకో పెట్టి, అడ్డుగా సూట్‌కేస్ ఒకరిది వుంచాడు ఎవరూ చూడకుండా.

తర్వాత రైలు దిగి గబగబా స్టేషన్ లోంచి బయటకి వచ్చాడు. గుండెనిండా బాధ అలా చేసినందుకు. అయినా సత్య మూర్తిలోని పగముందు ఆ బాధ ఎక్కు వగా బాధించలేదు.

ఆటోలో ఇంటికి చేరుకున్నాడు రాత్రి తొమ్మిదిన్నరకు.

గుమ్మం దగ్గర కూర్చుని వుంది ప్రియంవద పక్కింటి వాళ్ళతో కబుర్లు చెప్తూ.

"బాబేడీ?" అడిగింది ప్రియంవద భయంగా.

సత్యమూర్తి పడకగదిలోకి వెళ్ళి బ్రీఫ్‌కేస్‌లో రెండుజతల బట్టలు, టూత్ పేస్ట్, బ్రష్, సబ్బు,తువ్వాలు సర్దుకున్నాడు గబగబా!

"మిమ్మల్నే బాబేడీ?" అడిగింది ప్రియంవద వెనకాలే వచ్చి.

ఆ కంఠంలో, భయం, కోపం, బాధ మిళితమయివున్నాయి. కొద్దిపాటు వణుకు కూడా వుంది.

సత్యమూర్తి దిగులుగా నవ్వాడు. జవాబు చెప్పలేదు. గోడకి వేలాడుతున్న బాబు ఫోటోతీసి నేలపై కొట్టి పగలగొట్టి లోపలనుంచి ఫోటోతీసి భార్య కళ్ళ ముందే ముక్కలు ముక్కలుగా చింపేసాడు.

ఆశ్చర్యంలోంచి ప్రియంవద తేరుకునే ముందే అలమారలోని ఆల్బం తెరచి గబగబా బాబు ఫోటోలు తీసి వాటిని కూడా చింపేసేడు పరపరా.

"బాబేడీ?"


గొంతు చించుకుని అరిచింది ప్రియంవద.

సత్యమూర్తి గుమ్మంవైపు కదిలాడు మళ్ళీ.

"నిన్నే. ఏం చేసావ్? ఏడి నా బాబు?"

సత్యమూర్తి చొక్కా పట్టుకుని అడి గింది సత్యమూర్తిని ప్రియంవద.

సత్యమూర్తి నోరు మెదపలేదు.



"చెప్పు చెప్పు ఏం చేసావ్?"

సత్యమూర్తి గుండెల మీద బలంగా రెండు చేతులతో బాదుతూ అడిగింది.

"ఇంకెన్నడూ నాకూ, నీకూ కనబడడు."

"అంటే?" ఆగి అడిగింది వణుకుతూ, ఏడుస్తూ.

"చంపేసారా?"

"లేదు."

"మరి? ఏమయాడు?"

"ఓ రైల్లో ఏదో వూరు వంటరిగా వెళ్తున్నాడిప్పుడు. రైలెక్కించేసాను."

"ఏ వూరు?"

"నాకు తెలియదు."

పిల్లలకి పాలిస్తున్న తల్లిపులికి గుండె దెబ్బ తగిలితే అరిచినంత భయంగా, భీకరంగా అరిచింది ప్రియంవద రెండు చేతులతో చెవులు గట్టిగా మూసుకుని.

తర్వాత దెబ్బతిన్న పులిలా భర్తమీద పడి చేతులతో ఇష్టం వచ్చినట్లు బాదుతూ ఏడుస్తూ అరవసాగింది.

"బాబు నీకు పుట్టాడు. బాబు నీకు పుట్టాడు. నువ్వు రాక్షసుడివి. నువ్వు.... నువ్వు దుర్మార్గుడివి. నువ్వు హంతకుడివి."

ప్రియంవద అరుపులకి చుట్టుప్రక్కల వాళ్ళు పరిగెత్తుకుంటూ వచ్చారు. భర్త మీద పడి బాదుతున్న ప్రియంవదని బలంగా పట్టుకుని పక్కకు తీసుకు వెళ్ళారు ఆడవాళ్ళు.

సత్యమూర్తి అందరూ అడిగే ప్రశ్నలకి సమాధానం చెప్పకుండా గబగబా బయటికి నడిచాడు.

తొమ్మిది నెలలలో ప్రేమ చేయగలిగింది కొన్ని నిముషాల్లో ద్వేషం నాశనం చేసేసింది.

ద్వేషం పగ చల్లారితే పశ్చాత్తాపం కలుగుతుంది మనిషికి, ఒక్కసారి తను

చేసిన పని తలచుకొంటే. కసి తీరడానికి ఒకటే మార్గం. క్షమించగలిగే హృదయం కలిగివుండటం.

అది లేకపోతే, తనకు ద్రోహం చేసిన వ్యక్తిని, ప్రతీకారంగా, మనస్థాపానికి గురిచేయడం మరోమార్గం. సత్యమూర్తికి క్షమించే హృదయం వుంది.

తన అక్కబావలని, మేనకోడలుని, మేనల్లుడిని దారుణంగా హత్యచేసి వాళ్ళ ఆస్తినంతా దోచుకుపోయిన వ్యక్తిని పట్టుకున్నా నిర్వికారంగా నిశ్చలంగా వాళ్ళవంక చూడగలడు.

వాళ్ళని చిరునవ్వుతో క్షమించి, కించిత్‌హాని కూడా తల పెట్టకుండా వదిలేయగలడు. మానసికంగా సత్యమూర్తి ఆ స్థితికి ఎదిగాడు మాణిక్యశాస్త్రిలు బోధనలని విన్న రోజునుంచి

కాని తన రెండోభార్య ప్రియంవదని మాత్రం క్షమించలేకపోయాడు. మనసుని ఎంత భావరహితంగా వుంచుకోవాలని ప్రయత్నించినా ఆ ఒక్క విషయంలో సత్యమూర్తికి మనసు ఎదురుతిరిగింది.

ఆ ఒకేఒక్క విషయంలో ఓడిపోయాడు. మనసుని స్థిరంగా వుంచుకోలేకపోయాడు. ఫలితంగా తామిద్దరి వరాల పంటగా పుట్టిన బాబుని వూహించలేని వాడికి ముందేం జరుగుతుందో వూహించలేని-కష్టాలకి గురిచేసాడు.

నిజానికి సత్యమూర్తి తన కొడుకు డుంబుగాడి గురించి ఆలోచించలేదు. భవిష్యత్ ఏమవుతుంది, తనుచేసే దారుణంవల్ల జరిగే ఫలితం ఏమిటి అన్న విషయం స్ఫురణకి రాలేదు.

కేవలం అందువల్ల తన రెండోభార్య ఏమవుతుంది. అన్న విషయమే అతని మనసులో నాటుకుంది.

తన వియోగం భరించి బ్రతకగలదు కాని, అమితంగా ప్రేమించే తన కొడుకు తనకి దూరమయి ఎన్ని బాధలు పడుతున్నాడో అనే స్పృహే,ఆ జ్ఞాపకమే,-ఆ ఆలోచనే ప్రియంవదని కృంగదీస్తుంది. బ్రతికివున్నంత కాలం ఆ బెంగ తన భార్యని నిలువునా కృంగదీస్తుందని తెలుసు సత్యమూర్తికి. తనంతట తను దూరమయితే ఆ డుంబుగాడి దగ్గరున్నంత కాలం కొద్దిలోకొద్ది ఓదార్పు కలుగుతుంది.

చచ్చేలోపల ప్రియంవద మనస్ఫూర్తిగా ఒక్కసారయినా అయ్యో! ఆయనకి అన్యాయం చేసానే? అని బాధపడాలి. అలా జరగాలంటే, సత్యమూర్తి మనసుకి తట్టినదారి అతను చేపింది ఒక్కటే.

ఇంటినుంచి, చేతిలో బ్రీఫ్‌కేస్‌తో బయటికి వచ్చి నాలుగయిదు ఫర్లాంగులు నడిచాక ఎక్కడికి వెళ్ళాలో తోచలేదు సత్యమూర్తికి.

మనసంతా గజిబిజిగా వుంది. చాలా కాలం తర్వాత మనసంతా గజిబిజిగా వుంది మళ్ళీ. శ్రీవల్లి గుర్తుకువస్తోంది మళ్ళీ మళ్ళీ వద్దనుకున్నా.

అకస్మాత్తుగా భగవద్గీత చదవాలనే కోరిక కలిగింది. ఇంట్లోవుంది తన పుస్తకం. వెంటనే వెనక్కి తిరిగాడు.

ఇంటికి కాదు.

తను పనిచేసే లైబ్రరీవైపు నడవ సాగాడు. ఆ రాత్రి ఎక్కడ గడపాలి అన్న ప్రశ్నకి లైబ్రరీ సమాధానంగా కనిపించింది సత్యమూర్తికి.

ఆ రాత్రి గడిపితే చాలు.

నడుస్తూ ఆలోచించాడు తన జీవితంలో తను భరించలేని మానసికవేదన అనుభవించిన క్షణం ఏదా అని.

శ్రీవల్లి ఇక కనపడదని తెల్సినరోజు అది.

ఎంతో హాయిగా అనిపించిన క్షణం?

తన పుట్టిన రోజు నాడు తలంటిపోసి, శ్రీవల్లి స్వయంగా తువ్వాలతో తల తుడిచి, వళ్ళో పడుకోపెట్టుకున్న క్షణం.

నవ్వుకున్నాడు సత్యమూర్తి.

లైబ్రరీ ముందు ఆగాడు. లైబ్రరీవున్న కాంపౌండ్ వాల్‌కున్న పెద్ద ఇనపగేటు మూసివుంది. లైబ్రరీకున్న పెద్ద గాజు తలుపులోంచి ట్యూబ్‌లైట్ వెలుగు పడుతోంది బయట పోర్టికోలోకి.

ఇనపగేటు తెరచుకొని లోపలకి వెళ్ళాడు. గేటుకీ, లైబ్రరీ గుమ్మానికీ మధ్యవున్న లాట్‌లో వాచ్‌మన్ కూర్చుని చుట్ట తాగుతున్నాడు.

"కౌన్ హై?"

దూరంనుంచే అడిగాడు లేస్తూ.

సత్యమూర్తి వెలుగులోకి రాగానే చూసి చటుక్కున సిగరెట్ పారేశాడు.

"ఆదాబర్సే సాబ్" అన్నాడు సలాం చేస్తూ.

సత్యమూర్తి లైబ్రరీలోకి నడుస్తూ చెప్పాడు.

"ఈ రాత్రి నేను లైబ్రరీలోనే వుంటాను."

"పని చేస్తారా?"

జవాబు చెప్పలేదు. గాజు తలుపు తోసుకుని లోపలికి నడిచాడు సత్యమూర్తి.

వాచ్‌మన్ కూడా రాబోయాడు.

"అవసరంలేదు. నాకు టీ లాంటివేమీ అక్కరలేదు. డిస్టర్బ్‌చేయక" చెప్పాడు.

విశాలమయిన హాల్‌లో ట్యూబ్‌లైట్ తాలూకు కాంతి పడుతోంది. ఆ హాలు మధ్యలో గోడకి ఆనుకుని వుంది పుస్తకాలు తీసుకుని, ఇష్యూ చేసే కౌంటర్. కౌంటర్ ప్రక్కనే ఎలక్ట్రిసిటీ పోతే వెలిగే ఆటోమెటిక్ దీపం, కొద్ది దూరంలో తపాళాబిళ్ళలు ప్రదర్శనకోసం వుంచిన పేనల్ స్టేండ్స్.

పూర్తిగా నిశ్శబ్దంగావుంది. గోడకున్న బోర్డుకి వేలాడుతున్న తాళం చెవులలోంచి ఓ తాళంచెవి తీసుకుని పుస్తకాలుంచే హాలు వైపు నడిచాడు. తాళంతీసి లోపలకి వెళ్ళాడు.

చీకటిగావుంది లోపల. తలుపుపక్కనే వున్న స్విచ్‌లు వేసాడు. ట్యూబ్‌లైట్లు క్షణాలలో వెలిగాయి. విశాలమయిన ఆ హాలంతా కాంతితో నిండిపోయి, బారులు తీర్చివున్న పుస్తకాల రేక్‌లు వరసగా కనబడ్డాయి.

ఓమూల విజిటర్స్ కూర్చొని చదువుకోడానికి వేయబడ్డ బెంచీలు, కుర్చీలు. లైబ్రరీ వుద్యోగి కూర్చోడానికికూడా పక్కగా చిన్న మేజాబల్ల, కుర్చీ.

సూది కిందపడితే చప్పుడయేంత నిశ్శబ్దంగా వుంది. గోడకున్న గడియారం కూడా శబ్దం చేయడంలేదు బేటరీతో నడిచేది కాబట్టి

అయిదారు నిముషాలు సత్యమూర్తి ఆ పుస్తకాల రేకుల వంక చూస్తూండిపోయాడు. తర్వాత రిఫరెన్స్ పుస్తకాలుండే రేక్ వైపు నడిచాడు.


అవన్నీ ఖరీదైన పుస్తకాలు. ఒకొక్కటే వందరూపాయలకు తక్కువఖరీదు వుండదు. లైబ్రరీలోనే చదువుకోవాలి వాటిని. బయటకి తీసికెళ్ళడానికి అనుమతి ఇవ్వబడదు.

ఒకొక్క పుస్తకమే తీసి పేజీలు తిరగేసి మళ్ళీ వాటిని యధాస్థానంలో వుంచసాగాడు. అనేక కార్టూన్ సినిమాలు నిర్మించిన వాల్ట్‌డిస్నీ జీవిత చరిత్ర. మొగలు పాదుషాలనాటి భారతదేశంలోని చిత్రకళ. లండన్‌లోని ఇంపీరియల్ వాల్ మ్యూజియంలోని ప్రదర్శింపబడ్డ కొన్ని వస్తువుల ఫోటోలు,వివరణగల పుస్తకం, టెన్సింగ్ ఎవరెస్ట్ శిఖరం ఎక్కిన ప్రయత్నం తాలూకు కథ,బొమ్మలు. 2900 మైళ్ళ పొడవుగల అమెజాన్ నది పుట్టిన చోటునుంచి అంటార్కిటిక్ మహా సముద్రంలో కలిసేవరకూ ఒక యాత్రికుడు పడవమీద ప్రయాణంచేసి తీసిన ఛాయా చిత్రాలు. రీడర్స్ డైజెస్ట్, ప్రచురించిన 'బుక్ ఆఫ్ హోమ్ ఇంప్రూవ్‌మెంట్స్.'

మనసుని పుస్తకం మీద కేంద్రీకరించలేకపోతున్నాడు సత్యమూర్తి. ముల్లు గుచ్చుకున్నట్లుగా బాధగా వుంది.

వద్దనుకున్నా ఢుంబుగాడు గుర్తుకు వస్తున్నాడు. ప్రియంవద గుర్తుకు వస్తోంది. ప్రియంవదపడే బాధ ఎంత తీవ్రంగా వుంటుందో తెలుసు సత్యమూర్తికి. ఆ విషయం బాధించడంలేదు సత్యమూర్తిని. ఢుంబుగాడు ఏమవుతాడో, ఏం అవస్థలుపడతాడో అనే సంగతే సత్యమూర్తి హృదయాన్ని పీడిస్తోంది.

తనలో జాలి, క్షమ వున్నాయి. కాని ప్రియంవద విషయంలో మాత్రం అని



కరడుగట్టిపోయాయి; ఎడారిలో పడని వర్షబిందువులా తనలోని దయ వుపయోగం లేకుండా అయింది వాడి విషయంలో.

ఓ చెట్టు నేలమీద నిలబడి వున్నప్పటికంటే, నేలకూలిపోయాకే దాని పొడవు, పరిమాణం ఖచ్చితంగా కొలవ్వచ్చు. మామూలుగా వున్నప్పటికంటె, ఓ మనిషి నైజం, సంస్కారం కష్టాలలో వున్నప్పుడే అంచనా వేయగలుగుతారు.

తను?

ఏమైంది తన వైరాగ్యం? ఎటు పోయింది తనలోని డిటాచ్‌మెంట్ ఫీలింగ్?

మామూలు మనిషిలా, అతి సామాన్య వ్యక్తిలా తన కక్షతీర్చుకుని వెళ్తున్నాడు!

సత్యమూర్తి నెమ్మదిగా మతగ్రంథాలుండే రేక్‌వైపు నడిచాడు చేతిలోని లావుపాటి బైండ్, "యు అండ్ యువర్ మైండ్" అనే పుస్తకాన్ని టేబిల్‌మీద పెట్టి.

భగవగ్గీతని అందుకున్నాయి అతని చేతులు యాంత్రికంగా. లెక్కలేనన్ని సార్లు చదివాడు ఆకుపచ్చరంగు కాలికో బైండ్‌లోవున్న ఆ పుస్తకం.

ఎప్పుడు చదివినా, ఎలాంటి మానసిక స్థితిలోనయినా అందులో త్వరగా లీనమయిపోయేవాడు. కాని ఎంత ప్రయత్నించినా ఇప్పుడు కుదరటంలేదు.

భగవద్గీతలోని యధాస్థానంలో వుంచి వాల్మీకి రామాయణం పుస్తక భాగాలు వరసగా పేర్చిన రేక్‌వైపు కదిలాడు.

మోకాళ్ళమీద కూర్చున్నాడు. రెండు చేతులూ జోడించాడు. కళ్ళు మూసుకొన్నాడు. పెదవులు విడివడ్డాయి. మంత్ర

స్థాయిలో బయటికి పలికాడు.

"హే భగవాన్. నాకిప్పుడు ఎవరి మీదా మమకారం, ప్రేమ లేవు. నా కొడుకుమీద అసలే లేదు. వాడు ప్రకృతి సృష్టి. అంతే. ఎలాంటి పాశంలేని విరాగిని. కాని....కాని అమాయకుడయిన ఓ పసివాడికి అపకారం తలపెట్టినందుకు మనసు కుమిలిపోతోంది. అది ప్రేమ కాదు. పశ్చాత్తాపం బహుశ. ఒకరిమీద పగ తీర్చుకోడానికి ఇంకొకరిని బలి చేసాను. బాధ అనే యీ మాయలోంచి నన్ను విముక్తుడిని చెయ్యి. నాకు శాంతి కలిగించు "

లేచి నిలబడ్డాడు అదురుతున్న పెదవులతో. సత్యమూర్తికి గుండెని ఎవరో పట్టి నొక్కి నొక్కి, అదిమి, చిదిమేస్తున్నట్లుగా వుంది.

క్రమంగా ఎక్కిళ్ళు రాసాగాయి. ఏడుపు గుండెలోంచి తన్నుకు వస్తోంది. అనేకసార్లు, అనేక వందలసార్లు సత్యమూర్తికి జీవితంలో అలాంటి దుఃఖం ముందుకు వచ్చింది.

మంగళగిరిలో టి.బి శానిటోరియంలో అర్ధరాత్రుళ్లు మేలుకుని, వంటరిగా చీకట్లో తను చూసిన గుర్తయినా లేని తల్లిని తలచుకుని కుమిలిపోయాడు. తన పక్కగదిలోని తన ఈడు కుర్రాడిని చూసుకోడానికి వచ్చిన తల్లిని, ఆమె ప్రేమని, ఆప్యాయతనీ రహస్యంగా గమనించాడు. వారం, పదిరోజులకోసారి అక్కయ్య వచ్చి, 'ఎలా వున్నావురా?' అని పలకరించి నాలుగయిదు గంటల్లో వెళ్ళిపోయేది.

తల్లిని గుర్తు తెచ్చుకుంటే ఏడుపు తన్నుకు వచ్చేది.

ఏడవలేదు.

శ్రీవల్లి తనకి అందించిన ప్రేమని భరించలేక, ఆనందంతో వుక్కిరి బిక్కిరి అయి ఏడుపు వచ్చేది.

ఏడవలేదు.

తన ప్రాణం, శ్రీవల్లి, దూరమయినప్పుడు- అంతకు వందరెట్లు బాధ పడ్డప్పుడు ఏడుపు వచ్చింది.

బలవంతంగా అణచుకున్నాడు.

శ్రీవల్లి లేచిపోయిందనీ, ఎవడితోనో కులుకుతోందని ప్రియంవద తమకి వివాహం అయిన కొత్తల్లో సూటి పోటి మాటలనేది.

అప్పుడూ ఏడవలేదు.

తన హృదయం పాషాణంకన్నా కఠినంగా చేసుకుని బ్రతుకుతున్నాడు.

ప్రియంవద సుగుణరావుతో కులుకుతోందని తెలిసినప్పుడు భరించలేక ఏడవాలనిపించింది.

అయినా ఏడవలేదు.

తన బుద్ధి తెలిసాక కొన్నివందలసార్లు కళ్ళలోంచి నీళ్ళు చిందకుండా తనని తాను ఎంతో ప్రయత్నంచేసి సంబాళించుకుంటూ వస్తున్నాడు.

రూఢి అయాక ప్రియంవదని పల్లెత్తు మాట కూడా అనలేదు. తనని తను తిట్టుకున్నాడు. విధిని, విధాతని తిట్టుకున్నాడు.

కారణం ఇంతదాకా తను మోసగింపబడ్డ వ్యక్తిగా, ఓడిపోయిన వ్యక్తిగా, దెబ్బతిన్న సిపాయిలా, అపకారం చేయబడ్డ మనిషిలా బ్రతుకుతున్నాడు.

తనంతట తానుగా ఎవరికీ అపకారం,

ప్రతీకారం చేసి ఎరగడు.

జీవితంలో మొట్టమొదటి సారిగా ఏ తండ్రీ తన కొడుక్కీ, తన భార్యకీ చేయడానికి సమ్మతించని పాపం చేసాడు.

అందుకే సత్యమూర్తి తన దుఃఖాన్ని ఆపుకోలేకపోయాడు.

పుస్తకాల రేక్‌కి ఆనుకొని, నిలబడలేక, అలాగే నేలమీదకి జారిపోయాడు. ఎక్కిళ్ళు ఎక్కువయ్యాయి. గొంతులో ఏదో అడ్డుపడుతున్న భావన. గుండెలో ఏదో బరువుగా దింపిన స్పందన.

కన్నీరు ఆగటంలేదు.

మోకాళ్ళలో తల వుంచుకొని, మోకాళ్ళచుట్టూ చేతులు బిగించి ఏడుస్తూండిపోయాడు సత్యమూర్తి.

నిర్మానుష్యంగా, నిశ్శబ్దంగావున్న ఆ విశాలమయిన గ్రంథాలయంలో, రకరకాల రచయితల మేధస్సుకి, ఆలోచనలకీ, విజ్ఞానానికీ ప్రతీకలుగా వున్న పుస్తకాలమధ్య, పుస్తకాల రేక్స్‌మధ్య సత్యమూర్తి, 'శ్రీవల్లీ, శ్రీవల్లీ నువు రావూ. శ్రీవల్లీ, నీదగ్గరకి తీసుకెళ్ళవూ. శ్రీవల్లీ, నేనీ లోకంలో వుండలేను' అంటూ చంటిపిల్లాడిలా వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు సత్యమూర్తి.

ఎంతసేపు అలా వుండిపోయాడో తెలియదు. చాలాసేపటి తర్వాత నిస్సత్తువగా లేచాడు సత్యమూర్తి.

కళ్ళు తుడుచుకున్నాడు. అయినా కన్నీరు ఆగటంలేదు. ఇంతకాలంగా వాడిలో జ్ఞాపకాల దొంతరల్లో పేరుకుని దాగివున్న విషాదం అంతా ఆ శరీరంలోంచి మొదటిసారిగా, బయటకి దారి దొరికిందికదా అన్నట్లుగా, కళ్ళవెంట

కన్నీళ్ళద్వారా జరజరా బయటికి పాకి పోతోంది ఆత్రంగా.

గాయత్రీ మంత్రం స్తోత్రం చేస్తూండి పోయాడు సత్యమూర్తి కొంతసేపు, మనోనేత్రం ముందు గాయత్రీదేవి విగ్రహం గుర్తు తెచ్చుకుంటూ.

తర్వాత మళ్ళీ కళ్ళు తుడుచుకుని చేతికి అందిన పుస్తకం తీసుకున్నాడు.

చేతికి వచ్చిన పేజీని తెరిచాడు.

రామాయణంలోని ఓ భాగం ఆ పుస్తకం.

ఎదురుగా ఓ శ్లోకం, దానికింద తాత్పర్యం కనబడ్డాయి.

లక్ష్మణుడు సుగ్రీవుడికి పాపాల గురించి చెప్పే సన్నివేశం అది.

బ్రహ్మఘ్నేచ సురాపేచ చోరే భగ్న
వ్రతే తథా
నిష్కృతి ర్విహితాసద్భిః కృతఘ్నే
నాస్తి నిష్కృతిః

బ్రహ్మ హత్యకు, సురాపానానికి, దొంగతనానికి, వ్రతభంగము చేసుకొన్న వానికీ ప్రాయశ్చిత్తము విధింపబడింది. కాని కృతఘ్నతకు ఎట్టి ప్రాయశ్చిత్తము విధింపబడలేదు.

సత్యమూర్తి ఆ శ్లోక తాత్పర్యాన్ని అయిదారుసార్లు చదివాడు, పూర్తిగా అర్థం చేసుకుంటూ.

కృతఘ్నతకి నిష్కృతిలేదు!

ప్రియంవద తన విషయంలో కృతఘ్నతతో ప్రవర్తించింది. సుగుణరావు విషయంలో ప్రియంవద నడవడి కేవలం కృతఘ్నతే అనిపించింది సత్యమూర్తికి.

ప్రియంవద తను చేసిన పాపానికి శిక్షగా భగవంతుడే తనచేత ఈ దుష్కార్యం చేయించాడు.

భగవద్గీతలోని ఓ వాక్యం గుర్తుకు వచ్చింది.

'చేసేది నేను. చేయించేది నేను.'

కొన్నివేల సంవత్సరాల క్రితం ఓ కావ్యంకోసం రచింపబడ్డ ఆ శ్లోకం, ఆనాటి నీతినీ, న్యాయాన్నీ దృష్టిలో వుంచుకుని వ్రాయబడ్డ దాని భావం సత్యమూర్తికి కించిత్ ఓదార్పుగా వుపయోగించింది.

లిటరేచర్ రేక్ దగ్గరకి నడిచి 'ఆఫ్ హ్యూమన్ బాండేజ్' అందుకుని ఓ కుర్చీలో కూర్చున్నాడు.

ఆ హాలు బయట, కొద్ది దూరంలో చుట్ట తాగుతూ కూర్చునివున్న వాచ్‌మన్‌కి చాలాసేపు లీలగా వినబడుతూనే వున్నాయి సత్యమూర్తి ఏడుపు, ఎక్కిళ్ళు.

కాని లేచి సత్యమూర్తి దగ్గరకి వెళ్ళ లేదు.

'కొన్ని బాధలకి మందు రహస్యం గానే వుండాలి' అనుకున్నాడు చుట్ట తాగుతూ.

సత్యమూర్తి ఆ రాత్రంతా నిద్ర పోలేదు. పాఠకులకోసం వుద్దేశింపబడ్డ బల్లల మధ్య కూర్చుని రకరకాల విషయాల గురించి ఆలోచిస్తూండిపోయాడు.

క్రమంగా తెల్లవారసాగింది. సత్యమూర్తి కిటికీలోంచి కనబడుతున్న ఆనాటి తొలి వెలుగు రేఖలని చూసి జేబులోంచి పెన్ను బయటికి తీసాడు.

తన ముందున్న తెల్ల కాగితాలమీద రెండు అప్లికేషన్ ఫారాలు వ్రాసాడు.

ఒకటి తన జీవితంలోంచి ప్రతి నెలా తీసుకోబడ్డ ప్రావిడెంట్ ఫండ్ గురించి.

(వి) చిత్ర విజ్ఞానం



"సెరిబ్రల్ పాల్సీ" వ్యాధికి గురైన వారికి మెదడు దెబ్బతిందంవల్ల దేహంలో కండరాల స్వాధీనం తప్పుతుంది. అందుచేత వీళ్లు మాట్లాడలేరు. కాళ్ళూ చేతులూ కదపలేరు. ఐతే అందరిలా ఆలోచించగలరు, చూడగలరు, వినగలరు! వీరి భావాలను యితరులకు వ్యక్తం చేసుకోవడం ఎలా? చార్లెస్‌బ్లిస్ అనే మేధావి 1949లో వంద వింత గుర్తులు గల "భాష"ను రూపొందించాడు. ఈ గుర్తులను నేర్చుకోవడం సులభం. వీటిని కళ్ళతోనో, కదపగలిగినంతమేరకు చేతులతోనో, కాళ్ళతోనో సూచించి, పై వ్యాధిగ్రస్తులు యితరులతో "మాట్లాడు"కోవచ్చు! బొమ్మలో చూపిన గుర్తుల అర్థం— "నిన్ను చూడ్డానికి నాకు సంతోషంగా వుంది" అని. ఈ "భాష"కు బ్లిస్సింబల్స్ అని పేరు.

ఆ మొత్తాన్ని హైదరాబాద్‌లోని అనాథ బాలల శరణాలయానికి పంపవలసిందిగా కోరుతూ వ్రాయబడ్డ అప్లికేషన్. ఇది వరలో తన తదనంతరం, ఆ మొత్తం తనందుకోలేకపోతే, తన రెండో భార్య ప్రియంవదకి చెందాలని నామినేషన్ ఫారం వ్రాసిచ్చాడు పెళ్ళయిన చాలా కాలానికి. కాని కొత్త ఆలోచన కలగడం వల్ల ఆ ధనాన్ని శరణాలయానికి చెందాలని వ్రాసాడు అప్లికేషన్‌తో.

రెండోది తన రాజీనామా.

కొన్ని వ్యక్తిగత కారణాలవల్ల తను రాజీనామా చేయాల్సి వచ్చిందని, తనకి రావలసిన జీతం మంగళగిరిలో టి.బి. శానిటోరియంలో నర్స్‌గా పనిచేస్తున్న మేరీకి పంపవలసిందిగా రాసాడు. క్షయ వ్యాదితో తను బాధపడుతున్న రోజుల్లో అందరికన్నా శ్రద్ధగా చూసుకుంది మేరీ.

లైబ్రేరియన్ గది తలుపు తెరచి ఆ గదిలోవున్న ఫారాలు తీసుకుని అవసరమయిన వాటిని తను అప్లికేషన్‌లో వ్రాసిన విధంగా నింపి సంతకాలు చేసాడు. తర్వాత అవసరం వచ్చినా తను ఎవరికీ అందుబాటులో వుండడు కాబట్టి.

ఓసారి లైబ్రరీ మొత్తం తిరిగి చూసాడు. కొన్ని సంవత్సరాలుగా తను మేలుకునివున్న అత్యధిక సమయం గడిపిన ఆ గ్రంథాలయం తనివితీరా చూసాడు.

బయటకి వచ్చాడు. ఆ బిల్డింగ్‌లోంచి బయటకివచ్చి అప్పుడే వుదయిస్తున్న సూర్యుడికి నమస్కారంచేసి ఆదిత్య హృదయం మనసులో పఠించాడు.

తిరిగి లోపలకివెళ్ళి, బ్రీఫ్‌కేస్ అందుకుని నిద్రపోతున్న వాచ్‌మన్‌ని లేపాడు.

"క్యా సాబ్? టైమ్ క్యాహై?" అన్నాడు వాచ్‌మన్ ఆవలిస్తూ లేచి కూర్చుని.

తన చేతిలోని కాగితాలని అతనికిచ్చి చెప్పాడు సత్యమూర్తి తెలుగులో.

"నే వెళ్తున్నాను. వీటిని లైబ్రేరియన్‌కి అందజేయి."

"ఆజ్ ఛుట్టీ హైక్యా?" అడిగాడు వాచ్‌మన్ లేచి ఒళ్ళు విరుచుకుంటూ.

సత్యమూర్తి బయటకివచ్చి నడవ

సాగాడు. రాత్రంతా నిద్ర లేకపోయినా అలసటగాలేదు. నిద్ర మత్తుగాలేదు. ఎంతో హాయిగా తేలికగావుంది మనసు. దారిలో రోడ్డు ప్రక్కనేవున్న ఓ పంపు దగ్గర మొహం, కళ్ళు, చేతులు కడుక్కుని, బ్రీఫ్‌కేస్‌లోంచి టవల్ తీసి తుడుచుకున్నాడు. కళ్ళు కొద్దిగా మండినట్లుగా అనిపించాయి.

మళ్ళీ నడకసాగించాడు. ఈసారి గబగబా నడవసాగాడు. దాదాపు రెండున్నర గంటల తర్వాత అంబర్‌పేట చేరుకున్నాడు సత్యమూర్తి.

అంబర్‌పేటలోని స్మశానంలోకిఅడుగు పెట్టాడు.

క్రితం రాత్రి కాలిన రెండు శవాల తాలూకు చితులలోంచి తెల్లటి పొగ మందంగావస్తోంది. చంకలో పుస్తకాలతో అప్పుడే వచ్చారు యిద్దరు బ్రాహ్మలు. ఆఫీస్ మూసివుంది.

"ఆఫీస్ ఎప్పుడు తెరుస్తారు?" అడిగాడు సత్యమూర్తి వాళ్ళలో ఒకరిని.

"ఇంకో అరగంటలో. ఎవరయినా పోయారా మీ వాళ్ళు?" అడిగాడొకాయన సత్యమూర్తిని ఎగాదిగా చూసి.

"లేదు."

"రాత్రంతా ఏడ్చినట్లుగా కళ్లు వుబ్బి వుంటే అడిగానంతే. ఏం అనుకోకు నాయనా" అన్నాడు ఆయన వెంటనే.

సత్యమూర్తి స్మశానం మధ్యలోవున్న అమ్మవారిగుడి మెట్టుమీద కూర్చున్నాడు.

బ్రాహ్మలిద్దరూ పెరుగుతున్న ధరల గురించి, సంపాదన చాలకపోవడంవల్ల ఇంట్లోపడే ఇబ్బందుల గురించి, రిపేరు చేయించాయిల్సిన సైకిల్ గురించి మాట్లాడుకుంటున్నారు పిచ్చాపాటి.

"ఈ సంగతులు మాట్లాడుకోవడానికి అతిచక్కని చోటిది" నవ్వాడు సత్యమూర్తి.

ఒకాయన సత్యమూర్తి వంక మొహం చిట్లించి చూసాడు. రెండో అతను నవ్వి అన్నాడు.

"నాసిక్ ప్రెస్‌లో పనిచేసే వుద్యోగులు కోటీశ్వరులు కాలేరు. అలాగే స్మశానంలో పనిచేసే మేం విరాగులం కాలేము. స్మశానవైరాగ్యం అప్పుడప్పుడు వచ్చే మీలాంటి వారికే."

"బ్రతుకులో నిప్పులు కురుస్తున్నప్పుడు సన్యాసికయినా ముక్కు మూసుకుని కూర్చోవడం చేతకాదు." అని నవ్వి చదివాడు సత్యమూర్తి ఓ శ్లోకం.

"కోప న్యార్థం అహం పటోటాప్."

తరువాత చెప్పాడు "పూర్వం సర్వసంగ పరిత్యాగి అయిన ఓ సన్యాసికి రెండు గోచీ గుడ్డలు తప్ప మరేవీ లేవుట. ఓ రోజు ఆరవేసిన గోచీని ఓ ఎలుక కొట్టేస్తుంటే దాన్ని దూరంగా వుంచడానికి ఓ పిల్లిని పెంచాడుట. ఆ పిల్లికి పాలకోసం గోవుని పెంచాడుట. గోవు ఆహారం కోసం పొలంలో వరి పండించి గడ్డిమోపులు సంపాదించాడుట. పొలంపని తనొక్కడే చూసుకోలేడని సహాయంకోసం వివాహం చేసుకుని, భార్యను సంపాదించాడుట. అప్పుడు 'నా గోచీకి రక్షణ ఏర్పడింది కదా యిప్పుడు' అని తృప్తిగా అనుకున్నాడుట.

ఓ గోచీ బట్టకోసం 'నాది' అనే భావం ప్రవేశించటంతో మళ్ళీ ఝంఝూటంలో పడిపోయాడు ఆయన.

నాది అనేది ఏ కోశానా లేనివాడే అసలైన విరాగి.''

''మీకు సంస్కృతం కూడా వచ్చా?'' అడిగాడు మొదటి బ్రాహ్మడు అబ్బురపడుతూ.

తల వూపాడు సత్యమూర్తి. లేచి నిలబడి చెప్పాడు.

''ఆఫీస్ తెరిచారు. వస్తాను.''

సత్యమూర్తి స్మశాన వాటిక ఆఫీస్‌లోకి వెళ్ళాడు.

ఏం కావాలన్నట్లుగా చూసాడు లోపల వున్న వుద్యోగి కొద్దిగా విసుగ్గా.

''రెండురోజుల క్రితం నా చెల్లెలుని ఖననం చేసానిక్కడ. ఆమె అస్తికలు దాచివుంచమని కోరాను....''

''పేరు?''

''ప్రవీణ''

''మీ పేరు?''

''మూర్తి. సత్యమూర్తి.''

అతను ఓ పుస్తకం తిరగేసి వెనక్కి చూసాడు. కొద్ది దూరంలో నల్లటి చిన్న చిన్న కుండలున్నాయి. గోనుపట్టాతో పైన మూతలా అడ్డు కట్టబడి వుంది తాడుతో.

లేచివెళ్ళి వాటిలోంచి నల్లటి ముంతని తీసుకువచ్చి యిచ్చాడు.

''రసీదు?'' అడిగాడు.

సత్యమూర్తి పర్స్‌లోంచి అంతకు మునుపు వాళ్ళిచ్చిన రసీదు తీసి యిచ్చాడు.

ఆ ముంత బ్రీఫ్‌కేస్‌లో పట్టలేదు. అలాగే పట్టుకుని బయటకి నడిచాడు.

17

—అంతకు సరిగ్గా గంటకు మునుపు ప్రవీణ తలిదండ్రులకి తెలిసింది తమ కూతురి మరణం గురించి. ప్రవీణ విజయవాడలో బయలుదేరిన సంగతి వుత్తరం వచ్చింది. ఇంకా ఇంటికి రాకపోవడంతో కంగారుపడి పోలీస్‌స్టేషన్‌కి వెళ్ళారు.

ఇన్‌స్పెక్టర్‌వాళ్ళు చెప్పేది పూర్తిగా వినాల్సిన అవసరం లేకపోయింది.

''సారీ. మీ అమ్మాయి మరణించింది'' చెప్పాడు.

ఆ ముసలి వాళ్ళిద్దరి మొహంలో రక్తం పూర్తిగా శరీరంలోని యితర భాగాలలోకి వెళ్ళిపోయినట్లుగా, తెల్లబడిపోయాయి. నోటమాట రాలేదు కొంతసేపు.

ముసలాయనకి బ్లడ్‌ప్రెషర్ వ్యాధి వుంది. ఆయనకి కాళ్ళు చేతులు తిమ్మిర్లు ఎక్కినట్లు అనిపించింది. స్పృహతప్పి పడిపోయాడు కొద్ది నిముషాలలో.

ఆవిడ నిబ్బరంగా వుండ కలిగింది భర్త పరిస్థితి చూసి.

''ఏమయింది?'' అడిగింది.

''ఆటోలోవస్తూంటే ఎక్సిడెంటయింది. రోడ్డుమీద అక్కడికక్కడేమరణించింది''

''ఆ అమ్మాయి మా అమ్మాయి ప్రవీణే అని ఎలా తెలుసు?''

''పరికిణీ, జాకెట్టు వేసుకుంది. పట్నాలుగేళ్ళుంటాయి ....సమర్తాడలేదు. చేతిలో ఈ పుస్తకం వుంది''

డ్రాయర్‌లోంచి ఓ పుస్తకం తీసి అందించాడు ఆవిడకి.

కాన్‌స్టేబుల్ ముసలాయన మొహం మీద నీళ్ళు చల్లాక లేచాడాయన. వెర్రిగా చూసాడు అందరివంకా. భార్య కళ్ళలోని నీళ్ళు, వుబికి వుబికి వస్తున్న ఏడుపుని

చూసి ఆయనా ఏడవసాగాడు.

"శవం ఏది?" హఠాత్తుగా అడిగిందావిడ.

"నిజానికి కార్పొరేషన్ వాళ్లు తగలబెట్టేవారు. కాని ఆ రోజు బస్‌లో వచ్చే ఇంకో పేసెంజర్ ఒకాయన అడిగి తీసుకు వెళ్ళారు అంత్యక్రియలు తను చేస్తానని."

"ఎవరాయన? ఆయనకి ప్రవీణ ఎలా తెలుసు?" అడిగింది ముసలావిడ అనుమానంగా చూస్తూ.

జరిగింది చెప్పాడు ఇన్‌స్పెక్టర్.

ఆవిడ తన చేతిలోని పుస్తకం తెరచి చూపింది అందులోని చిరునామా.

"లైబ్రరీలో పని చేస్తున్నాడట. బ్రతికుండగా బస్సులో ఏం మాట్లాడిందో అడుగుదాం రండి" ఆవిడ గుడ్లనీరు కుక్కుకుంటూ అంది భర్తతో.

ఆటోలో ఇద్దరూ లైబ్రరీకి వెళ్ళారు. లైబ్రేరీయన్ గదిలోకి వెళ్ళి జరిగింది చెప్పారు.

"అలాగా? నాకు తెలియదే" అన్నాడాయన తెల్లబోతూ. "పర్మిషన్ తీసుకుని వెళ్ళాడు. సంగతేం చెప్పలేదు నాకు"

"ఆయన్ని పిలిపిస్తారా ఓ సారి?"

లైబ్రేరియన్ ఇబ్బందిగా చూసాడు ఆ దంపతుల వైపు.

"ఐ యాం సారీ. సత్యమూర్తి రిజైన్ చేసేసాడు."

"ఎందుకు? ఎక్కడ కలుసుకోవచ్చు ఆయన్ని?"

"అది అన్నిటికన్న ఆశ్చర్యమయిన విషయం. నాకు ఎందుకో నాకు తెలియదు. ఇంత హఠాత్తుగా రాజీనామా చేయాల్సిన వ్యక్తిగతమయిన అవసరం ఏమిటో తెలుసుకోవాలని నాకు వుంది"

"ఆయన్ని కలుసుకోవటం ఎలా?" అడిగింది ముసలావిడ. "ఇంకా ఇంటికి కూడా వెళ్ళకుండా సరాసరి ఇటే వచ్చాము."

"ఆయన ఇంట్లో వుండచ్చు. పదండి. నాకు తెలుసు అతని ఇల్లు."

"బయట ఆటో వుంది. రండి"— బయటకి వెళ్ళారు.

లైబ్రేరియన్ గమనించాడు ఆ దంపతులిద్దరూ ఎంతో ప్రయత్నంమీద దుఃఖాన్ని అణచుకొనే ప్రయత్నం చేస్తున్నారని. ఆవిడ ఒళ్ళోకి వాలిపోయాడాయన, కొన్నినిముషాల తర్వాత బిగ్గరగా ఏడుస్తూ.

"ప్రవీణ ఏం మాట్లాడిందో తెలుసుకోవాలని నా ప్రాణం కొట్టుకుపోతోంది" అన్నదావిడ.

మౌనంగా వుండిపోయాడు లైబ్రేరియన్.

కొన్ని క్షణాల తర్వాత అడిగింది.

"అతనికి ఎన్నేళ్ళు?"

"ఇరవై తొమ్మిది. అతను జీవితంలో చాలావరకు దెబ్బలుతిన్న వ్యక్తి. చిన్నప్పుడు అనారోగ్యం బాగా కృంగదీసింది. అక్క బావలదగ్గిర పెరిగాడు. మొదటి భార్య ప్రమాదవశాత్తు దూరమయింది. మళ్ళీ వివాహం చేసుకున్నాడు. గత నెల రోజులుగా అతనికి మనశ్శాంతి లేదు. అతని మొహంమీద చిరునవ్వన్నమాటే లేదు."

సత్యమూర్తి ఇంటిముందు ఆగింది ఆటో. ముగ్గురూ లోపలికి వెళ్ళారు.

(సశేషం)

మహిళాజ్యోతి

నస్త్రీ స్వాతంత్ర్యం

శ్రీలక్ష్మమ్మగారు అంట్లు తోముతున్న పని మనిషితో అంటున్నారు.

"పూర్వకాలంలో మేమసలు లక్ష్మీగుమ్మం దాటి ఎరుగుదుమా? యిప్పటి వాళ్ళా. ! లేస్తూనే బజార్లో పడతారు."

"అవునండమ్మా. . ఆ కాలం ఆ తీరూ, అంతా ఏరు. "

పని మనిషైనా ప్రాసపోకుండా మాట్లాడుతూ వుంటే శ్రీదేవి దంత ధావనం ముగించి వంటింట్లోకి వెళ్ళింది.

గ్యాస్ స్టౌమీద డికాషన్ తీసివుంది. కాఫీ యింకా తయారు కాలేదు.

'పాలేవీ ...?' అనుకుంటూ యిటూ అటూ చూసింది.

నిన్న రాత్రి గూట్లో పెట్టిన పాలసీసాలు, వాటి క్రింద డబ్బులు, వెక్కిరించాయి.

"అదేమిటత్తయ్యా. ..నిన్న రాత్రి పాల పిల్లవచ్చి, సీసాలు, డబ్బులు, పట్టుకెళ్ళలేదా?"

"అయ్యో నామతి మండ. మాటల సందట్లో మరిచే పోయేను. అదేదో వూరి కెళుతూందిట. ఈ రోజు, రేపుకూడ రానని చెప్పమంది."

ఒక్క క్షణంలో శ్రీదేవి కోపం తారస్థాయి నందుకుంది. వెంటనే నిగ్రహించుకుని "అప్పయ్యమ్మా. . " అని కేకేసింది.

"అప్పయ్యమ్మ అంట్లు బోర్లించి వెళ్ళిపోయిందమ్మాయ్ యింకొక గంటలో కాఫీ గిన్నెలు తోమటానికి వస్తానంటూ.. . ." శ్రీలక్ష్మమ్మ అంది.

వసారాలోకి తొంగి చూసింది శ్రీదేవి.. కుంభకర్ణుడుగారు (మరిది) సెకండ్ షో సినీమా చూసి వచ్చేడు కాబోలు. నిండా ముసుగుతన్ని గుర్రు కొడ్తున్నాడు.

గబగబ గదిలోనికి పరుగెత్తి శ్రీవారినో రెండు కుదుపులు కుదిపింది.

'అబ్బ. . ' 'ఉస్సు. ' అంటారే కాని లేవరు.

టైము చూసి హడలిపోయి చేసేది లేక తానే రెండు సీసాలు, డబ్బులు పట్టుకుని, వంటి నిండా కొంగు కప్పుకుని బయలుదేరింది.

"అదేమిటండీ యింత ఆలస్యం చేశారు. బాటిల్సన్నీ అయిపోయేయి, ఒక్కటే వుంది" అన్నాడు మిల్కుబూత్ మనిషి.

"అయ్యో.. రోజూ వచ్చేవాళ్ళమే కదా. తెల్సిన మొహాలే కదా, రెండు బాటిల్సుంచ లేకపోయారా?" శ్రీదేవి నొచ్చుకుంటూ అడిగింది.

"బాగుందండోయ్. ఈ చుట్టు ప్రక్కలన్నీ నాకు తెలిసిన ముఖాలే. అంత మందిలో ఎంతకని గుర్తుంచుకుంటాం?"

ఇకిలిస్తున్న వాడి పళ్ళని ఒక్క తాపుతన్ని 'ఎంత రేటుకి అమ్ముకున్నావ్. ' అని అడగాలనిపించినా చేసేది లేక ఒక్కబాటిల్‌తోనే వడి వడిగా యింటి ముఖం పట్టింది.

* * *

"అమ్మాయ్—కూరలు నిండుకున్నాయి. కూరలమ్మి వచ్చింది. తొందరగా వచ్చి తీసు

మా. నీ. మ.

కుంటావా?'' శ్రీ లక్ష్మమ్మగారు కేకపెట్టారు.

"ఏదో ఒకటి మీరే తీసుకోండత్తయ్యా." బాత్ రూం లోంచి సమాధానం యిచ్చింది శ్రీదేవి.

"ఆ బేరాలూ....పద్దులూ....నాకు తెలియవు తల్లీ, ఒక్క నిముషం ఆగమంటాను. లేదా ప్రక్కన బేరం చూసుకొని రమ్మంటాను. నువ్వే వచ్చి తీసుకో. అన్నం ఉడుకు పట్టినట్లుంది. వారుస్తా..'' అంటూ వంట గదిలోనికి వెళ్లింది శ్రీ లక్ష్మమ్మగారు.

కూరలు బేరమాడి బుట్టలోనికి తీస్తున్న భార్య దగ్గరకు వచ్చి ...ఆవులిస్తూ అన్నాడు అప్పుడే లేచిన మోహన్.


"ఎంత చెప్పినా ఈ మనిషి దగ్గరేకొంటావ్ ఆవిడగారే రేటు అడిగితే అది యిచ్చి. ఆఫీసు నుండి వచ్చే దారే కదా బజారు సాయంత్రం వచ్చినప్పుడు ఏం కావాలో తెచ్చుకోకూడదూ?'' వక్కసారి భర్త ముఖంలోనికి తీక్షణంగా చూచి, మళ్ళీ కూరల బుట్టతీసుకుని వంటింట్లోకి దారితీసింది.

మోహన్ మీద ఈగ పడనివ్వదుఅత్తగారు. ఏదైనా బజారు పని చేప్తే....

"వాడి మొహం. వాడెప్పుడైనా చేసేడా ఏమైనానా? ఏ సాయింత్రమో వెళ్ళి కావల్సినవన్నీ నువ్వేతెచ్చుకోకూడదూ ..?''అంటుంది. ఊరుకున్నంత ఉత్తమంలేదు.

* * *

"ఏమండీ లక్ష్మిగారూ. ఆ మధ్యనే మీ హస్బెండ్‌కి బాగులేదని నాలుగు రోజులు సెలవు పెట్టారు. మళ్ళీ నిన్న మొన్న సెలవు పెట్టారు. యిలాగ చెప్పాచెయ్యకుండా సెలవు పెడితే అర్జంటు వర్కంతా ఎవరు చేస్తారు?''



అప్పుడే లోనికి అడుగు పెడుతున్న శ్రీదేవికి హెడ్ గుమాస్తా లక్ష్మిమీద విసుక్కోవటం వినిపించింది.

"రెండు రోజులుగా పిల్లడికి బాగాలేదండి?" లక్ష్మి నెమ్మదిగా చెపుతూంది.

"అసలీ ఆడవాళ్ళని ఉద్యోగాల్లో చేర్చుకోకూడదండీ. గడియ గడియకీ సెలవులు పెడ్తారు. పైగా ఏడాదికి మూడునెల్లు....గవర్నమెంటిచ్చిన ఉల్ఫా మెటర్నిటీలీవు ..." ఒక కాకారాయుడు హెడ్‌క్లార్కుతో అంటున్నాడు.

"వెధవ. వీడి పెళ్ళాం పురుడయిన మర్నాటి నుండీ వంటింట్లోను, పడగ్గదిలోను ప్రవేశిస్తుంది కాబోలు. రాస్కెల్. అయినా.... మగవారయితే వాళ్ళకి వంట్లో ఏమొచ్చినా సెలవుపెట్టి కూర్చుని యింటిల్లిపాదిసీ హడల గొడ్తారు. అదే ఆడదయితే భర్త కొచ్చినా, పిల్లలకి వచ్చినా లేక యింట్లోవుండే పెద్దదిక్కుకాని, చిన్నదిక్కుకాని ఎవరికి వచ్చినా తను సెలవు పెట్టక తప్పదు. యింక తానే నిజంగా సిక్ అయితే యింట్లో లక్షణంగా పడుకోవటం అవదు. అమ్మ యింట్లోవుంది కదాని పిల్లలు అల్లరి చేస్తారు. అత్తగారు పురాణానికో, కాలక్షేపానికో వెళ్తారు. ఎంత లేవలేని పరిస్థితో వస్తే తప్ప మామూలు పనులు చేసుకోక తప్పదు' శ్రీదేవి ఆలోచిస్తూ ఫైల్సు తీసింది.

లంచవర్లో డైనింగ్ హాల్‌కి వెళ్ళేసరికి శకుంతల టేబిల్‌మీద తలపెట్టుకుని పడుకుని వుంది.

"అదేమే...." అంటూ వెళ్ళి తాకే సరికి చెయ్యి భగ్గుమంది.

"అరె యింత జ్వరంలో ఆఫీసుకి రాకపోతే ఉండిపోలేకపోయావా?" కోపంగా అడిగింది శ్రీదేవి.

"సెలవులేదే...." దీనంగా అంది శకుంతల.

"నాన్సెన్స్. సెలవు లేకపోతే ఒకరోజు లాసాఫ్ పే అవుతుంది. అంతే కాని పీక పోతుందా?" శ్రీదేవి కోపం యింకా తగ్గలేదు.

"నిజంగా పీకే పోతుందే. యిక్కడకాదు. యింట్లో—" భోరున ఏడ్చింది శకుంతల.

"అరె....ఏమిటిది? కాఫీ త్రాగావా?"

లేదన్నట్లు తల వూపింది శకుంతల.

"ప్రొద్దున్నెలా వచ్చావు?"

"రిక్షాలో...."

"ఐ ...సీ...." అంటూ కాఫీకి ఆర్డరిచ్చి తను తెచ్చుకున్న టిఫిన్ బాక్స్ తీసింది శ్రీదేవి.

'శకుంతల జీతమెంతో శకుంతలకి తెలియదు కాని భర్తకి మాత్రం అణా పైసలతో తెలుసు. ఫస్టు రాగానే ఆమె చేతిలో రానుపోను బస్సు ఖర్చులు మాత్రమేవుంచి మిగత తీసుకుంటాడు.

మిగత ఏ చిన్న విషయానికైనా అతనిని దేబిరించాల్సిందే.

వంట్లో బాగులేదంటే ..."అక్కడేం గుళ్ళెత్తాలా రాళ్ళెత్తాలా? ఫేను కింద కుర్చీలో కూర్చోటమేకదూ, వెళ్ళు...." అనివుంటాడు, బస్సులో నిల్చుని రాలేక రిక్షాలో వచ్చింది. పాపం కాఫీకికూడ డబ్బులులేవు కాబోలు.

టిఫిన్ తింటున్న శ్రీదేవి చేతిమీద, బాక్సులోను, రెండు కన్నీటి బొట్లు రాలేయి.

'సాయింత్రం నిన్ను దిగబెట్టి యింటికి వెళ్తా. వచ్చేవరకు మీ సెక్షన్‌లో వుండు .." అంటూ శకుంతలనామె శెక్షన్‌లో చేరవేసింది శ్రీదేవి.


"రమణిగారూ....మీరెప్పుడూ ఏ పిక్నిక్‌కీ, పార్టీలకీరారు. డబ్బు మాత్రం పే చేసేస్తారు. ఈసారి రాకుంటే ఊరుకోము." అంటున్నాడు ఆర్గనైజరు, "రేపేదో ఫేర్‌వెల్ పార్టీ ఉంది కాబోలు". అనుకుంది శ్రీదేవి.

"సారీ అండీ. నన్నేమన్నా అనుకోండి కాని నేను రాలేను. నాకు పని వుంటుంది."

"ఎవరి కుండవండీ పనులు? మేమేం పని లేక పెట్టుకున్నామా యివన్ని?...." యింకా ఏదో అనబోయాడు.

"ఎక్స్‌క్యూజ్‌మి. ఎంత కావాలో చెప్పండి" రమణి బ్యాగ్‌తీస్తూ అడిగింది.

'రమణి భర్త వట్టి అనుమానపు మనిషి. అత్త గయ్యాళి. ఏ మాత్రం ఆలస్యం అయినా యింటికి వచ్చిన కొడుక్కి లేనిపోనివన్నీ కల్పించి చెప్తుంది. అతను చావ బాదుతాడు.



తొందరపడండి!
మా 'జనప్రియ' గ్రూప్‌లో
నేడే చేరండి!
మొదటి బహుమతి
2,00,000
ద్వితీయ బహుమతి
1,00,000
ఇంకా ఎన్నో లక్షలు!
SEX
బోర్ కొడుతోంది అని
మీ డబ్బు పనికిరాని
పుస్తకాల మీద
వృధా చేస్తారా...?
మీరు ఇంట్లో వుంటూ
హాయిగా మా ఏజెంట్‌గా
చేరండి!
కాలక్షేపం! ధనలాభం!
రెండూ పొందండి!
నేడే వ్రాయండి!
తొలివాయిదా రూ. 25లు
తర్వాత రూ 21 చొప్పున
4 వాయిదాలు మాత్రమే!
మీ సొమ్ము భద్రతకై
'ఆంధ్రా బ్యాంకు' వారి
క్యాష్ సర్టిఫికెట్టు మీ పేరుతో
ఇస్తున్న తొలి సంస్థ!
RADHIKA
వాణి
సేవింగ్ సిండికేట్
H O:
G.T. రోడ్
గుంటూరు
B O:
మెయిన్ రోడ్
మచిలీపట్నం

అందుకే ఏ పార్టీ కయినా ఫంక్షన్ కయినా ఉండదు. పైమయిన వెంటనే ఆదరా బాదరాగా యింటికి పరుగెత్తుంది.'

శ్రీదేవి ఆలోచిస్తూ పైల్సు చూస్తోంది.

ఉమ పనిలో ఏదో తప్పుచేసిందని వాళ్ళ సెక్షన్ హెడ్ నోటికి వచ్చినట్లు తిడ్తున్నాడు. ప్రక్కనున్న కుర్రాళ్ళు పైల్సు చాటుచేసుకుని నవ్వుతున్నారు. ఆ సెక్షన్ హెడ్‌ని చూస్తూ వుంటే యేదో ఆలోచన వచ్చి శ్రీదేవి నవ్వు కుంది. అతను రిజర్వేషన్స్‌లో త్వరలో ప్రమోషన్ సంపాదించాడు. అతనికి పనిచేతకాదు. అవతల ఆఫీసర్ రూంలో ఏం కాజాలు తిని వచ్చాడో... కన్పించిన వారినందరినీ కసురు తున్నాడు.

"చాలామంది ఆడవాళ్ళు యింటి దగ్గర హాయిగా కూర్చుని ఉద్యోగస్థునుల మంటే జెలసీ చూపిస్తారు. మా అత్తగారు తిట్టారు, ఆడపడుచు నవ్వింది. మొగుడు కొట్టాడు అని యేడుస్తారు. యిక్కడ మనం అడ్డమైన వాళ్ళచేత చెప్పుదెబ్బలలాటి తిట్లుతినటం వాళ్ళు చూడరు కదా....' ఎప్పుడో రిజైన్‌చేసి వెళ్ళి పోయిన వత్సల మాటలు గుర్తుకొచ్చేయి శ్రీదేవికి.

* * *

"మా కాలంలో లక్ష్మీగుమ్మం దాటి ఎరుగ మమ్మా, యీ రోజుల్లో నయితేనా ."

పక్కింటి పిన్నిగారికి శ్రీలక్ష్మమ్మగారు మాట్లాడటం విన్పించింది కూరల బుట్ట చేతిలో పెట్టుకుని మెట్లెక్కుతున్న శ్రీదేవికి.

"అవసరం లేకపోతే ఎవరు మాత్రం దాటారు!" అనుకుంది శ్రీదేవి.

తమ తాతగారిల్లు గుర్తుకు వచ్చింది శ్రీదేవికి.

వాళ్ళకి బోలెడు ఆస్తిపాస్తులుండేవి. చాల పెద్ద యిల్లు. ఆడవాళ్ళెప్పుడూ వంటిళ్ళు, మండువా తప్పిస్తే యివతలి గదుల్లోకి వచ్చే వాట కారు. పాలు, పెరుగు, కూరలే కాదు బట్టలు, ఆఖరుకు బంగారం నగలు చేసే కంసాలికూడ పెరటి గుమ్మంలోనుండి లోనికి వెళ్ళేవాళ్ళు. యే పెళ్ళికో పేరంటానికో తప్ప ఆడవాళ్ళు బయటకు వచ్చేవారు కారు. రావల సిన అవుసరం అంతకంటే వుండేది కాదు.

యిప్పుడైతేనో పొద్దున్న లేచి పాలకి, పంచదారకి, బియ్యానికి, అన్నింటికి ఆడవాళ్ళే వెళ్ళి క్యూలో నిలబడవలసిందే.

"అబ్బబ్బ....ఎక్కడ చూచినా ఆడవాళ్ళే" అనే జనం ఈ సంగతి గ్రహించుకోరు.

పూర్వం, ఆడదానికి స్వాతంత్ర్యం ఉండేది కాదు.

భర్త ఒడికలో, అత్తమామల చెప్పు చేతల్లో, ఆడపడుచుల దెప్పి పొడుపుల్లో గడపలసివచ్చేది. యింట్లో వాళ్ళకి, వచ్చేపొయ్యే వాళ్ళకి, వండి వార్చిపెట్టడం, యింట్లో యింకా మిగతా పనులు చేసుకోవటం, అంటే.... వంటలక్కగా, దాసీగా, మాత్రమే వుండేది. కాని. నేడు...

నేడు చాకలిదానిగా, చప్పుడిదానిగా (సెప్టిక్ లెట్రిన్ క్లీన్ చేసుకోవద్దూ...?) మంగలి దానిగా..(భర్తగారి షేవింగ్ సెట్ క్లీన్ చెయ్యవద్దూ—) యింకా———బంట్రోతుగా, ఆయాగా కూడ వుంటోంది.

యివన్నీకాక ఉద్యోగిని అయితే. . డబ్బు సంపాదించే యంత్రంగా కూడాను.

యినుప గోడలుచీల్చి, స్త్రీని వంటింట్లోంచి, యింట్లోంచి, బయటకు తీసుకుని వచ్చిన దిందుకేనా?

యిదేనా పెద్దలందరూ కలసి స్త్రీకి కల్పించిన స్వాతంత్ర్యం?


సాదా నూలు చీర కట్టుకున్నా, నైలాన్ డ్రస్ వేసినా, పట్టు బట్ట కట్టినా నేటి స్త్రీ ఎదుర్కొంటున్న సమస్యల్లో పై చెప్పినవి కొన్ని మాత్రమే.

అత్తపోరు, భర్తపోరు పోకపోయినా సంఘంలో ప్రతి మనిషిపోరు సంపాదించ గలిగిందీకాలపు స్త్రీ.

పగవాళ్ళకు కూడ వద్దు బాబూ ఈ స్వాతంత్ర్యం .

స్త్రీకిమీరు తెచ్చిపెట్టిన, లేక వాళ్ళు చేజేతులా తెచ్చుకున్న స్వాతంత్ర్యం యిదే అయితే

నస్త్రీ స్వాతంత్ర్యం వాంఛతి అనవచ్చునేమో. □



మయసభ

గత సంవత్సరం నవంబర్ నెలలో ఆంధ్ర కోస్తాలో ప్రకృతి విలయతాండవం చేసింది. వేలాది ప్రాణాలను, కోట్లాది రూపాయలను ఆ స్తినీ పొట్టనబెట్టుకుంది.

అదంతా గమనించిన జాతీయ బఫూన్ శ్రీమద్రాజనారాయణ్ జీ చాలా గొప్ప వ్యాఖ్యానం ఒకదాన్ని తెలుగు జనులపై విసిరేశారు—"ఈ ఆంధ్రులు మా పార్టీని కాదని మరొక పార్టీని ఎన్నుకున్నారు. అటువంటి పాప కార్యం చేసినందుకే వారిమీద ప్రకృతి ఈ విధంగా విరుచుకు పడింది—" అన్నారు!

ఆహా! ఎంత గొప్ప లాజిక్! ఏమా వైజ్ఞానిక దృష్టి....! అనిపిస్తుంది. మరి ఆ లెక్కని పరిశీలిస్తే మనకు ఎన్నో సృష్టి రహస్యాలు బోధపడిపోతాయి. విజ్ఞాన శాస్త్రం తలబద్దలు కొట్టుకున్నా అవగతం కాని కార్యకారణ సంబంధం,—"హిరణ్మయేన పాత్రేణ సత్యస్యాపి హితం ముఖం—" అన్నట్లు దాగివున్న సత్యం, ఇట్టే తెలిసిపోతుంది.

ఈ సంవత్సరం ఉత్తరప్రదేశ్, బీహార్, ఢిల్లీ హర్యానాలలోని నదులన్నీ వరదలతో ఉప్పొంగాయి. లక్షలాది ఎకరాల్లో పంట నష్టమైంది; ప్రాణ నష్టం కూడా జరిగింది.

రాజా! నారాయణా! దానికి కారణమేమయి యుండనోపు?—అని ప్రశ్నిస్తే సమాధానం ఇలా వుంటుందనుకోవచ్చునా—

ఆ రాష్ట్రాల వారందరూ ముక్తహస్తంతో మీకు ఓటేసిరి కదా, అవతలి పార్టీకి ఒక్క సీటయినా లేకుండా చేసిరి కదా ఆ పాపాల మూటయేఇప్పుడు వానయై వరదయై మీమీదకు పడగెత్తి వచ్చింది—అని మనం అనవచ్చు.

మీరేదో ఉద్ధరిస్తారని మిమ్మల్ని ఎన్నుకుంటే మీలో మీరు బజారులో ఎదగని కుర్రాళ్ళలా కీచులాడుకుంటూ దేశాన్ని మరచిపోతున్నారే—అందుకే ప్రకృతి కన్ను 'తడి'చేసింది.

నిరుద్యోగి ఉద్యోగం కన్న మద్యనిషేధం ముందు అవసరం—అనీ,

సామాన్యుడికి సముచితమైన ధరలలో—అవసరాలు లభింపచేయటం కన్న హిందీ భాషావ్యాప్తి చాలా అర్జెంటు అనీ—

నానాటికి నిరాశ పెరిగిపోతున్న సమాజపు ఊపిరితిత్తుల్లోకి ప్రాణవాయువు పోయటంకన్న—బంగారం వేలం పాటలు ముఖ్యం—అనీ.

—భావించి నడుచుకుంటున్న నాయకులారా! మీ ఆ పాపాలన్నీ భగ్గుమని ఆకాశాని కెగసి ఘోరుమని వర్షమయి మీ ప్రాంతాలపై, మిమ్మల్ని ఎన్నుకున్న రాష్ట్రాలపై కురిసి, ముంచిందని — అనుకోమంటారా? .... అని మనం అడగవచ్చు.

....ఇదే సమస్యమీద ఘనత వహించిన మన ప్రతినిధుల సభలో చర్చబయలుదేరిందని అనుకుందాం; అప్పుడు డైలాగులు ఈ విధంగా వుండవచ్చు....

* * *

ఏ. రామసంజీవి

ఒక ప్రతిపక్ష సభ్యుడు:—అధ్యక్షా! మన్నగరంలో "మాడల్ టౌన్" అనే పేటలోకి యమునానది నీళ్ళొచ్చేశాయి. ఈ విషయమై ప్రభుత్వం అశ్రద్ధను నేను తీవ్రంగా నిరసిస్తున్నాను.

ప్రభుత్వ సభ్యుడు:—ఇది చాలా వింతగా వుంది....యమునలో నీళ్ళు రాకపోతే గ్రాండ్ ట్రంక్ రోడ్ మీద వస్తాయిటండీ?

మరొక సభ్యుడు:—ఇలాటి వరదలు రాకుండా వుండాలంటే మన నగరాన్నయినా యిక్కడనుంచి తరలించాలి; లేకపోతే ఆ నదినయినా తరలించాలి. ఈ పని చేబడితే రాబోయే ఎనిమిదేళ్ళ ఆరు నెలల మూడు వారాలలో నిరుద్యోగ సమస్య పూర్తిగా తేలిపోగలదు.

రాజ్‌నారాయణ్‌జీ:—దేశ విద్రోహశక్తులను ప్రతిఘటిస్తున్నాము అన్న కారణంగా చరణ్‌జీని, నన్నూ మంత్రిమండలినుండి సాగనంపిన పాపానికి ఫలితమే ఈ వరద.

ప్రతిపక్షం:—అదే గనుక నిజమయితే అధ్యక్షా! మా రాష్ట్రంలో ఈసారి ఒక చుక్క వర్షం పడలేదు, పైర్లెండిపోయాయి; పశువులు చచ్చిపోతున్నాయి; తిండికోసం లక్షలాది ప్రజలు వలసపోతున్నారు. కనుక ఈ పాపాత్ములందరి సభనూ మా రాష్ట్రంలో పెట్టించండి; అప్పుడు ప్రకృతికి కోపం వచ్చి వానలొస్తాయి; వరదలొస్తాయి. జనం సుఖపడతారు.... (సభలో చప్పట్లు)

మరొక సభ్యుడు:—అధ్యక్షా! అసలు విషయం దాటవేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తూంది. నాలుగు రోజులనుండి నా నియోజక వర్గంలోని అన్ని యిళ్ళలోను ఎనిమిదడుగుల ఎత్తు నీరుంది....జనం యిళ్ళ మేడల మీద కూర్చుని వున్నారు. తిండి, నిద్రలేక అష్టకష్టాలు పడుతున్నారు. వారికి నిత్యావసరాలు అందజేయాలి అంటే తగినన్ని పడవలయినా లేవు.

మాజీ ప్రభుత్వ సభ్యుడు:—చూచారా! చీటికి మాటికి మమ్మల్ని ఆడిపోసుకుంటారు కాని, ముప్పైయేళ్ళ ప్రభుత్వంలో ఎన్ని మంచిపనులు చేశాము....యిలాంటి వరదలూ అవీ వచ్చేస్తాయి అనే మేము మూడు, నాల్గు అంతస్తుల మేడల ఇళ్ళ నిర్మాణాన్ని ప్రోత్సహించాము. ఇవాళ ఆ వరదలనుండి ప్రాణాలను కాపాడటానికి ఆ మేడలే పనికొచ్చాయి. మేడలు వర్ధిల్లాలి! నాల్గంతస్తులు జిందాబాద్!

అట్టడుగు వర్గాల ప్రతినిధి:—అన్యాయం! ఇది అన్యాయం! ఇక ముందరనించి బడుగు వర్గాలవారి నిమిత్తం ప్రభుత్వం నిర్మించే గుడిశెలన్నీ కూడా కనీసం నాల్గు అంతస్థుల ఎత్తయినా వున్న మేడలమీదే నిర్మించాలని నేను డిమాండ్ చేస్తున్నాను.

బూటకపు వాగ్దానాలు చేసి, గుడిసెలను మామూలుగా నేలమీద నిర్మించి యిచ్చే మీ కేపిటలిస్టు కుట్రదారుల నయవంచకత్వం యింక సాగదు. జనం మేల్కొంది; ప్రభంజనం హోరు విన్పిస్తూంది; దోపిడీ చీడపురుగుల్ని చీరిపారేస్తుంది; కనుక చరిత్ర గతిని గమనించండి. కళ్ళు తెరవండి; ముందుగా రెండంతస్తులే వున్న మా ప్రతినిదుల నివాసగృహాల మీద మరొక రెండంతస్తులు కట్టించే ప్రయత్నం మొదలు పెట్టండి—

మరొక సభ్యుడు:—అధ్యక్షా! మంత్రిగారేమీ పలకడం లేదు. నా నియోజకవర్గంలో యిళ్ళల్లో రెండంతస్తులవరకు నీళ్ళొచ్చి, టెలివిషన్ సెట్లన్నీ పాడయిపోయాయి. వాటిని మళ్ళీ కొనుక్కునే నిమిత్తం ఆ వరదబాధితులకు గ్రాంట్లు యిప్పించవలసినదిగా మనవి చేస్తున్నాను. మంత్రిగారిని సమాధానం యివ్వమని కోరుతున్నాను.

[కరువు కాటకాల మంత్రిగారు నిలబడి—"శ్రీ అధ్యక్ష మహోదయా...." అని పూర్తిగా అనకముందే సభలో కలకలం—]

తమిళ సభ్యుడు:—'శ్రీ' ఎన్బదు సరియల్ల; 'తిరు' ఎన్రుదాన్ సొల్ల వేండుమ్....నంబ ద్రావిడ నాట్టిల్........

తివారీజీ:—ఏ క్యా బోల్ రహా హై భాయ్!

అధ్యక్షులు: సైలెన్స్ ప్లీజ్! సభ్యులు లేవదీసిన సమస్యపై ప్రభుత్వంవారి సమాధానం మంత్రిగారిని చెప్పనివ్వండి.

[మళ్ళీ కరువు కాటకాల మంత్రి నిలబడతారు]

ప్రతిపక్షం:—వరద వ్యవహారాల మంత్రిగారు సభలో వుండగా కరువుకాటకాల మంత్రిగారు సమాధానం యివ్వడానికి మేము తీవ్రంగా అభ్యంతరం తెలుపుతున్నాము.

కరువు కాటకాలు:—అధ్యక్షా! మన్నించండి! నా మనవి ఆలకించండి... నా సోదరుడు వరదవ్యవహారాల మంత్రిగారు గత ఎనిమిది రోజులనుండి రాజానగర్ ఉపఎన్నికల నిమిత్తం వందా అరవైయేడు సభలలో మాట్లాడి వచ్చాడు. ఆయన స్వరపేటిక పచ్చి పుండై పోయింది. ఆయన్ను యింకో పదిరోజులదాక 'కిమ్మ'న వద్దని ఆలిండియా మెడికల్ సంస్థవారు సలహా యిచ్చారు; అంచేత ఆయన తరపున నేను మాట్లాడడానికి నిల్చున్నాను.

అధ్య:—కానివ్వండి.

క. కా. మంత్రి:—వరద బాధితులందరికీ ప్రభుత్వం ప్రగాఢ సానుభూతిని అందజేస్తూంది. రోజూ మూడు పూటలా మేమందరం హెలికాప్టర్ల మీదుగా వెళ్ళి వారికి కనపడి, వారి భయాందోళనలు తగ్గించడానికి కృషి చేస్తూనే వున్నాం. ఆర్మీ విమానాలు వెళ్ళి ఆహారపొట్లాలు అందచేస్తున్నాయి. ఇంకొక రెండు రోజులలో పరిస్థితి బాగా మెరుగవుతుందని నిపుణులు అంచనా వేశారు.

ఇక—సభ్యులు చేసిన సూచనలన్నిటిని ప్రభుత్వం తప్పకుండా పరిశీలిస్తుందని హామీ యిస్తున్నాను.

నగరాన్ని యిక్కడినుంచి తరలిస్తే మాతోబాటు ప్రతిపక్ష సభ్యులకు అనేక యిబ్బందులు ఎదురవుతాయి గనుక అందుకు బదులుగా నదిని తరలించే సూచనను పరిశీలించడానికి ఒక నిపుణుల సంఘాన్ని నియమిస్తాము.

ప్రతిపక్షం సూచించినట్లుగా యిహ ముందు వేసే గుడిసెలన్నీ నాల్గవ అంతస్తుపైగానే వుండాలన్నది మా పార్టీ ప్రాథమిక సూత్రాలలో ఒకటి అని గుర్తుచేస్తున్నాను. గుడిసెలకన్న మేడలు ఎత్తుగా వుండే రోజులు పోయాయి. మేడలకంటె గుడిసెలే ఎత్తుగా వుండాలని మేము మనస్ఫూర్తిగా నమ్ముతున్నాం. కనుక ఈ ఆదర్శాన్ని ఆచరణలో పెట్టడంలో మేము ప్రతిపక్షం వారి సహకారాన్ని అర్థిస్తున్నాము.

నీళ్ళల్లో మునిగిన ఇళ్ళవద్దకు వెళ్ళడానికి వున్న పడవలన్నీ వినియోగించాము. ఇంకా కావలసిన పడవల్ని దిగుమతి చేసుకుంటాము. ఈలోగా కాగితపు గుజ్జుతో పడవల తయారీకి ఒక పథకం ఆమోదించాము. వాటి తయారీకి కాగితం కొరత ఏర్పడకుండా మనందరి పార్టీల ఎన్నికల "మేనిఫెస్టో" ప్రతులను ఆ పడవల తయారీకే కేటాయించడం జరిగింది. కనుక ఈ విషయంలో మానవమాత్రులు చేయగల్గిందల్లా చేశామని మనవి చేస్తున్నాను. (కరతాళధ్వనులు)

* * *

కనుక, సోదరా!

ఎవరన్నారు మన సమస్యల్ని మన ప్రతినిధులు పరిష్కరించడం లేదని?

పుకార్లు నమ్మకండి!!

**

పలురంగాలలో ఆంధ్ర ప్రముఖులు

ప్రపంచంలో నూనె పరిశ్రమలలో సగానికి పైగా సంస్థలకు సహకరిస్తున్న 'హోవార్డ్ ఫిన్లే కన్సల్టెంట్స్' సంస్థ భారత విభాగంగా వున్న 'హోవార్డ్ ఫిన్లే కన్సల్టెంట్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్' సంస్థకు మేనేజింగ్ డైరక్టర్‌గా వున్నది ఆంధ్రుడు. ఆయన పేరు కప్పగంతుల రామేశం. 1935 లో మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన వేపా రామేశంగారి మనుమడీయన.

'తమిళనాడు స్టేట్ సెంటర్-ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్' సంస్థకు చైర్మన్‌గా పనిచేసిన తొలి ఆంధ్రుడైన శ్రీ రామేశం ఇంజనీరింగ్ పట్టభద్రుడు. అనేక పరిశ్రమలలో పని చేసిన అనుభవశాలి. లూకాస్ టి. వి. యస్ లిమిటెడ్ సంస్థలో చీఫ్ వర్క్స్ ఇంజనీర్‌గా పదమూడేళ్ళు పనిచేశారీయన.

'కాలేజీలనుంచీ పట్టభద్రులు వెలువడుతున్న వేగానికి సరిపడా పారిశ్రామిక ప్రగతి లేక పోవడంతో నిరుద్యోగ సమస్య తప్పనిసరియై పోయిందని' అభిప్రాయపడుతున్న ఈ ఇంజనీర్ "గ్రామీణ పరిశ్రమలు అభివృద్ధి పరచడంలో ఈ సమస్యకు పరిష్కారం ఉంది" అని అంటారు. "స్వయం ఉపాధి పథకాలు పెంచాలి—నా పరంగా మా సంస్థ సహకారంతో 'ఇంటర్నేషనల్ టెక్నికల్ రిక్రూట్‌మెంట్ ఏజన్సీ' ప్రారంభించి సాంకేతిక విద్య నేర్చిన వారికి అవకాశాలు కల్పించే ప్రయత్నం చేయాలనిఉంది" అన్నారీయన. నేషనల్ స్టాండింగ్ కమిటీ (మెయిన్‌టెనెన్స్ మేనేజ్‌మెంట్) సభ్యుడయిన శ్రీరామేశం "ఉన్న మనుష్య శక్తి, యంత్రశక్తి పూర్తిగా ఉపయోగించుకోలేకపోతున్నాము" అని ఆందోళన వెలిబుచ్చారు. "కార్మికుల సమ్మెలవలన చిన్న తరహా పరిశ్రమలే ఎక్కువ దెబ్బతింటున్నాయి. క్రమశిక్షణ ఒక్కటే ఈ సమస్యా పరిష్కారానికి మార్గం" అంటున్న శ్రీ రామేశం "కార్మికులూ, యజమానుల మధ్య మానవతా దృక్పథం చోటు చేసుకోవాలి" అన్నారు.



శ్రీ రామేశం

"కోలార్ గోల్డ్ ఫీల్డ్‌లో పనిచేస్తున్నపుడు దెబ్బతిన్న ఓ కార్మికునికి, మత సమస్య కారణంగా ఏ వర్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రానప్పుడు....నేను....వారి పై అధికారిగా ఉన్నా రక్తదానంఇచ్చేందుకు ముందుకు వచ్చాను. ఆ వెంటనే అంతకు ముందు నిరాకరించిన మరి కొంతమంది ముందుకు వచ్చారు. అవతలి మనుషుల్లో మానవత్వాన్ని వెలికి తేగలిగిన ఆనాటి సంఘటన నేనెన్నటికీ మరువలేను" అన్నారీయన తమ అనుభవాలు ముచ్చటిస్తూ.

ఇతర దేశాలలో కూడా తన ప్రతిభకు గుర్తింపు తెచ్చుకున్న శ్రీరామేశం "కష్టించి పని చెయ్యడానికి మించిన విజయ- రహస్యం లేదు. భగవద్గీతలో చెప్పినట్లు తన ధర్మం తాను నిర్వర్తించ గలగడాన్ని మించిన గొప్ప కార్యమేమీలేదు" అన్నారు.

—పి. సరళా సూర్యారావు

సినిమా

కృష్ణ త్రిపాత్రాభినయం

హీరో కృష్ణ త్రిపాత్రాభినయం విశేషాకర్షణగా సుందర కాశ్మీర దృశ్యాలు కనుల విందుగా చూపించే సత్యచిత్ర వారి 'కుమార్ రాజా' సినిమాస్కోప్ వర్ణ చిత్రం పి. సాంబ శివరావు దర్శకత్వంలో తయారైంది. జయప్రద, లత, సత్యనారాయణ, జయంతి, చివర బాబు కలసివున్న మోహన్, రాజ, గిరి, నాగభూషణం మొదలైనవారు నటించారీ చిత్రంలో. ప్రధాన సాంకేతిక నిపుణులు; వి. యస్. ఆర్. స్వామి కెమేరా: మహదేవన్ సంగీతం: జంధ్యాల మాటలు, నిర్మాతలు సత్యనారాయణ, సూర్యనారాయణ:

విదేశ తెలుగు చిత్రం!

తొలిసారిగా విదేశంలో నిర్మించబడ్డ తెలుగు చిత్రంగా చెప్పబడుతున్న తిరుపతి పిక్చర్స్‌వారి భారీవర్ణ చిత్రం సాహసవంతుడు త్వరలో విడుదల కాబోతోంది. ఎన్. టి. రామారావు కథానాయకుడిగా నటించే ఈ చిత్రంలో వాణిశ్రీ, చంద్రకళకూడా నటించారు. కె. విద్యాసాగర్ నిర్మించిన ఈ చిత్రానికి కె. బాపయ్యా దర్శకుడు.

'చలిచీమలు' చిత్రం తెలుగు చిత్ర పరిశ్రమలోని రెండు శాఖలకు కొత్తవారిని ప్రవేశపెట్టడమేగాక, మరో శాఖలోని, ఒక వ్యక్తికి నిలకడయిన కెరీర్ సంపాదించిపెట్టింది.

చంద్రకళ, రామారావు—'సాహసవంతుడు'



ఆ చిత్ర దర్శకుడు దేవదాస్ కనకాల తొలి చిత్రంతోనే కేవలం విజయవంతమైన చిత్రం సమర్పించిన దర్శకుడిగానే గాక, విమర్శకుల చేత ప్రతిభగల దర్శకుడన్న పేరూ పొందాడు. చలిచీమలకు ముందే దేవదాస్ దర్శకత్వంలో ప్రారంభించబడ్డ నిజం (రాచకొండ విశ్వనాథ శాస్త్రి నాటకం 'నిజం'కు చిత్ర రూపం) పూర్తి కావస్తోందిప్పుడు. ఆ తర్వాత వరసగా మూడు నాలుగు సినిమాలు యీ దర్శకుని చేతిలో రూపు దిద్దుకొనేందుకు షెడ్యూల్స్ వేయబడుతున్నాయి

రచయితగా 'పరుచూరి' పరిచయమయ్యాడు 'చలిచీమలు' ద్వారా. ఇప్పుడు పరుచూరి రాసిన నాటకం కలియుగ మహాభారతం చిత్రంగా తయారవుతూంది హనుమాన్ ప్రసాద్ దర్శకత్వంలో. ఈ చిత్రానికి మాటలు పరుచూరే రాస్తున్నారు. మంచి నాటక రచయితగా పేరొందిన పరుచూరి తొలి చిత్రం ద్వారా మంచి సినిమా సంభాషణల రచయితగా కూడా పేరొందాడు. మరికొన్ని చిత్రాలకు పరుచూరి పనిచేస్తున్నాడిప్పుడు.

అంతకు ముందే నటుడిగా పరిచయమైనా చలిచీమలు చిత్రంలోని చిన పద్దయ్య పాత్ర ద్వారా పరిశ్రమలో స్థిరమైన కేరీర్ సంపాదించుకోగలిగాడు వరప్రసాద్ .... సారీ .... ఇప్పుడీయన నూతన్ ప్రసాద్. నాటకరంగం ద్వారా నటుడిగా విశేషానుభవం గడించిన నూతన్ ప్రసాద్ వైవిధ్యమున్న ఎన్నో పాత్రలలో తెలుగు ప్రేక్షకులకు కన్పించబోతున్నాడు వరసగా.



మాధవి—'ఏది పాపం-ఏది పుణ్యం'

'కేడీ నెం. 1'లో రామారావు



కమలమ్మ కమతం!

రచయిత సి. యస్. రావ్ సహజత్వమున్న కథలూ, ప్రయోజనాత్మకమైన కథలూ రాసి రచయితగా ప్రసిద్ధుడయాడు. తర్వాత 'ఊరుమ్మడి బ్రతుకులు' చిత్రం ద్వారా చలన చిత్ర రంగానికి పరిచయమై, ఆ పిమ్మట తరం మారింది చిత్రానికి సంభాషణలు సమకూర్చారు సి. యస్. రావు కథ మాటలు సమకూర్చిన ప్రాణం ఖరీదు ఇటీవలనే విడుదలయింది.

ఇప్పుడు ప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్ వారు సి. యస్. రావు నవల 'కమలమ్మ కమతం'ను చిత్రంగా రూపొందిస్తున్నారు. చిత్రానికి మాటలుకూడా సి. యస్. రావే రాస్తున్నారు. కృష్ణంరాజు, జయంతి, గిరిబాబు, పల్లవి, విజయలలిత, అల్లు రామలింగయ్య, వంకాయల సత్యనారాయణ ముఖ్యపాత్రధారులు, నిర్మాత: ఎ. వి. సుబ్బారావు.

దాసరి మరో ప్రయోగం!

నూతనత్వానికి, వైవిధ్యానికి ప్రతీకగా నిలుస్తూ చిత్రాలకు దర్శకత్వం వహించడమే గాక, కథ, మాటలు. స్క్రీన్ ప్లే బాధ్యతలు కూడా చేపట్టి విజయవంతమైన చిత్రాలు అందిస్తున్న దర్శకుడు దాసరి నారాయణరావు 'నీడ' పేరుతో ప్రయోగాత్మక చిత్రం తీసేందుకు నిర్ణయించుకొన్నారు. పాటలుండని యీ చిన్న చిత్రం, తన తొలి చిత్రం 'తాత మనవడు' రిలీజ్‌కు కర్నూలు వెళ్ళినప్పుడు జరిగిన ఒక సంఘటన ఆధారంగా తయారవుతుందని దాసరి చెప్పారు.


రావణుడే రాముడైతే!

పేరులోనే ఆకర్షణ ధ్వనింపచేస్తున్న యీ చిత్రానికి కథ,మాటలు. దర్శకత్వం దాసరి నారాయణరావు, హీరో అక్కినేని నాగేశ్వరరావు. మురళీ 'మోహన్'బాబు, ప్రభాకరరెడ్డి, మాడా, కె. వి. చలం, నటిస్తున్న యీ చిత్రంలో జయచిత్ర కథా నాయిక, లక్ష్మీ ఫిలిం కంబైన్స్ నిర్మించే యీ స్కోప్ అండ్ కలర్ చిత్రానికి నిర్మాత అనూరాధాదేవి.



జయప్రద 'అందమైన అనుభవం'

'మా భూమి'లో సాయిచంద్



కోరికలే గుర్రాలైతే

దాసరి నారాయణరావు దర్శకత్వంలో తయారౌతున్న మరో చిత్రమిది. మురళీమోహన్, ప్రభ. చంద్రమోహన్, జయలక్ష్మి, మోహన్‌బాబు, రమాప్రభ. కాంతారావు, నిర్మల, జయమాలిని మొదలైన వారు నటించే యీ చిత్రాన్ని జగదీష్ చంద్రప్రసాద్ నిర్మిస్తున్నారు.

మా భూమి!

గౌతమ్ ఘోష్! ఇది బెంగాలీ పేరు. ఇప్పుడు ఆ పేరుగల వ్యక్తి ఒక తెలుగు



కృష్ణంరాజు—'కటకటాల రుద్రయ్య'

...త్రానికి దర్శకత్వం వహిస్తున్నాడు. ముప్ఫై ఏళ్ళు నిండిన గౌతమ్ ఘోష్ చలన చిత్ర దర్శకుడిగా ప్రశంస లందుకొన్నారిదివరకే. ఈయన దర్శకత్వంలో నిర్మించబడ్డ డాక్యుమెంటరీలు విమర్శకులచేత కొనియాడబడి విశేష ప్రశంస లందుకొన్నాయి. 'హంగ్రీ ఆటమ్' (క్షుధిత శిశిరం) అన్న డాక్యుమెంటరీ ఈస్టు జర్మనీ ఫిలిం ఫెస్టివల్‌లో డిప్లొమా ఆఫ్ మెరిట్ గెలుచుకొంది. దాదాపు ముప్ఫై నిముషాలున్న ఈ డాక్యుమెంటరీని మద్రాసులోని పత్రికల వారికి 'మా భూమి' చిత్ర నిర్మాతలు చూపించారు. "బెంగాలు కరువు"పై చిత్రీకరించబడ్డ యీ డాక్యుమెంటరీ ఒక విషాద కావ్యం. ఎంతటి కఠీనుడినయినా కదిలించి కంట తడి పెట్టిస్తుంది. తమ దర్శకుని దర్శకత్వంలో తయారైన ఆ డాక్యుమెంటరీని 'శాంపిల్'గా చూపించి తర్వాత జరిపిన గోష్ఠిలో 'మాభూమి' చిత్ర విశేషాలు వివరించారు చైతన్య చిత్ర ఇంటర్నేషనల్ సంస్థవారు. కీ॥ శే॥ కిషన్ చందర్ నైజాం నవాబుకు వ్యతిరేకంగా తెలంగాణా రైతులు జరిపిన ప్రతిఘటనోద్యమాన్ని వస్తువుగా తీసుకొని రాసిన నవల "జబ్ ఖేత్ జాగే"కు చలన చిత్ర రూపంగా 'మాభూమి' తయారౌతోంది. కమల్‌నాయక్ ఫొటోగ్రఫీ, వింజమూరి సీత సంగీతం నిర్వహించే ఈ చిత్రాన్ని జి. రవీంద్రనాధ్. బి. నరసింగరావు నిర్మిస్తున్నారు.

సత్యజిత్‌రాయ్ చలన చిత్రోత్సవాలు

చలన చిత్రాన్ని సృజనాత్మక కళగా అభివృద్ధి పరచటంలోను, అత్యుత్తమ రీతిలో మానవతా విలువలను ప్రతిబింబిస్తూ ఫిలిం




'మనవూరి పాండవులు'లో హలం, గీత

రంగంలో నిరంతరం కృషి సల్పిన ప్రముఖ భారతీయ చలన చిత్ర దర్శకుడు శ్రీ సత్యజిత్ రేకు లండన్ అక్స్‌ఫోర్డ్ యూనివర్సిటి డాక్టరేటును బహూకరించిన సందర్భంలో ఆంధ్ర ప్రదేశ్‌లో వరంగల్, శ్రీకాకుళం, గుడివాడ, అనకాపల్లి, అనంతపూర్ మొదలగు పట్టణాలలోని ఫిలిం సొసైటీలు రాయ్ చలన చిత్రోత్సవాలను సెప్టెంబర్, అక్టోబర్‌లలో నిర్వహిస్తున్నాయి. ఈ ఫిలిం ఫెస్టివల్స్‌లో మిస్టర్ రే దర్శకత్వం వహించిన అశనిసంకేత్, అవణ్యేస్ దిన్ రాత్రి. ప్రతిద్వంది, తీన్ కన్య, జల్సాఘర్, పథేర్ పాంచాలి, అపరాజిత, అపూర్ సంసార్, మున్నగు చిత్రాలు ప్రదర్శించబడతాయి. ఈ చిత్రాలను కొమ్మినేని ఫిలింస్ మద్రాసువారు ఆంధ్రప్రదేశ్‌లో విడుదల చేస్తున్నారు.



'అంగడిబొమ్మ'లో సీమా, నారాయణరావు



దక్షిణ భారత నటీనట సమాఖ్య (న్యూఢిల్లీ) ప్రదర్శించిన
'సిద్ధార్థ' నాటకంలో ఒక దృశ్యం

ఢిల్లీలో 'సిద్ధార్థ'

దక్షిణభారత నటీనట సమాఖ్య (న్యూఢిల్లీ) వారు తమ తెలుగు నాటకోత్సవాల సందర్భంగా ఆదివిష్ణు 'సిద్ధార్థ' నాటకాన్ని తొలి రోజున ప్రదర్శించేరు. 'సిద్ధార్థ' కథగా జ్యోతి మాస పత్రికలో ప్రచురించబడ్డ విషయం పాఠకులకు తెలిసే వుంటుంది. (1973 జ్యోతి దీపావళి ప్రత్యేక సంచికలో ప్రచురించబడిన ఈ కథ పాఠకుల బాలెట్‌లో గెలుపొంది 'బంగారు వుంగరం' బహుమతి పొందింది.) మదరాసు కళాసాగర్ వారి 1975-78 ఉత్తమ రచన బహుమతి "సిద్ధార్థ"కు లభించింది. మనోహరంగా ప్రదర్శించబడిన ఈ నాటకానికి దర్శకుడు శ్రీ బి. నాగరాజరావు.

రెండవ రోజున శ్రీ అత్తిలి కృష్ణారావు రచించిన 'టామీ టామీ' నాటికను శ్రీచాట్ల శ్రీరాములు దర్శకత్వంలో విశాఖపట్నం వారు ప్రదర్శించేరు. అదేరోజు శ్రీరాడి వీరభద్రరావు రచించి దర్శకత్వం వహించిన "పలుకే బంగారమాయె" నాటకాన్ని అనకాపల్లివారు ప్రదర్శించి రక్తి కట్టించేరు. చివరి రోజున ప్రఖ్యాత రచయిత శ్రీ రాచకొండ విశ్వనాథ శాస్త్రి "నిజం" నాటకాన్ని శ్రీ అత్తిలి కృష్ణారావు దర్శకత్వంలో విశాఖపట్నంవారు ప్రదర్శించేరు.

ఢిల్లీ నగరవాసులకు తెలుగు నాటకాలు మూడు రోజులపాటు చూపించి మురిపించిన దక్షిణభారత నటీనటసమాఖ్య కృషి అభినందనీయం.

—యస్వీ నారాయణ

షత్‌రంజ్ కె ఖిలారి

చదరంగం—రాజుల ఆటట—లేక ఆ లెవల్లో బతికేవాళ్ళ క్రీడట—ముందు బంట్లు —ఆనక తదితర బలాలు ఛస్తాయి.

ఓ పక్షం....నెగ్గితే—మరోపక్షం వోడాలి-వోడితీరాలి. ఇదే కదా మన జీవన సత్యం—

సత్యజిత్ రాయ్‌కి చాలా జీవన సత్యాలు తెలుసు! అందులో ఈ జీవన చదరంగ అంత రంగ మొకటి!

అమావాస్య తర్వాత చంద్రుడు ఎదిగినట్టు-యింగ్లీషువాళ్లు—భారత భూమిలో ఎదుగుతున్నప్పటి కథ. లార్డ్ డల్హౌసీ - ఈస్టిండియా కంపెనీ తరుపున అత్తగారి పెత్తనం చలా



సంగీత, రంగనాథ్ — 'తాయారమ్మ-బంగారయ్య'

యిస్తూ—ఒక్కో సామ్రాజ్యాన్నీ సంస్థానాన్నీ చప్పరిస్తున్న రోజుల్లో—"అవధ్" సంస్థానాన్ని "వజీద్ అలీషా"—పుట్టుకతో సాయిబైనా-హిందూమతాన్ని కూడా గౌరవిస్తూ—చాలా ప్రశాంతంగా కవిత్వంతో కలాన్ని ఖర్చు పెడుతూ "జీహుకుం" గాళ్ళ మధ్య హాయిగా ఏలుకుతున్నాడు.

ఆ వూళ్ళోనే సంజీవ్ కుమార్‌గారనే ఓ నవాబు, మరో జఫ్రీగారనే (పాకిస్థాన్ నటుడు) మరో సాయిబుగారూ, హాయిగా ముప్పూటలా పీక మొయ్యతింటూ ఆపైన కులాసాగా హుక్కా-పీలుస్తూ, చదరంగం ఆడుకుంటుంటారు. చదరంగం ఆడుకునే పరుపుమీదే—వాళ్ళ చేతికందుబాట్లో అన్ని ఏర్పాట్లూ—అలా కాలాన్ని ''మూడు బుడ్లూ ఆరు గ్లాసులుగా'' గడిపేస్తున్నారు. చదరంగాన్ని నడిపేస్తున్నారు—

సంజీవ్ కుమార్‌కి—షబానా అజ్మీ అనే అందమైన ఓ పెళ్లాం—బోలెడంత ఆస్తీ—ఇంటినిండా నౌకర్లూ-చాకర్లూ వగైరా.

అలాగే జఫ్రీకి నిగనిగలాడే లావుపాటి చిలగడదుంపలాటి — ఫరీదాజలాల్ అనే పెళ్ళాం—తగ్గ ఆస్తీ మందీమార్బలం వగైరా వున్నాయ్.

ఆ మొగుళ్ళకైతే పెళ్ళాలున్నారు కానీ ఆ పెళ్ళాలకి మాత్రం మొగుళ్లు లేరు. చదరంగమాడుకునే యిద్దరు మొగాళ్ళున్నారు—వెచ్చటి శరీరం—గోర్వెచ్చని కోరికలు—నరాల్ని శృతిపెట్టి కామరాగాలాపన చేస్తున్నప్పుడు భరించలేక ఏదో వంకపెట్టి మొగుణ్ణి పడకగదికి రప్పించుకుని—వచ్చిన మొగుడు ఏమీ చెయ్యకుండానే చక్కాపోతే తలపగలుకొట్టుకుని ఏడిచే పడుచు "షబానా". మొగుడు ముండాకొడుకు తెల్లారుతూ వుండగానే కొంపలు మునిగిపోయినట్టు - పళ్లైనా తోవుకుంటాడో లేదో తెలియదు—శుభ్రమైన గుడ్డలేసుకుని-కళ్ళకి సుర్మారాసుకుని బయల్దేరి వెళ్ళిపోయి-మళ్ళీ రాత్రి వస్తాడో రాడో తెలియని దురశలో-ఎక్కువగా, రాడనే గేరంటీతో ఆపిల్‌పండు లాంటి కుర్రాణ్ణొకణ్ణి యింటికి రప్పించుకుని కులికే జాణ—''ఫరీదా.''

అలా దేశంలో సంస్థానాధీశుల దగ్గర్నించి సామాన్యులవరకూ-వీలున్నంతవరకూ హాయిగా

బతికేద్దామనుకునే దశలో—లార్డు డల్‌హౌసీ-అవుట్‌రేం (రిచెర్డు అటెన్‌బరో అనే ఇంగ్లీషు నటుడు) ఓ ప్రబుద్ధుణి-'అవధ్' సంస్థానాన్ని-మహోఘనత వహించిన, సూర్యుడస్తమించని, బ్రిటిష్ సామ్రాజ్యం తరపున, మింగేయ దానికి నియమించాడు.

ఆ "అవుట్‌రేం" గారికి — ఇండియా అన్నా ఇండియన్స్‌న్నా—ముఖ్యంగా రాజు లన్నా ఓ విధమైన వొళ్ళుమంట—

"వాట్—ఓ రాజుగారికి మూడొందల మంది పెళ్లాలా-అందులో రెండొందలు పెంప రరీయా? బ్లడీ యిండియన్స్" అని-ఇంగ్లీష్ చుట్టలు కాల్చుకుంటూ అంతస్థిమితంగానూ భారతీయుల్ని గురించి యింగ్లీష్‌లో ఆలోచిస్తూ వుంటాడు—

ఈ—వజిద్ అలీషా—చదరంగ మాడు కునే యిద్దరు ప్రభువులు వాళ్ళ పెళ్ళాలూ—వాళ్ళ బతుకులూ—వాళ్ళ దేశం—

వాళ్ళతో జీవన చదరంగమాడి ఓడించే బరువు బాధ్యతలు నెత్తి నెట్టుకున్న—


విక్టోరియా మహారాణి—ఇంగ్లీష్ బానిసలూ

వీళ్ళకథ 'షత్‌రంజ్‌కె ఖిలారీ' గొప్ప కావ్యానికి భాష్యం రాయడం జోక్‌కాదు గొప్ప వాక్యానికి అర్థం చెప్పడం జోక్‌కాదు సత్యజిత్‌రాయ్ సినిమాలకి అర్థం చెప్పడం అంతకంటె జోక్‌కాదు చాలాకష్టం—తెలుగు వాళ్ళకి అదృష్టంవుంటే 'షత్‌రంజ్‌కె ఖిలారి' చూడండి. చూసి ఆనక ఈ ఆర్టికల్ చదవండి.

[షరా: జయమాలిని డాన్సులూ, హీరోగారు తనకంటే రెండింతలున్న పదిహేను మంది డాదాల్ని చితక బాదడాలూ, మనుషులు చిలకలవడాలూ, హీరో హీరోయిన్లు ఒక పాటలో ఒక చరణాన్ని కాశ్మీర్లో. రెండో చరణాన్ని బృందావన్ గార్డెన్స్‌లో, ముగింపుని వాహినీ స్టూడియోలో ఏర్పాటు చేయ బడ్డ పడగ్గదిలో పూర్తిచేయడాలూవంటి ఫాంటసీలూలేవు గనుక—ఈ చిత్రాన్ని చూస్తూ ఆలోచిస్తూ, ఆలోచిస్తూ చూడ వలసి వుంటుంది హెచ్చరిక!]

—సి. వి. రమణ

జయప్రద, కృష్ణ—'వియ్యాలవారి కయ్యాలు'



ఉత్తరాలు

సెప్టెంబరు '78 జ్యోతి చదివాను. ప్రేమ త్యాగం నవల ఆకట్టుకుంది. పురుషోత్తంగారి నైలాన్ చీర కథలో రామారావు కుడిచెయ్యి మొండి అని రాశారు, మరి కార్టూన్లు ఎడం చేత్తో గీసేవాడా?

ఎ. రామ సంజీవిగారి మయసభ జ్యోతికి, ఏ పత్రికకులేని ప్రత్యేకత. విప్లవాన్ని గురించి వారు రాసింది అక్షరాలా నిజం. తాము సుఖంగా వుండి అమాయకులైన యువతీ, యువకుల్ని బలిచేస్తున్నారు. అలాంటి వాళ్ళకి బుద్ధిచెప్పటం కూడా విప్లవంలో ఒక భాగంగా యువతీ యువకులు స్వీకరించాలి. అప్పుడే ఇలాంటి వాళ్ళకి బుద్ధివస్తుంది. ఇలాంటి రచయితలు కూడా అన్నారు కేవలం రచనల ప్రభావానికి లోను కాకుండా వారి నిజజీవితం ఎలా వుందో పరికించాలి.

—కె. రామారావ్, హైదరాబాద్-27.

ఈనెల జ్యోతి చదివాను. "నైలాన్ చీర" కథ నన్ను ముగ్ధురాల్ని చేసింది. భారతి ఆత్మ గౌరవం, భర్తపై ప్రేమ, ఆ నిబ్బరం, చాలా అద్భుతమయిన స్త్రీ. ఉద్యోగిని అయిన ప్రతీ స్త్రీ అలావుంటే? అనిపించింది. "ప్రేమ - త్యాగము" చీర్ల సీతాదేవిగారి నవల బాగుంది. కాని సరితను యేదో త్యాగమయిగా సృష్టించదలిచారు రచయిత్రి. అది అంతబాగాలేదు. అయినా నవల యింట్రెస్టింగ్‌గావుంది. "విధి వంచిత", ప్రతిబింబం కథలు బాగున్నాయి.

—సత్యవతి, సికింద్రాబాద్.

శ్రీశ్రీ పదబంధ ప్రహేళికలో 'లాత్వం' గురించి తగవుపడుతున్నారు పెద్దలు. 'లాత్వం' శాస్త్రరీత్యా వుండదని కొందరు అంటున్నారు. అది చూసి రెండు మాటలు వ్రాద్దామనుకున్నాను.

సహజంగా హల్లుకి స్వయం ఉచ్చారణాధికారంలేదు. ఏ అచ్చు కలిస్తే ఆ ధ్వనివస్తుంది. ఇది 'ప్రాణులు' అని అనడంవల్ల తద్‌జ్ఞులకు తెల్లమే.

'అత్వము, ఉత్వము-అన్నట్టు లాత్వము- అని అనరు-అనేది ఒక వాదం వుంది. కాదన లేము. కానీ సాధించాలంటే 'లాత్వము'ను సాధించవచ్చు. అయితే అది వక్రమార్గం బ్రతకడమవుతుందని ముందుగా మనవి చేస్తున్నాను.

ఇంతకూ ఇది భారద్వాజ ఘట్టమా? తుర్థా న్యాయమా? పుణ్యమా! పురుషార్థమా?

శ్రీశ్రీని ఎలాగైనా రంగంమీదికి లాగాలని చేసే ప్రయత్నం అంత సముచితం కాదు. అలాగైతే కాళిదాసాదులు కూడా దొరుకుతారు. మన ఆది కవిగారు 'అనుగుణ భార్యావంతుడు' అని ప్రయోగించారు. ఇది తగునా? శాంతం పాపం.

ఇక్కడికి యీ అనుచితమైన తగవు తెంచుటే మంచిది.

—యామిజాల పద్మనాభస్వామి,
మద్రాసు-17.

విజ్ఞాన - వినోద వీచికల ప్రసరింపచేసే 'జ్యోతి' ఈనాడు కాంతి విహీనమై కారు చీకట్లను చిందిస్తూ ఆ వెనుక కామసలను ప్రకోపింప చేస్తూండడం విచారకరం 'జ్యోతి' అక్టోబర్ సంచిక ఇందుకు 'ప్రతీక'.

ఈ సంచికలో ఒక్క 'ప్రతిబింబం' కథ తప్ప మిగిలిన కథల యితివృత్తాలు, చిత్రాలు 'జ్యోతి'ని Ill - lust - rated Monthly

అనివార్య కారణాలవల్ల ఈ నెల శ్రీశ్రీ పదబంధ ప్రహేళిక ప్రచురించ లేకపోయాము. వచ్చే సంచికనుంచీ యధావిధిగా ఈ శీర్షిక కొనసాగుతుంది.

—ఎడిటర్.

గా తీర్చి దిద్దాయి. యీ పోకడ పత్రికాభిమానులను కలవర పెట్టూంది.

—ఓలేటి వెంకటసుబ్బారావు, ఖమ్మం.

సెప్టెంబర్‌నెల ప్రహేళికలో "కోతి" అని ఇచ్చిన ఆధారానికి జవాబు "అవుతోక" మా కర్థం కావటంలేదు. అలాగే "అసమగ్రాంధ్ర సాహిత్య చరిత్రంలో ఆరుద్ర దూడ" అనే ఆధారానికి "దస్తగిరి" ఎలాగయ్యిందో అర్థం కావటంలేదు. విచిత్ర మేమిటంటే మేము ఈ రెండూ రాశాం. కానీ ఆ జవాబులు మాకు సంతృప్తి కలిగించని కారణంగా మేము మా పజిలు పంపించలేదు.

శ్రీశ్రీగారిచేత మీరు సమగ్రమయిన వివరణ యిప్పించి మా అనుమాన నివృత్తిచేయించ వలసిందిగా కోరుతున్నాం.

—పంతుల విద్యాసాగర్,
కె. రమేష్ కుమార్, వి. రంగాచార్యులు,
పులిజాల విద్యాసాగర్‌రావ్, బి. వీరారెడ్డి,
నల్లగొండ.

అక్టోబర్ 'జ్యోతి' చాలా చూడ ముచ్చటగా వుంది. ముఖచిత్రం చాలా బాగావుంది. ఈనెల 'జ్యోతి మయసభ'లో ఏ. రామసంజీవిగారు ప్రస్తుతము జరుగుతున్న పచ్చి నిజాలను తెల్పారు. 'అంకితం' అన్న పదాన్ని గురించి ఎంతో విశదంగా తెల్పారు. వారికి మా కృతజ్ఞతలు.

—వి. ఉదయకుమార్, కాళహస్తి.

సెప్టెంబరు సంచికలో నవల బోరుకొట్టింది. అక్టోబర్ సంచిక చదివాక పరువాలేదు అనిపించింది. 'ప్రేమ - త్యాగము'లో కరుణాకర్ పాత్ర చాల చక్కగా చిత్రీకరించారు. రచయిత్రి ముగింపు బాగుంధి. ఇకపోతే కథలలో 'నైలాన్ చీర' బాగుంది. మీరు అందించబోవు దీపావళి సంచిక కోసం ఎదురు చూస్తున్నాను.

—వి. ప్రసాదరావు, హైదరాబాదు.

సుమారు మూడు సంవత్సరాలనుంచి "జ్యోతి"ని చూస్తున్నాను. సుప్రసిద్ధ రచయితల కథలు ప్రచురిస్తున్నారు. ఒకనెల కన్న మరోనెల సంచిక చాల ఆకర్షణీయంగా వుంటున్న దనడంలో సందేహంలేదు. ప్రస్తుతం నడుస్తున్న రెండు సీరియల్స్ ఆసక్తిదాయకంగా వున్నవి. మళ్ళీ కొత్త సంచిక ఎప్పుడు వస్తుందా అన్నంత ఆశతో ఎదురు చూడవలసి వస్తున్నది.

రామసంజీవిగారి "మయసభ"కు ఎన్నరే కళ్ళుకున్న శక్తి వుంది.

అక్టోబరు సంచికలోని "ప్రతి బింబం" "తొలిరేయి" "విధివంచిత" బ్రహ్మాండంగా వున్నవంటే అతిశయోక్తి కానేరదు.

"పలు రంగాలలో ఆంధ్ర ప్రముఖులు" శీర్షిక ద్వారా గొప్ప వ్యక్తులను పరిచయం చేస్తున్నందుకు ధన్యవాదాలు.

—బొగ్గవరపు వేంకట సుబ్బారావు
టంగుటూరు.

అక్టోబరు జ్యోతిలో శ్రీ యస్వీ నారాయణ గారి "వలువలూడిన వనితను" (చూచిన తరువాత పేజి 119) చదివిన తరువాత, రాస్తున్నాను. అశ్లీల పదప్రయోగాన్ని యీ రోజులలో సినిమా పాటల కవులు ముఖ్యంగా వుపయోగిస్తున్నారు. శీలాన్ని భద్రంగా సీలువేసి భూస్థాపితంచేసి, అశ్లీలాన్ని ఆనందంగా స్టారు హోటల్సులో కూర్చుని వ్రాసి మనకందచేస్తే మనకు కన్పించేది మరి "వలువలూడిన వనిత"లే గదా! అయినా యీ మధ్య మన ఆస్థానకవి శ్రీ దాశరథిగారు ప్రమాణీకంగా యిక యీ ద్వంద్వార్థ కవిత్వాన్ని వ్రాయను అన్నారు. యిది చాలసంతోషించ తగ్గవిషయం. (మిగిలిన

కవులు ఆస్థాన కవులు ఎప్పుడు అవుతారో ఎప్పుడు ప్రమాణం చేస్తారో?)

—తంగిరాల జగన్‌మోహన్‌రావు,

రూర్కెలా.

సెప్టెంబరు జ్యోతిలో గుంటూరునుండి ఒక ఆపరేటర్ వ్రాసిన వుత్తరంచూశాను. రామసంజీవిగారు యేం రాశారో తెలియదుగాని, మొత్తానికి పి అండ్ టి సక్రమంగా పనిచేయ లేదని నేను ఖచ్చితంగా చెప్తున్నాను. ఆపరేటరు వ్రాసినట్టు స్పెషల్ సర్వీసు అంటే టంక్స్ బుకింగ్ ట్రంక్ ఎంక్వయిరీ, అసిస్టెన్సు, ఎంక్వయిరీ, కంప్లైంట్సు మొదలైనవి సాధారణంగా ఎంగేజ్‌డ్‌గా వుండవు. కాని ఆపరేటర్లు మన సహనాన్ని పరీక్షిస్తారు. ట్రంక్ కాల్ బుక్‌చేసిన ఆపరేటర్ అర్థగంటకి ఒకసారి కాల్‌బుక్‌చేసిన సబ్‌స్క్రైబర్‌కి పొజిషన్ చెప్తూండాలి. అలా ఎంతమంది ఆపరేటర్లు చేస్తున్నారు. ఇక స్పెషల్ ఇన్ఫర్‌మేషన్ 1'6కి మామూలుగా ఎక్కువ కాల్స్‌రావు. ఒక్క ఎలక్షన్ సమయాల్లోనూ క్రికెట్టుమేచ్ వుండే టప్పటప్పుడు తప్ప. అయినా వాళ్ళూ ఆన్సరు చేయరు. వేరు శనగకాయలు తినడం నేను చూడలేదుగానీ డ్యూటీలోవున్న ఆపరేటర్లు (ఆడ) స్వెట్టర్లు అల్లడం నేను చూశాను. అలాగే బాయ్ ఫ్రెండుతో మాట్లాడుతూ మిగత కాల్స్‌ని నిర్లక్ష్యం చేయడమూ చూశాను. ప్రేమించుకోవడంలోనూ, తినడంలోనూ తప్పు లేదుగాని, డ్యూటీని సక్రమంగా నిర్వహిస్తే చాలు. ఈ మధ్య బాంబే టెలిఫోన్లు సరిగా పని చేయడం లేకపోవటం వలన సబ్‌స్క్రైబర్స్ అందరూ టైమ్ ఆఫ్ ఇండియాలో బాంబే జి. ఎమ్‌ని విమర్శిస్తూ వుత్తరాలు గుప్పించడం,ఒక డెలిగేషను ఢిల్లీకివెళ్లి కమ్యూనికేషన్ మంత్రి గారికి మెమరాండం సమర్పించడం బహుశా గుంటూరు ఆపరేటర్‌కి తెలియకపోవచ్చు. ఆంధ్రలోని టెలిఫోను సర్వీసు గురించి నాకంతగా తెలియదు. బహుశా మంచి మనస్సు గల ఆంధ్ర జి. ఎమ్. టి. శ్రీ బాలసుబ్రమణ్యం గారి హయాములో ఆంధ్రప్రదేశ్ టెలిఫోను సర్వీసు బాగుందేమో.

పి అండ్ టి లో ఒక బాధ్యతా పూరితమైన పదవిని నిర్వహిస్తున్న నేను ఇలా వ్రాయడానికి ఎంతో ఆవేదన చెందుతున్నాను.

—ఎస్. లక్ష్మి, బొంబాయి.

అక్టోబర్ సంచిక చదివాక యీ వుత్తరం వ్రాస్తున్నాను. చాన్నాళ్ళ తరువాత నవలాను బంధంలో చక్కని నవల చదివాము అన్న తృప్తి కలిగింది. కరుణాకర్, భరత్‌కి వ్రాసిన వుత్తరం నవల కంతటికీ హైలైట్.

కథలు పరువాలేదు.

—ఎమ్. రమ, నల్గొండ.

ఆరుద్ర, శ్రీశ్రీ తెలుగు, ఇంగ్లీషు పదాలను కలిపి చేసిన ప్రయోగాలు చాలావున్నాయి. ఆరుద్ర 'రనండి నా పంథా'. 'రాగ్మూలం' వాడారు శ్రీశ్రీ పొందించిన విష్పరించు వగైరా వాడారు. అయితే శ్రీశ్రీ దీన్ని ప్రహేళికల్లోకి తీసుకొచ్చారు. నవంబర్ '17 ప్రహేళికలో అడ్డం 11 - 21 అయితే వెళ్ళకు; నిలువు 21 - ఇది తీరడానికి 11 అడ్డు - చూడండి గోకు, దురద వీటికి సమాధానాలు ఇక్కడ 'గోకు' 'వెళ్ళకు' ఒకటే.

కార్యమా? వాలకమా? అన్ని ప్రశ్నిస్తే 'చేష్ట' సమాధానం అవుతుంది. అయ్యింది కూడా. మరి రా తమ్ముడా? కోతి? అని ప్రశ్నించి రప్ప, అవుతోక అని సమాధానాలిచ్చినప్పుడు ఈ '?' అనవసరం కదా. బహుశా తికమకపెట్టడానికి అవసరం కాబోలు అలాగే 'సుమారు గురికి బారెడు'కి 'రమారమి' అన్నారు. కేవలం 'సుమారు' అంటే చాలదా? గురికి బారెడు దేనికి?

అష్టపది (ఛందస్సుకాదు) కి 'సాలీడు'; మే '78 చే—. (3 గళ్ళు) కి గువేరా; మే '78 అడ్డం: 15 - 4, లేక 8, లేక 10 కి ఆశలు— అన్న సమాధానాలు నా కర్థంకాలేదు. శ్రీశ్రీగారి వివరణ కోరుతున్నాను.

ప్రహేళికకి విరుగుడు 'నిఘంటువు' (కొంత వరకు). కొన్నాళ్ళపాటు దీన్ని (అంటే నిఘంటువుని, ప్రహేళికని కాదు సుమా-అది మా ప్రాణం) అవతల ఉంచకపోతే మా తలనొప్పి మరీ ఎక్కువౌతుందేమో?

—తాతిరాజు వేణుగోపాల్, బరంపురం-1



Edited&Published by V. Leelavathy Raghavaiah, at 17B Rajaram Colony Kodambakkam, Madras-600024, & Printed by D. Hanumantha Rao, at Kranti Press, 12, Francis Joseph Street, Madras-600001.